
'రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలు పాడిపంటలతో పులకించాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 246

బుధవారం 27-11-2024

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



వేలం కథ కమామిషు

అనూహ్యాలకు వేదికగా ఐపీఎల్ వేలం.. భారత క్రికెటర్ల కోసం భారీ ఖర్చు -14లో



క్యూఆర్ కోడ్‌తో పాన్ కార్డ్

రూ.1,435 కోట్ల వ్యయంతో పాన్ 2.0 ప్రాజెక్టుకు కేంద్రం ఆమోదం -15లో



ఏక్‌నాథ్ షిండే రాజీనామా

మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే తన పదవికి రాజీనామా చేశారు. మరోపక్క కొత్త సీఎం ఎంపికపై ఉత్కంఠ కొనసాగుతోంది.

- వివరాలు 6లో▶



హిందూ నేతపై దేశద్రోహం కేసు

బంగ్లాదేశ్‌లో దేశద్రోహం ఆరోపణలపై అరెస్టు అయిన హిందూ నేత చిన్మయ్ కృష్ణ దాస్‌కు అక్కడి కోర్టు బెయిల్ నిరాకరించింది.

- వివరాలు 6లో▶



కాల్పుల విరమణకు ఓకే

లెబనాన్‌లోని హెజ్‌బొల్లా మిలిటెంట్ గ్రూప్‌తో యుద్ధానికి చరమగీతం పాడుతూ ఇజ్రాయెల్ కీలక నిర్ణయం దిశగా ముందడుగు వేసింది.

- వివరాలు 6లో▶



ఇస్లామాబాద్ రణరంగం

జైలులో ఉన్న ఇమ్రాన్‌ఖాన్‌ను విడుదల చేయాలని ఆయన మద్దతుదారులు చేపట్టిన ర్యాలీ హింసాత్మకంగా మారింది.

- వివరాలు 6లో▶

రాజ్యాంగ దినోత్సవంలో పాల్గొన్న రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్, ప్రధాని నరేంద్ర మోదీ, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, కేంద్ర మంత్రులు కిరణ్ రిజిజు, జేపీ నడ్డా, కాంగ్రెస్ అగ్రనేతలు మల్లికార్జున్ ఖర్గే, రాహుల్‌గాంధీ, రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ హరివంశ్ నారాయణ్ సింగ్



విశ్వబంధు భారత్‌కు..


రాజ్యాంగమే పునాది

భారత రాజ్యాంగం ద్వారా ఎన్నో ఘనతలు సాధించాం

కలిసికట్టుగా పనిచేస్తే సంవిధాన్ ఆశయాలకు మరింత బలం

దేశ ప్రజాస్వామ్య గణతంత్రానికి రాజ్యాంగమే పునాది రాయి: రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము

పాత పార్లమెంట్ భవనం సెంట్రల్‌హాల్‌లో రాజ్యాంగ దినోత్సవం.. హాజరైన ఎంపీలు



న్యూఢిల్లీ: రాజ్యాంగ స్ఫూర్తిని అనుసరిస్తూ సామాన్య ప్రజల జీవితాలను మెరుగ్గా తీర్చిదిద్దడమే లక్ష్యంగా కలిసికట్టుగా పని చేయాల్సిన బాధ్యత కార్యనిర్వాహక వర్గం, శాసననిర్వాహక వర్గం, న్యాయ వ్యవస్థపై ఉందని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము సూచించారు. పౌరుల ప్రాథమిక విధులను రాజ్యాంగంలో స్పష్టంగా నిర్దేశించారని చెప్పారు. దేశ ఐక్యత, సమగ్రత, సమాజంలో సామరస్యంతోపాటు మహిళల గౌరవాన్ని కాపాడడం పౌరుల విధి అని చెప్పారు. కార్యనిర్వాహక వర్గం, శాసననిర్వాహక వర్గం, న్యాయ వ్యవస్థతోపాటు ప్రజలు కూడా కలిసి క్రియాశీలకంగా పని చేస్తే రాజ్యాంగ ఆశయాలకు బలం చేకూరుతుందని తెలిపారు. ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేలా కేంద్ర ప్రభుత్వం గత కొన్నేళ్లలో పార్లమెంట్‌లో ఎన్నో చట్టాలు తీసుకొచ్చిందని గుర్తుచేశారు. సమాజంలో అన్ని వర్గాల అభివృద్ధి కోసం చర్యలు చేపట్టిందన్నారు. ప్రభుత్వ నిర్ణయాలతో ప్రజల జీవితాలు మెరుగుపడుతున్నాయని, వారి పురోభివృద్ధికి నూతన అవకాశాలు అందుబాటులోకి వస్తున్నాయని వివరించారు. భారత రాజ్యాంగాన్ని ఆమోదించి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా పాత పార్లమెంట్ భవనం సెంట్రల్ హాల్‌లో మంగళవారం నిర్వహించిన రాజ్యాంగ దినోత్సవంలో రాష్ట్రపతి ప్రసంగించారు. కార్యక్రమానికి పార్లమెంట్ ఉభయ సభల మిగతా 6వ పేజీలో ▶

జాతికి కరదీపిక

సజీవ స్రవంతి మన రాజ్యాంగం: మోదీ

తానెన్నడూ రాజ్యాంగ పరిధి దాటలేదని వ్యాఖ్య

సుప్రీంకోర్టులో ఘనంగా రాజ్యాంగ దినోత్సవం

6 లో

నిర్మల్ పల్లెల్లో 'ఇథనాల్' మంట

దిలావర్‌పూర్ మండలంలో ఫ్యాక్టరీ వద్దంటూ రోడ్డెక్కిన గ్రామాలు

ఎన్‌హెచ్ 61పై 12 గంటలపాటు రాస్తారోకో, వంటావార్పు

నచ్చజెప్పేందుకు వచ్చిన మహిళా ఆర్డీఓ గంటల తరబడి ఘెరావ్.. వాహనంపై దాడి.. అతికష్టంమీద రాత్రికి ఆమెను కాపాడిన జిల్లా ఎస్పీ.. తోపులాటలో మహిళా ఎస్సైకి గాయాలు

ఘటనపై సీఎంఓకు నివేదించిన జిల్లా కలెక్టర్



ఆర్డీఓ వాహనం ఎదుట బైఠాయించిన మహిళలు

నిర్మల్/దిలావర్‌పూర్: తమ పచ్చని పంటపొలాల్లో ఇథనాల్ చిచ్చు పెట్టొద్దంటూ నిర్మల్ జిల్లాలోని పలు గ్రామాల ప్రజలు కొన్ని నెలలుగా చేపడుతున్న నిరసన మంగళవారం తీవ్రరూపు దాల్చింది. దిలావర్‌పూర్ మండలంలోని దిలావర్‌పూర్-గుండంపల్లి గ్రామాల మధ్య ఏర్పాటు చేసిన ఇథనాల్ ఫ్యాక్టరీని వెంటనే తొలగించాలన్న తమ డిమాండ్‌ను అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో ఆయా గ్రామాల ప్రజల సహనం నశించింది. బంద్ పాటించడంతోపాటు దిలావర్‌పూర్ మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద 61వ నంబర్ జాతీయ రహదారిపై ఒక్కసారిగా వందలాది మంది నిరసనకారులు రాస్తారోకోకు దిగారు. నిర్మల్-భైంసా మార్గంలో దాదాపు 12 గంటలపాటు రోడ్డుపై బైఠాయించారు. దీంతో హైవేపై కొన్ని గంటలపాటు తీవ్ర ట్రాఫిక్ సమస్యలు తలెత్తాయి.

ఆర్డీవో నచ్చజెప్పినా..: నిరసనకారులు రోడ్డుపైనే మధ్యాహ్నం, రాత్రి వంటావార్పు చేసుకోవడంతోపాటు సాయంత్రం నుంచి అక్కడే చలిమంటలు వేసుకున్నారు. వారికి నచ్చజెప్పేందుకు మిగతా 3వ పేజీలో ▶

న్యూస్‌రీల్

ప్రచారం పీక్.. దర్యాప్తు వీక్!



గంజాయి, డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపాలని ప్రభుత్వ పెద్దలు పదేపదే సూచిస్తున్నా క్షేత్రస్థాయిలో ఆ పరిస్థితి కనిపించట్లేదు. మత్తు పదార్థాలను కట్టడి చేస్తున్నామంటూ అధికారులు భారీగా ప్రచారం చేస్తుండగా కేసుల దర్యాప్తు మాత్రం పేలవంగా సాగుతోందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

- వివరాలు 16లో▶

తప్పుడు అఫిడవిట్ దాఖలు చేస్తారా?



'తప్పుడు అఫిడవిట్ దాఖలు చేస్తారా? అన్నీ నిజాలే చెప్తాను.. అని ప్రమాణం చేసి అబద్ధాలు ఎలా ఆడతారు?' అని సుందిళ్ల బరాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఈఈ) గంగం వేణుబాబుపై జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ ఆగ్రహం వ్యక్తం చేసింది.

- వివరాలు 3లో▶

మైనర్లు.. మహాముదుర్లు



ప్రేమ, పెళ్లి పేరుతో అమ్మాయిలను వేధిస్తున్న ఆకతాయిల ఆటకట్టించారు రాచకొండ పోలీసులు. 15 రోజుల్లో 66 మంది ఈవ్‌టీజర్లను అరెస్టు చేసినట్లు మహిళా భద్రతా విభాగం డీసీపీ ఉషా విశ్వనాథ్ తెలిపారు.

- వివరాలు 16లో▶

పాటల రచయిత కులశేఖర్ కన్నుమూత



ప్రముఖ సినీ గేయ రచయిత కులశేఖర్ (53) కన్నుమూశారు. హైదరాబాద్ పంజగుట్టలో రోడ్డుపై స్పృహతప్పి పడిపోయిన ఆయనను గాంధీ ఆస్పత్రిలో చేర్చగా, చికిత్సపొందుతూ మరణించారు.

- వివరాలు 5లో▶

ఇదండీ సంగతి



ఇష్టపూర్వకంగానే మేమిద్దరం విడిపోతున్నాం.. ఈ విషయాన్ని సోషల్ మీడియాలో తిక్కతిక్కగా ప్రచారం చేశారో ఖబడ్దార్!!

రాహుల్ తిట్టినందుకే అదానీ విరాళం వెనక్కి

బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



రూ.100 కోట్ల చెక్‌ను ఇప్పటివరకు ఎందుకు నగదుగా మార్చుకోలేదు?

చెక్ చూపించి డబ్బులు దోచుకునే కుట్ర జరుగుతోందా?

అదానీ ఫ్రాడ్ అని రేవంత్‌కు ఇప్పుడే తెలిసిందా? అని నిలదీత

అదానీకి కేంద్ర అనుమతులపై అసత్య ప్రచారం చేస్తున్నారని ఫైర్

సాక్షి, హైదరాబాద్: 'అదానీ నుంచి రూ.100 కోట్ల విరాళం తీసుకోవడంపై రాహుల్‌గాంధీ ఫోన్ చేసి తిడితే నష్ట నివారణ కోసం సీఎం రేవంత్‌రెడ్డి వెనక్కి తగ్గాడు. అదానీ విరాళంగా రూ.100 కోట్ల చెక్‌ను ఇచ్చి 38 రోజులు పూర్తయినా రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు నగదుగా ఎందుకు మార్చుకోలేదు? చెక్ చూపించి వెనుక నుంచి డబ్బులు దోచుకునే కుట్ర జరుగుతోందా?..' అని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు ప్రశ్నించారు. 'అదానీ ఫ్రాడ్ అని రేవంత్‌కు ఇప్పుడే తెలిసిందా? అదానీని రాహుల్‌గాంధీ ఫ్రాడ్ అంటుంటే రేవంత్ మాత్రం ఫ్రెండ్ అంటూ రూ.12,400 కోట్ల ఒప్పందాలు చేసుకున్నాడు. కేంద్ర ప్రభుత్వం అనుమతులు ఇచ్చిన ప్రాజెక్టులను బీఆర్‌ఎస్‌కు అంటగడుతూ అసత్య ప్రచారం చేస్తున్న సీఎం తన పేరును అబద్ధాల రేవంత్‌రెడ్డిగా మార్చుకోవాలి..' అని కేటీఆర్ అన్నారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో మాజీ మంత్రులు తలసాని, పొన్నాల లక్ష్మయ్య, ఎమ్మెల్సీ మధుసూదనాచారి, ఎమ్మెల్యేలు కాలేరు వెంకటేశ్, మాగంటి గోపీనాథ్‌తో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు.

రేవంత్ అసలైన శాడిస్ట్..: 'అదానీ విషయంలో రాహుల్‌గాంధీకి, రేవంత్‌కు నడుమ ఏకాభిప్రాయం కనిపించడం లేదు. రాహుల్‌తో తిట్లు తిన్న అసహనంతో నన్ను రేవంత్ ఇష్టమొచ్చినట్లు తిడుతున్నాడు. చిట్టి నాయుడికి చిప్ దొబ్బినట్లు కనిపిస్తోంది. అదానీ మిగతా 3వ పేజీలో ▶

వయనాడ్ ఉప ఎన్నికలో ఘన విజయం సాధించిన ఎంపీ ప్రియాంకాగాంధీని కలిసి శుభాకాంక్షలు తెలుపుతున్న సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



సమాజానికి 'ఎక్స్‌రే'!

అన్ని వర్గాలకు సామాజిక న్యాయం జరగాలంటే కులగణన తప్పనిసరి

ఢిల్లీలో ఏఐసీసీ ఆధ్వర్యంలో జరిగిన 'సంవిధాన్ రక్షక్ అభియాన్' సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

- కేంద్ర ప్రభుత్వం జనగణనలో భాగంగా కులగణన చేపట్టాల్సిందే.. ఈ అంశంలో రాహుల్ చేసే పోరాటాలకు తోడుగా నిలుస్తాం
- ఇది రాజ్యాంగాన్ని రక్షించే గాంధీ పరివార్‌కు.. మార్చాలని చూసే మోదీ పరివార్‌కు మధ్య యుద్ధం
- సోనియా, ఖర్గే, రాహుల్‌ల నేతృత్వంలో 'సామాజిక న్యాయం 3.0' ఉద్యమం
- ప్రజలంతా ఈ పోరాటానికి వెన్నుదన్నుగా నిలవాలని విజ్ఞప్తి

2 లో

బాపూఘాట్ అభివృద్ధికి.. 222.27 ఎకరాలు ఇవ్వండి

రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌కు సీఎం రేవంత్‌రెడ్డి వినతి

2 లో

తెలంగాణలో కులగణన చరిత్రాత్మకం

మేం ఎక్కడ అధికారంలోకి వచ్చినా ఇదే తరహాలో చేపడతాం: రాహుల్

మూసీ కబ్జాదారులపై క్రిమినల్ చర్యలు

అధికారులకు స్పష్టం చేసిన హైకోర్టు

సుప్రీం మార్గదర్శకాల ప్రకారం ఆక్రమణదారులకు నోటీసులిచ్చి, తదుపరి చర్యలు చేపట్టాలి



పునరుజ్జీవ ప్రాజెక్టు వల్ల ప్రభావితమైన వ్యక్తులకు అనువైన చోట వసతి కల్పించాలి

'మారుతినగర్' వాసుల పిటిషన్‌లో రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం తీర్పు

సాక్షి, హైదరాబాద్: మూసీ నది పరీవాహకంతోపాటు ఫుల్ ట్యాంక్ లెవల్ (ఎఫ్‌టీఎల్), బఫర్ జోన్‌లో కబ్జాలకు పాల్పడిన వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోవచ్చని అధికారులకు హైకోర్టు స్పష్టం చేసింది. దీనిపై పూర్తి సర్వే నిర్వహించాలని సూచించింది. ఇందుకు పిటిషనర్లు, ఆక్రమణదారులు సహకరించాలని చెప్పింది. అవసరమైతే అధికారులకు భద్రత కల్పించాలని పోలీసులను ఆదేశించింది. హైదరాబాద్ కొత్తపేట్‌లోని న్యూ మారుతీనగర్‌వాసులు దాఖలు చేసిన పిటిషన్‌లో ఈ మేరకు విచారణను ముగించింది. అధికారులు తమ ఇళ్లను కూల్చేందుకు ప్రయత్నిస్తున్నారంటూ న్యూ మారుతీనగర్‌కు చెందిన చింతపల్లి సుబ్రమణ్యం సహా మరికొందరు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. జీహెచ్‌ఎంసీ నుంచి అన్ని అనుమతులు తీసుకున్నాకే లేఅవుట్ వేసి ఇళ్లు కట్టుకున్నామని.. ఆస్తిపన్ను, నల్లా పన్ను, విద్యుత్ బిల్లులు చెల్లిస్తున్నామని పిటిషనర్లు పేర్కొన్నారు. అందువల్ల మిగతా 2వ పేజీలో ▶

'యాసంగి' పెట్టుబడి ఎట్లా?

దాదాపుగా పూర్తికావచ్చిన వానాకాలం కోతలు

నవంబర్ ఒకటో తేదీ నుంచే మొదలైన యాసంగి సీజన్

- చాలా జిల్లాల్లో దుక్కులు దున్ని.. నారు పోస్తున్న రైతులు
- రైతుభరోసాపై అస్పష్టత.. రైతులకు తప్పని పెట్టుబడి తిప్పలు
- పూర్తికాని రుణమాఫీ.. బ్యాంకుల నుంచి అందని కొత్త రుణాలు
- పంట పెట్టుబడుల కోసం మళ్లీ ప్రైవేటు అప్పుల బాట పట్టాల్సిన దుస్థితి వస్తోందనే ఆవేదన



రాష్ట్రంలో యాసంగి పంట సాగు అంశం రైతుల్లో ఆందోళన కలిగిస్తోంది. సర్కారు నుంచి అందాల్సిన రైతుభరోసాపై అస్పష్టత నెలకొనడం.. రుణమాఫీ పూర్తిగాక బ్యాంకుల నుంచి కొత్త రుణాలు అందే పరిస్థితి లేకపోవడంతో... యాసంగికి పెట్టుబడులు ఎలాగని రైతులు ఆందోళన చెందుతున్నారు. మళ్లీ ప్రైవేటు అప్పుల బాటపట్టాల్సిన దుస్థితి వస్తుందా? అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో వానాకాలం పంట కోతలు దాదాపుగా పూర్తయ్యాయి. కొనుగోలు కేంద్రాల ద్వారా ఇప్పటివరకు సుమారు 26 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం సేకరించింది. మరో 20 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేసే అవకాశం ఉందని భావిస్తోంది. మరోవైపు నవంబర్ ఒకటి నుంచే యాసంగి (రబీ) సీజన్ మొదలైంది. నిజామాబాద్, నల్లగొండ వంటి జిల్లాలతోపాటు పంట కోతలు పూర్తయిన ప్రాంతాలన్నిటా రైతులు యాసంగి సాగు మీద దృష్టి పెట్టారు. దుక్కులు దున్ని, పొలాలను సిద్ధం చేస్తున్నారు. కొన్నిచోట్ల నారు పోస్తున్నారు. కానీ పంట సాగుకు పెట్టుబడులు ఎలాగని వారిలో ఆందోళన వ్యక్తమవుతోంది.

'రైతుభరోసా'పై అస్పష్టత..: రాష్ట్ర ప్రభుత్వం 'రైతుబంధు' పథకం కింద రైతులకు పంట పెట్టుబడి సాయంగా 2018 ఖరీఫ్ నుంచి ఆర్థిక సాయాన్ని అందిస్తూ వస్తోంది. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో 2023-24 వానాకాలం మిగతా 2వ పేజీలో ▶

మళ్లీ ఫుడ్ పాయిజన్

మాగనూర్‌లో తాజాగా 40 మంది విద్యార్థులకు అస్వస్థత

- విషమంగా ఇద్దరి పరిస్థితి
- వరుస ఘటనలతో తల్లిదండ్రుల్లో ఆందోళన



వాంతులు, విరేచనాలు కావడంతో అస్వస్థతకు గురైన విద్యార్థులు

నారాయణపేట: నారాయణపేట జిల్లా మాగనూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం మరోసారి కలుషిత ఆహారంతో విద్యార్థులు అస్వస్థతకు గురై ఆస్పత్రి పాలయ్యారు. మధ్యాహ్న భోజనం తిన్న 40 మంది విద్యార్థులు వాంతులు, విరేచనాలు, కడుపునొప్పితో తీవ్ర అనారోగ్యానికి గురి కావడంతో ఉపాధ్యాయులు మొదట మాగనూర్ పీహెచ్‌సీకి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం 30 మంది విద్యార్థులను మెరుగైన వైద్యం కోసం మక్తల్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఇందులో 9వ తరగతి విద్యార్థులు నేత్ర, దీపిక పరిస్థితి కొంత విషమంగా మిగతా 5వ పేజీలో ▶

ఉద్రిక్తత మధ్య శైలజ అంత్యక్రియలు

5 లో

బాలికను మభ్య పెట్టి.. ఫొటోలు తీయించి...

క్లుప్తంగా...

రాజ్యాంగ ఫలాలు ప్రజలందరికీ అందాలి

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

సాక్షి, హైదరాబాద్: దేశ పౌరులకు న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం ప్రసాదిస్తూ దేశ రాజ్యాంగాన్ని ఆమోదించి మంగళవారం నాటితో 75 వసంతాలు పూర్తైన సందర్భంగా రాష్ట్ర ప్రజలకు ఎ.రేవంత్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. అంబేడ్కర్ మార్గనిర్దేశంలో రూపుదిద్దుకున్న రాజ్యాంగ ఫలాలు ప్రజలందరికీ అందాలనే ప్రజాప్రభుత్వ సంకల్పమని పేర్కొన్నారు. 1949, నవంబర్ 26న రాజ్యాంగాన్ని ఆమోదిస్తూ తీసుకున్న నిర్ణయంతో ప్రపంచంలోనే భారత్ అతిపెద్ద ప్రజాస్వామిక దేశంగా పరిఢవిల్లుతోందన్నారు. రాజ్యాంగ నిర్మాతలను సంవిధాన్ దివస్ రోజున స్మరించుకోవడమే కాకుండా రాజ్యాంగ విలువలు కాపాడుతూ ఆ మహాశయుల ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ పనిచేయాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు.

'ఓటుకు-నోటు' కేసు విచారణ నాలుగు వారాలకు వాయిదా

సాక్షి, న్యూఢిల్లీ: 'ఓటుకు–నోటు'కేసుకు సంబంధించిన పిటిషన్లపై విచారణను సర్వోన్నత న్యాయస్థానం మరో నాలుగు వారాలు వాయిదా వేసింది. ఈ కేసు నుంచి తనను తప్పించాలని జెరూసలేం మత్తయ్య గతంలో తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. విచారణ జరిపిన హైకోర్టు మత్తయ్య పేరును క్వాష్(తొలగించడం) చేస్తున్నట్టు ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. ఆ తీర్పును సవాల్ చేస్తూ 2016, జూలై 6న ఏసీబీ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్ మంగళవారం జస్టిస్ బీఆర్.గవాయి, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ముందుకొచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం తరఫున తెలంగాణ స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుడు శ్రవణ్‌కుమార్, ప్రతివాది తరఫు ఏఓఆర్ ప్రియాంక ప్రకాశ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా విచారణను నాలుగు వారాల తర్వాత చేపడతామని బెంచ్ వెల్లడించింది. వచ్చే ఏడాది జనవరి 7వ తేదీన ఈ పిటిషన్ మరోసారి సుప్రీంకోర్టు ధర్మాసనం ముందుకు వచ్చే అవకాశముంది.

దేశ జీడీపీలో ఒక శాతం పౌల్ట్రీ పరిశ్రమదే

పశుసంవర్ధక ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సబ్యసాచీ ఘోష్



సాక్షి, హైదరాబాద్: దేశ జీడీపీలో పౌల్ట్రీ రంగం వాటా 1 శాతంగా ఉందని పశుసంవర్ధక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సబ్యసాచీ ఘోష్ అన్నారు. హెచ్ఐసీసీలో ఏర్పాటు చేసిన పౌల్ట్రీ ఇండియా–2024 సదస్సును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశ పౌల్ట్రీ పరిశ్రమలో ఇది ప్రతిష్టాత్మక ఉత్సవమని తెలిపారు. ఇది దేశ, విదేశీ ఉత్పత్తిదారులు, పౌల్ట్రీ పరికరాల తయారీదారులను ఏకం చేస్తుందన్నారు. ఇందులో 40 దేశాల ప్రతినిధులు పాల్గొంటున్నారని సబ్యసాచీ వెల్లడించారు. తెలంగాణ రాష్ట్రం పౌల్ట్రీ రంగంలో ప్రాముఖ్యతను కలిగి ఉందన్నారు. పరిశ్రమలో పరిశోధనలు, టెక్నాలజీ, మార్గదర్శకాలను అందించేందుకు ఈ సదస్సు గొప్ప వేదికగా మారుతుందని సబ్యసాచీ పేర్కొన్నారు.

నేడు ప్రధానితో బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేల భేటీ

సాక్షి, హైదరాబాద్: బుధవారం ఢిల్లీలోని పార్లమెంట్ భవనంలో రాష్ట్రానికి చెందిన ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో ప్రధాని నరేంద్ర మోదీ భేటీ కానున్నారు. ఈ సందర్భంగా తమ పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాల్లో చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, కేంద్రం నుంచి ఆయా రంగాలకు సంబంధించి ప్రత్యేక సహాయం తదితర అంశాల గురించి ప్రధానితో చర్చించే అవకాశాలున్నట్టు సమాచారం. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీని అధికారంలోకి తీసుకువచ్చేందుకు అనుసరించాల్సిన బ్లూప్రింట్ గురించి భేటీలో ప్రస్తావనకు రావొచ్చని తెలుస్తోంది. వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో అధికారంలోకి రావడంపై బీజేపీ ప్రజాప్రతినిధులకు ప్రధాని దిశానిర్దేశం చేసే అవకాశాలున్నాయంటున్నారు.

సమాజానికి 'ఎక్స్‌రే'!

- అన్ని వర్గాలకు సామాజిక న్యాయం జరగాలంటే కులగణన తప్పనిసరి
- ఢిల్లీలో ఏఐసీసీ ఆధ్వర్యంలో జరిగిన 'సంవిధాన్ రక్షక్ అభియాన్' సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- కేంద్ర ప్రభుత్వం జనగణనలో భాగంగా కులగణన చేపట్టాల్సిందే.. ఈ అంశంలో రాహుల్ చేసే పోరాటాలకు తోడుగా నిలుస్తాం

సాక్షి, న్యూఢిల్లీ: దేశంలో అన్ని వర్గాలకు సామాజిక న్యాయం జరగాలంటే కులగణన తప్పనిసరని... ఇది సమాజానికి 'ఎక్స్‌రే'వంటిదని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. సమాజానికి 'మెగా హెల్త్ చెకప్'జరగాలంటే కులగణన చేసి తీరాల్సిందేనని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ఆధ్వర్యంలో సామాజిక న్యాయ సాధనకోసం చేపట్టే మూడో ఉద్యమంలో కులగణన భాగమని చెప్పారు. ఇప్పటికే తెలంగాణలో కులగణన చేపట్టి, దేశానికే ఆదర్శంగా నిలిచామని పేర్కొన్నారు. మంగళవారం 75వ రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏఐసీసీ ఎస్సీ, ఎస్టీ సెల్ ఆధ్వర్యంలో ఢిల్లీలోని తాల్‌కటోరా స్టేడియంలో నిర్వహించిన 'సంవిధాన్ రక్షక్ అభియాన్'కార్యక్రమంలో సీఎం రేవంత్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పాల్గొన్నారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి కులగణన అంశంపై కీలక వ్యాఖ్యలు చేశారు. వివరాలు ఆయన మాటల్లోనే...

''దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత జవహర్‌లాల్ నెహ్రూ, బీఆర్ అంబేడ్కర్, ఇందిరాగాంధీ తమ హయాంలో ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లు, బ్యాంకుల జాతీయీకరణ వంటివి తెచ్చారు. 140 కోట్ల మంది పేదలకు రాజ్యాంగపరమైన హక్కులు కల్పించారు. రిజర్వేషన్ల ద్వారా విద్య, ఉద్యోగ అవకాశాలు ఇచ్చారు. అగ్రికల్చర్ ల్యాండ్ సీలింగ్ యాక్ట్ ద్వారా పేదలకు భూమి హక్కులు కల్పించి వారి గౌరవాన్ని రెట్టింపు చేశారు. అది చరిత్రలో 1.0గా నిలిచింది. ఇక 2.0లో భాగంగా రాజీవ్‌గాంధీ మొదలు పీవీ నర్సింహారావు వరకు మండల్ కమిషన్ ద్వారా ఓబీసీలకు, స్థానిక సంస్థల్లో మహిళలకు రిజర్వేషన్లు అమలు చేశారు. 18 ఏళ్లకే ఓటు హక్కు తెచ్చారు. ఐఐటీ, ఐఐఎంలలో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మహిళలకు సామాజిక న్యాయం చేశారు.

గాంధీ పరివార్.. మోదీ పరివార్ మధ్య యుద్ధం

దేశంలో ప్రస్తుతం మోదీ పరివార్, గాంధీ పరివార్ అని రెండు వర్గాలే ఉన్నాయి. ఇందులో గాంధీ పరివార్ రాజ్యాంగాన్ని రక్షించాలని భావిస్తుంటే... మోదీ పరివార్ రాజ్యాంగాన్ని మార్చే ప్రయత్నం చేస్తోంది. ఈ సమయంలో ప్రజలంతా రాజ్యాంగ రక్షకులైన గాంధీ కుటుంబానికి వెన్నుదన్నుగా నిలవాలి. గతంలో రైతులకు వ్యతిరేకంగా కేంద్రం తెచ్చిన నల్లచట్టాలపై రాహుల్ దృఢంగా నిలబడి కొట్లాడారు. రాహుల్ పోరాటంతో కేంద్రం వెనకడుగు వేసింది. అదే రీతిలో కులగణనపై కొట్లాడాలి. ఈ అంశంలో రాహుల్ చేసే ప్రతి పోరాటానికి మద్దతుగా మేముంటాం..''అని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

ఎంత జనాభా ఉంటే అంత హక్కు

ఇక 3.0లో భాగంగా సోనియా గాంధీ, మల్లికార్జున ఖర్గేల నిర్దేశంలో రాహుల్ గాంధీ కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు పాదయాత్ర చేసి... నిరుద్యోగులు, పేదలు, రైతులను కలసి కులగణన చేస్తామని హామీ ఇచ్చారు. 'జిత్‌నీ భాగీ దారీ.. ఉత్‌నీ హిస్సేదారీ (ఎంత జనాభా ఉంటే అంత హక్కు)'అని నినదించారు. ఈ కులగణన అనేది ఎక్స్‌రే వంటిది. సమాజానికి ఇది 'మెగా హెల్త్ చెకప్'వంటిదే. దేశంలో జనాభా ఆధారంగా రిజర్వేషన్లు దక్కాలన్నా, సామాజిక న్యాయం జరగాలన్నా కులగణన తప్పనిసరి. దేశంలోనే తొలిసారి తెలంగాణలో కులగణన మొదలుపెట్టాం. 92శాతం పూర్తయింది. భారత్ జోడో యాత్ర సందర్భంగా రాహుల్ గాంధీ ఇచ్చిన వాగ్దానం నిలబెట్టుకున్నాం. సామాజిక న్యాయం చేయడంలో దేశానికే తెలంగాణ ఆదర్శంగా నిలబడింది. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం జనగణనలో భాగంగా కులగణన కూడా చేపట్టాల్సిందే. కులగణన చేసేంతవరకు మోదీ ప్రభుత్వంపై రాహుల్ ఒత్తిడి తెస్తూనే ఉంటారు.



'సంవిధాన్' సభలో రాహుల్ గాంధీ, రేవంత్‌రెడ్డి, భట్టి విక్రమార్క, తదితరులు

ఖర్గేతో భేటీ.. ప్రియాంకకు శుభాకాంక్షలు

సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీలో మంగళవారం ఉదయం ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో విడిగా కొంతసేపు భేటీ అయ్యారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతోపాటు జనగణన ప్రక్రియ సాగుతున్న తీరును వివరించినట్టు సమాచారం. కులగణన ఆధారంగా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలన్న డిమాండ్‌పై వారి మధ్య చర్చ జరిగినట్టు తెలిసింది. డిసెంబర్ ఒకటి నుంచి జరగనున్న ప్రజా పాలన దినోత్సవాల ఏర్పాట్లపైనా మాట్లాడుకున్నట్టు సమాచారం. ఇక ఇటీవల వయనాడ్ ఉప ఎన్నికలో ఘన విజయం సాధించిన ఎంపీ ప్రియాంకా గాంధీని రేవంత్, భట్టి విక్రమార్క కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

తెలంగాణలో కులగణన చరిత్రాత్మకం

- మేం ఏ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చినా ఇదే తరహాలో కులగణన చేపడతాం: రాహుల్ గాంధీ
- కులగణన అంటే బీజేపీ, కేంద్ర ప్రభుత్వం భయపడుతున్నాయి
- బీజేపీ, ఆర్ఎస్ఎస్ ఎంత అడ్డుకున్నా కులగణన, రిజర్వేషన్లకు అడ్డుగోడలు తొలగిస్తామని వెల్లడి

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన కులగణన చరిత్రాత్మకమని కాంగ్రెస్ అగ్ర నేత, ఎంపీ రాహుల్ గాంధీ చెప్పారు. కాంగ్రెస్ ఏ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చినా ఇదే తరహాలో కులగణన చేపడతామని ప్రకటించారు. తెలంగాణలో కులగణన ఫలితాల ఆధారంగా పాలసీలను రూపొందిస్తామని తెలిపారు. మంగళవారం ఢిల్లీలోని తాల్‌కటోరా స్టేడియంలో నిర్వహించిన 'సంవిధాన్ రక్షక్ అభియాన్'సభలో రాహుల్ గాంధీ మాట్లాడారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లు ఏం చేసినా, ఎంత అడ్డుకున్నా కులగణన, రిజర్వేషన్లకు అడ్డుగోడలు తొలగించి చూపిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో రాహుల్ గాంధీ ప్రసంగం ఆయన మాటల్లోనే..

''తెలంగాణలో కులగణనను ప్రజా భాగస్వామ్య ప్రక్రియగా మార్చాం. కులగణన ఏదో మూసి ఉన్న గదిలో పది పదిహేను మంది రూపొందించినది కాదు. దళితులు, ఆదివాసీలు, మైనారిటీలు అంతా కలసి తెలంగాణ ప్రజలు నిర్ణయించారు. ఇది చరిత్రాత్మకం. కర్ణాటక, తెలంగాణలాగే.. ఏ రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినా ఇదే తరహాలో కులగణన చేపడతాం. తెలంగాణలో కులగణన ఫలితాలు వస్తే.. దాని ఆధారంగా మేం పాలసీలు రూపొందిస్తాం.

అదానీ, అంబానీ, టాటా, బిర్లాలు.. ఆదివాసీలా? దళితులా?

దేశంలో దళిత, ఆదివాసీ, ఓబీసీ వర్గాలకు దక్కాల్సిన వాటా దక్కడం లేదు. ఆర్ఎస్ఎస్, నరేంద్ర మోదీ వీరి మధ్య అడ్డుగోడ కడుతున్నారు. అదానీ, అంబానీ, టాటా, బిర్లాలు ఆదివాసీలా? దళితులా? దేశంలో 90 శాతం ప్రజలకు అన్యాయం జరుగుతోంది. దానికి కులగణన, రిజర్వేషన్ల పెంపు ఒక్కటే మార్గం. ఆ దిశగా ఉన్న అడ్డుగోడలను తొలగించి చూపిస్తాం. కులగణన విషయాన్ని ఊరూవాడాలో ప్రచారం చేయాలి..''అని రాహుల్ గాంధీ పిలుపునిచ్చారు.

బీజేపీ భయపడుతోంది

కులగణన అంటే బీజేపీ, కేంద్ర ప్రభుత్వం భయపడుతున్నాయి. నాలుగైదు శాతం మంది కోటీశ్వరుల కంట్రోల్‌లో ఈ దేశాన్ని పెట్టాలని బీజేపీ భావిస్తుంది. కులగణన చేయడం, రిజర్వేషన్లను 50 శాతం పెంచడం ద్వారానే దానిని ఛేదించగలుగుతాం. అదే పనిలో మేమున్నాం. దీనిని తెలంగాణ, కర్ణాటకలలో చేశాం. ఏ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చినా దళితులు, ఆదివాసీలు, వెనుకబడిన వర్గాలు, మైనారిటీలు, నిరుపేదల డేటా తీస్తాం. అభివృద్ధి, దేశ భవిష్యత్తులో వారి భాగస్వామ్యం ఎంత? భవిష్యత్తు ఏమిటి? అనేదే మా లక్ష్యం. ఈ వేదికపై రోహిత్ వేముల ఫొటో ఉంది. ఆయన ఎంతో మాట్లాడాలనుకున్నారు. కానీ వీళ్లు (కేంద్ర ప్రభుత్వం) రోహిత్ వేముల గొంతు నొక్కేశారు. యువత కలలకు వ్యతిరేకంగా ప్రభుత్వ యంత్రాంగం పనిచేస్తోంది.

స్వేచ్ఛ, సమానత్వానికి మన రాజ్యాంగం హామీ

వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉద్ఘాటన



సాక్షి, అమరావతి: 'మన రాజ్యాంగం సార్వభౌమ, సామ్యవాద, లౌకిక, ప్రజాస్వామ్య, న్యాయ, సమానత్వ, స్వేచ్ఛ, సౌభ్రాతృత్వాలకు హామీ ఇస్తుంది' అని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉద్ఘాటించారు. ఇలాంటి అత్యంత ప్రాముఖ్యత కలిగిన రాజ్యాంగ దినోత్సవాన్ని అందరూ గుర్తించాలని కోరారు. రాజ్యాంగ వజ్రోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం ఆయన 'ఎక్స్'లో పోస్టు చేశారు. ఆ పోస్టులో వైఎస్ జగన్ ఏమన్నారంటే.. 'ప్రజా ప్రతినిధులను ఎన్నుకోవడమే ప్రజాస్వామ్యానికి మూల స్తంభం. ఈవీఎంల పని తీరుపై దేశ వ్యాప్తంగా ఆందోళన నెలకొంది. వాటి పని తీరుపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా మెజారిటీ దేశాల్లో బ్యాలెట్ పేపర్లతోనే ఎన్నికలు జరుగుతున్నాయి. అలాంటప్పుడు మనం కూడా పేపర్ బ్యాలెట్ పద్ధతిలో ఎన్నికలు ఎందుకు నిర్వహించకూడదని మనల్ని మనం ప్రశ్నించుకోవాలి. ప్రజాస్వామ్యం ప్రబలంగా ఉండటమే కాదు.. ఉన్నట్టుగా కూడా కనిపించాలి. మన దేశ ప్రజలకు రాజ్యాంగం ప్రసాదించిన ప్రాథమిక హక్కు వాక్ స్వాతంత్ర్యాన్ని హరించడానికి.. ప్రశ్నించే గొంతును నొక్కేయడానికి కొంత కాలంగా దూకుడుగా ప్రయత్నిస్తుండటం ఆందోళన కలిగిస్తోంది. రాజ్యాంగాన్ని రూపొందించి, ఇదే పవిత్రమైన రోజున ఆమోదించి, మన దేశాన్ని ఏకీకృత, సమానత్వం వైపు నడిపిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌తోపాటు దార్శనిక నాయకులకు మనం ఘనంగా నివాళులు అర్పిద్దాం' అని పేర్కొన్నారు.

'పనుల జాతర'లో పలు అభివృద్ధి కార్యక్రమాలు

సాక్షి, హైదరాబాద్: భారత రాజ్యాంగ దినోత్సవం, ప్రజాపాలన విజయోత్సవాల సందర్భంగా గ్రామ పంచాయతీల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పనుల జాతర కార్యక్రమాన్ని మంగళవారం ములుగు జిల్లాలోని ఇంచర్ల గ్రామంలో ప్రారంభించారు. రూ. 1.05 కోట్లతో చేపట్టే పలు అభివృద్ధి పనులకు మంత్రి సీతక్క శ్రీకారం చుట్టారు. గ్రామీణ ప్రాంతాల సమగ్రాభివృద్ధికి, సుస్థిరతకు రాష్ట్రంలోని అన్ని గ్రామాలలో పీఆర్ఆర్డీ శాఖ ద్వారా 15,094 పనులను స్థానిక ఎమ్మెల్యేలు ప్రజా ప్రతినిధుల ద్వారా ఒకే రోజు రూ. 228.07 కోట్లతో ప్రారంభించుకోవడం పట్ల మంత్రి సంతోషం వ్యక్తం చేశారు. ప్రతి కుటుంబానికి వేతనంతో కూడిన పనిని కల్పించడం ద్వారా గ్రామీణ ప్రాంతాలలో మౌలిక వసతుల కల్పన, ఉత్పాదకతను పెంచడం, సుస్థిరమైన ఆస్తులను సృష్టించడమే లక్ష్యంగా ఈ ప్రజా విజయోత్సవాలలో పనులు చేపట్టినట్లు సీతక్క తెలియజేశారు.

బాపూఘాట్ అభివృద్ధికి.. 222.27 ఎకరాలు ఇవ్వండి

- ఆ ప్రాంతంలోని రక్షణ శాఖ భూమిని రాష్ట్ర ప్రభుత్వానికి బదిలీ చేయండి
- రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌కు సీఎం రేవంత్‌రెడ్డి వినతి
- ఎయిర్‌పోర్టులకు అనుమతి ఇవ్వాలని పౌర విమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడుకు విజ్ఞప్తి



రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌తో భేటీ అయిన సీఎం రేవంత్, భట్టి విక్రమార్క, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

సాక్షి, న్యూఢిల్లీ: హైదరాబాద్‌లో బాపూఘాట్ అభివృద్ధి కోసం ఆ ప్రాంతంలో ఉన్న 222.27 ఎకరాల రక్షణ శాఖ భూములను రాష్ట్ర ప్రభుత్వానికి బదిలీ చేయాలని రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌కు సీఎం రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ మంగళవారం సాయంత్రం రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌ను కలిశారు. మహాత్మాగాంధీ చితాభస్మాన్ని కలిపిన ఈసా, మూసీ నదుల సంగమ స్థలంలో ఏర్పాటు చేయనున్న బాపూఘాట్‌ను ప్రపంచ స్థాయిలో గాంధీ తాత్వికతను చాటే కేంద్రంగా తీర్చిదిద్దాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని వివరించారు. బాపూఘాట్ వద్ద గాంధీ సిద్ధాంతాలను ప్రచారం చేసే నాలెడ్జ్ హబ్, మెడిటేషన్ విలేజ్, చేనేత ప్రచార కేంద్రం, ప్రజావినోద స్థలాలు, ల్యాండ్ స్కేప్ ఘాట్లు, శాంతి విగ్రహం (స్టాట్యూ ఆఫ్ పీస్), మ్యూజియంలతో గాంధీ సరోవర్ ప్రాజెక్టును చేపట్టనున్నామని కేంద్ర మంత్రికి తెలిపారు. ఇందుకోసం రక్షణ శాఖ భూమిని బదిలీ చేయాలని కోరారు.

కొత్త విమానాశ్రయాలకు అనుమతివ్వండి

తెలంగాణలో పారిశ్రామికాభివృద్ధి, ప్రజలకు రవాణా వసతులను మెరుగుపర్చడంలో భాగంగా కొత్త విమానాశ్రయాలకు అనుమతి ఇవ్వాలని పౌర విమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడుకు సీఎం రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. మంగళవారం సాయంత్రం ఢిల్లీలో కేంద్ర మంత్రిని కలిశారు. తెలంగాణలో రెండో పెద్ద నగరమైన వరంగల్‌లో విమానాశ్రయ ఏర్పాటుకు అవసరమైన ఎన్‌వోసీని రాష్ట్ర ప్రభుత్వం జీఎంఆర్ నుంచి పొందిందని వివరించారు. 253 ఎకరాల భూసేకరణకు అవసరమైన రూ.205 కోట్లను భారత విమానయాన సంస్థకు రాష్ట్ర ప్రభుత్వం అందజేసిందని.. ఈ మేరకు విమానాశ్రయ పనులకు, విమానాలు నడిపేందుకు అవసరమైన అనుమతులు ఇవ్వాలని కేంద్ర మంత్రిని కోరారు. ఇక కొత్తగూడెం జిల్లా పాల్వంచ, పెద్దపల్లి జిల్లా అంతర్గాం, ఆదిలాబాద్‌లలోనూ విమానాశ్రయాలను మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. కేంద్ర మంత్రులతో భేటీల్లో సీఎం వెంట ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్, ఎంపీలు చామల కిరణ్ కుమార్‌రెడ్డి, రఘువీర్‌రెడ్డి, అనిల్‌కుమార్‌యాదవ్, ఆర్.రఘురామిరెడ్డి, కడియం కావ్య తదితరులు ఉన్నారు.

గొప్పలు చెప్పుకోకుండా బాధ్యత వహించాలి

విద్యార్థులు ఇబ్బంది పడుతుంటే ప్రభుత్వాలు ఏం చేస్తున్నాయి

- రెండేళ్ల నుంచి అద్దె చెల్లించలేకపోవడం ఏమిటి?
- రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ జి.నిరంజన్



మాట్లాడుతున్న బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్, కమిషన్ సభ్యులు

సాక్షి, హైదరాబాద్: 'కల్తీ ఆహారంతో పేద విద్యార్థి మృతి చెందడం బాధాకరం. ఈ దుస్థితికి మంత్రులు, ఎమ్మెల్యేలు బాధ్యులు కారా ? దేశంలో ఏ ప్రభుత్వమైనా గొప్పలు చెప్పుకోకుండా బాధ్యతగా వహించాలి. ఏదో ఒకరోజు కాకుండా.. అధికారులు నిరంతరం తనిఖీలు చేయాలి. విద్యార్థులు వసతిగృహాల్లో ఉన్నారంటే వారు ఎంత పేదవారో అర్థం చేసుకోవాలి. శిథిలావస్థలో ఉన్న బాలుర, బాలికల వసతి గృహాలపై అధికారులు తగిన చర్యలు తీసుకోవాలి. వసతి గృహాలు పూర్తి శిథిలావస్థగా మారాయంటే దానికి అధికారుల నిర్లక్ష్యం, బాధ్యతారాహిత్యమే అందుకు నిదర్శనం'అని రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ జి.నిరంజన్ స్పష్టం చేశారు. మంగళవారం రాష్ట్ర బీసీ కమిషన్ కార్యాలయంలో కమిషన్ సభ్యులు రాపోలు జయప్రకాశ్, బాలలక్ష్మి, తిరుమలగిరి సురేందర్‌లతో కలిసి నిరంజన్ విలేకరులతో మాట్లాడారు. 'గతంలో ఒక హాస్టల్ పరిస్థితి చూద్దామని అక్కడకు వెళ్లాం. రెండేళ్ల నుంచి అద్దె చెల్లించడం లేదని చెప్పడంతో తలదించుకొని రావాల్సిన పరిస్థితి వచ్చింది. మహబూబ్‌నగర్ హాస్టళ్లలో 200 మంది విద్యార్థులు ఉండాల్సిన చోట దాదాపు 300 మందికిపైగా ఉన్నారు. ఇలాఉంటే విద్య ఎలా సాగుతుంది. ఇలాంటి వాటిపై రాజకీయ నేతలందరూ దృష్టి పెట్టాలి'అని ఆకాంక్షించారు.

తప్పుడు సమాచారం ఇస్తే క్రిమినల్ చర్యలు

సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేపై ఎవరైన అపోహలు కల్పించినా, తప్పుడు సమాచారం ఇచ్చినా క్రిమినల్ చర్యలు తీసుకుంటామని కమిషన్ చైర్మన్ నిరంజన్ హెచ్చరించారు. వ్యక్తిగత ప్రయోజనాల కోసం అలా చేసే వారిని తెలంగాణ సమాజం, బీసీలు క్షమించరన్నారు. బహిరంగ విచారణలో 'తోలుబొమ్మలాట వృత్తిలో ఉన్న వారికి కుల ధ్రువీకరణ పత్రాలివ్వాలని, కలెక్టర్, తహసీల్దార్‌కు ఆదేశాలివ్వాలని, దేవాలయాల్లో గానుగ నూనె వాడుతారని, దానికి గానుగ వృత్తి ఉన్నవారికి అవకాశం కల్పించాలని, గంగపుత్రులను బీసీ 'బీ'నుంచి బీసీ 'డీ'కి మార్చాలని పలువురు కోరారని కమిషన్ చైర్మన్ తెలిపారు. పందిరి వేసే మేదర కులం వారికి డెకరేషన్, తయారీపై శిక్షణ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారన్నారు. 40 కులాలను ఓబీసీ జాబితాలో చేర్చాలని కేంద్రానికి లేఖ రాసినట్టు తెలిపారు.

పరిహారం చెల్లించాకే భూసేకరణ

ఎన్‌హెచ్ఏఐ అధికారులకు మంత్రి కోమటిరెడ్డి సూచన



సాక్షి, హైదరాబాద్: పరిహారం చెల్లించకుండా భూసేకరణ చేసే ప్రయత్నం సరికాదని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. ముందుగా పరిహారం చెల్లించాకే భూములు సేకరించాలని ఎన్‌హెచ్ఏఐ అధికారులకు సూచించారు. మంగళవారం ఆయన సచివాలయంలో ఎన్‌హెచ్ఏఐ అధికారులతో జరిపిన సమీక్షలో పలు సూచనలు చేశారు. మంచిర్యాల–విజయవాడ గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారికి సంబంధించి ఎన్‌హెచ్ఏఐ వద్ద పరిహారానికి సంబంధించి డ్రాఫ్ట్ అవార్డులు 1,023 వరకు పెండింగులో ఉండటంపై ప్రశ్నించారు. 15 రోజుల్లో వాటిని క్లియర్ చేస్తామని అధికారులు పేర్కొనే క్రమంలో.. భూమిని సేకరించి పరిహారం చెల్లిస్తామంటూ ఎన్‌హెచ్ఏఐ అధికారులు పేర్కొనటాన్ని మంత్రి తప్పుపట్టారు. భూముల విలువ ఆధారంగా పరిహారాన్ని ఖరారు చేయాలంటూ కేంద్రానికి లేఖ రాస్తానని పేర్కొన్నారు. మన్నెగూడ రోడ్డు విస్తరణ పనులను వచ్చేవారం ప్రారంభించాలని, తాను ఇప్పటికే పదిసార్లు ఆదేశించినా పనులు మొదలుపెట్టకపోవటమేంటని ప్రశ్నించారు. రీజినల్ రింగురోడ్డు ఉత్తర భాగానికి డిసెంబర్/జనవరిలో టెండర్లు పిలవాలని సూచించారు. శ్రీశైలం దారిలో మిషన్ భగీరథ పైపులైన్లు ఉన్నందున తుక్కుగూడ నుంచి డిండి వరకు గ్రీన్‌ఫీల్డ్ రహదారి నిర్మాణానికి నిర్ణయించామని అధికారులు మంత్రి దృష్టికి తెచ్చారు. దీని ఆమోదంపై తాను సీఎంతో మాట్లాడతానని మంత్రి పేర్కొన్నారు. రూ.7 వేల కోట్లు ఖర్చయ్యే శ్రీశైలం ఎలివేటెడ్ కారిడార్ ఎంతో ఉపయుక్తమైందని, ఈ పనుల్లో వేగం పెరగాలని సూచించారు. భద్రాచలానికి 3 గంటల్లో వెళ్లేలా చేసే గౌరెల్లి–వలిగొండ రోడ్డు జాప్యం లేకుండా పూర్తి చేయాలని ఆదేశించారు. ఖమ్మం–దేవరపల్లి రోడ్డులో సర్వీసు రోడ్డు ఆప్షన్ ఉండాలని సూచించారు.

విపక్షాల వికృత చేష్టలు..

రైతులకు లాభదాయక పరిహారం ఇచ్చి కీలక ప్రాజెక్టులకు భూసేకరణ కోసం యత్నిస్తుంటే విపక్షాలు కలెక్టర్లపై కూడా దాడులు చేసి చంపేందుకు కుట్రచేస్తున్నాయని మంత్రి కోమటిరెడ్డి ఆరోపించారు. సమీక్ష అనంతరం ఆయన మాట్లాడుతూ వ్యక్తిగత రాజకీయాల కోసం కేసీఆర్ రాష్ట్రాన్ని బలిపశువును చేశారని విమర్శించారు.

'యాసంగి' పెట్టుబడి ఎట్లా?

▶ మొదటి పేజీ తరువాయి

సీజన్ వరకు 11 విడతలుగా రైతుబంధు మంజూరు చేసింది. చివరిసారిగా 2023–24 వానాకాలం సీజన్‌లో 68.99 లక్షల మంది రైతులకు రూ.7,624.74 కోట్లు రైతుబంధు సాయంగా అందజేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పెట్టుబడి సాయాన్ని ఏటా రూ.15 వేలకు పెంచి 'రైతు భరోసా' పథకాన్ని అమలు చేస్తామని ప్రకటించింది. కానీ 2023–24 యాసంగికి సంబంధించి ఈ ఏడాది మార్చిలో ఐదెకరాలలోపు భూమి ఉన్న వారికి ఎకరాకు రూ.5 వేల చొప్పున రూ.5,575 కోట్లు విడుదల చేసింది. తర్వాత ఐదెకరాలపైన ఉన్న వారికి కూడా పెట్టుబడి సాయం విడుదల చేసినట్టు ప్రకటించింది. అయితే.. 2024–25 వానాకాలానికి సంబంధించి 'రైతు భరోసా (రైతుబంధు)' పెట్టుబడి సాయం రైతులకు అందలేదు. దీనిపై ఇటీవల వ్యవసాయ మంత్రి తుమ్మలను ప్రశ్నిస్తే.. వానాకాలం సీజన్ అయిపోయిందని, యాసంగి నుంచి రైతు భరోసా ఇస్తామని చెప్పారు. కానీ యాసంగి సీజన్ మొదలై నెలరోజులు గడుస్తున్నా పెట్టుబడి సాయం ఊసే లేదు. దీనితో పంట పెట్టుబడులు ఎలాగని రైతుల్లో ఆందోళన కనిపిస్తోంది. పెట్టుబడి సాయం పెంచి 'రైతు భరోసా' ఇవ్వడమేమోగానీ.. రైతు బంధుకూ దిక్కులేకుండా పోయిందని వాపోతున్నారు.

ఐదెకరాల్లోపు రైతులకు ఒక సీజన్‌కు అవసరమైన పెట్టుబడి సాయం

వివరాలు	రైతుల సంఖ్య	నిధులు (రూ.కోట్లలో)
ఎకరంలోపు ఉన్నవారు	24,24,870	678.8
రెండు ఎకరాల్లోపు	17,72,675	1,329.15
మూడు ఎకరాల్లోపు	11,30,788	1,368.2
నాలుగు ఎకరాల్లోపు	6,54,419	1,146.88
ఐదు ఎకరాల్లోపు	4,92,568	1,051.73
మొత్తం	64,75,320	5,574.76

(ఇది బీఆర్ఎస్ సర్కారు ఒక్కో సీజన్‌కు ఎకరా రూ.5 వేల చొప్పున ఇచ్చిన మొత్తం. కాంగ్రెస్ హామీ ఇచ్చిన మేరకు అయితే ఒక్కో సీజన్‌కు ఎకరాకు రూ.7,500 అవుతుంది. అంటే రైతులకు చెల్లించాల్సిన మొత్తం మరో 50శాతం పెరుగుతుంది. అంటే రూ. 8,362 కోట్లు అవసరం. సాగులో లేని భూములకు సాయం అందించకుంటే.. ఈ మొత్తం ఆ మేరకు తగ్గుతుంది.)

రైతులందరికీ 'భరోసా' అందేనా?

యాసంగి నుంచి పెట్టుబడి సాయం ఇస్తామని మంత్రి తుమ్మల ప్రకటించినా.. ఎవరెవరికి అందుతుందన్న దానిపై స్పష్టత లేని పరిస్థితి. గుట్టలు, రోడ్లు, సాగులో లేని భూములకు పెట్టుబడి సాయం ఇచ్చేది లేదని గతంలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. దానికితోడు గరిష్టంగా ఐదెకరాలకే పెట్టుబడి సాయం ఇచ్చే ప్రతిపాదనలు కూడా వచ్చాయి. ఈ క్రమంలో ప్రభుత్వం రైతుల సాగుభూములపై ఇప్పటికే సర్వే చేపట్టినట్టు తెలిసింది. సాగు జరిగిన భూముల లెక్కలు తేలితేనే పెట్టుబడి సాయం అందించే రైతుల ఖాతాల్లో పడే అవకాశం ఉంది. దీనిలో ఎంత మంది రైతులకు, ఎంత వరకు పెట్టుబడి సాయం అందుతుందన్న దానిపై అస్పష్టత నెలకొంది. ఈ నెల 28 నుంచి 30 వరకు మహబూబ్‌నగర్‌లో రైతు సదస్సులు నిర్వహిస్తున్న నేపథ్యంలో అప్పుడైనా పెట్టుబడి సాయంపై ప్రకటన వెలువడుతుందేమోనని రైతులు ఆశగా ఎదురు చూస్తున్నారు.

రుణమాఫీ పూర్తవక రుణాలకు ఇబ్బంది

కాంగ్రెస్ సర్కారు హామీ ఇచ్చిన మేరకు రూ.2 లక్షల రుణమాఫీ ఇంకా పూర్తిస్థాయిలో అమలుకాలేదు. రాష్ట్రంలో రూ.2లక్షల వరకు రుణాలు తీసుకున్న రైతులు సుమారు 40 లక్షల మందికాగా.. ప్రభుత్వం 22 లక్షల మందికి సంబంధించి రూ. 18 వేల కోట్లను మాఫీ చేసింది. మిగతావారికి రుణమాఫీ జరగాల్సి ఉంది. రేషన్‌కార్డు లేకపోవడం, ఆధార్, పాస్ పుస్తకాల్లో పేర్లు తప్పుగా ఉండటం, కుటుంబంలో ఒకరి కన్నా ఎక్కువ మందికి రుణాలు ఉండటంతోపాటు పలు సాంకేతిక కారణాలతో వారికి రుణమాఫీ జరగలేదు. వ్యవసాయ శాఖ వారి వివరాలను సేకరించి ప్రభుత్వానికి పంపించింది కూడా. అయితే పంట పెట్టుబడుల కోసం రుణం కావాలని వెళితే.. పాత రుణాలు ఇంకా మాఫీ కానందున కొత్త రుణాలు ఇవ్వలేమని బ్యాంకులు తేల్చి చెబుతున్నాయని రైతులు వాపోతున్నారు. అంతేకాదు మాఫీకాని రుణాలకు సంబంధించి వడ్డీలు చెల్లించాలంటూ ఒత్తిడి చేస్తున్నాయని పేర్కొంటున్నారు. వానాకాలం ధాన్యానికి సంబంధించిన సొమ్ము కూడా ఇంకా అందలేదని కొందరు రైతులు చెబుతున్నారు.

మూసీ కబ్జాదారులపై క్రిమినల్ చర్యలు

▶ మొదటి పేజీ తరువాయి

తమ ఇళ్లను కూల్చకుండా అధికారులను ఆదేశించాలని కోరారు. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి.. అధికారులకు, పిటిషనర్లకు పలు సూచనలు చేస్తూ తీర్పు వెలువరించారు.

హైకోర్టు సూచనలివీ...

- ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్, రివర్ బెడ్ జోన్‌లో అక్రమ నిర్మాణాలకు సంబంధించి సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం ఆక్రమణదారులకు చట్ట ప్రకారం నోటీసులు ఇచ్చి ఆక్రమించినట్లు తేలితే వెంటనే తొలగింపు చర్యలు చేపట్టాలి.
- మూసీ పునరుజ్జీవం ప్రాజెక్టు ప్రభావిత వ్యక్తులకు సమగ్ర సామాజిక–ఆర్థిక సర్వే నిర్వహించి ప్రభుత్వం నిర్దేశించిన విధానాల ప్రకారం అనువైన ప్రదేశాల్లో అధికారులు వసతి కల్పించాలి.
- పట్టణాభివృద్ధి శాఖ 2012లో జారీ చేసిన జీవో 168 ప్రకారం ఇచ్చిన బిల్డింగ్ రూల్స్‌ను కచ్చితంగా పాటించాలి.
- మూసీ ఎఫ్‌టీఎల్, రివర్ బెడ్ జోన్‌లోని కేసుల విషయంలో మున్సిపల్ కార్పొరేషన్ ఆఫ్ హైదరాబాద్ వర్సెస్ ఫిలోమినా ఎడ్యుకేషనల్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా కేసులో హైకోర్టు ద్విసభ్య ధర్మాసనం జారీ చేసిన మార్గదర్శకాలతోపాటు 2023 నవంబర్ 8న ఆక్రమణలపై జారీ చేసిన సర్క్యులర్‌లోని సూచనలను ట్రయల్ కోర్టులు పాటించాలి.
- మూసీ బఫర్ జోన్, రివర్ బెడ్ జోన్ సరిహద్దుల స్థిరీకరణ కోసం అధికారులు చేపట్టే సర్వేలను పిటిషనర్లు, ఆక్రమణదారులు అడ్డుకోవద్దు.
- సర్వే కోసం వెళ్లే నీటిపారుదల, రెవెన్యూ, హైడ్రా, మున్సిపల్ శాఖల అధికారులకు పోలీసులు అవసరమైన భద్రతను కల్పించాలి.
- తెలంగాణ నీటిపారుదల చట్టం–1357 ఫస్లీ, వాల్టా చట్టం 2002లోని నిబంధనల ప్రకారం నదులు, నీటివనరులు, చెరువులు, సరస్సుల విధ్వంసానికి పాల్పడిన ఆక్రమణదారులు, భూకబ్జాదారులపై అధికారులు తగిన క్రిమినల్ చర్యలు తీసుకోవాలి.

క్లుప్తంగా...

సోనియా వల్లే కేసీఆర్‌కు సీఎం పదవి

మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి



సాక్షి, హైదరాబాద్‌: సోనియాగాంధీ తెలంగాణ ఇవ్వడం వల్లే కేసీఆర్‌ కొత్త రాష్ట్రానికి సీఎం అయ్యారని టీపీసీసీ వర్కింగ్‌ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే టి.జగ్గారెడ్డి స్పష్టం చేశారు. ఆయన గాంధీభవన్‌లో మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ.. కేటీఆర్‌ తన వయసును మరిచి మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్‌ పార్టీ వయసు 140 ఏళ్లయితే.. కేటీఆర్‌ వయసు 50 మాత్రమేనని పేర్కొన్నారు. ప్రతిపక్ష పార్టీగా బీఆర్‌ఎస్‌ ఇంకో 20 ఏళ్లు బతకాల్సి ఉందని జగ్గారెడ్డి ఎద్దేవా చేశారు.

వినతిపత్రాలు ఇద్దామన్నా కేసీఆర్‌ అపాయింట్‌మెంట్‌ ఇవ్వలేదు: జాజుల



సాక్షి, హైదరాబాద్‌: పదేళ్ల బీఆర్‌ఎస్‌ పాలనలో కేసీఆర్‌కు వినతిపత్రాలు ఇద్దామన్నా బీసీలకు అపాయింట్‌మెంట్‌ ఇవ్వలేదని, బీసీలు ఎప్పటికీ బీఆర్‌ఎస్‌ను నమ్మరని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్‌ వ్యాఖ్యానించారు. మంగళవారం డాక్టర్‌ బీఆర్‌ అంబేడ్కర్‌ తెలంగాణ సచివాలయ మీడియా బయట ఆయన విలేకరులతో మాట్లాడారు. మహాత్మా జ్యోతిబా పూలేకు నివాళులర్పించకుండా బీసీలను అవమానించారని, పదేళ్ల కాలంలో హైదరాబాద్‌లో పూలే విగ్రహాన్ని ఏర్పాటు చేయని వారు ఇప్పుడు ఆయన గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. రాష్ట్రంలో సంక్షేమ హాస్టళ్లు, గురుకులాల్లో విద్యార్థుల చావులకు బీఆర్‌ఎస్‌ కారణమని ఆరోపించారు. బీఆర్‌ఎస్‌ ఎమ్మెల్సీ కవిత రాజకీయాలు మాట్లాడితే బీసీలకు అభ్యంతరం లేదని, అయితే బీసీలను మోసం చేసిన వారే ఈరోజు బీసీల గురించి మాట్లాడే నైతిక హక్కులేదన్నారు. కేసీఆర్‌ స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లు తగ్గించారని, కులగణనపై ఆయన ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. 2014లో చేసిన సమగ్ర కుటుంబ సర్వే ఏమైందో కవిత చెప్పాలని నిలదీశారు.

న్యాయవాదిపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

సాక్షి, హైదరాబాద్‌: నిజామాబాద్‌లో సీనియర్‌ న్యాయవాది మహమ్మద్‌ ఖాసీంపై దాడిని బార్‌ కౌన్సిల్‌ ఖండించింది. ఆస్తి అమ్మడానికి నిరాకరించారనే కోపంతో దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని ప్రభుత్వాన్ని కోరింది. న్యాయవాదిపై క్రూరత్వంగా ఆయుధాలతో దాడి చేయడం హేయమని బార్‌ కౌన్సిల్‌ చైర్మన్‌ ఎ.నరసింహారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. న్యాయవాదులపై పెరిగిపోతున్న దాడులపై ఆందోళన వ్యక్తం చేశారు. అడ్వొకేట్ల రక్షణకు పోలీసులు వెంటనే చర్యలు తీసుకోవాలని డీజీపీకి విజ్ఞప్తి చేశారు. నిందితులను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్‌ చేశారు. ఆస్తి అమ్మడానికి నిరాకరించారనే ఆగ్రహంతో నిజామాబాద్‌ ఖిల్లా రోడ్‌లో ఆదివారం రాత్రి తండ్రీకొడుకులు ఖాసీంపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన విషయం తెలిసిందే.

అనుమతి లేకుండా వ్యవసాయ కోర్సులు

రెండు ప్రైవేటు వర్సిటీలు, పలు విద్యాసంస్థలపై ప్రభుత్వానికి 'ఐకార్‌' ఫిర్యాదు

సాక్షి, హైదరాబాద్‌: రాష్ట్రంలో వ్యవసాయ కోర్సులకు అనుమతి లేకుండానే విద్యార్థులను అక్రమంగా చేర్చుకుంటూ రెండు ప్రైవేటు వర్సిటీలతోపాటు పలు విద్యాసంస్థలు భారీగా సొమ్ము చేసుకుంటున్నట్లు ఇండియన్‌ కౌన్సిల్‌ ఆఫ్‌ అగ్రికల్చర్‌ రీసెర్చ్‌ (ఐకార్‌) గుర్తించింది. ఆయా సంస్థలపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారికి ఐకార్‌ డైరెక్టర్, డిపార్ట్‌మెంట్‌ ఆఫ్‌ అగ్రికల్చర్‌ రీసెర్చ్‌ ఎడ్యుకేషన్‌ కార్యదర్శి డాక్టర్‌ హిమాన్షు పాఠక్‌ లేఖ రాశారు. ఆయా ప్రైవేటు యూనివర్సిటీలు అగ్రికల్చర్‌డిగ్రీల కోసం ఐకార్‌ నుంచి నాలుగేళ్లలోగా ఎప్పుడైనా అనుమతి పొందొచ్చనే ధీమాతో ఇష్టానుసారంగా విద్యార్థులను చేర్చుకుంటున్నాయని తెలిసింది. ఈ వ్యవహారంలో గతంలో వ్యవసాయ విశ్వవిద్యాలయ వీసీగా పనిచేసిన ఓ వ్యక్తే కీలకంగా వ్యవహరించినట్లు సమాచారం. ఆయన అండదండలతో ఆ ప్రైవేటు వర్సిటీలు గుట్టుచప్పుడు కాకుండా అగ్రికల్చర్‌కోర్సులను నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. రాష్ట్రంలో ఇద్దరు నేతలకు చెందిన ప్రైవేటు వర్సిటీల్లో అనుమతి లేకుండానే వ్యవసాయ కోర్సులు నిర్వహిస్తున్నట్లు ఐకార్‌ గుర్తించిందని సమాచారం. విత్తన సంస్థకు చెందిన ఓ వర్సిటీ కూడా ఇలా అనుమతి లేకుండా అగ్రికల్చర్‌కోర్సులు నిర్వహిస్తున్నట్లు ఐకార్‌ తేల్చినట్లు సమాచారం.

ముందే అనుమతి ఉండాల్సిందే: వ్యవసాయ వర్సిటీ వీసీ

ఈ వ్యవహారంపై వ్యవసాయ విశ్వవిద్యాలయం వీసీ ప్రొఫెసర్‌ అల్దాస్‌ జానయ్య స్పందించారు. మంగళవారం ఓ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేటు రంగంలో వ్యవసాయ కళాశాలల ప్రారంభానికి ముందే కోర్సుల నిర్వహణకు అనుమతి ఉండాలని స్పష్టం చేశారు.



61వ నంబర్‌ జాతీయ రహదారిపై బైఠాయించిన రైతులు, మహిళలు

నిర్మల్‌ పల్లెల్లో 'ఇథనాల్‌' మంట

▶ మొదటి పేజీ తరువాయి

మధ్యాహ్నం 3 గంటల వేళ నిర్మల్‌ ఆర్డీవో రత్న కల్యాణి రాగా ఆమెను నిరసనకారులు అడ్డుకున్నారు. 20 మంది గ్రామస్తులను కలెక్టరేట్‌కు తీసుకెళ్లి కలెక్టర్‌తో మాట్లాడిస్తానని చెప్పినా వారు ససేమిరా అన్నారు. గతంలో తమకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని ఆరోపించారు. అందుకే కలెక్టరే తమ వద్దకు రావాలంటూ ఆమెను ఘెరావ్‌ చేశారు. దీంతో ఆమె రాత్రి 9:30 గంటల వరకు వాహనంలోనే కూర్చుండిపోయారు. చివరకు జిల్లా ఎస్పీ జానకీ షర్మిల స్వయంగా రోప్‌పార్టీ పోలీసులతో వచ్చి అడ్డుగా కూర్చున్న మహిళలను బలవంతంగా పక్కకు తప్పించి ఆర్డీఓను వాహనంలో నుంచి బయటకు తీసుకొచ్చారు. దీంతో కోపోద్రిక్తులైన నిరసనకారులు ఆర్డీవో వాహనాన్ని బోల్తా పడేసి దానిపై చలిమంటల్లోని కర్రలను విసిరేశారు. ఈ క్రమంలో జరిగిన తోపులాటలో లక్ష్మణచాంద మండల ఎస్సై సుమలత గాయపడ్డారు. మరోవైపు కొన్ని గంటలపాటు వాహనంలో కూర్చుండిపోయిన ఆర్డీఓ సైతం అనారోగ్యానికి గురైనట్లు తెలిసింది.

చేతిలో ప్లకార్డులు, పురుగుమందు డబ్బాలు

మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు, బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి 'కనబడుట లేదు..' అంటూ వారి ఫొటోలతో కూడిన ప్లకార్డులను నిరసనకారులు ప్రదర్శించారు. అలాగే కొందరు మహిళలు పురుగుల మందు డబ్బాలు తీసుకొచ్చి ఇప్పటికైనా ఫ్యాక్టరీని తీసేయకపోతే తమకు అవే దిక్కంటూ చూపించారు.

300 మంది పోలీసుల మోహరింపు..

నిరసనకారులు బంద్‌తోపాటు ఆందోళన చేయొచ్చన్న సమాచారంతో నిర్మల్‌ ఎస్పీ జానకీ షర్మిల ఇథనాల్‌ ఫ్యాక్టరీ వద్దకు మంగళవారం వేకువ జామునే నిర్మల్‌ డీఎస్పీ గంగారెడ్డితోపాటు జిల్లాలోని సీఐలు, ఎస్సైలు, దాదాపు 300 మంది పోలీసు బలగాలను పంపించారు. శాంతియుతంగానే ఉండాలని, చర్యలు తీసుకోవద్దని తమ సిబ్బందిని ఆదేశించారు. రాత్రిపూట ఆందోళనకారులను అడ్డుకునేందుకు నిజామాబాద్‌ జిల్లా నుంచీ బలగాలను రప్పించారు.

సీఎంవోకు నివేదిక పంపాం: కలెక్టర్‌

నిర్మల్‌ చైన్‌గేట్‌: ఇథనాల్‌ పరిశ్రమకు వ్యతిరేకంగా ప్రజలు చేస్తున్న ఆందోళనపై ముఖ్యమంత్రి కార్యాలయానికి నివేదిక పంపినట్లు కలెక్టర్‌ అభిలాష అభినవ్‌ ఓ ప్రకటనలో తెలిపారు. వారి ఆవేదనను సీఎంవోకు నివేదించినట్లు వివరించారు. ప్రజలు సంయమనం పాటించాలని కోరారు.

ఆది నుంచీ వద్దంటూనే..

దిలావర్‌పూర్‌–గుండంపల్లి గ్రామాల మధ్య శ్రీరాంసాగర్‌ ప్రాజెక్టు బ్యాక్‌వాటర్‌కు సమీపంలో దాదాపు 40 ఎకరాల్లో పీఎంకే గ్రూప్‌ ఇథనాల్‌ ఫ్యాక్టరీని ఏర్పాటు చేస్తోంది. ఇప్పటికే ప్రహరీతోపాటు దాదాపు నిర్మాణాలన్నీ పూర్తయ్యాయి. రూ.వందల కోట్ల పెట్టుబడితో పెడుతున్న తమ ఫ్యాక్టరీ జీరో పొల్యూషన్‌తో కూడినదని నిర్వాహకులు చెబుతున్నారు. కానీ సమీపంలోని దిలావర్‌పూర్, గుండంపల్లి గ్రామాలు తొలి నుంచీ ఈ ఫ్యాక్టరీని వ్యతిరేకిస్తూ వస్తున్నాయి. గతేడాది సైతం ఈ గ్రామాలు చేపట్టిన పరిశ్రమ ముట్టడి ఉద్రిక్తంగా సాగింది. రైతులపై పోలీసులు లాఠీచార్జి చేసే వరకూ పరిస్థితి వెళ్లింది. నాటి నుంచి ఆయా గ్రామస్తులు దీక్షలు, నిరసనలు కొనసాగిస్తున్నారు. తాజాగా దిలావర్‌పూర్, గుండంపల్లి గ్రామాలతో పాటు సమీపంలోని సముందర్‌పల్లి, కాండ్లి, టెంబరేణి, లోలం గ్రామాలూ ఆందోళనలో భాగమయ్యాయి.

మాస్టర్‌ విజన్‌-2050తో హైదరాబాద్‌ అభివృద్ధి

వెల్లడించిన రాష్ట్ర ప్రభుత్వం

సాక్షి, హైదరాబాద్‌: పెరుగుతున్న జనాభా, నగర విస్తరణకు అనుగుణంగా గ్రేటర్‌ హైదరాబాద్‌ అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాస్టర్‌ విజన్‌–2050 ప్రణాళికను సిద్ధం చేశారు. దీంతో రోడ్లు, రవాణా సదుపాయాలతో పాటు ట్రాఫిక్‌ నియంత్రణ, నీటి వనరుల రక్షణ, ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ వంటి కార్యక్రమాలను పకడ్బందీ ప్రణాళికతో అమలు చేసేందుకు అవసరమైన చర్యలకు శ్రీకారం చుట్టినట్లు రాష్ట్ర ప్రభుత్వం వెల్లడించింది. కాంగ్రెస్‌ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తవుతున్న సందర్భంగా నిర్వహిస్తున్న ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా హైదరాబాద్‌ నగర అభివృద్ధికి ముఖ్యమంత్రి తీసుకున్న చర్యలను ప్రభుత్వం మీడియాకు తెలిపింది. భవిష్యత్‌ విజన్‌తో నగరంలో ట్రాఫిక్‌ రద్దీని తట్టుకునేలా ఎలివేటెడ్‌ కారిడార్లు, మెట్రోరైల్‌తో పాటు రోడ్లు, రవాణా సదుపాయాల విస్తరణపై ప్రత్యేక దృష్టి సారించినట్లు వెల్లడించింది. రూ.లక్ష కోట్ల విలువైన పనులకు ఇప్పటికే శ్రీకారం చుట్టినట్లు తెలిపిన ప్రభుత్వం హైదరాబాద్‌ను ఫ్యూచర్‌ హబ్‌గా మార్చడమే సీఎం లక్ష్యమని పేర్కొంది.

విజన్‌-2050 వివరాలు సాక్షి ప్లస్‌ (ఈ-పేపర్‌)లో

ధాన్యం కొనుగోళ్లు త్వరగా పూర్తి చేయాలి

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశం

- సేకరణ కేంద్రాల వద్ద అదనపు సిబ్బందిని ఏర్పాటు చేయాలి
- ఇన్‌చార్జి మంత్రులు, అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలి
- రైతు పండగను కలెక్టర్లు విజయవంతం చేయాలి



కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌. చిత్రంలో సీఎస్‌ శాంతికుమారి

సాక్షి, హైదరాబాద్‌: రాష్ట్రంలో ధాన్యం సేకరణను త్వరగా పూర్తి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కలెక్టర్లను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల వద్ద అదనపు సిబ్బందిని ఏర్పాటు చేసి ధాన్యం కొనుగోలును వేగవంతం చేయాలన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్లతో పాటు పౌరసరఫరాల శాఖ ఉన్నతాధికారులను ఆదేశించారు. రైతుల నుంచి ధాన్యం సేకరణ సజావుగా సాగేలా పర్యవేక్షించేందుకు జిల్లాల వారీగా నియమితులైన ఇన్‌చార్జి మంత్రులు, అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలని సూచించారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న సీఎం..మంగళవారం పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కలిసి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌ నిర్వహించారు. హైదరాబాద్‌ నుంచి మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, కొండా సురేఖ, జూపల్లి కృష్ణారావు, సీఎస్‌ శాంతికుమారి తదితరులు పాల్గొన్నారు. ముఖ్యమంత్రి మాట్లాడుతూ గతంలో ఎప్పుడూ లేని విధంగా ధాన్యం కొనుగోలు, చెల్లింపులు సక్రమంగా జరుగుతున్నాయని సంతృప్తి వ్యక్తం చేశారు. సన్న, దొడ్డు రకాలను వేరువేరుగా సేకరించాలని, ధాన్యం విక్రయించిన రైతుకు చెల్లింపులు వెంటనే పూర్తి చేయాలని, సన్న రకాలకు బోనస్‌ కూడా త్వరగా చెల్లించాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అన్నిరకాల మౌలిక వసతులు కల్పించాలని సూచించారు. ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి ఉమ్మడి జిల్లాల వారీగా ప్రతిరోజూ నివేదిక సమర్పించాలని ఆదేశించారు.

అక్రమాలకు పాల్పడే మిల్లర్లను ఉపేక్షించొద్దు

అక్రమాలకు పాల్పడే మిల్లర్లను ఎట్టిపరిస్థితుల్లోనూ ఉపేక్షించరాదని, కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్లను ఆదేశించారు. రైతుల నుంచి సేకరించిన ధాన్యాన్ని మిల్లులకు తరలించేందుకు రవాణా సమస్యలు తలెత్తకుండా తగినన్ని లారీలు అందుబాటులో ఉండేలా చూడాలని కోరారు. సన్నాలకు బోనస్‌గా క్వింటాల్‌కు రూ.500 చెల్లిస్తుండడంపై రైతులు ఆనందంతో ఉన్నారని సీఎం వ్యాఖ్యానించారు. 'రాష్ట్రంలో 66 లక్షల ఎకరాల్లో ధాన్యం పండించారు. ఇంకా 20 లక్షల ఎకరాల్లో పంట కోయాల్సి ఉంది. సరిహద్దు జిల్లాల్లో నుంచి బోనస్‌ కోసం ధాన్యం రాష్ట్రంలోకి వస్తోంది. ఆ ధాన్యం విషయంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలి. 30న మహబూబ్‌నగర్‌లో రైతు పండగను జరుపబోతున్నాం. దీన్ని కలెక్టర్లు విజయవంతం చేయాలి' అని సీఎం కోరారు. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అందిస్తున్న సౌకర్యాలపై ప్రజల్లో ప్రచారం చేయాలని సూచించారు.

పాలమూరు రైతు పండుగను విజయవంతం చేయండి



- అధికారులు, ప్రజాప్రతినిధులకు మంత్రి తుమ్మల సూచన
- 30న సదస్సుకు లక్షమంది రైతులు.. ముఖ్య అతిథిగా సీఎం

సాక్షి, హైదరాబాద్‌: మహబూబ్‌నగర్‌లో ఈనెల 28, 29, 30 తేదీల్లో నిర్వహించే రైతు పండుగను విజయవంతం చేసేందుకు అధికారులు, ప్రజా ప్రతినిధులు కలసి పనిచేయాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. రైతు సదస్సు ఏర్పాట్లపై మంగళవారం సచివాలయంలో ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ, ఈ సంవత్సర కాలంలో రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యత ఇచ్చి నిధులు కేటాయించిందని చెప్పారు. రైతులకు పెద్దఎత్తున చేకూరిన ఈ ప్రయోజనాలకు సంబంధించిన అంశాలు, వ్యవసాయ రంగంలో వస్తున్న ఆధునిక మార్పులు, ఆదర్శ రైతుల ప్రసంగాలు పాలమూరు రైతు సదస్సులో ప్రధాన అంశాలుగా ఉంటాయని తెలిపారు. ఈనెల 28న ఉదయం 10 గంటలకు ఈ సదస్సు ప్రారంభమవుతుందని, మొదటి రోజు ఉమ్మడి మహబూబ్‌నగర్‌ జిల్లాకు చెందిన రైతులు, ప్రజాప్రతినిధులు హాజరవుతారని తుమ్మల చెప్పారు. 29న మహబూబ్‌నగర్‌ జిల్లాయేతర ప్రాంతాలనుంచి రైతులు హాజరవుతారని, 30న రాష్ట్ర వ్యాప్తంగా కనీసం లక్ష మంది రైతులు ఈ సదస్సుకు హాజరవుతారని వివరించారు. మొదటి రెండు రోజులు ప్రతిరోజూ 5 వేల మంది రైతులు హాజరయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. 30న సదస్సుకు సీఎం రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలిపారు. ఈ మూడు రోజులు రైతు సదస్సు వేదికపై ఆదర్శ రైతులచే ప్రసంగాలు, ఆధునిక వ్యవసాయ విధానాలపై వివరణలు, వ్యవసాయ అనుబంధ రంగాలైన పాడి పరిశ్రమ, మత్స్య తదితర రంగాలకు చెందిన ఆదర్శ రైతులచే ప్రసంగాలు, విజయగాథలపై వీడియో ప్రదర్శనలు ఉంటాయని వెల్లడించారు. సమావేశానికి తుమ్మలతోపాటు మంత్రులు జూపల్లి, దామోదర, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్‌ చిన్నారెడ్డి, వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్‌ చైర్మన్‌ ఎం.కోదండరెడ్డి, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ఉమ్మడి మహబూబ్‌నగర్‌ జిల్లాకు చెందిన ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, సీఎస్‌ శాంతికుమారి, డీజీపీ జితేందర్, కలెక్టర్లు, ఎస్పీలు హాజరయ్యారు.

సిరిసిల్ల కలెక్టర్‌ కాంగ్రెస్‌ కార్యకర్తలా పనిచేస్తున్నాడు

అతి చేస్తున్న అధికారులకు వడ్డీతో సహా చెల్లిస్తాం.. కార్యకర్తల సమావేశంలో కేటీఆర్‌



సిరిసిల్ల: 'సిరిసిల్ల కలెక్టర్‌ కాంగ్రెస్‌ కార్యకర్తలా పనిచేస్తున్నాడు. మన నాయకులను పార్టీ మారాలని అడుగుతున్నాడంట. ఇటువంటి సన్నాసిని కలెక్టర్‌గా తీసుకొచ్చారు. మీరు ఎవ్వరూ భయపడవద్దు..'అంటూ బీఆర్‌ఎస్‌ వర్కింగ్‌ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీ రామారావు భరోసా ఇచ్చారు. మంగళవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని తెలంగాణ భవన్‌లో పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. 'అతి చేస్తున్న కలెక్టర్లు, అధికారులు రాసి పెట్టుకోండి. కాంగ్రెస్‌ కార్యకర్తల్లాగా వ్యవహరిస్తే మళ్లీ మేము అధికారంలోకి వచ్చిన తర్వాత వడ్డీతో సహా చెల్లిస్తాం. నేనే ఆ బాధ్యత తీసుకుంటా. నేను కచ్చితంగా ఆ పనిచేసి చూపిస్తా..'అంటూ హెచ్చరించారు. తనపై నాలుగుసార్లు ఓడిపోయిన వ్యక్తి అధికారులను అడ్డుపెట్టుకుని విర్రవీగుతున్నాడని, సిరిసిల్లలో ప్రజలు ఛీకొట్టినా ఎగురుతున్నాడని కేటీఆర్‌ మండిపడ్డారు. ప్రభుత్వ తప్పులు, సీఎం అవినీతిని ఎండగడతామన్నారు.

రాహుల్‌ తిట్టినందుకే అదానీ విరాళం వెనక్కి

▶ మొదటి పేజీ తరువాయి

విషయంలో ప్రజలను తప్పుదోవ పట్టించేలా తప్పుడు ప్రచారం చేస్తున్నాడు. రాష్ట్రంలో అదానీకి రెడ్‌ సిగ్నల్‌ ఇవ్వడమే కేసీఆర్‌ చేసిన తప్పా? తెలంగాణ వనరులను దొంగకు దోచిపెట్టడాన్ని ప్రశ్నించిన నేను సైకోనా? తాను తప్పులు చేసి మా మీద రుద్దే ప్రయత్నం చేస్తున్న రేవంత్‌ అసలైన శాడిస్ట్‌. రేవంత్‌ మాదిరిగా కాళ్లు పట్టుకోవడం, లుచ్చా పనులు చేయడం, మస్కా కొట్టడం, గౌతమ్‌ భాయ్‌ అంటూ తిరిగే రకం కాదు మేము. నేను దావోస్‌లో అదానీతో కలిసి దిగిన ఫొటోను బహిరంగంగా ట్విట్టర్‌లో పెట్టా. కానీ రేవంత్‌ తరహాలో ఆయనను ఇంటికి పిలుచుకుని నాలుగు గంటలు రహస్యంగా కలవలేదు. కోహినూర్‌ హోటల్లో కాళ్లు పట్టుకోలేదు. అదానీ కాళ్లు ఒత్తుకుంటూ ఉండే అలవాటు నాకు లేదు..' అని కేటీఆర్‌ ఆగ్రహం వ్యక్తం చేశారు.

అదానీకి అనుమతులపై అబద్ధాలు

'సీఎం ప్రతి అంశంపైనా అవగాహన లేకుండా ఇష్టారీతిన మాట్లాడుతూ రాష్ట్ర గౌరవం మంటగలుపుతున్నాడు. మైక్రోసాఫ్ట్‌ డేటా సెంటర్‌ను అదానీతో ముడిపెడుతూ సీఎం ప్రెస్‌మీట్లు పెడుతున్నాడు. రక్షణ శాఖ, కేంద్ర ఉపరితల రవాణా శాఖ ఇచ్చిన అనుమతులు బీఆర్‌ఎస్‌ ప్రభుత్వానికి అంటగడుతున్నాడు. డ్రై పోర్టు, విద్యుత్‌ ట్రాన్స్‌మిషన్‌ అనుమతులతో మాకు సంబంధం లేదు..' అని మాజీమంత్రి స్పష్టం చేశారు.

గురుకుల మరణాలన్నీ సర్కారు హత్యలే

'గురుకుల పాఠశాలల్లో చదివే 48 మంది పిల్లలు చనిపోయినా సీఎం సమీక్ష నిర్వహించడం లేదు. గురుకుల విద్యార్థుల మరణాలన్నీ ప్రభుత్వ హత్యలే. కొండారెడ్డిపల్లిలో మాజీ సర్పంచ్‌ ఆత్మహత్యకు రేవంత్‌రెడ్డే కారణం..' అని కేటీఆర్‌ ఆరోపించారు.

జనతా గ్యారేజ్‌లా తెలంగాణ భవన్‌

బంజారాహిల్స్‌ (హైదరాబాద్‌): కాంగ్రెస్‌ ప్రభుత్వం హైదరాబాద్‌ ప్రజలపై పగ పెంచుకుని వేధిస్తోందని కేటీఆర్‌ ఆగ్రహం వ్యక్తం చేశారు. మూసీ, హైడ్రా బాధితులు, ఆటోడ్రైవర్లు తదితర నగర ప్రజలు.. ప్రభుత్వం పెడుతున్న బాధలు చెప్పుకునేందుకు తెలంగాణ భవన్‌కు వస్తున్నారని, తెలంగాణ భవన్‌ జనతా గ్యారేజ్‌గా మారిందని చెప్పారు. ఈ నెల 29న నిర్వహించనున్న దీక్షా దివస్‌ కార్యక్రమానికి సంబంధించి హైదరాబాద్‌ జిల్లా సన్నాహక సమావేశాన్ని మంగళవారం తెలంగాణ భవన్‌లో నిర్వహించారు. ఈ సమావేశంలో కేటీఆర్‌ మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఏ వర్గం కూడా సంతోషంగా లేదని ఆయన విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి పాలన పిచ్చోడి చేతిలో రాయిలా మారిందన్నారు. రేవంత్‌రెడ్డి ఎత్తైన కుర్చీలో కూర్చొని గొప్ప మనిషిని కావాలని భావిస్తున్నాడని, కానీ కేసీఆర్‌లా ప్రజలకు మంచి చేసినప్పుడు మాత్రమే వారి గుండెల్లో చెరగని స్థానం సంపాదించుకోగలమని గుర్తించడం లేదని అన్నారు.

హైదరాబాద్‌ను నాలుగు ముక్కలు చేసే కుట్ర

ఓఆర్‌ఆర్‌ లోపల ఉన్న హైదరాబాద్‌ను మూడు లేదా నాలుగు ముక్కలు చేయాలని సీఎం కుట్ర చేస్తున్నాడని కేటీఆర్‌ ఆరోపించారు. హైదరాబాద్‌ ఇమేజ్‌ను డ్యామేజ్‌ చేసే కుట్రలో బీజేపీకి కూడా భాగం ఉందని అన్నారు. కాంగ్రెస్‌ తప్పుడు హామీలను నమ్మి మోసపోయామని ప్రజలు ఇప్పుడు బాధపడుతున్నారని చెప్పారు. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా బీఆర్‌ఎస్‌ అఖండ మెజార్టీ సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. గత ఎన్నికల్లో జీహెచ్‌ఎంసీ పరిధిలో కాంగ్రెస్‌కు ఒక్క సీటు కూడా ఇవ్వని ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. కాంగ్రెస్‌ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలని ఈ సందర్భంగా పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సమావేశంలో బీఆర్‌ఎస్‌ ఎమ్మెల్యేలు తలసాని శ్రీనివాస్‌యాదవ్, పద్మారావుగౌడ్, మాగంటి గోపీనాథ్, కాలేరు వెంకటేశ్, ముఠా గోపాల్, ఎమ్మెల్సీ మధుసూదనాచారి, పొన్నాల లక్ష్మయ్య, పలువురు బీఆర్‌ఎస్‌ నేతలు పాల్గొన్నారు.

రాజ్యాంగ రూపకర్తకు అవమానం

సీఎం రేవంత్‌కు కేటీఆర్‌ బహిరంగ లేఖ

సాక్షి, హైదరాబాద్‌: రేవంత్‌ ప్రభుత్వం రాజ్యాంగ ప్రమాణాలు, విలువల స్ఫూర్తిని ఉల్లంఘిస్తోందని బీఆర్‌ఎస్‌ వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ కేటీఆర్‌ అన్నారు. రాజ్యాంగ రూపకర్త అంబేడ్కర్‌కు గౌరవ సూచకంగా కేసీఆర్‌ ప్రభుత్వం ఏర్పాటు చేసిన అతిపెద్ద విగ్రహాన్ని రేవంత్‌ గౌరవించడం లేదని చెప్పారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా సీఎం రేవంత్‌కు కేటీఆర్‌ మంగళవారం బహిరంగ లేఖ రాశారు. చట్టవిరుద్ధంగా బీఆర్‌ఎస్‌ ఎమ్మెల్యేలను కాంగ్రెస్‌లో చేర్చుకొని నామినేటెడ్‌ పదవులు ఇస్తోందని, ప్రజాపాలన పేరిట అరాచకాలకు పాల్పడుతోందన్నారు. రేవంత్‌ పాలనను వ్యతిరేకిస్తున్న వారిపై దేశద్రోహం లాంటి తీవ్ర సెక్షన్ల కింద కేసులు పెడుతూ అరాచకత్వాన్ని బయట పెట్టుకుంటోందన్నారు. రేవంత్‌ పాలనలో తెలంగాణ పోలీసు రాజ్యంగా మారిందని చెప్పారు. సీఎం కుటుంబసభ్యులు రాజ్యాంగేతర శక్తులుగా పాలనలో జోక్యం చేసుకుంటుండగా, ఆయన సోదరులు క్విడ్‌ ప్రోకో విధానంలో లబ్ధి పొందుతున్నారన్నారు. సమాజంలోని వివిధవర్గాలు రేవంత్‌ రాజ్యాంగ వ్యతిరేక, అసమర్థ పాలనను వ్యతిరేకిస్తూ రోడ్లపైకి వచ్చి ఆందోళన చేపడుతున్నారని కేటీఆర్‌ ఆ లేఖలో పేర్కొన్నారు.

తప్పుడు అఫిడవిట్‌ దాఖలు చేస్తారా?

- డిజైన్లు లేకుండానే బ్లాక్‌-2ఏ కట్టిన వాటికి సీఈ సీడీవో ఆమోదం ఉందంటారా?
- ప్రమాణం చేసి అబద్ధాలా? క్రిమినల్‌ చర్యలు తీసుకోవాలా?
- సుందిళ్ల బరాజ్‌ ఈఈపై జస్టిస్‌ ఘోష్‌ కమిషన్‌ ఆగ్రహం
- సీఈ నల్లా వెంకటేశ్వర్లు ఆదేశాలతోనే డిజైన్లు లేకుండానే నిర్మించినట్టు ఇంజనీర్ల వివరణ
- 16 మంది ఇంజనీర్లకు క్రాస్‌ ఎగ్జామినేషన్‌ నిర్వహణ.. నేడు మరో 18 మందిని ప్రశ్నించనున్న కమిషన్‌



విచారణకు హాజరైన ఇంజనీర్లు

సాక్షి, హైదరాబాద్‌: 'తప్పుడు అఫిడవిట్‌ దాఖలు చేస్తారా? అన్నీ నిజాలే చెప్తాను.. అని ప్రమాణం చేసి అబద్ధాలు ఎలా ఆడతారు ? క్రిమినల్‌ కేసు పెట్టి చర్యలు తీసుకోవాలా..'అని సుందిళ్ల బరాజ్‌ ఎగ్జిక్యూటివ్‌ ఇంజనీర్‌(ఈఈ) గంగం వేణుబాబుపై జస్టిస్‌ పినాకి చంద్రఘోష్‌ కమిషన్‌ ఆగ్రహం వ్యక్తం చేసింది. కాళేశ్వరం ప్రాజెక్టు బరాజ్‌ల నిర్మాణంలో అవకతవకలపై విచారణలో భాగంగా మంగళవారం 16 మంది నీటి పారుదల శాఖ ఇంజనీర్లకు క్రాస్‌ ఎగ్జామినేషన్‌ నిర్వహించింది. అఫిడవిట్‌లో పేర్కొన్న విషయాలన్నీ వాస్తవాలేనా? సుందిళ్ల బరాజ్‌ బ్లాక్‌-2ఏ డిజైన్, డ్రాయింగ్స్‌ ఉన్నాయా? ..అని విచారణ ప్రారంభంలో ఈఈ గంగం వేణుబాబును కమిషన్‌ ప్రశ్నించింది. బరాజ్‌లో నిర్మించిన ఇతర బ్లాకుల డిజైన్లు, డ్రాయింగ్స్‌ ఆధారంగా బ్లాక్‌-2ఏను నిర్మించాలని నాటి రామగుండం సీఈ నల్లా వెంకటేశ్వర్లు ఆదేశించారని వేణుబాబు బదులిచ్చారు. సెంట్రల్‌ డిజైన్స్‌ ఆర్గనైజేషన్‌(సీడీఓ) సీఈ ఆమోదించిన డిజైన్లతోనే బ్లాక్‌-2ఏ కట్టామని అఫిడవిట్‌లో మీరు పొందుపరిచిన అంశం అబద్ధమా? ఆమోదిత డ్రాయింగ్స్‌ లేకుండానే బ్లాక్‌-2ఏ నిర్మించారా? అఫిడవిట్లో అబద్ధాలు ఎలా చెప్తారు? అని ఈ సందర్భంగా ఆయనపై కమిషన్‌ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. 'పొరపాటైంది.. అఫిడవిట్‌లో పొందుపరిచిన అంశం వాస్తవం కాదు'అని వేణుబాబు వివరణ ఇవ్వడానికి ప్రయత్నించగా కమిషన్‌ అసహనం వ్యక్తం చేసింది. మీరు ఒక ఇంజనీర్‌ ? బాధ్యత లేదా? ఏ బ్లాకును కట్టాకా దాని డిజైన్ల ఆధారంగా ఏయే బ్లాకులు కట్టారు? బ్లాక్‌ –1, 2 కట్టిన తర్వాత బ్లాక్‌-2ఏ కట్టారా? అని కమిషన్‌ నిలదీయగా, సమాధానం ఇవ్వలేక వేణుబాబు ఇబ్బందిపడ్డారు. తప్పుడు అఫిడవిట్‌ ఇవ్వడం నేరం.. క్రిమినల్‌ కేసు పెట్టాలా? అని కమిషన్‌ మందలించింది. బ్లాక్‌-2, 3ల నిర్మాణాన్ని ఎప్పుడు ప్రారంభించారని తదుపరిగా కమిషన్‌ ప్రశ్నించగా, వేణుబాబు సమాధానం ఇవ్వలేక నీళ్లు నమిలారు. తేదీలు తెలియకపోతే కనీసం ఏ సంవత్సరమో తెలపాలని కమిషన్‌ కోరగా, 2016 నిర్మాణం ప్రారంభమైందని బదులిచ్చారు. బ్లాక్‌-2, 3, 2ఏల నిర్మాణం 2017లో ప్రారంభించినట్టు రికార్డుల్లో ఉందని మళ్లీ కమిషన్‌ ఆయనపై ఆగ్రహం వ్యక్తం చేసింది.

ఈఎన్‌సీ ఆదేశాలతోనే బ్లాక్‌-2ఏ నిర్మాణం

సుందిళ్ల బరాజ్‌ బ్లాక్‌-2ఏకి సంబంధించిన డిజైన్లు, డ్రాయింగ్స్‌ లేవని రిటైర్డ్‌ డీఈఈ బండారి భద్రయ్య వెల్లడించారు. బ్లాక్‌-2, బ్లాక్‌-3 మధ్య దూరం పెరగడంతో అదనంగా బ్లాక్‌-2ఏ నిర్మించాల్సి వచ్చిందని ఓ ప్రశ్నకు బదులిచ్చారు. డ్రాయింగ్స్‌ లేకుండానే ఇతర బ్లాకులను ఎలా కట్టారో బాక్‌-2ఏను సైతం అదే తరహాలో కట్టాలని రామగుండం మాజీ సీఈ నల్లా వెంకటేశ్వర్లు ఆదేశించారని తెలియజేశారు. డ్రాయింగ్స్‌ లేకుండా ఎలా కట్టారు? అని కమిషన్‌ నిలదీయగా, ఆయన పైవిధంగా బదులిచ్చారు. సుందిళ్ల బరాజ్‌ పూర్తయినట్టు తాను ధ్రువీకరణ పత్రం జారీ చేశానని మరో డీఈఈ సునీత కమిషన్‌కు వివరణ ఇచ్చారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంతో తనకు సంబంధం లేదని చొప్పదండి ఈఈ శ్రీధర్‌ బదులిచ్చారు.

సుందిళ్ల పునరుద్ధరణ పూర్తి

అఫిడవిట్‌లో పేర్కొన్న విషయాలన్నీ వాస్తవాలేనా? నిజం తప్ప మరేమీ చెప్పను.. అని చేసిన ప్రమాణానికి అర్థం తెలుసా? అని రామగుండం ఎస్‌ఈ సత్యరాజుచంద్రను కమిషన్‌ ప్రశ్నించింది. నేషనల్‌ డ్యామ్‌ సేఫ్టీ అథారిటీ మధ్యంతర సిఫారసుల ఆధారంగా సుందిళ్ల బరాజ్‌కు అత్యవసర మరమ్మతులను నిర్మాణ సంస్థ నవయుగ సొంత ఖర్చులతో చేపట్టిందని, బ్లాక్‌-8కి ఎదురుగా ఉన్న కాంక్రీట్‌ బ్లాకుల పునరుద్ధరణ తప్ప మిగిలిన పనులన్నీ పూర్తయ్యాయని ఏఈఈ చెన్న అశోక్‌కుమార్‌ తెలిపారు. ఏ రోజు పనిని అదేరోజు పరిశీలించి ప్లేస్‌మెంట్‌ రిజిస్టర్‌లో నమోదు చేసి సంతకాలు చేశారా? అని ఏఈఈ హరితను కమిషన్‌ అడగ్గా, అవును అని ఆమె బదులిచ్చారు. క్రాస్‌ ఎగ్జామినేషన్‌కు హాజరైన మిగిలిన ఇంజనీర్లు బరాజ్‌ల నిర్మాణంతో తమకు సంబంధం లేదని బదులిచ్చారు.

సర్కార్‌ విచక్షణ అధికారాలతో జర్నలిస్టులకు ఇళ్లు కేటాయించాలి

కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌ డిమాండ్‌



సాక్షి, హైదరాబాద్‌: జేఎన్‌జే హౌసింగ్‌ సొసైటీకి కేటాయించిన ఇళ్ల స్థలాలను రద్దు చేస్తూ సుప్రీంకోర్టు తీర్పు వెలువరించడం అత్యంత బాధాకరమని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌ పేర్కొన్నారు. అయినా ప్రభుత్వం విచక్షణ అధికారాలను ఉపయోగించి జర్నలిస్టులకు ఇళ్లు కేటాయించాలని డిమాండ్‌ చేశారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రంలో ఇళ్లు లేని అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు వెంటనే మంజూరు చేయాలని మంగళవారం ఒక ప్రకటనలో సూచించారు. 'సుప్రీం'తీర్పును గౌరవించాల్సిందేనని, అయితే ఈ స్థలాలు దక్కకపోవడానికి పదేళ్ల బీఆర్‌ఎస్‌ సర్కార్‌తోపాటు ప్రస్తుత కాంగ్రెస్‌ పాలకులే ప్రధాన కారణమన్నారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌ రెండూ ఏదో ఒక సాకు చూపుతూ జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు చేతికి అందించకుండా తీవ్రమైన అన్యాయం చేశాయని మండిపడ్డారు. ప్రభుత్వం వారికి కనీస సౌకర్యాలు కూడా కల్పించకుండా అన్యాయం చేస్తోందని ధ్వజమెత్తారు.



ఉద్దేశ్యాన్ని బట్టి చర్య సారం ఆధారపడి ఉంటుంది.
– బౌద్ధ ధర్మం

సాక్షి
బుధవారం, 27 నవంబర్ 2024

సాధించినదేమిటి?

పర్యావరణ మార్పుల రీత్యా ప్రపంచం క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నవేళ జరిగిన సమావేశం అది. తీరా పన్నెండు రోజుల పైగా చర్చోపచర్చల తర్వాత సాధించినది మాత్రం అతి స్వల్పం. అజర్‌బైజాన్‌లోని బైకూలో తాజాగా ముగిసిన ఐరాస 29వ పర్యావరణ సదస్సు (కాన్ఫడరేషన్ ఆఫ్ పార్టీస్- కాప్29), అక్కడ చేసిన తూతూమంత్రపు తీర్మానం పట్ల బాహాటంగానే విమర్శలు వినిపిస్తున్నాయి. దేశాల మధ్య అభిప్రాయ భేదాలను పోగొట్టి, మధ్యేమార్గ సాధన కోసం నిర్ణీత షెడ్యూల్‌కు మించి అదనంగా మరో రెండు రాత్రుల పాటు బాకూలో సంప్రతింపులను పొడిగించారు. అయినా పెద్దగా ఫలితం లేకపోయింది. చివరకు ఓ 'దిశానిర్దేశ ప్రణాళిక' రూపకల్పనతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. ఇన్నాళ్ళుగా కాలుష్యానికి కారణమవుతూ పురోగమించిన అభివృద్ధి చెందిన దేశాలు అలా చేతులు దులిపేసుకొని హమ్మయ్య అనుకున్నాయి. కాలుష్య బాధిత వర్ధమాన దేశాల్లో సహజంగానే ఇది నిరాశ నింపింది. పర్యావరణ మార్పులతో సతమతమవుతున్న పుడమి యథాపూర్వస్థితిలో ప్రమాదం అంచునే మిగిలిపోయింది. భారత్, నైజీరియా, బొలీవియా వగైరా బృందంతో కూడిన వర్ధమాన దేశాలు తాజా 'కాప్-29' సదస్సు పట్ల పెదవి విరుస్తున్నది అందుకే!

ప్యారిస్ ఒప్పందానికి అనుగుణంగా భూతాపోన్నతిని నియంత్రిస్తూ, పర్యావరణ అనుకూల విధానాలకు మారిపోవాలంటే వర్ధమాన ప్రపంచానికి 2035 నాటికి ఏటా 1.3 లక్షల కోట్ల డాలర్లు అవసరమని స్వతంత్ర నిపుణుల అంచనా. కానీ, విచ్చలవిడి పారిశ్రామికీకరణతో అభివృద్ధి చెందిన దేశాలు మాత్రం బాధ్యతారాహిత్యాన్ని ప్రదర్శిస్తూ, 2035 నాటికి ఏటా కేవలం 300 బిలియన్ డాలర్లు మాత్రం ఇస్తామంటూ ఒప్పందం చేశాయి. అడిగిన మొత్తంలో కేవలం 20 శాతమే అది. ఆ అరకొర నిధులతో, అదీ అపరిమితమైన ఆలస్యంతో ఉపయోగం ఉండదు. ఇప్పటికే అధిక ఉష్ణోగ్రతలు, పెరుగుతున్న సముద్రమట్టాలు, దరిమిలా ముంచెత్తిన ఆర్థిక భారంతో మునిగిపోతున్న పేద దేశాలు తాజా బాకూ సదస్సులో తీర్మానించిన ఈ రకమైన అరకొర పర్యావరణ నిధి తమ పాలిట మరణ శాసనంగా అభివర్ణిస్తున్నాయి. పైగా, నిధి విషయంలో ధనిక ప్రపంచ ప్రభుత్వాలు బాధ్యతను తమ భుజం మీద వేసుకోకుండా ప్రైవేట్ సంస్థలు, అంతర్జాతీయ ఋణదాతల మీద ఆధారపడడం మరీ ఘోరం. ఈ అంశాలే ఇప్పుడు రచ్చకు దారి తీస్తున్నాయి.

పర్యావరణ సంక్షోభానికి ప్రధాన కారణమైన ధనిక దేశాలు బెదిరింపులు, అధికార ప్రదర్శనలతో బాధిత దేశాల మెడలు వంచుతున్నాయి. పస లేని ఒప్పందాలకు తలలూపేలా చేస్తున్నాయి. ఇది చేదు నిజం. బైకూ సదస్సులోనూ అదే జరిగింది. శిలాజ ఇంధన దేశాల ప్రయోజనాల్ని కాపాడేందుకు తెర వెనుక సాగిన లాబీయింగ్, తీర్మానాల్లో ఆఖరి నిమిషంలో సాగిన మార్పులు చేర్పులే అందుకు నిదర్శనం. అభివృద్ధి చెందిన దేశాలు ఇలా తమ నైతిక, చారిత్రక కర్తవ్యాల విషయంలో వెనక ముందులాడుతూ, చివరకు విసురుతున్న చాలీచాలని రొట్టె ముక్కలకే బీద దేశాలు తలలూపాల్సి వస్తోంది. అలాగని కాప్ సదస్సులు వట్టి వృథా అని కొట్టిపారేయలేం. ఎందుకంటే, పర్యావరణ ప్రమాదంపై పేద దేశాలు కనీసం తమ వాణిని అయినా వినిపించడానికి మిగిలింది ఇదొకటే వేదిక. కాదూ... కూడదంటే అసలుకే మోసం వస్తుందనీ, మొత్తం 'కాప్' ప్రక్రియే కుప్పకూలుతుందనీ ఈ బీద ప్రపంచపు భయం.

మరోపక్క పర్యావరణ సంక్షోభమనేది వట్టి బూటకమని వాదించే ట్రంప్ రెండోసారి అమెరికా అధ్యక్ష పదవిని చేపట్టనున్నారు. ఈ నేపథ్యంలో బైకూ 'కాప్' సదస్సులో ఇచ్చిన హామీలకు అగ్ర రాజ్యం భవిష్యత్తులో ఏ మేరకు కట్టుబడి ఉంటుందన్నది మిలియన్ డాలర్ల ప్రశ్న. ఆ మాటకొస్తే అధ్యక్షుడు బైడెన్ హయాంలోనూ పర్యావరణ నిధులకై ప్రభుత్వ అభ్యర్థనల్ని అమెరికన్ కాంగ్రెస్ నెరవేర్చనేలేదు. క్లిష్టమైన పరిస్థితుల్లో, అధ్యక్ష స్థానంలోని అజర్‌బైజాన్ సహా అనేక ప్రధాన దేశాల అంతంత మాత్రపు ముందస్తు కసరత్తు నడుమ కాప్29 అడుగులు వేసింది. అయినా ఈ సదస్సులో అసలేమీ జరగలేదని అనుకోలేం. ఏటా 100 బిలియన్ డాలర్ల మేర నిధులు సమకూరుస్తామని సంపన్న దేశాలు గతంలో వాగ్దానం చేశాయి. 2020 నుంచి నిలబెట్టుకోవాల్సిన మాటను ఆలస్యంగా 2022 నుంచి అమలు చేస్తున్నాయి. అదీ 2025తో ముగిసిపోనుంది. ఈ పరిస్థితుల్లో ఇప్పుడు ఆ మొత్తాన్ని 2035 నాటికి 300 బిలియన్లకు పెంచడం ఒకింత విజయమే. కాకపోతే, పారదర్శకత లేమి, అందరినీ కలుపుకొనిపోలేకపోవడం తాజా ఒప్పందపు చట్టబద్ధతను తక్కువ చేస్తున్నాయి.

అధిక పారిశ్రామికీకరణతో లాభపడ్డ సంపన్న దేశాలు ఏళ్ళ తరబడి మీనమేషాలు లెక్కపెడుతుండడమే పెనుశాపమవుతోంది. అందువల్లే భూతాపోన్నతిని 1.5 డిగ్రీల సెంటీగ్రేడ్‌ను మించనివ్వరాదన్న ప్యారిస్ ఒప్పంద లక్ష్యం వట్టి కలగానే మిగిలింది. అసలు ఇదే పద్ధతిలో ముందుకు వెళితే కర్బన ఉద్గారాలను తగ్గించే విషయంలో కొత్త మాట దేవుడెరుగు... వర్తమాన వాగ్దానాలకు కట్టుబడి ఉన్నప్పటికీ భూతాపం 2.7 డిగ్రీల మేర పెరుగుతుందట. అది పర్యావరణ సంక్షోభానికి దారి తీస్తుందని ఐరాస హెచ్చరిక. అది చెవికెక్కించుకొని, వచ్చే ఏడాది బ్రెజిల్‌లో జరిగే కాప్30 నాటికైనా సంపన్న దేశాలు చిత్తశుద్ధితో ప్రయత్నాలు సాగించాలి. ఇచ్చిన మాట నిలబెట్టుకొని, పర్యావరణ న్యాయం వాస్తవమయ్యేలా చూస్తేనే మానవాళికి మేలు జరుగుతుంది. అదే సమయంలో భారత్ సహా వర్ధమాన ప్రపంచం ఈ పర్యావరణ మార్పు సవాలును సమర్థంగా ఎదుర్కొనేందుకు తమవైన వ్యూహాలపై దృష్టి పెట్టడం మంచిది. థర్మల్ విద్యుత్‌పై అతిగా ఆధారపడడం లాంటివి మానుకోవడమూ మంచిది. లేదంటే కూర్చున్న కొమ్మను నరుక్కున్నట్టే అవుతుంది.

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం,
శరదృతువు, కార్తీక మాసం, **తిథి:** బ.ద్వాదశి తె.5.48 వరకు
(తెల్లవారితే గురువారం) తదుపరి త్రయోదశి, **నక్షత్రం:** చిత్త
పూర్తి (24 గంటలు), **వర్జ్యం:** ప.2.06 నుండి 3.50 వరకు
దుర్ముహూర్తం: ఉ.11.27 నుండి 12.15 వరకు,
అమృతఘడియలు: రా.12.42 నుండి 2.28 వరకు.

సూర్యోదయం : 6.15
సూర్యాస్తమయం: 5.20
రాహుకాలం : ప.12.00 నుండి 1.30 వరకు
యమగండం : ఉ.7.30 నుండి 9.00 వరకు

విజయాన్ని మించిన పరాజయం

విశ్లేషణ



దిలీప్ రెడ్డి

మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ఫలితం ప్రజలకు పెద్దగా ఆశ్చర్యం కలిగించలేదు. మెజారిటీ సర్వే సంస్థలు పాలకపక్ష కూటమి 'మహాయుతి'కి అనుకూలంగానే చెప్పాయి. కానీ, ఇంతటి ఘనవిజయాన్ని అవి కూడా అంచనా వేయలేకపోయాయి. ఈ గెలుపును విశ్లేషిస్తే, 'మహా వికాస్ అఘాడీ'పై మహాయుతి విజయంగా కన్నా... మహాయుతి చేతిలో ఎమ్వీయే ఘోర పరాజయంగా పరిగణించడమే సమంజసం. ఇది విపక్ష కూటమి చేజేతులా తెచ్చుకున్న ఓటమి. మితిమీరిన ఆత్మవిశ్వాసం, కొరవడిన ఎన్నికల వ్యూహం వారికీ గతి పట్టించాయి. అతి విశ్వాసంతో సరైన 'ఎన్నికల నినాదమే' లేకుండా కూటమి గుడ్డిపోరు సల్పింది. లోక్‌సభ ఎన్నికల్లో లభించిన స్పష్టమైన ఆధిక్యాన్ని నిలుపుకోలేక పోయింది.

మెజారిటీ సర్వే సంస్థలు అంచనా వేసినట్టుగానే, మహారాష్ట్ర శాసనసభ ఎన్నికల్లో పాలకపక్ష కూటమి 'మహాయుతి' ఘన విజయాన్ని సాధించింది. గరిష్ఠంగా 'పీపుల్స్ పల్స్' చెప్పిన 195 సంఖ్యను కూడా మించి, ఏకంగా 234 స్థానాలను కైవసం చేసుకొని బీజేపీ నేతృత్వపు కూటమి తిరుగులేని విజయాన్ని నమోదు చేసింది.

మహారాష్ట్ర ఫలితం 'ఇండియా కూటమి'కి ఎదురు దెబ్బే అయినా, పార్టీగా కాంగ్రెస్‌కు కోలుకోలేని పెద్ద దెబ్బ. హిమాచల్ ప్రదేశ్ గెలుపు కర్ణాటకలో విజయానికీ, కర్ణాటకలో గెలుపు తెలంగాణలో విజయానికీ కొంత ప్రేరణ ఇచ్చిన క్రమంలో... 2024 లోక్‌సభ ఎన్నికల నాటికి కాంగ్రెస్ తన స్థానాలను రెట్టింపు చేసుకోగలిగింది. సెంచరీ మార్క్ సాధించింది. ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ మెరుగుదల మిత్ర పక్షాలకూ ప్రేరణ కలిగించి, దేశ రాజకీయాల్లో 'ఇండియా కూటమి' బలమైన ప్రత్యామ్నాయంగా నిలువగలిగింది.

అయితే, చావు తప్పి కన్ను లొట్టబోయిందన్న తరహాలో 'ఇండియా' కూటమికి దక్కిన నిన్నటి జమ్ము-కశ్మీర్ గెలుపైనా, ఇవాళ్టి 'జార్ఖండ్' విజయమైనా మిత్రుల ఘనతే తప్ప కాంగ్రెస్ సాధించిందేమీ లేదు. కాంగ్రెస్ సంస్థాగత స్థితి, ఎన్నికల నిర్వహణా సామర్థ్యం దిగదుడుపుగానే ఉంటోంది. 1990లలో బీజేపీ-శివసేన కూటమి రాజకీయాలు మొదలయ్యే వరకు మహారాష్ట్రలో కాంగ్రెస్‌దే ఆధిపత్యం. బీజేపీ-శివసేన శకం ఆధిపత్య క్రమంలో కూడా 2004-14 మధ్య శరద్ పవార్ నేతృత్వంలోని జాతీయవాద కాంగ్రెస్ (ఎన్సీపీ)తో పొత్తుల వల్ల కాంగ్రెస్ మళ్లీ పాలకపక్ష స్థాయికి వచ్చింది. 2014 తర్వాత, ముఖ్యంగా 2019 ఎన్నికల తర్వాత రాజకీయ అనిశ్చితి, పార్టీ మార్పిళ్లు, రాజకీయ శక్తుల పునరేకీకరణల్లో కాంగ్రెస్ క్రమంగా పలుచబారుతోంది.

కాంగ్రెస్‌ది మహావైఫల్యం

ఇటీవలి హరియాణా అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు అవకాశాలను దాదాపు అన్ని సర్వే సంస్థలూ అంచనా వేశాయి. 2014, 2019 రెండు సార్వత్రిక ఎన్నికల్లోనూ, మొత్తం పది లోక్‌సభ స్థానాలూ ఓడిపోయిన హరియాణాలో కాంగ్రెస్ పార్టీ, 2024 ఎన్నికలకు వచ్చేసరికి 5 స్థానాలు గెలిచింది. ఓటు వాటాలోనూ బీజేపీ కన్నా 1 శాతం స్పష్టమైన ఆధిక్యత దక్కించుకుంది. తర్వాతి ఒకటి, రెండు మాసాల్లో కాంగ్రెస్ సానుకూలత మరింత పెరిగినట్టు వివిధ సర్వేల్లో సంకేతాలొచ్చాయి. కానీ, అసెంబ్లీ ఎన్నికల్లో చతికిలబడింది. తీవ్ర ప్రభుత్వ వ్యతిరేకతను ఎదుర్కొన్న బీజేపీ వ్యూహాత్మకంగా వ్యవహరించి, మూడోమారు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగలిగింది. లోక్‌సభ ఎన్నికలు, అసెంబ్లీ ఎన్నికలు వేర్వేరు ప్రాతిపదికలపై జరుగుతాయనీ, ప్రజాతీర్పు భిన్నంగా వచ్చే ఆస్కారం ఉంటుందనీ కాంగ్రెస్ పాఠం నేర్వనందునే మహారాష్ట్రలో ఎదురుదెబ్బ తప్పలేదు.



మహారాష్ట్రలో 'మహాయుతి' విజయోత్సవం

హరియాణా పరిస్థితే మహారాష్ట్రలోనూ ఉండింది. లోక్‌సభ ఎన్నికల్లో 48కి 30 స్థానాలు నెగ్గి మహా వికాస్ అఘాడీ స్పష్టమైన ఆధిక్యత పొందింది. పాలక పక్షంగా ఉండిన మహాయుతికి 17 స్థానాలే లభించాయి. మరాఠ్వాడా వంటి కొన్ని ప్రాంతాల్లో మహాయుతికి ఒక్క స్థానం కూడా దక్కలేదు. ఆ పరిస్థితిని నిలబెట్టుకోవడమో, మెరుగుపరచుకోవడమో చేయకుండా... తమ గెలుపు ఖాయమైపోయినట్టు ఎమ్వీయే పక్షాలు ధీమా ప్రదర్శించాయి. కూటమి గెలుపు మీద కన్నా 'ఎవరు ముఖ్యమంత్రి?' అన్న దానిపైనే వివిధ పక్షాల నేతలు కన్నుపెట్టారు. సంస్థాగత నిర్వహణ, మిత్రులతో సయోధ్య, ప్రభావవంతమైన నినాదమివ్వడం, ప్రజలకో స్పష్టమైన వాదన (నెరేటివ్) వినిపించగలగడం... ఇలా అన్నింటా విఫలమయ్యారు. ఎన్నికల వేళ ఆ యా ప్రాంతాలకు పార్టీ ఇన్‌చార్జీల నియామకం కూడా సహేతుకంగా జరుగలేదు. పీసీసీ అధ్యక్ష బాధ్యతలు నిర్వహించి, ఇప్పుడు వర్కింగ్ కమిటీ సభ్యుడిగా ఉన్న నాయకుడిని ఒక నియోజకవర్గానికి నియమిస్తే, ఆ స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థియే పోటీలో లేరు. ప్రత్యర్థి పార్టీ ఓబీసీలతో 60 వేల 'బృంద సమావేశాలు' ఏర్పాటు చేస్తే, కాంగ్రెస్ నాయకులు స్టార్ హోటళ్లలో దిగి, రూ. 60 వేల బిల్లులు చేశారంతే!

పాత చింతకాయ పచ్చడి

చంకలో పుస్తకం పెట్టుకొని 'రాజ్యాంగం ప్రమాదంలో ఉంది' (సంవిధాన్ ఖత్రే మే హై) అన్న కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ నినాదం ఈసారి పనిచేయలేదు. 'బీజేపీ అడుగుతున్నట్టు 400కు పైగా స్థానాలు ఇస్తే రాజ్యాంగాన్ని మారుస్తారు, రిజర్వేషన్లు గల్లంతవుతాయి' అని ప్రచారం చేస్తే లోక్‌సభ ఎన్నికల్లో అది కాంగ్రెస్‌కూ, వారి కూటమికీ లాభించింది. అసెంబ్లీ ఎన్నికలు గనుక... సోయ, పత్తి వంటి రైతాంగ సమస్యలు, కొన్ని ప్రాంతాల వెనుకబాటుతనం, మరాఠా యువత నిరుద్యోగిత వంటి స్థానికాంశాలకు ప్రాధాన్యత ఇచ్చి ఉండాల్సింది. మహా వికాస్ అఘాడీలోని శివసేన (ఉద్ధవ్ ఠాక్రే), ఎన్సీపీ (శరద్ పవార్) కూడా, తమ పార్టీలను బీజేపీ నిలువునా చీల్చిందన్న పాత నినాదాన్నే ఈ ఎన్నికల్లోనూ ప్రచారాంశంగా ఎత్తుకున్నాయి. అదే అంశంపై లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలు తీర్పిచ్చారు. 2019 ఎన్నికల్లో బీజేపీ-శివసేన కలిసి ఎన్నికలకు వెళ్లి, సానుకూల ప్రజాతీర్పు పొందిన తర్వాత, ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలోని శివసేన... కాంగ్రెస్-ఎన్సీపీ పంచన చేరడం వారి నైతిక స్థితిని కొంత బలహీనపరిచింది. అందుకే, చీలికల అంశంలో బీజేపీపై నిందలు తాజా ఎన్నికల్లో ఆధిక్యతను ఇవ్వలేకపోయాయి.

వాస్తవిక బలాల ఆధారంగా లోక్‌సభ సీట్ల పంపకాలు చేసుకున్న ఎమ్వీయే కూటమి ఈసారి మాత్రం పొత్తుల్ని కడదాకా తేల్చలేదు. ముఖ్యమంత్రి పీఠంపై కన్నేయడం వల్లనేమో... సీట్ల పంపకాల్లో సయోధ్యకు నీళ్లొదిలారు. కాంగ్రెస్ గెలిచిన 16 స్థానాల్లో 11 బీజేపీతో నేరుగా తలపడ్డ స్థానాలే. అయినా, ఆ పార్టీతో పోలిస్తే విజయశాతం అట్టడుగున ఉంది. శివసేన (ఉద్ధవ్ ఠాక్రే), ఎన్సీపీ (శరద్ పవార్) పార్టీలు కూడా ప్రత్యర్థి కూటమి పక్షాలైన శివసేన (షిండే), ఎన్సీపీ (అజిత్ పవార్) పార్టీలతో పోలిస్తే చాలా వెనుకబడ్డాయి.

దిద్దుబాటు చర్యలతో...

లోక్‌సభ ఎన్నికల ఫలితాల్లో ప్రభుత్వ వ్యతిరేకతను పసిగట్టిన మహాయుతి కూటమి దిద్దుబాటు చర్యలు ప్రారంభించింది. ఇందులో భాగంగానే, 18-59 మధ్య వయస్కులైన ప్రతి మహిళకు నెలకు రూ.1,500 చెల్లిస్తూ చేపట్టిన 'మాజీ-లడ్కీ-బహెన్' పథకం తిరుగులేని ఆధిక్యతనిచ్చింది. మహిళా ఓటింగ్ 6 శాతం పెరగటం ఇందుకొక సంకేతమే! తాము తిరిగి గెలిస్తే దాన్ని రూ. 2,100లకు పెంచుతామన్న 'మహాయుతి' హామీ 2.4 కోట్ల కుటుంబాలకు ఆశ కల్పించింది. దానికి తోడు 'ఓట్ జిహాద్', 'బటేంగే తో కటేంగే' నినాదాలు, ఆ దిశలో చేసిన ప్రచారం హిందువుల ఓట్లను ఏకీకృతం చేయడంలో ప్రభావం చూపాయి.

బీజేపీ యంత్రాంగానికి తోడు ఆర్‌ఎస్‌ఎస్ ఈ ఎన్నికల్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని పనిచేసింది. లోక్‌సభ ఎన్నికల్లో మరాఠ్వాడా, విదర్భ లాంటి ప్రాంతాల్లో ప్రతికూలంగా వచ్చిన ప్రజాభిప్రాయాన్ని గమనించిన బీజేపీ, ఓబీసీల మద్దతు కూడగట్టడంపై పెట్టిన శ్రద్ధ కలిసొచ్చింది. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో ఎన్నికల హామీలను అమలు చేయట్లేదంటూ చేసిన 'ప్రతి ప్రచారం'తో, ఎమ్వీయే కూటమి హామీలపై సందేహాల్ని రేకెత్తించడంలో మహాయుతి పైచేయి సాధించింది. అంతిమంగా మహారాష్ట్ర ఫలితం 'మహాయుతి' భారీ విజయాన్ని మించి, 'మహా వికాస్ అఘాడీ' ఘోర పరాజయంగా మిగిలింది.

వ్యాసకర్త పొలిటికల్ ఎనలిస్ట్,
పీపుల్స్ పల్స్ రీసెర్చ్ సంస్థ డైరెక్టర్

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

ఎందుకు వెతకడం?



మసీదుల్లో ఇంకా దేవాలయాలు వెతకాల్సిన అవసరం ఉందా? (సంభాల్ ఘటన నేపథ్యంలో) సమకాలీన సమాజంలో దీనివల్ల ఏమైనా ప్రయోజనం ఉందా?

– మినీ నాయర్, రచయిత్రి

మంచి రాత



ఏదైనా బాగా రాశారో లేదో నేను ఎలా నిర్ణయిస్తానని ఒక పదిహేనేళ్ల పిల్లాడు అడిగాడు. మంచి రచన అనేది నాకు ముఖ్యమైన కొత్త విషయాలను బాగా చెబుతుందని చెప్పాను.

– పాల్ గ్రాహమ్, కంప్యూటర్ శాస్త్రవేత్త

మాట్లాడాల్సినవి!



సిక్కులం శ్రీ హర్మందిర్ సాహిబ్‌లో సైనిక చర్య గురించి మాట్లాడుతాం. 1984 సిక్కు మారణకాండ గురించి మాట్లాడుతాం. కానీ సైనిక చర్య ఉగ్రవాదులను తరిమికొట్టడానికే తప్ప గురుద్వారా సాహిబ్‌పై దాడి చేయడానికి కాదనీ, ఇందిరాగాంధీని సొంత సిక్కు భద్రతా సిబ్బంది చంపడం వల్ల వేల మంది అమాయకులు మూల్యం చెల్లించారనీ, పంజాబ్‌లో ఉగ్రవాదం సిక్కులతో సహా వేలాది మందిని చంపిందనీ అంగీకరించిన రోజున పరిస్థితులు మారవచ్చు.

– అమర్ జీత్ సింగ్, విశ్రాంత దౌత్యవేత్త

నీరసానికి కారణం



ఎప్పుడూ నీరసంగా ఉండే (క్రానిక్ ఫెటీగ్ సిండ్రోమ్) వ్యక్తులు పిండిపదార్థాలకు (కార్బోహైడ్రేట్స్) బానిసలు. తీసుకొనే ఆహారంలో సమతూకం సాధించడమే కీలకం.

– దీప్తా నాగ్‌పాల్, డైటీషియన్

దారుణ గుర్తు



26/11 అనేది ముంబైలో జరిగిన భయంకరమైన ఉగ్రదాడులను గుర్తు చేస్తుంటుంది. అది నా ప్రియమైన నగరపు మూలాలను కదిలించింది. మనల్ని సురక్షితంగా ఉంచడానికి తమ ప్రాణాలను అర్పించిన వారందరికీ హృదయపూర్వక నివాళులు.

–ప్రియాంక చతుర్వేది, రాజ్యసభ సభ్యురాలు

అసలు సంక్షోభం



మయన్మార్ అంతర్యుద్ధం అనంతరం, మణిపుర్‌లో మాదక ద్రవ్యాల మార్కెట్ రూ.70,000 కోట్లు అయిందంటే చాలామంది సందేహించారు. కానీ ఇటీవల మయన్మార్ ఫిషింగ్ ఓడ నుంచి రూ.27,500 కోట్ల విలువైన 5.5 టన్నుల మెథాంఫెటమైన్‌ను స్వాధీనం చేసుకోవడం మా వాదనలను బలపరిచింది. ఇలాంటిది స్థానికంగా నియంత్రించాల్సిన సమస్య కాదు. తక్షణ దృష్టిని కోరే ప్రాంతీయ సంక్షోభం!

– సేవియో రోడ్రిగ్స్, మీడియా పర్సనాలిటీ

సమస్యే వరం



వచ్చిన సవాళ్లను ఎదుర్కొని, ఇది నాకు పాఠం చెప్పడానికే వచ్చిందనో, ఇది రావడానికి ఏదో కారణం ఉందనో అనుకోగలిగితే ఆ సవాలు ఒక వరం అవుతుంది. మనకు తెలియనిది ఇంకా ఏమైనా ఉందేమో అని అనుకున్నప్పుడు మనం ముందుకు వెళ్తాం. కాబట్టి అడ్డంకులు, బాధలకు భయపడొద్దు. ఇవన్నీ జీవితంలో భాగమే.

– శ్రీ ఎం, ఆధ్యాత్మిక గురువు

ఇన్ బాక్స్

సాహితీ రంగంలో నిశ్శబ్ద విప్లవం

తెనాలి అందించిన ఎందరో సాహిత్య, కళారంగ ప్రముఖుల్లో బొల్లిముంత శివరామకృష్ణ ఒకరు. యవ్వన దశలో ఎప్పుడో బొల్లిముంత గురించి విన్నప్పటికీ... నాకు ప్రత్యక్ష పరిచయం 1984లో నేను 'విశాలాంధ్ర'లో ఉద్యోగ జీవితం ప్రారంభించినప్పటి నుంచే. ఆయన తెనాలి తాలూకా సీపీఐ కార్యదర్శిగా ఉన్నప్పుడు నా పెళ్లికి వచ్చారు. ప్రముఖ రచయిత కొడవటిగంటి కుటుంబరావు రాసిన 'పిల్లి' అనే కథానికపై బొల్లిముంత చేసిన విమర్శ 'కొడవటిగంటి తిరోగమన యాత్ర' అప్పట్లో ఒక సంచలనం. పిల్లి మ్యావ్ అన్నంత మాత్రాన అది 'మావో' అన్నట్లు కాదనీ, పిల్లి విప్లవానికి ప్రతీక కాదనీ బొల్లిముంత తేల్చి చెప్పారు. 1920 నవంబరు 27న గుంటూరు జిల్లా చదలవాడలో ఆయన జన్మించారు. కృష్ణాజిల్లా చల్లపల్లి జమీందారు రాజాకి వ్యతిరేకంగా నిర్వహించిన భూమి పోరాటంలో పాల్గొన్నారు. తెలంగాణ పోరాట నేపథ్యంలో ఆయన రచించిన 'మృత్యుంజయులు' నవల ఆయనను చిరంజీవిని చేసింది. కమ్యూనిస్టుల పైన నిర్బంధ కాండ అమలు చేస్తూనే, మరోవైపు సోషలిస్టు శిబిరంతో స్నేహ సంబంధాలు నెరపిన నాటి ప్రధాని నెహ్రూ వైఖరిని విమర్శిస్తూ రాసిన 'మొదళ్ళు నరికి చివుళ్ళకు నీరు పోస్తానంటాడు' వ్యాసం చాలా సంచలనం రేపింది. 38 హిట్ సినిమాలకు రచన అందించి సినీ రంగంలో తన ప్రత్యేక ముద్ర చాటారు.



బొల్లిముంత శివరామ కృష్ణ (1920-2005)

సోవియట్ ల్యాండ్ అవార్డు పొందిన శ్రీకాంత్‌తో కలసి 'అందరూ బతకాలి' నాటకం రాశారు. దీన్ని 'రక్తకన్నీరు' నాగభూషణం వందకు పైగా ప్రదర్శనలిచ్చారు. బొల్లిముంత జైలు శిక్షలు అనుభవించారు. అజ్ఞాత వాస జీవితం గడిపారు. సీపీఐ ఆదేశం మేరకు 1967లో బందరు పార్లమెంటు నియోజక వర్గానికి పోటీచేసి ఓటమి పాలయ్యారు. 1988 అక్టోబరు నుంచి 1992 నవంబరు వరకూ అరసం ప్రధాన కార్యదర్శిగా ఉన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి ఉపాధ్యక్షునిగా కూడా సేవలందించారు. కమ్యూనిస్ట్ ఉద్యమానికీ, తెలుగు సాహితీ రంగానికి బొల్లిముంత అందించిన బహుముఖీన సేవలు మరువలేనివి.

– కాగితాల రాజశేఖర్
(నేడు బొల్లిముంత శివరామకృష్ణ జయంతి)

ఆర్థిక పరిస్థితి ఆగమాగం

అభిప్రాయం



ఏనుగుల రాకేష్ రెడ్డి

ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం తెలంగాణలోని పది జిల్లాలలో హైదరాబాద్ మినహా 9 జిల్లాలను వెనకబడిన జిల్లాలుగా గుర్తించింది. ఆ జిల్లాలతో ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత పదేళ్లలో తలసరి ఆదాయంలో దేశంలోనే మొదటి స్థానంలో నిలిచింది తెలంగాణ. మౌలిక సదుపాయాల కల్పనలోనూ ఇదే స్థానం సాధించింది. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ఎన్నో అవార్డులు గెలుచుకొని దేశం దృష్టిని ఆకర్షించింది. అదే రాష్ట్రంలో గత పది నెలల కాంగ్రెస్ పాలనలో ఆర్థిక వ్యవస్థ కుదేలవడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది.

2024-25 బడ్జెట్ అంచనాల ప్రకారం రూ 1.64 లక్షల కోట్లు పన్ను రాబడుల రూపంలో సమకూరాలి. అంటే ఆరు నెలలకు అందులో సగం లెక్కన కనీసం రూ 82 వేల కోట్లు రావాల్సి ఉంది. కానీ, కేవలం రూ. 69 వేల కోట్లు మాత్రమే పన్నుల రూపంలో సమకూరాయి. ఫలితంగా అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలు నిలిచిపోతున్నాయి. కొత్త పథకాల అమలుకు నిధులు లేవు. ప్రభుత్వం కనీస అవసరాలు కూడా తీర్చలేకపోతోంది. నిర్వాహణ ఖర్చులకు కూడా నిధులను సమకూర్చలేకపోతున్నది. అద్దె చెల్లించక గురుకులాలు మూతబడుతున్నాయి. దవాఖానల్లో మందులు కొనడానికి డబ్బులు లేవు. బడుల్లో చాక్‌పీసులు కొనడానికీ డబ్బులు లేని దుఃస్థితి నెలకొంది.

ఇటీవలే 6 వేల మంది ప్రభుత్వ ఉపాధ్యాయులు ఉద్యోగ విరమణ పొందితే రిటైర్మెంట్ బెనిఫిట్స్ కూడా రాష్ట్ర ప్రభుత్వం చెల్లించలేదు. ఇది దయనీయం. అలాగే, రాష్ట్రవ్యాప్తంగా పారిశుధ్య కార్మికులకు 9 నెలల నుండి జీతాలు లేవు. ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ హాస్టళ్లలో అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు జీతాలు సరిగ్గా రావడం లేదు,



ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు నెల ఆలస్యంగా ఇస్తున్నారు. పంచాయతీల్లో, పాఠశాలల్లో నిర్వహణ ఖర్చులకు ఉపాధ్యాయులు, పంచాయితీ కార్యదర్శులు చందాలు వేసుకోవాల్సిన పరిస్థితి దాపురించింది.

ఒకటో తారీఖు జీతాలు రావాలనీ, కాంగ్రెస్ వస్తే తమ కష్టాలు పోతాయనీ మార్పుకు పట్టం కట్టిన ప్రభుత్వ ఉద్యోగులు ఇప్పుడు కక్కలేక మింగలేక లోలోపల మథనపడుతున్నారు. అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే కొత్త పీఆర్సీ అమలు చేస్తామని చెప్పి పదకొండు నెలలు గడిచినా పీఆర్సీ పత్తా లేదు. రాష్ట్ర వ్యాప్తంగా గుత్తేదార్లు, సర్పంచ్‌లు చేసిన పనులకు ఒక్క రూపాయి కూడా బిల్లులు చెల్లించడం లేదు. రైతు రుణమాఫీ, రైతు భరోసా, బోనస్ అంటూ ఇచ్చిన హామీలన్నీ నీటి మూటలే అయ్యాయి.

హైదరాబాద్ చుట్టుపక్కనున్న జిల్లాల్లో అత్యధిక రిజిస్ట్రేషన్లు జరిగేవి. హైడ్రా, మూసీ సుందరీకరణ పేరుతో చేపట్టిన కూల్చివేతలతో అమ్మకాలు, కొనుగోళ్లు నిలిచిపోయాయి. దీని ప్రభావం జిల్లాలపై కూడా పడింది. రియల్ ఎస్టేట్ రంగం కుదేలు అవ్వడం, భవన నిర్మాణ రంగం నిర్వీర్యం అయ్యే పరిస్థితికి దారితీసింది. బ్రాండ్ హైదరాబాద్, బ్రాండ్ తెలంగాణ ఇమేజ్ దెబ్బతిని పెట్టుబడులు తరలిపోతున్నాయి.

రిజిస్ట్రేషన్ ఛార్జీలు, విద్యుత్ ఛార్జీలు, బస్ ఛార్జీలు పెంచడం సమస్యకు పరిష్కారం కాదు. స్థిరమైన విధానాలు, ప్రాధాన్యతలు సరిగ్గా ఎంచుకోవడం, ప్రగతి కాముకంగా ముందుకు వెళతామని పెట్టుబడిదారులకు నమ్మకం కల్గించడం, డబ్బు సరఫరాలో అంతరాయం కలగకుండా ఉండటానికి కాంట్రాక్టర్ల బిల్లులు విడుదల చేయడం, స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయడం, పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్ట్‌లకు అనుమతులు ఇవ్వడం వంటి చర్యలను యుద్ధప్రాతిపదికన చేపట్టినప్పుడే పరిస్థితుల్లో మార్పులు వస్తాయి.

వ్యాసకర్త బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు

లోపలి దిక్కు

భారతీయులు వాస్తుకు ఎంతో ప్రాధాన్యం ఇస్తారు. భారతీయ వాస్తు శాస్త్రంలో ముఖ్యంగా దిక్కులకు ఎంతో ప్రాముఖ్యం ఉంది. ప్రాచీన కాలం నుంచి వస్తున్న ఈ వాస్తు సంప్రదాయాలను తు.చ. తప్పకుండా అనుసరించేవారే అధికం. కానీ మన భారతీయ తత్త్వశాస్త్రంలో పేర్కొన్న 'లోపలి దిక్కుకు దృష్టి సారించడం' (అంతర్ దృష్టి)పై మాత్రం అంతగా ధ్యాసపెట్టరు.



జ్యోతిర్మయం

వాస్తు శాస్త్ర పండితులు ఇల్లు కట్టాలన్నా, ఆలయం నిర్మించాలన్నా, చెరువు లేక బావి త్రవ్వించాలన్నా, చెట్లు నాటాలన్నా వాస్తు శాస్త్రాన్ని పరిశీలించి, ఆ శాస్త్రం చెప్పే విధంగా చేయాలంటారు. ఏ దిక్కులో ఏమి ఉంటే ధన, కనక, వస్తు, వాహనాలు, ఆరోగ్యం లభిస్తుందో; ఏ దిక్కులో ఏమి ఉంటే అష్ట దరిద్రాలు ప్రాప్తిస్తాయో చెబుతారు. అయితే ఆధ్యాత్మిక వేత్తలు వాస్తు శాస్త్రం చెప్పేదిక్కుల కన్నా ముఖ్యమైన దిక్కు మన లోపల ఉందని చెబుతున్నారు. మనసుని అటు వైపు సారిస్తే, అంటే మనిషి అంతర్ముఖుడైతే తరగని నిధిగా భావించే అవధులు లేని ఆనందం లభించి జన్మ ధన్యమవుతుంది.

భూమి గోళాకారంలో ఉండి, నిరంతరం చలనం కల్గి ఉంది. అలాంటప్పుడు దిక్కులు, వాటి ప్రాధాన్యతను గూర్చి వాస్తు పండితులు చెప్పేదంతా సరైనది కాదని కొందరు ఖండిస్తారు కావచ్చు. అయితే మనిషి లోపలి దిక్కు ప్రాధాన్యాన్ని మాత్రం ఎవరూ తిరస్కరించలేరు. హేతువాదులు, నాస్తికులు కూడా... ఆత్మపరిశీలన చేసుకోవాలనీ, హృదయంలోని మాలిన్యాలను తొలగించుకోవాలనీ, పరిశుద్ధ హృదయంతో జీవించాలనీ చెబుతారు. హృదయం పవిత్రమైతే అందులో ఆత్మప్రకాశిస్తుందంటారు ఆధ్యాత్మికులు. లోపలి దిక్కుకు మానవ జీవన యాత్ర సాగాలనీ, అదే గొప్ప తీర్థయాత్ర అనీ ఓషో 'ది లాస్ట్ మార్నింగ్ స్టార్'లో పేర్కొన్నారు. అంతర్ముఖులై ఆత్మసాక్షాత్కారాన్ని పొందటమే జీవిత గమ్యమని ఇటువంటి ఆధ్యాత్మిక వేత్తలు చెబుతుంటారు కదా. దాని కొరకు తపించాలి, శ్రమించాలి.

– రాచమడుగు శ్రీనివాసులు

క్లుప్తంగా...

29న తులసీ దామోదర కల్యాణం

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ సన్నిధిలో ఈ నెల 29వ తేదీన తులసీ దామోదర కల్యాణం, శ్రీ సత్యనారాయణస్వామి వ్రతం నిర్వహించనున్నట్లు దేవస్థానం ఈవో భాస్కర్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 29న మల్లాపురం వెళ్లే దారిలోని దేవస్థానం తోటలో ఉదయం 10.30 గంటలకు తులసీ దామోదర కల్యాణం, శ్రీ సత్యనారాయణస్వామి వ్రతాలను జరిపిస్తామని తెలిపారు. అనంతరం కార్తీక వన భోజన కార్యక్రమం ఉంటుందని వెల్లడించారు.

విషాహారంతో విద్యార్థిని మృతి పాపం సర్కారుదే

- ఇది ముమ్మాటికీ ప్రభుత్వ నిర్లక్ష్యమే: హరీశ్‌రావు



సాక్షి, హైదరాబాద్: వాంకిడి గురుకుల పాఠశాల విద్యార్థిని ప్రాణాలు కోల్పోవడం ముమ్మాటికీ ప్రభుత్వ నిర్లక్ష్యమేనని బీఆర్‌ఎస్‌ ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. ప్రభుత్వం తమ తప్పేమీ లేదన్నట్లు వ్యవహరించినంత మాత్రాన విద్యార్థిని ప్రాణం తీసిన పాపం ఊరికే పోదన్నారు. గురుకుల విద్యాసంస్థలు, పాఠశాలల్లో జరుగుతున్న విషాహార ఘటనలపై మంగళవారం హరీశ్‌రావు ఓ ప్రకటన విడుదల చేశారు. 'వాంకిడి గురుకులంలో విషాహారం వల్ల బిడ్డను కోల్పోయి పుట్టెడు దుఃఖంలో ఉన్న తల్లిదండ్రులకు భరోసా ఇచ్చేందుకు వెళ్తున్న ఎమ్మెల్యే కోవా లక్ష్మి, ఇతర ప్రజాప్రతినిధులను పోలీసులు అడ్డుకోవడం సిగ్గుచేటు. దేశ వ్యాప్తంగా జాతీయ రాజ్యాంగ దినోత్సవం జరుపుకుంటుండగా తెలంగాణలో కాంగ్రెస్‌ ప్రభుత్వం రాజ్యాంగ సూత్రాలను తుంగలో తొక్కుతోంది' అని హరీశ్‌రావు మండిపడ్డారు. మాగనూరు జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలలో మరోమారు ఫుడ్‌ పాయిజన్‌ ఘటన జరగడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులకు కల్తీ ఆహారం పెడితే జైలుకు పంపిస్తామన్న సీఎం రేవంత్‌రెడ్డి మాటలు నీటి మూటలే అయ్యాయని విమర్శించారు. మాటలే తప్ప చేతలు లేని ముఖ్యమంత్రి నిర్లక్ష్యంతో ఇంకెంత మంది విద్యార్థులు ఆస్పత్రి పాలవ్వాలని.. ఇంకెందరు ప్రాణాలు కోల్పోవాలని హరీశ్‌రావు ప్రశ్నించారు.

వీధి కుక్కల వీరంగం.. చిన్నారులపై దాడి



కంటికి గాయమైన చిన్నారి

నిజామాబాద్‌ సిటీ/ఎడపల్లి(బోధన్‌): వేర్వేరు జిల్లాల్లో కుక్కల దాడిలో చిన్నారులు సహా పలువురు గాయపడ్డారు. నిజామాబాద్‌ నగరంలో పాఠశాల ముగిసిన తర్వాత సాయంత్రం ఇంటికి వెళ్తున్న చిన్నారులపై శునకాలు ఒక్కసారిగా దాడి చేయడంతో ఏడుగురు గాయపడ్డారు. నగరంలోని పాతబస్తీలోని అహ్మద్‌పుర కాలనీ–మాలపల్లి మధ్యలో కుక్కల దాడి జరిగింది. ఎండీ తఖీఫ్, సోఫియా ఖాన్, అబ్దుల్‌ ఫసీ, ఉజ్మా, ఖాజా, షహీద్, అల్మాస్‌లు పాఠశాల ముగిసిన తర్వాత ఇంటికి బయల్దేరారు. కొద్ది దూరం వెళ్లగానే నాలుగు కుక్కలు వెంటపడి దాడి చేశాయి. ఈ దాడిలో ఓ బాబు కన్నుపై భాగంలో తీవ్ర గాయమై రక్తస్రావమైంది. చిన్నారుల కాళ్లు, చేతులు, తొడలపై కుక్కలు కరిచాయి. కుక్కలను తరిమేందుకు ప్రయత్నించిన స్థానికులను సైతం కరిచాయి. చిన్నారులను తల్లిదండ్రులు ఆటోల్లో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా యాంటీ రేబిస్‌ వ్యాక్సిన్‌ ఇచ్చారు. నిజామాబాద్‌ జిల్లా ఎడపల్లి మండలం దుబ్బ తండా గ్రామంలో ముగ్గురు, ఏఆర్పీ క్యాంపు గ్రామంలో ఇద్దరు వీధి కుక్కలు దాడిలో గాయపడ్డారు. ఏఆర్‌పీ క్యాంపు గ్రామంలో బాలిక తీవ్రంగా గాయపడింది.

వీడియో కాల్‌ మాట్లాడుతూ యువకుడి ఆత్మహత్య



భరత్‌ కుమార్‌

మాచారెడ్డి: అక్క, చెల్లితో పాటు స్నేహితులకు వీడియో కాల్‌ చేసి మాట్లాడుతూనే అప్పర్‌ మానేరు డ్యామ్‌లో దూకి ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కామారెడ్డి జిల్లా పాల్వంచ మండలం ఎలుపుగొండ గ్రామానికి చెందిన నందగిరి భరత్‌కుమార్‌ (32) ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తున్నాడు. కొన్ని రోజులుగా పని దొరక్క ముభావంగా ఉంటున్నాడని గ్రామస్తులు తెలిపారు. ఈ క్రమంలో మంగళవారం రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం అప్పర్‌ మానేరు డ్యామ్‌ వద్దకు వెళ్లిన భరత్‌.. తోబుట్టువులు, స్నేహితులకు వీడియో కాల్‌ చేశాడు. అందరితో ఆప్యాయంగా మాట్లాడాడు. తనకు బతకాలని లేదని, జీవితంపై విరక్తి కలుగుతోందంటూ చెప్పాడు. చివరి నిమిషంలో తన సోదరితో మాట్లాడుతూ డ్యామ్‌లోకి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తోబుట్టువులు, స్నేహితులు ఎంత వారించినా వినలేదు. భరత్‌ బలవన్మరణానికి పాల్పడటం అందరినీ కలిచివేసింది. మృతునికి భార్య, కూతురు ఉన్నారు.



చలిలో చన్నీటి స్నానం

వేకువజామున మంచు కురుస్తూ గజగజ వణికిస్తోంది. ఎముకలు కొరికే చలిలో విద్యార్థులు చన్నీటి స్నానం చేస్తూ అవస్థలు పడుతున్నారు. ఆదిలాబాద్‌ కలెక్టర్‌ క్యాంప్‌ కార్యాలయం పక్కనే ఉన్న గిరిజన సంక్షేమ బాలుర రెసిడెన్షియల్‌ పాఠశాలలో 850 మంది విద్యార్థుల దుస్థితి ఇది. ఇక్కడ ఒక బోరు, ఒక నల్లా మాత్రమే ఉండగా, వాటికి ట్యాప్‌లు లేవు. ఇక్కడి విద్యార్థులు మంగళవారం పదుల సంఖ్యలో చలిలో స్నానం చేస్తూ కనిపించారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్‌



పాటల రచయిత కులశేఖర్‌ కన్నుమూత

- రోడ్డుపై స్పృహతప్పి పడిపోయిన కులశేఖర్‌
- అనామకుడిలా గాంధీలో చేర్పించిన స్థానికులు
- ఆస్పత్రిలోనూ ఆయనను గుర్తుపట్టని వైనం
- అక్కడ చికిత్స పొందుతూ తుదిశ్వాస
- సినీ రైటర్స్‌ అసోసియేషన్‌ తీవ్ర దిగ్భ్రాంతి
- నేడు జూబ్లీహిల్స్‌లోని మహాప్రస్థానంలో అంత్యక్రియలు
- పలు హిట్‌ సినిమాలకు పాటలు అందించిన కులశేఖర్‌



సనత్‌నగర్: ప్రముఖ సినీ గేయ రచయిత కులశేఖర్‌ (53) కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆయన.. మంగళవారం గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. హైదరాబాద్‌లోని పంజాగుట్ట వద్ద రోడ్డుపై స్పృహతప్పి పడిపోవటంతో ఆయనను స్థానికులు గాంధీ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ మరణించారు. రోడ్డుపై పడిపోయినప్పుడుగానీ.. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నప్పుడుగానీ ఆయన పాటల రచయిత కులశేఖర్‌ అని ఎవరూ గుర్తించకపోవటం గమనార్హం. తెలుగు చిత్ర పరిశ్రమకు ఎన్నో హిట్‌ సాంగ్స్‌ను అందించి, ప్రేక్షక లోకాన్ని ఉర్రూతలూగించిన ఆయన.. అనామకుడిలా చనిపోవటం సినీ అభిమానులను కలచివేసింది. కులశేఖర్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కొంతకాలంగా ఆయన చిత్రపురి కాలనీలోని ఎల్‌ఐజీలో ఉంటున్నట్లు తెలిసింది. గాంధీ ఆస్పత్రి వైద్యులు కులశేఖర్‌ భౌతికకాయానికి మంగళవారం పోస్టుమార్టం పూర్తిచేశారు. మహాప్రస్థానంలో బుధవారం అంత్యక్రియలు నిర్వహిస్తారని కులశేఖర్‌ సన్నిహితులు తెలిపారు. కులశేఖర్‌ మరణం పట్ల సినీ రైటర్స్‌ అసోసియేషన్‌ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తంచేసింది. ఆయన మరణం తెలుగు సినీ పరిశ్రమకు తీరని లోటు అని అసోసియేషన్‌ అధ్యక్షుడు పరుచూరి గోపాలకృష్ణ సంతాపం వ్యక్తంచేశారు. పలువురు సినీ ప్రముఖులు, పాటల రచయితలు కులశేఖర్‌ భౌతికకాయానికి నివాళులు అర్పించారు.

యువతను ఊపేసిన కులశేఖర్‌ పాటలు

కులశేఖర్‌ స్వస్థలం ఆంధ్రప్రదేశ్‌లోని సింహాచలం. ఆయన తండ్రి మహామహోపాధ్యాయ టీపీ శ్రీరామచంద్రాచార్యులు, తల్లి రంగనాయకమ్మ. 1971 ఆగస్టు 15న జన్మించిన కులశేఖర్‌కు.. చిన్నప్పటి నుంచే సంగీతం, సాహిత్యంపై ఆసక్తి ఉండేది. విశాఖపట్టణంలోని భారతీయ విద్యా కేంద్రం విజ్ఞాన భారతీ కళాశాలలో విద్యనభ్యసించారు. అప్పటి నుంచే పాటలు రాసి బహుమతులు పొందారు. చదువు పూర్తయిన తర్వాత విలేకరిగా పనిచేశారు. కొన్ని రోజులు చినజీయర్‌ స్వామి ఆశ్రమంలో గడిపారు. ప్రముఖ సినీ గేయ రచయిత సిరివెన్నెల సీతారామశాస్త్రి వద్ద శిష్యరికం చేస్తూ సినీ గీత రచనలో మెళకువలు నేర్చుకున్నారు. తేజ దర్శకత్వంలో 2000 సంవత్సరంలో వచ్చిన 'చిత్రం'సినిమాతో గేయ రచయితగా పరిచయం అయ్యారు. ఆ సినిమాలో అన్ని పాటలు ఆయనే రాశారు. తర్వాత ఆర్పీ పట్నాయక్, తేజలతో కలిసి అనేక సినిమాలకు పనిచేశారు. చిత్రం, జయం, ఘర్షణ, వసంతం, నువ్వు నేను, ఔనన్నా కాదన్నా, సుబ్బు, రామ్మా చిలకమ్మా, మృగరాజు, దాదాగిరి, భద్ర, సంతోషం, సైనికుడు వంటి సినిమాలకి సూపర్‌హిట్‌ పాటలు అందించారు. కులశేఖర్‌ కలం నుంచి జాలువారిన పాటలు యువతను ఉర్రూతలూగించాయి. వెంకటేశ్‌ హీరోగా నటించిన 'ఘర్షణ'(2004) సినిమాకు అన్ని పాటలు రాయడంతో పాటు డైలాగ్స్‌ కూడా అందించడం విశేషం. గీత రచయితగా బిజీగా ఉన్న సమయంలోనే 'ప్రేమలేఖ రాశా'అనే సినిమాకు దర్శకత్వం వహించారు. ఆ సినిమా విడుదల ఆలస్యం కావడంతో కులశేఖర్‌ మానసికంగా కుంగిపోయారని ఆయన సన్నిహితులు చెప్పారు.

ఉద్రిక్తత మధ్య శైలజ అంత్యక్రియలు

- అర్ధరాత్రి స్వగ్రామానికి మృతదేహం
- పోలీసుల భారీ బందోబస్తు.. ఆంక్షలు
- కుటుంబసభ్యులు, విద్యార్థి సంఘాల నిరసన
- పరిహారం హామీ అనంతరం అంత్యక్రియలు పూర్తి
- ఫుడ్‌పాయిజన్‌తో మృతిచెందిన వాంకిడి గురుకుల విద్యార్థిని



శైలజ మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

వాంకిడి (ఆసిఫాబాద్‌): హైదరాబాద్‌లోని నిమ్స్‌లో చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందిన కుమ్రంభీమ్‌ ఆసిఫాబాద్‌ జిల్లా వాంకిడి గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థిని చౌదరి శైలజ అంత్యక్రియలను స్వగ్రామం ధాబాలో ఉద్రిక్తత మధ్య మంగళవారం నిర్వహించారు. అక్టోబర్‌ 30వ తేదీన పాఠశాలలో భోజనం చేసిన తర్వాత తీవ్ర అస్వస్థతకు గురైన శైలజకు.. 21 రోజులపాటు నిమ్స్‌లో వెంటిలేటర్‌పై చికిత్స అందించినా ప్రాణాలు కాపాడలేకపోయారు. శైలజ మృతదేహాన్ని హైదరాబాద్‌ నుంచి మంగళవారం వేకువజామున 3 గంటలకు కట్టుదిట్టమైన భద్రత మధ్య ధాబా గ్రామానికి తీసుకువచ్చారు. కుమ్రంభీం ఆసిఫాబాద్‌ జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాసరావు, ఆదిలాబాద్‌ ఎస్పీ గౌస్‌ ఆలం బందోబస్తును పర్యవేక్షించారు. మండల కేంద్రంలోని ఆశ్రమ పాఠశాల, ధాబా గ్రామానికి వెళ్లే మార్గాల్లో బారికేడ్లు ఏర్పాటు చేసి ఆంక్షలు విధించారు. ధాబా గ్రామానికి వెళ్లేందుకు ఎవ్వరినీ అనుమతించలేదు. పోలీసుల కన్నుగప్పి గ్రామానికి చేరుకున్న మాలి సంఘం, విద్యార్థి సంఘాల నాయకులు.. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్‌ చేస్తూ నిరసన తెలిపారు. కచ్చితమైన హామీ ఇచ్చేవరకు అంత్యక్రియలు నిర్వహించేది లేదని స్పష్టంచేశారు. బాధిత కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం, ఇల్లు, రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్‌ చేశారు. ఎమ్మెల్సీ దండే విఠల్, డీసీసీ అధ్యక్షుడు కొక్కిరాల విశ్వప్రసాద్‌రావు శైలజ కుటుంబ సభ్యులతో చర్చలు జరిపారు. ఎక్స్‌గ్రేషియా విషయంపై మంత్రి సీతక్కతో మాట్లాడతామని హామీ ఇచ్చారు. ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసి, కుటుంబంలో ఒకరికి ఔట్‌సోర్సింగ్‌ ఉద్యోగం కల్పిస్తామని తెలిపారు. తక్షణ సాయం కింద రూ.20 వేలు.. అంత్యక్రియలు, ఇతర కార్యక్రమాల నిర్వహణకు రూ.లక్ష నగదును అందించారు. మధ్యాహ్నం 3 గంటలకు చర్చలు ముగిశాయి. అనంతరం శైలజ మృతదేహానికి కుటుంబసభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు. అంతకు ముందు ఎమ్మెల్యేలు కోవ లక్ష్మి, పాల్వాయి హరీశ్‌బాబు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

మళ్లీ ఫుడ్‌ పాయిజన్‌

▶ మొదటి పేజీ తరువాయి

ఉండటంతో మహబూబ్‌నగర్‌ జనరల్‌ ఆస్పత్రి తరలించారు.

తహసీల్దార్‌ పర్యవేక్షణలోనే వంట

మాగనూర్‌ ఇన్‌చార్జి తహసీల్దార్‌ సురేష్‌కుమార్, మధ్యాహ్న భోజనం ఇన్‌చార్జి, పాఠశాల ఉపాధ్యాయుడు రాఘవేంద్రచారి పర్యవేక్షణలోనే మధ్యాహ్న భోజనం తయారు చేయించారు. అయినప్పటికీ మళ్లీ ఫుడ్‌ పాయిజన్‌ కావడంతో అధికారులు సైతం ఆందోళన చెందుతున్నారు. ఈ క్రమంలోనే వంట చేసిన కార్మికులను స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి విచారించారు.

బయట చిరుతిళ్లు తిన్నారా?

విద్యార్థులు స్కూల్‌ బయట ఉన్న బేకరీలు, దుకాణాల్లో చిరుతిళ్లు తినడంతోనే అస్వస్థతకు గురై ఉంటారని కలెక్టర్‌ సిక్తా పట్నాయక్‌ అనుమానం వ్యక్తం చేశారు. డీఎస్పీ లింగయ్య నేతృత్వంలో పోలీసులు రంగంలోకి దిగి మాగనూర్‌లోని పలు బేకరీలు, దుకాణాల్లో విచారణ చేపట్టారు.

సీఎం దృష్టికి వెళ్లినా..

గత బుధవారం కలుషిత ఆహారంతో 100 మందికిపైగా విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. 17 మంది ఆస్పత్రిలో చికిత్స పొందిన విషయంపై రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జిల్లా అధికార యంత్రాంగంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అయినప్పటికీ మరునాడే అన్నంలో మళ్లీ పురుగులు రావడం, అధికారులపై చర్యలు తీసుకోవడం వంటివి జరిగాయి. తాజాగా మళ్లీ ఫుడ్‌ పాయిజన్‌ కావడంతో తల్లిదండ్రుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. పాఠశాలలో మధ్యాహ్న భోజనం తింటున్న విద్యార్థులు వరుసబెట్టి అస్వస్థతకు గురవుతుండటంపై ప్రభుత్వం దృష్టిసారించాలని వారు కోరుతున్నారు.

బాలికను మభ్య పెట్టి.. ఫొటోలు తీయించి

- సంక్షేమ హాస్టల్‌లో వంట మనిషి నిర్వాకం
- ఓ యువకుడితో ఫొటోలు తీయించిన వైనం
- మంథనిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన
- క్షుద్ర పూజల కోసమా? సెక్స్‌ రాకెట్‌ ఏమైనా ఉందా అనే అనుమానాలు



వసతి గృహంలో విచారణ జరుపుతున్న నాగైలేశ్వర్‌

మంథని: ఫొటోలు తీసి ఓ వ్యక్తికి పంపిస్తే లక్ష్మీదేవి కటాక్షం లభిస్తుందని, కనకవర్షం కురుస్తుందని ఓ విద్యార్థినికి వంట మనిషి మాయమాటలు చెప్పింది. తన గదిలోకి తీసుకెళ్లి ఓ యువకుడితో ఫొటోలు తీయించింది. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ సంఘటన పెద్దపల్లి జిల్లా మంథనిలో కలకలం సృష్టించింది. అధికారుల కథనం ప్రకారం.. మంథనిలోని పాఠశాలలో పదో తరగతి చదువుతూ ఓ వసతి గృహంలో ఉంటున్న బాలికను ఈ నెల 18న ఆ హాస్టల్‌ వంట మనిషి తన గదికి తీసుకెళ్లింది. ఓ యువకుడిని పిలిపించి బాలిక ఫొటోలు తీయించిన తర్వాత బాలికను యథావిధిగా పాఠశాలకు పంపించింది. మరుసటిరోజు ఆ బాలిక తన చిన్నమ్మ ఇంటికి వెళ్లింది. సోమవారం తల్లిదండ్రులతో కలిసి హాస్టల్‌కు తిరిగివచ్చింది. అయితే హాస్టల్లో ఉండేందుకు బాలిక ఇష్టపడలేదు. తల్లిదండ్రులు నిలదీయడంతో జరిగిన విషయం వివరించింది. దీంతో కోపోద్రిక్తులైన కుటుంబసభ్యులు వంట మనిషిని నిలదీశారు. భయపడిన ఆమె వారి నుంచి తప్పించుకుని పారిపోయింది. దీనిపై ఆందోళనకు దిగిన తల్లిదండ్రులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు విచారణ చేపట్టారు. ఘటనపై జిల్లా సంక్షేమ శాఖ అధికారి నాగైలేశ్వర్‌ మంగళవారం హాస్టల్‌లో విచారణ జరిపారు. కలెక్టర్‌కు నివేదిక ఇస్తానని, వంట మనిషిని ఉద్యోగం నుంచి తొలగిస్తామని, హాస్టల్‌ ఇన్‌చార్జి వార్డెన్, డిప్యుటేషన్‌పై పనిచేస్తున్న వాచ్‌మన్‌ను బదిలీ చేస్తామని చెప్పారు. ఈ సంఘటన సంచలనం సృష్టించడంతో మిగతా విద్యార్థినుల తల్లిదండ్రులు భారీగా తరలివచ్చి అధికారులు, సిబ్బందిని నిలదీశారు.

పోలీసుల అదుపులో యువకుడు?

బాలికను ఫొటోలు తీసిన మంథనికి చెందిన యువకుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఫొటోలు తీసే సమయంలో సదరు యువకుడికి మరో వ్యక్తి వీడియో కాల్‌ చేశాడని, అప్పుడు బాలికను ఫొటోలు తీసిన యువకుడు ఆ వ్యక్తికి చూపించాడని తెలుస్తోంది. పోలీసులు దీనిపై దర్యాప్తు కొనసాగిస్తుండగా, బాలికను వంట మనిషి అసలెందుకు తీసుకువచ్చింది? ఫొటోలు ఎందుకు తీశారు? క్షుద్ర పూజల కోసమా? సెక్స్‌ రాకెట్‌ నడుస్తోందా? అనే చర్చ జరుగుతోంది. సోషల్‌ మీడియాలో వైరల్‌ అయిన ఈ ఘటనపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

మూడు ప్రాణాలు తీసిన పంతం

- భార్యాభర్తల మధ్య నెలకొన్న చిన్నపాటి గొడవ
- ఇద్దరు పిల్లలతో సహా చెరువులో దూకి భార్య ఆత్మహత్య



నఫీజ్‌బేగం, హబీబ్, సనాబేగం

వనపర్తి: మాట్లాడుకుని పరిష్కరించుకోవాల్సిన చిన్నపాటి సమస్య మూడు ప్రాణాలను బలిగొంది. ఈ ఘటన వనపర్తి జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. పంతానికి పోయి తన తోపాటు అభం శుభం తెలియని ఇద్దరు చిన్నారుల జీవితాలను చిదిమేసింది ఓ తల్లి. ఎస్‌ఐ హరిప్రసాద్‌రెడ్డి, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. పట్టణంలోని గణేశ్‌నగర్‌లో నివాసం ఉంటున్న నిరంజన్‌– నఫీజ్‌బేగం (34) ఉమ్మడి కుటుంబంగా ఉంటూ.. జీవనం సాగిస్తున్నారు. గత కొంతకాలంగా ఇంట్లో చిన్నపాటి సమస్యలు ఉత్పన్నమై వేరు కాపురం పెట్టాలనే విషయంపై కొన్నిరోజులుగా భార్యాభర్తల మధ్య గొడవలు మొదలయ్యాయి. ఈ వివాదం రోజురోజుకూ పెరిగి మనస్తాపానికి గురైన నఫీజ్‌బేగం సోమవారం పిల్లలు హబీబ్‌ (7), సనాబేగం (4)తో పాటు ఇంటికి సమీపంలోని తాళ్ల చెరువులో దూకింది. భార్యాపిల్లలు కనిపించడం లేదని రెండురోజులుగా నిరంజన్‌ వెతుకుతున్న క్రమంలో.. చెరువు కట్టపై వెళ్తున్న పలువురు చెరువులో తేలిన మృతదేహాలను చూసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. స్పందించిన పోలీసులు మృతదేహాలను వెలికితీశారు.

ఓ దొంగతనం.. ఆపై పంచాయితీ..

- మంజీరాలో దూకిన తల్లి, కుమారుడు
- లభించని ఆచూకీ



బాలమణి



వడ్ల శ్యామ్‌

వట్‌పల్లి (అందోల్‌): దొంగతనం విషయంలో పంచాయితీకి పిలవడంతో తల్లీకుమారుడు ఆత్మహత్యా యత్నం చేశారు. ఈ ఘటన సంగారెడ్డి జిల్లా అందోల్‌ మండలంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. సంగారెడ్డికి చెందిన ఓ వ్యక్తి అందోలు మండలం చింతకుంట గ్రామంలో జరిగిన విందుకు ఆదివారం టాటా ఏస్‌ వాహనంలో వచ్చాడు. సోమవారం తిరిగి వెళ్లిపోదామని నిర్ణయించుకొని వాహనాన్ని గ్రామంలోని ఖాళీ ప్రదేశంలో నిలిపాడు. అదే గ్రామానికి చెందిన తాగుడుకు బానిసైన వడ్ల శ్యామ్‌ (21) ఆ వాహనాన్ని అర్ధరాత్రి 12 గంటల సమయంలో ఎత్తుకెళ్లాడు. కొడిపల్లి మండలం బుజరంపేట గ్రామ శివారుకు వెళ్లగానే వాహనం కాల్వలో ఇరుక్కుపోయింది. దానిని బయటకు తీసే ప్రయత్నంలో భారీ శబ్దం రావడంతో చుట్టుపక్కల వారు లేచి దొంగ దొంగ అని అరిచారు. దీంతో శ్యామ్‌ వెంటనే సమీపంలోని ఓ బైక్‌ను తీసుకొని అక్కడి నుంచి పరారయ్యారు. బుజరంపేట గ్రామస్తులు దుంపలకుంటలోని సీసీ ఫుటేజీని పరిశీలించి వడ్ల శ్యామ్‌ను గుర్తించారు. గ్రామ పెద్దలతో సమావేశమై శ్యామ్‌ను తమకు అప్పగించాలని, లేకపోతే వాహనాన్ని ఇచ్చేది లేదని హెచ్చరించారు. అనంతరం శ్యామ్‌ తండ్రి యాదయ్యను పిలిపించి జరిగిన విషయాన్ని వివరించారు. ఈ క్రమంలో మంగళవారం సాయంత్రం శ్యామ్‌ అతడి తల్లిదండ్రులు యాదయ్య, బాలమణి (46), చిన్నమ్మ మమత బుజరంపేటకు పంచాయితీకి వెళ్లేందుకు నిర్ణయించుకున్నారు. తండ్రి, చిన్నమ్మ బస్‌లో బయలుదేరగా, శ్యామ్‌ తల్లి బాలమణితో బైక్‌పై బయలుదేరాడు. చింతకుంట బ్రిడ్జిపైకి రాగానే బైక్‌ను ఆపి మొదట శ్యామ్‌ మంజీరా నీళ్లలోకి దూకగా, అనంతరం తల్లి దూకింది. విషయం తెలుసుకున్న జోగిపేట, చిలప్‌చెడ్‌ పోలీసులు వేర్వేరుగా గాలింపు చర్యలు చేపట్టినా వారి ఆచూకీ లభ్యం కాలేదు.



బిహార్‌ కార్మికుడి కుమార్తెకు చెప్పులు, దుస్తులు అందిస్తున్న మంత్రి సురేఖ

చలించి.. చెప్పులు కొనిచ్చి

సుల్తానాబాద్‌(పెద్దపల్లి): చెప్పుల్లేకుండా రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న నిరుపేద తండ్రీకూతుళ్లను చూసి మంత్రి సురేఖ చలించిపోయారు. వారికి చెప్పులు, దుస్తులు కొనిచ్చి పెద్దమనసు చాటుకున్నారు. పెద్దపల్లి జిల్లా కేంద్రంలో వివిధ అభివృద్ధి పనుల్లో పాల్గొనేందుకు దేవాదాయ, ధర్మాదాయ శాఖమంత్రి కొండా సురేఖ మంగళవారం సుల్తానాబాద్‌ నుంచి వెళ్తుండగా.. చెప్పుల్లేకుండా సాగిపోతున్న తండ్రీకూతుళ్ల కనిపించారు. వెంటనే ఆమె తన కాన్వాయ్‌ ఆపి.. వారివద్దకు వెళ్లారు. తండ్రిని ప్రశ్నించగా.. బిహార్‌కు చెందిన తాను స్థానిక రైస్‌మిల్లులో హమాలీగా పనిచేస్తున్నానని తెలిపాడు. తన ఐదేళ్ల కూతురితో కలిసి ఇంటి సామగ్రి కొనుగోలు చేసేందుకు వెళ్తున్నానని వివరించాడు. తనది పేద కుటుంబమని, అందుకే కాలినడకన వెళ్తున్నామని వివరించాడు. వెంటనే మంత్రి.. వారిద్దరినీ వెంటతీసుకుని సమీపంలోని ఓ చెప్పుల దుకాణానికి వెళ్లారు. రెండు జతల చెప్పులు కొన్నారు. మరో దుకాణానికి వెళ్లి రెండు జతల దుస్తులు కూడా కొనుగోలు చేసి వారికి అందజేశారు. చలితీవ్రత అధికంగా ఉన్న సమయంలో.. చిన్నపిల్లలను ఇలా బయటకు తీసుకురావొద్దని బిహార్‌ వాసికి సూచించారు. మంత్రి కొండా సురేఖ మానవీయ స్పందనకు స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు.

రాజ్యాంగమే పునాది



మంగళవారం సుప్రీంకోర్టులో రాజ్యాంగ దిన వేడుకల సందర్భంగా సీజేఐ జస్టిస్ ఖన్నా, ప్రధాని మోదీ

జాతికి కరదీపిక

- సజీవ స్రవంతి మన రాజ్యాంగం: మోదీ
- సుప్రీంకోర్టులో రాజ్యాంగ దినోత్సవం

న్యూఢిల్లీ: భారత రాజ్యాంగాన్ని జాతికి దారి చూపే కరదీపికగా ప్రధాని నరేంద్ర మోదీ అభివర్ణించారు. కీలకమైన పరివర్తన దశలో మన రాజ్యాంగం దేశానికి అన్ని విషయాల్లోనూ దారి చూపుతూ చుక్కానిలా వ్యవహరిస్తోందన్నారు. ''మన రాజ్యాంగం కేవలం నిబంధనల పుస్తకం కాదు. అదో సజీవ స్రవంతి. కోట్లాది మంది భారతీయుల అవసరాలు, ఆశలను తీర్చడంలోనే గాక వారి ఆకాంక్షలు, అంచనాలను అందుకోవడంలో ఏనాడూ విఫలం కాలేదు. చివరికి ఎమర్జెన్సీ వంటి అతి పెద్ద సవాలును కూడా తట్టుకుని సమున్నతంగా నిలిచింది'' అంటూ కొనియాడారు. మంగళవారం సుప్రీంకోర్టులో జరిగిన రాజ్యాంగ దిన వేడుకల్లో ప్రధాని ప్రసంగించారు. దేశమే ముందన్న భావన పౌరులందరిలో నిండుగా ఉండాలని హితవు పలికారు. ఆ భావనే మన రాజ్యాంగాన్ని మరిన్ని శతాబ్దాల పాటు సజీవంగా ఉంచుతుందని అభిప్రాయపడ్డారు. స్వీయ అవసరాల కంటే దేశ ప్రయోజనాలను మిన్నగా భావించే కొద్దిమంది నిజాయతీపరులు దేశానికి చాలని 1949 నవంబర్ 26న రాజ్యాంగ పరిషత్ తొలి భేటీలో బాబూ రాజేంద్రప్రసాద్ చేసిన వ్యాఖ్యలను ప్రధాని గుర్తు చేశారు. ''కాలానుగుణంగా వచ్చే మార్పులను రాజ్యాంగం తనలో ఇముడ్చుకునేలా దాని నిర్మాతలు ఎన్నో జాగ్రత్తలు తీసుకున్నారు. స్వతంత్ర భారత ఆశలు, ఆశయాలు, ఆకాంక్షలు, పౌరుల అవసరాలు, సవాళ్లు కాలంతో పాటు ఎంతగానో మారతాయని వారికి బాగా తెలుసు'' అని అన్నారు. జమ్మూ కశ్మీర్లో తొలిసారి రాజ్యాంగం పూర్తిస్థాయిలో అమలవుతుండటం ఆనందకరమన్నారు. ''పౌరుల్లో మానవీయ విలువలను పాదుగొల్పాలని రాజ్యాంగ నిర్మాతలు ఆకాంక్షించారు. అందుకే రాజ్యాంగపు తొలి హస్తలిఖిత ప్రతిలో రాముడు, సీత, గురునానక్, బుద్ధుడు, మహావీరుడు తదితరుల చిత్రాలను చేర్చారు'' అని గుర్తు చేశారు.

ఎన్నడూ పరిధి దాటలేదు: మోదీ

రాజ్యాంగ పరిధులను తానెన్నడూ దాటలేదని ప్రధాని మోదీ అన్నారు. ప్రధానిగా ఎప్పుడూ రాజ్యాంగం నిర్దేశించిన సరిహద్దులకు లోబడి పని చేసేందుకే ప్రయత్నించానని స్పష్టం చేశారు. ''ఇతర వ్యవస్థల్లో చొరబాట్లకూ నేనెన్నడూ ప్రయత్నించలేదు. నా దృక్కోణాన్ని, అభిప్రాయాలను కూడా పరిధులకు లోబడే వెల్లడించేందుకే శాయశక్తులా ప్రయత్నించా. ఈ వేదికపై ఇంత మాత్రం చెబితే చాలనుకుంటా. వివరించి చెప్పాల్సిన అవసరం లేదనే ఆశిస్తున్నా'' అంటూ నర్మగర్భ వ్యాఖ్యలు చేశారు. మోదీకి ముందు మాట్లాడిన సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కపిల్ సిబల్ ప్రభుత్వాల పనితీరుపై విమర్శలు గుప్పించారు. ''తామే సర్వోన్నతులమనే భావనతో అవి అప్పుడప్పుడు అతి చేస్తున్నాయి. చట్టాలను వ్యక్తిగత, రాజకీయ అజెండాలకు ఉపయోగించుకునే ప్రయత్నం చేస్తున్నాయి'' అని ఆరోపించారు. ఈ వ్యాఖ్యలపైనే పై విధంగా మోదీ స్పందించారని భావిస్తున్నారు.

నడిపించే శక్తి రాజ్యాంగం: సీజేఐ

''ప్రభుత్వ వ్యవస్థలన్నీ తమకు దఖలుపడ్డ రాజ్యాంగపరమైన బాధ్యతలను గౌరవించాలి. వాటికి లోబడే నడుచుకోవాలి'' అని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా సూచించారు. ఎన్నికల ప్రక్రియ తాలూకు పర్యవసానాలతో న్యాయవ్యవస్థ ప్రభావితం కాకుండా ఉండేందుకు దానికి స్వతంత్ర ప్రతిపత్తి వంటి రక్షణలను రాజ్యాంగం కల్పించిందని గుర్తు చేశారు. అయితే, ''ఏ వ్యవస్థా దానికదే స్వతంత్ర విభాగం కాదు. అవన్నీ పరస్పరం ఆధారితాలే. కనుక దేశ శ్రేయస్సే లక్ష్యంగా పరస్పర సమతుల్యతతో సమైక్యంగా సాగాలి'' అని హితవు పలికారు. ''భారత్‌ను ప్రగతిశీల దేశంగా తీర్చిదిద్దడంలో రాజ్యాంగం అతి కీలక పాత్ర పోషించింది. ఫలితంగా దేశ విభజన, నిరక్షరాస్యత, పేదరికం తదితర పెను సవాళ్లను అధిగమించగలిగాం. అత్యంత చైతన్యవంతమైన ప్రజాస్వామ్యంగా, అంతర్జాతీయంగా బలమైన శక్తిగా భారత్ నిలిచింది. వీటన్నింటి వెనకాల అడుగడుగునా రాజ్యాంగపు వెన్నుదన్ను ఉన్నాయి'' అని పేర్కొన్నారు.

▶ మొదటి పేజీ తరువాయి

సభ్యులు హాజరయ్యారు. మన రాజ్యాంగం ఒక ప్రగతిశీల పత్రం అని రాష్ట్రపతి పేర్కొన్నారు. దూరదృష్టి కలిగిన మన రాజ్యాంగ నిర్మాతలు మారుతున్న కాలానికి అనుగుణంగా నూతన ఆలోచనలను అందిపుచ్చుకొనే వ్యవస్థను అందించారని కొనియాడారు. సామాజిక న్యాయం, సమగ్ర అభివృద్ధికి సంబంధించి రాజ్యాంగం ద్వారా మనం ఎన్నో ఘనతలు సాధించామని హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రపతి ముర్ము ఇంకా ఏం మాట్లాడారంటే..

విశ్వబంధు భారత్

''దేశ ఐక్యత, సమగ్రతతోపాటు పర్యావరణాన్ని కాపాడుకోవడం, శాస్త్రీయ దృక్పథం పెంచుకోవడం, ప్రభుత్వ ఆస్తులను రక్షించుకోవడం, అభివృద్ధిలో దేశాన్ని ఉన్నత శిఖరాలకు చేర్చడం పౌరుల ప్రాథమిక విధులు. నూతన పథంలో పయనిస్తే అంతర్జాతీయ వేదికలపై మన దేశానికి నూతన గుర్తింపును సాధించిపెట్టగలం. అంతర్జాతీయంగా శాంతిభద్రతలను పెంపొందించేలా కీలకపాత్ర పోషించడానికి రాజ్యాంగ నిర్మాతలు భారత్‌కు మార్గనిర్దేశం చేశారు. నేడు మన దేశం అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారింది. విశ్వబంధుగా ప్రపంచవ్యాప్తంగా చురుకైన పాత్ర పోషిస్తోంది. భారత ప్రజాస్వామ్య గణతంత్రానికి రాజ్యాంగమే బలమైన పునాది రాయి. ప్రజల సమ్మిళిత, వ్యక్తిగత గౌరవాన్ని రాజ్యాంగం కాపాడుతోంది.

పోరాట ఫలితమే రాజ్యాంగం

వచ్చే ఏడాది జనవరి 26వ తేదీన 75వ గణతంత్ర వేడుకలు నిర్వహించుకోబోతున్నాం. ఇప్పటిదాకా సాగిన మన ప్రయాణాన్ని సమీక్షించుకోవడానికి, భవిష్యత్తులో మరింత మెరుగైన ప్రయాణానికి ప్రణాళిక సిద్ధం చేసుకోవడానికి ఇలాంటి వేడుకలు ఎంతగానో తోడ్పడతాయి. మన ఐక్యతను బలోపేతం చేస్తాయి. జాతీయ లక్ష్యాలను సాధించడంలో మనమంతా కలిసకట్టుగా ఉన్నామని తెలియజేశాయి. ఎందరో మహామహులు దాదాపు మూడేళ్లపాటు కృషి చేయడంతో రాజ్యాంగం మన చేతికి వచ్చింది. నిజానికి సుదీర్ఘంగా జరిగిన స్వాతంత్ర్య పోరాట ఫలితమే భారత రాజ్యాంగం. ఈ పోరాట స్ఫూర్తి, ఆశయాలను రాజ్యాంగం ప్రతిబింబిస్తోంది. న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం అనే సమున్నత ఆశయాలను రాజ్యాంగ పీఠికలో పొందుపర్చారు. ఇవే దశాబ్దాలుగా భారత్‌ను నిర్వచిస్తున్నాయి. స్వశక్తితో పైకి ఎదిగే, సమాజానికి సేవలందించే, తోటి మానవులకు సాయం అందించే వాతావరణాన్ని రాజ్యాంగ పీఠిక కల్పించింది. 2015 నుంచి సంవిధాన దివస్ జరుపుకుంటున్నాం. దీనివల్ల రాజ్యాంగంపై యువతలో అవగాహన పెరుగుతోంది. మీ ప్రవర్తనలో రాజ్యాంగ విలువలను, ఆశయాలను జోడించాలని ప్రజలందరినీ కోరుతున్నా. పౌరులంతా ప్రాథమిక విధులను నిర్వర్తించాలి. '2047 నాటికి వికసిత్ భారత్' అనే లక్ష్యం దిశగా అంకితభావంతో ముందుకు సాగాలి'' అని రాష్ట్రపతి పిలుపునిచ్చారు.

ప్రజలే సర్వోన్నతులు
ఉపరాష్ట్రపతి ధన్‌ఖడ్

రాజకీయ పార్టీలు దేశం కంటే మత విశ్వాసాలకు, స్వార్థ ప్రయోజనాలకు ప్రాధాన్యం ఇస్తే మన స్వాతంత్ర్యం రెండోసారి ప్రమాదంలో పడుతుందని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చెప్పినట్లు ఉప రాష్ట్రపతి జగ్‌దీప్ ధన్‌ఖడ్ గుర్తుచేశారు. ఆయన పాత పార్లమెంట్ భవనంలో రాజ్యాంగ దినోత్సవంలో ఎంపీలను ఉద్దేశించి మాట్లాడారు. ప్రజలకు ప్రభావవంతంగా సేవలందించాలంటే చట్టసభల్లో అర్థవంతమైన చర్చలు, నిర్మాణాత్మక సంవాదాలు జరగాలని చెప్పారు. మన ప్రజాస్వామ్య దేవాలయాల పవిత్రతను పునరుద్ధరించాల్సిన సమయం వచ్చిందన్నారు. 'భారతదేశ ప్రజలమైన మేము' అని రాజ్యాంగ పీఠికలో ప్రారంభంలోనే పేర్కొన్నారని, ఇందులో లోతైన అర్థం ఉందని, ప్రజలే అత్యున్నతమని తేల్చిచెప్పారు. ప్రజల గొంతుకగా పార్లమెంట్ పని చేస్తోందని వివరించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో శాసనవర్గం, కార్యనిర్వాహక వర్గం, న్యాయ వ్యవస్థ అనే మూడు మూలస్తంభాలను రాజ్యాంగం ఏర్పాటు చేసిందని తెలిపారు. రాజ్యాంగ సంస్థలు కలిసి పనిచేస్తే ప్రజాస్వామ్యం మరింత వెలుగులీనుతుందని సూచించారు. రాజ్యాంగం నిర్దేశించిన ప్రాథమిక విధులను ప్రజలంతా నిర్వర్తించాలని కోరారు. దేశ సార్వభౌమత్వాన్ని, ఐక్యతను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. దేశ ప్రయోజనాలకే అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. వికసిత్ భారత్ అనే లక్ష్య సాధనకు గతంలో కంటే ఇప్పుడు మరింత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని జగ్‌దీప్ ధన్‌ఖడ్ వెల్లడించారు.

రాజ్యాంగం ఒక ఉత్ప్రేరకం: ఓం బిర్లా

చట్టసభల్లో నిర్మాణాత్మక, గౌరవప్రదమైన చర్చలు జరగాలని రాజ్యాంగ సభ సూచించినట్లు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా చెప్పారు. ఇదే సంప్రదాయాన్ని చట్టసభల సభ్యులు తు.చ. తప్పకుండా పాటించాలని కోరారు. రాజ్యాంగ దినోత్సవంలో ఓం బిర్లా ప్రసంగించారు. మన స్వాతంత్ర్య పోరాట వీరుల త్యాగం, అంకితభావం, దార్శనికతకు రాజ్యాంగం ఒక ప్రతీకగా నిలిచిందని పేర్కొన్నారు. సామాజిక మార్పునకు, ఆర్థిక ప్రగతికి రాజ్యాంగమే ఒక ఉత్ప్రేరకం అని చెప్పారు. సాధారణ ప్రజల స్థితిగతుల్లో ఎన్నో గణనీయమైన మార్పులు తీసుకొచ్చిందని, ప్రజాస్వామ్యం పట్ల వారి విశ్వాసాన్ని మరింత బలోపేతం చేసిందని వివరించారు. చట్టసభల్లో చక్కటి చర్చల ద్వారా రాజ్యాంగ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని ఎంపీలకు ఓం బిర్లా పిలుపునిచ్చారు. రాజ్యాంగ విలువల పట్ల మన తిరుగులేని అంకితభావం అంతర్జాతీయంగా భారతదేశ ప్రతిష్టను మరింత పెంచుతుందని ఉద్ఘాటించారు. రాజ్యాంగ దినోత్సవాన్ని దేశవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో ప్రజలతో కలిసి నిర్వహించాలని ఎంపీలకు లోక్‌సభ స్పీకర్ సూచించారు.


రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా స్మారక నాణెం విడుదల చేస్తున్న రాష్ట్రపతి ముర్ము, ఉపరాష్ట్రపతి ధన్‌ఖడ్, ప్రధాని మోదీ, స్పీకర్ ఓం బిర్లా, రాహుల్, ఖర్గే, కేంద్ర మంత్రులు రిజిజు, నడ్డా తదితరులు


ఉభయ సభల సంయుక్త భేటీలో పాల్గొన్న పార్లమెంటు సభ్యులు

బంగ్లా హిందూ నేతపై దేశ ద్రోహం కేసు

- చిన్మయ్ దాస్‌కు బెయిల్ నిరాకరించిన కోర్టు
- రాజధాని ఢాకాతోపాటు దేశవ్యాప్త నిరసనలు
- తీవ్ర ఆందోళన వ్యక్తం చేసిన భారత్
- సమైక్య బంగ్లాదేశ్‌ను కోరుకుంటున్నామన్న దాస్


కస్టడీకి తరలిస్తుండగా విజయచిహ్నం చూపుతున్న చిన్మయ్ దాస్

ఢాకా: బంగ్లాదేశ్‌లో దేశ ద్రోహం ఆరోపణలపై అరెస్టయిన హిందూ నేత చిన్మయ్ కృష్ణ దాస్ బ్రహ్మచారికి అక్కడి న్యాయస్థానం బెయిల్ నిరాకరించింది. దాస్ అరెస్టును నిరసిస్తూ రాజధాని ఢాకా, చిట్టోగ్రామ్ తదితర ప్రాంతాల్లో హిందువులు నిరసన ప్రదర్శనలు జరిపారు. ఈ పరిణామాలపై భారత్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఆయన అరెస్ట్ తర్వాత బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులు పెరిగిపోయాయని తెలిపింది. ఇస్కాన్ మాజీ సభ్యుడు, సమ్మిళిత సనాతని జోత్ అనే హిందూ సంఘం నేత చిన్మయ్ కృష్ణ దాస్ బ్రహ్మచారి సోమవారం చిట్టోగ్రామ్‌కు వెళ్లేందుకు ఢాకా విమానాశ్రయానికి రాగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం చిట్టోగ్రామ్‌కు తరలించారు. చిట్టోగ్రామ్‌లోని లాల్‌డిగి మైదాన్‌లో అక్టోబర్ 25న హిందువులు నిర్వహించిన ర్యాలీ సందర్భంగా జాతీయ పతాకాన్ని అవమానపరిచారంటూ దాస్, మరో 18 మందిపై మాజీ ప్రధాని ఖలేదా జియాకు చెందిన బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ(బీఎన్‌పీ) నేత ఒకరు ఫిర్యాదు చేయడంతో చిట్టోగ్రామ్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో దాస్‌ను పోలీసులు మంగళవారం ఆరో మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కాజీ షరీఫుల్ ఇస్లాం ఎదుట హాజరుపరిచారు. దాస్ బెయిల్ పిటిషన్‌ను తిరస్కరించిన మేజిస్ట్రేట్..చిట్టోగ్రామ్ వెలుపల ఈ అరెస్ట్ జరిగినందున నిబంధనల మేరకు 24 గంటలపాటు జ్యుడీషియల్ కస్టడీలో ఉండాల్సిందేనని ఆదేశించారు. దీంతో పోలీసులు ఆయన్ను జైలుకు తరలించారు. నిబంధనలకు లోబడి జైలులో మతాచారం ప్రకారం పూజాకార్యక్రమాలు జరుపుకోవచ్చన్నారు. దాస్‌ను జైలుకు తరలిస్తుండగా పెద్ద సంఖ్యలో మద్దతుదారులు నినాదాలు చేశారు. దాస్‌ను తరలిస్తున్న వ్యాన్‌ను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా జైలు వ్యానులో నుంచి విక్టరీ సింబల్ చూపుతూ దాస్ ప్రసంగించారు. తాము సమైక్య బంగ్లాదేశ్‌ను కోరుకుంటున్నామని చెప్పారు. దేశంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించవద్దని, డిమాండ్లు నెరవేరేదాకా శాంతియుత పోరాటం సాగించాలని మద్దతుదారులను దాస్ కోరారు. ఈ మేరకు ఒక వీడియో ఆన్‌లైన్‌లో వైరలవుతోంది. పోలీసులు లాఠీచార్జీ జరిపి ఆందోళనకారులను చెదరగొట్టారు.

దాస్ అరెస్ట్‌పై నిరసనలు

దాస్ అరెస్టును నిరసిస్తూ ఢాకా, చిట్టోగ్రామ్, ఖుల్నా, దినాజ్‌పూర్, కాక్స్ బజార్ కుమిల్లా తదితర చోట్ల హిందువులు ర్యాలీలు చేపట్టారు. బంగ్లాదేశ్ హిందూ బుద్ధిస్ట్ క్రిస్టియన్ యూనిటీ కౌన్సిల్ దాస్ అరెస్టును ఖండించింది. దాస్ అరెస్ట్‌పై భారత్ ప్రభుత్వం తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. హిందువులు ఇతర మైనారిటీల భద్రతకు తగు జాగ్రత్తలు తీసుకోవాలని బంగ్లా అధికారులను కోరింది. దాస్ అరెస్టును ఇస్కాన్ ఉపాధ్యక్షుడు రాధా రామణ్ దాస్ ఖండించారు. బంగ్లాదేశ్ జాతీయ జెండా కంటే ఎత్తుగా మరో జెండాను ఎగరేయడాన్ని తప్పుగా అర్థం చేసుకున్నారని, అంతే తప్ప అగౌరపర్చలేదని ఆయన పేర్కొన్నారు.

ఇస్లామాబాద్ రణరంగం

- ఇమ్రాన్ మద్దతుదారుల ర్యాలీలో హింస
- ఆరుగురు భద్రతా సిబ్బంది మృతి

ఇస్లామాబాద్: వివిధ ఆరోపణలపై జైలులో ఉన్న మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్‌ను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఆయన మద్దతుదారులు చేపట్టిన ర్యాలీ హింసాత్మకంగా మారింది. పాకిస్తాన్ తెహ్రీక్ ఏ ఇన్సాఫ్ (పీటీఐ) చేపట్టిన లాంగ్ మార్చ్‌ను అడ్డుకునేందుకు ప్రయత్నించిన పోలీసులతో కార్యకర్తలు ఘర్షణకు దిగారు. ఈ కొట్లాటలో ఆరుగురు ప్రైవేట్ భద్రతా సిబ్బంది ప్రాణాలు కోల్పోయారు. వంద మంది గాయపడ్డారు. పీటీఐ శ్రేణుల నిరసనలు కొనసాగటంతో ప్రభుత్వం మంగళవారం రాజధాని ఇస్లామాబాద్‌లో సైన్యాన్ని మోహరించింది. రాజధానిలో నిషేధాజ్ఞలు విధించింది. ఇమ్రాన్‌ను విడుదల చేసే వరకు ఇస్లామాబాద్‌ను వదిలేది లేదని పీటీఐ స్పష్టం చేసింది. బలగాల కాల్పుల్లో తమ కార్యకర్తలు ఇద్దరు ప్రాణాలు కోల్పోయారని, వందలాదిగా గాయపడ్డారని పేర్కొంది. పాకిస్తాన్‌లో జరుగుతున్న పరిణామాలపై అమెరికా తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. పౌరుల ప్రాథమిక హక్కులను, వ్యక్తిగత స్వా తంత్ర్యాన్ని గౌరవించాలని ప్రభుత్వాన్ని కోరింది. అదే సమయంలో, ప్రశాంతంగా నిరసన తెలపాలని ఆందోళన కారులకు సూచించింది.


జైలు నుంచి ఇమ్రాన్ ఖాన్ పిలుపు..

ప్రభుత్వ విధానాలకు నిరసనగా పీటీఐ చీఫ్ ఇమ్రాన్ ఖాన్ ఆదివారం నుంచి దేశవ్యాప్త నిరసనలకు తుది పిలుపునిచ్చారు. పార్టీకి చెందిన ఖైబర్ ప్రావిన్స్ ముఖ్యమంత్రి అలీ అమిన్ గండాపుర్, ఇమ్రాన్ భార్య బుష్రా బీబీ నేతృత్వంలో ఆందోళనకారులు ఆదివారం ఇస్లామాబాద్ వైపుగా సాగారు. షిప్పింగ్ కంటైనర్లు, కాంక్రీట్ బారికేడ్లు, బారికేడ్లతో ప్రభుత్వం రహదారులను దిగ్బంధించింది. అయితే ఆందోళనకారులు లిఫ్టింగ్ పరికరాలు, భారీ యంత్రాలను ఉపయోగించి అడ్డంకులను తొలగించుకుని దేశ రాజధాని వైపు దూసుకొచ్చారు. ఇస్లామాబాద్ సమీపంలో, పంజాబ్ ప్రావిన్స్‌లో జరిగిన ఘర్షణల్లో ఇద్దరు పోలీసు అధికారులు చనిపోయారని అధికారులు ధ్రువీకరించారు. మరో అధికారి తీవ్రంగా గాయపడ్డారని చెప్పారు. ఘర్షణల్లో 100 మందికిపైగా పోలీసులు, పలువురు ఇమ్రాన్ మద్దతు దారులు గాయపడ్డారు. నిరసనకారులు 22 పోలీసు వాహనాలకు నిప్పు పెట్టారని అధికారులు తెలిపారు. శ్రీనగర్ హైవేపై గుర్తు తెలియని దుండగులు జవాన్లపైకి వాహనాన్ని నడపడంతో నలుగురు జవాన్లు మరణించారని, మరో ఐదుగురికి గాయాలయ్యాయని అధికారులు చెప్పారు.

హెజ్‌బొల్లాతో కాల్పుల విరమణ ఒప్పందానికి ఇజ్రాయెల్ ఓకే

నెతన్యాహూ ప్రతిపాదనకు కేబినెట్ ఆమోదం

బీరూట్: లెబనాన్‌లోని హెజ్‌బొల్లా మిలిటెంట్ గ్రూప్‌తో పద్నాలుగు నెలల యుద్ధానికి తెరదించే దిశగా ఇజ్రాయెల్ ముందడుగు వేసింది. మంగళవారం ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ చేసిన కాల్పుల విరమణ ఒప్పందం ప్రతిపాదనకు ఇజ్రాయెల్ రక్షణ కేబినెట్ అనుకూలంగా ఓటేసింది. తొలుత 60 రోజులపాటు కాల్పుల విరమణ అమల్లోకి రానుంది. మంగళవారం కూడా బీరూట్‌లోని హెజ్‌బొల్లా స్థావరాలపై ఇజ్రాయెల్ దాడులు చేయడం విశేషం. వీటిలో 10 మంది మరణించారు.



ప్రధాని మోదీ రాజ్యాంగం చదవలేదు

ఆ విషయం గ్యారంటీగా చెప్పగలను: రాహుల్

సాక్షి, న్యూఢిల్లీ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మన దేశ రాజ్యాంగాన్ని చదవలేదని, ఆ విషయం తాను గ్యారంటీగా చెప్పగలనని కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ అన్నారు. మోదీ నిజంగా రాజ్యాంగం చదివి ఉంటే ఇప్పుడు నిత్యం చేస్తున్న పనులు చేసి ఉండేవారు కాదని పేర్కొన్నారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా మంగళవారం ఢిల్లీలో ఏఐసీసీ ఆధ్వర్యంలో నిర్వహించిన 'సంవిధాన్ రక్షక్ అభియాన్' కార్యక్రమంలో రాజ్యాంగ ప్రతిని ప్రదర్శిస్తూ రాహుల్ మాట్లాడారు. దేశంలో మొత్తం వ్యవస్థ ఎస్సీ, ఎస్టీ, బీసీలకు వ్యతిరేకంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో దళితుల, ఆదివాసీలు, ఓబీసీల ప్రయాణ మార్గంలో అడ్డుగోడను బీజేపీ, ఆర్‌ఎస్ఎస్ బలోపేతం చేస్తున్నాయని, దానికి సిమెంట్ అద్దుతున్నాయని ఆరోపించారు. ఆ అడ్డుగోడను బలహీనపర్చేందుకు యూపీఏ హయాంలో చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.తీసుకోవాల్సిన స్థాయిలో చర్యలు తీసుకోలేదని అంగీకరించారు.

బ్యాలెట్ పేపర్ కావాలి: ఖర్గే

న్యూఢిల్లీ: ఎన్నికల్లో మళ్లీ బ్యాలెట్ పేపర్ విధానాన్నే అమలుచేయాలని కాంగ్రెస్ చీఫ్ ఖర్గే డిమాండ్‌చేశారు. మంగళవారం ఢిల్లీలోని తాల్కటోరా స్టేడియంలో నిర్వహించిన 'సంవిధాన్ రక్షక్ అభియాన్' కార్యక్రమంలో ఖర్గే ప్రసంగించారు. ''ఈవీఎంలు వద్దు. బ్యాలెట్ పేపర్ విధానం తీసుకురండి. దీనిపై ఓటర్లలో అవగాహన పెంచేందుకు భారత్ జోడో తరహాలో విస్తృతస్థాయిలో ప్రచారం చేద్దాం'' అన్నారు. ప్రధాని మోదీకి కులగణన అంటే భయమని ఎద్దేవా చేశారు.

ఏపీ సహా నాలుగు రాష్ట్రాల్లోని ఆరు సీట్లకు పోలింగ్

రాజ్యసభ ఉప ఎన్నికలకు విడుదలైన షెడ్యూల్

సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్ సహా నాలుగు రాష్ట్రాల్లో ఇటీవల ఖాళీ అయిన ఆరు రాజ్యసభ స్థానాలకు ఉప ఎన్నికల షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం కార్యదర్శి సుమన్ కుమార్ మంగళవారం విడుదల చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో మూడు స్థానాలు, పశ్చిమ బెంగాల్, ఒడిశా, హరియాణాల్లో ఒక్కో సీటుకు ఎన్నికలు జరగనున్నాయి. వైఎస్సార్‌సీపీకి చెందిన రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణ, బీద మస్తాన్‌రావు, ర్యాగ కృష్ణయ్య ఆగస్ట్‌లో తమ సభ్యత్వాలకు రాజీనామా చేశారు. రెండు రోజుల క్రితం రాజ్యసభ చైర్మన్ వీరి రాజీనామాలను ఆమోదించారు. ఈ ముగ్గురితో పాటు ఒడిశాకు చెందిన సుజీత్‌కుమార్, పశ్చిమ బెంగాల్‌కు చెందిన జవహర్ సర్కార్, హరియాణాకు చెందిన కృష్ణన్ లాల్‌పన్వార్ కూడా రాజీనామా చేశారు. 6 రాజ్యసభ స్థానాల ఉప ఎన్నికలకు డిసెంబర్ 3న నోటిఫికేషన్ రానుంది. నామినేషన్ల స్వీకరణకు 10వ తేదీ, ఉపసంహరణకు 13వ తేదీ తుది గడువు. డిసెంబర్ 20న ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరగనుంది. అదే రోజు సాయంత్రం 5 గంటలకు ఓట్ల లెక్కింపు, ఫలితాలు విడుదల చేయనున్నట్లు కేంద్ర ఎన్నికల సంఘం తెలిపింది.

ఏక్‌నాథ్ షిండే రాజీనామా

ఆపద్ధర్మ ముఖ్యమంత్రిగా కొనసాగాలని గవర్నర్ వినతి • కొత్త సీఎం ఎంపికపై నేడు స్పష్టత!


గవర్నర్‌కు రాజీనామా లేఖ సమర్పిస్తున్న మహారాష్ట్ర సీఎం షిండే. చిత్రంలో ఫడ్నవీస్, అజిత్ పవార్

ముంబై: మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే తన పదవికి రాజీనామా చేశారు. రాజీనామా పత్రాన్ని మంగళవారం రాష్ట్ర గవర్నర్ సి.పి.రాధాకృష్ణన్‌కు అందజేశారు. ఈ సందర్భంగా షిండే వెంట ఉప ముఖ్యమంత్రులు దేవేంద్ర ఫడ్నవీస్, అజిత్ పవార్ ఉన్నారు. నూతన సీఎం ప్రమాణ స్వీకారం చేసే వరకూ ఆపద్ధర్మ ముఖ్యమంత్రిగా కొనసాగాలని షిండేను గవర్నర్ కోరారు. మహారాష్ట్రలో ప్రస్తుత ప్రభుత్వ పదవీ కాలం మంగళవారం ముగిసింది. సాధ్యమైనంత త్వరగా నూతన ప్రభుత్వం కొలువుదీరాల్సిన పరిస్థితి ఏర్పడింది. రాష్ట్రంలో ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ నేతృత్వంలోని మహాయుతి ఘన విజయం సాధించిన సంగతి తెలిసిందే.

ఎడతెగని ఉత్కంఠ

మహారాష్ట్ర కొత్త సీఎం ఎంపికపై ఉత్కంఠ కొనసాగుతూనే ఉంది. మహాయుతి భాగస్వామ్య పక్షాలు ఇంకా ఏకాభిప్రాయానికి రాలేదని సమాచారం. ముఖ్యమంత్రి ఎంపికపై ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాలదే తుది నిర్ణయమని ఆయా పార్టీలు చెబుతున్నాయి. వారు ఏ నిర్ణయం తీసుకున్నా తాము కట్టుబడి ఉంటామని పేర్కొంటున్నాయి. సీఎం పోస్టు కోసం బీజేపీ నుంచి దేవేంద్ర ఫడ్నవీస్, శివసేన(షిండే) నుంచి ఏక్‌నాథ్ షిండ్, ఎన్సీపీ(అజిత్‌పవార్) నుంచి అజిత్ పవార్ పోటీ పడుతున్నారు. ముఖ్యమంత్రి రేసు నుంచి తప్పుకోవడానికి అజిత్ పవార్ అంగీకరించినట్లు ప్రచారం జరుగుతోంది. కొత్త సీఎం ఎవరన్నదానిపై బుధవారం ఉదయం కల్లా స్పష్టత వచ్చే అవకాశం ఉందని శివసేన(షిండే) అధికార ప్రతినిధి సంజయ్ సిర్సాత్ చెప్పారు. మరోవైపు కేంద్ర మంత్రి రాందాస్ అథవాలే ఢిల్లీలో కీలక వ్యాఖ్యలు చేశారు. దేవేంద్ర ఫడ్నవీస్‌ను ముఖ్యమంత్రిగా నియమించాలని బీజేపీ అధిష్టానం నిర్ణయించినట్లు తెలిపారు. కానీ, అధికారికంగా ఆయన పేరు ఇంకా ఖరారు చేయలేదని అన్నారు. ఏ పార్టీకి ఎన్ని మంత్రిపదవులు, ఎవరెవరికి ఏయే శాఖలు ఇవ్వాలో నిర్ణయించిన తర్వాతే కొత్త సీఎంను ఎంపిక చేసే అవకాశం ఉన్నట్లు బీజేపీని సీనియర్ నేత ఒకరు వెల్లడించారు. సీఎం ఎంపిక విషయంలో తమ పార్టీ అధిష్ఠానం తొందరపడడం లేదని తెలిపారు. మహాయుతిలో ఘర్షణకు తావులేకుండా సామరస్యపూర్వకంగా ముందుకు సాగాలన్నది తమ ఉద్దేశమని వివరించారు.



సీపీ ఆన్ స్ట్రీట్

ట్రాఫిక్ జాంలను తగ్గించడంతో పాటు అక్రమ పార్కింగ్ నిరోధం, ఆక్రమణల తొలగింపునకు ట్రాఫిక్ విభాగం నడుం బిగించింది. మంగళవారం కొత్వాల్ సీవీ ఆనంద్ పర్యవేక్షించారు. -8లో



రీడ్.. రైట్.. రైట్

పుస్తక పఠనంపై యువతకు ఇటీవల మక్కువ పెరుగుతోంది. గ్రంథ రచనకు సైతం యువతరం ముందుకు వస్తుండటం శుభ పరిణామం. - సిటీప్లస్‌లో

గరిష్టం/కనిష్టం
30.0/16.0

వాతావరణం

నగరంలో బుధవారం ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉదయం పొగమంచు వాతావరణం ఉంటుంది. గరిష్టంగా 30, కనిష్టంగా 16 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.

చిట్టీల పేరుతో కుచ్చుటోపీ

రూ.2.79 కోట్లు వసూలు చేసి పరార్

- నిందితుడు సూర్య ప్రతాప్ రెడ్డి అరెస్ట్
- సైబరాబాద్ ఈఓడబ్ల్యూ డీసీపీ ప్రసాద్ వెల్లడి

సాక్షి, సిటీబ్యూరో: నెలవారీ చిట్టీల పేరుతో రూ.2.79 కోట్లకు కుచ్చుటోపీ పెట్టిన నిందితుడిని సైబరాబాద్ ఆర్థిక నేరాల నియంత్రణ విభాగం (ఈఓడబ్ల్యూ) పోలీసులు అరెస్టు చేశారు. జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. డీసీపీ కె.ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. చందానగర్‌కు చెందిన అప్పంపల్లి సూర్య ప్రతాప్ రెడ్డి రిజిస్ట్రేషన్ లేకుండా అనధికారికంగా నెలవారీ చిట్స్‌ను నిర్వహిస్తున్నాడు. చందానగర్‌లోని తన ఇంట్లో 14 ఏళ్లుగా ఈ దందా కొనసాగిస్తున్నాడు. కమీషన్ ప్రాతిపదికన రూ.లక్ష నుంచి రూ.25 లక్షల వరకు చిట్టీలు నిర్వహిస్తుంటాడు. ఈ క్రమంలో మియాపూర్, కూకట్‌పల్లి, పటాన్‌చెరు ప్రాంతాల్లో సూర్య ప్రతాప్ చిట్స్‌పై కలగడంతో వేలాది మంది వినియోగదారులు సభ్యులుగా చేరారు. వీరినుంచి సూర్య ప్రతాప్ రూ.2.79 కోట్లు వసూలు చేశాడు. రాత్రికి రాత్రే ఇంటికి తాళం వేసి పరారయ్యాడు. దీంతో చందానగర్‌కు చెందిన బాధితుడు నసర్ ఖాన్ సైబరాబాద్ ఈఓడబ్ల్యూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తెలంగాణ ప్రొటెక్షన్ ఆఫ్ డిపాజిటర్స్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్–1999 కింద కేసులు నమోదు చేసుకున్న పోలీసులు.. సాంకేతిక ఆధారాలు సేకరించి, నిందితుడు సూర్య ప్రతాప్‌ను కర్మన్‌ఘాట్ వద్ద మంగళవారం అరెస్టు చేశారు.

0001 @ రూ.11.11 లక్షలు

- ఆర్టీఏ ప్రత్యేక నంబర్లపై వాహనదారుల క్రేజ్
- ఒక్క రోజులోనే రూ.52.52 లక్షల ఆదాయం

సాక్షి, సిటీబ్యూరో: ఆర్టీఏ ప్రత్యేక నంబర్లపై వాహనదారులు మరోసారి క్రేజ్ చాటుకున్నారు. మంగళవారం ఖైరతాబాద్ ఆర్టీఏలో ప్రత్యేక నంబర్లపై నిర్వహించిన ఆన్‌లైన్ బిడ్డింగ్ ద్వారా రూ.52,52,283 ఆదాయం లభించింది. 'టీజీ 09 డి 0001' నంబర్ కోసం రుద్రరాజు రాజీవ్ కుమార్ అనే వాహనదారు రూ.11,11,111 చెల్లించి సొంతం చేసుకున్నాడు. 'టీజీ 09 డి 0009' కోసం మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ సంస్థ రూ.10,40,000 చెల్లించింది. 'టీజీ 09 సి 9999' నంబర్ కోసం శ్రీయాన్ కన్‌స్ట్రక్షన్స్ రూ.7,19,999 చెల్లించింది. 'టీజీ 09 డి 0006 ' నంబర్ కోసం పోరస్ ఆగ్రో ఫుడ్ ప్రొడక్ట్స్ అనే సంస్థ రూ. 3,65,000 చెల్లించింది. 'టీజీ 09 డి 0005' కోసం వేగా శ్రీ గోల్డ్‌అండ్ డైమండ్స్ సంస్థ రూ.3,45,000 చెల్లించింది. ఎన్‌స్పైరా మేనేజ్‌మెంట్ అనే సంస్థ 'టీజీ 09 డి 0007' నంబర్‌ను రూ.2,96,569 చెల్లించి దక్కించుకుంది. 'టీజీ 09 డి 0019' నంబర్‌కు నంబర్ మాల్ ప్రైవేట్ లిమిటెడ్ అనే సంస్థ రూ.1,95,009 చెల్లించింది. 'టీజీ 09 డి 0099' కోసం సీఎస్‌కె రియల్టర్స్ రూ.1,85,000తో దక్కించుకుంది.'టీజీ 09 డి 0077' నంబర్‌ను రూ.1,17,789తో మీనాక్షి ప్రాపర్టీ మేనేజ్‌మెంట్ అనే సంస్థ సొంతం చేసుకుంది.



రసాయనాలతో మాడిపోయిన మూసీ ఒడ్డు

మూసీపై కెమికల్ పంజా!

- తాండూరు, గుల్బర్గా, పటాన్‌చెరు నుంచి తరలింపు
- ప్రత్యేక పైపులైన్, మ్యాన్‌హోళ్ల ఏర్పాటు
- కాలుష్యం, చర్మ వ్యాధుల బారిన స్థానికులు
- అర్ధరాత్రుళ్లు కన్నుగప్పి అక్రమ వ్యవహారం
- బాపుఘాట్ వద్ద రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడిన వైనం



ట్యాంకర్లతో నదిలోకి రసాయన వ్యర్థాల వదిలివేత

లంగర్‌హౌస్: ఇప్పటికే కలుషిత జలాలతో కకావికలమవుతున్న మూసీ.. కెమికల్ మాఫియా గుప్పిట పడి మరింత విలవిలలాడుతోంది. అక్రమార్కులు చిమ్ముతున్న విష రసాయనాలతో తల్లడిల్లుతోంది. మూసీ నదికి పునరుజ్జీవం కల్పించాలని ఒకవైపు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంకల్పించగా.. మరోవైపు కెమికల్ మాఫియా పంజా విసురుతోంది. దూర ప్రాంతాల నుంచి రసాయన వ్యర్థాలను ట్యాంకర్లతో నగరానికి తీసుకొచ్చి సోమవారం అర్ధరాత్రి మూసీ నదిలోకి వదిలి చేసిన ఘటన వెలుగులోకి వచ్చింది. ప్రత్యేక పైపులైన్లు, మ్యాన్‌హోళ్లను ఏర్పాటు చేసి ఈ తతంగం నడిపిస్తుండటం కలకలం రేపుతోంది. కాలుష్యం, ఘాటైన రసాయనాల వాసనలతో స్థానిక ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారు. అంతుచిక్కని రోగాలతో ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు.

ఆట కట్టిస్తే రూటు మార్చారు..

గతంలో కెమికల్ మాఫియా కాటేదాన్, గగన్‌పహాడ్ పారిశ్రామిక ప్రాంతాలలో అర్ధరాత్రి గుట్టుచప్పుడు కాకుండా ట్యాంకర్లను నిలిపి నేరుగా కెమికల్స్ మూసీలో వదిలేవారు. ఆర్జీఐఏ పోలీసులు నిందితులపై కేసులు నమోదు చేసి, వారి ఆట కట్టించారు. దీంతో తాజాగా ఈ మాఫియా రూటు మార్చింది. తాండూరు, గుల్బర్గా, పటాన్‌చెరు, షాద్‌నగర్ వంటి ప్రాంతాల నుంచి పరిశ్రమల వ్యర్థాలు, విషపూరిత రసాయనాలను ట్యాంకర్లలో నింపి నగరానికి తరలిస్తున్నారు.

స్థల యజమానులకు ఆశ చూపి..

గండిపేట, కిస్మత్‌పూర్, హైదర్షాకోట్, జియాగూడ, లంగర్‌హౌస్, అత్తాపూర్, మొఘల్‌నగర్ రింగ్ రోడ్డు, నాగోల్ తదితర ప్రాంతాలను ఎంచుకొని విష రసాయనాలను మూసీలో కలుపుతున్నారు. ట్యాంకర్లు ఎక్కువ సమయం నిలిపితే అనుమానాలు తలెత్తుతున్నాయని మూసీ పరీవాహక ప్రాంతాల్లోని ఖాళీ స్థలాలను అక్రమార్కులు ఎంచుకుంటున్నారు. స్థల యజమానులకు డబ్బులు ఆశ చూపించి, లంగర్‌హౌస్ బాపుఘాట్ పక్కన అత్తాపూర్ బ్రిడ్జి వద్ద మూసీ వెంబడి స్థలాల నుంచి ప్రత్యేక పైపులైన్‌లను ఏర్పాటు చేశారు. కెమికల్ ట్యాంకర్ కనిపించకుండా అర్ధరాత్రి అక్కడ ఏర్పాటు చేసిన పైపులైన్‌ల ద్వారా రసాయనాలను నదిలోకి వదులుతున్నారు.


ట్యాంకర్‌కు రూ.2.5 లక్షలు..

20 వేల లీటర్లతో కూడిన రసాయనాల వ్యర్థాల ట్యాంకర్‌ను తరలించడానికి కంపెనీ రూ.2.5 లక్షలు చెల్లిస్తోందని గతంలో పట్టుబడిన నిందితులు పోలీసుల విచారణలో వెల్లడించారు. ఆయా ట్యాంకర్లను ఫ్యాక్టరీ నుంచి నేరుగా తీసుకురాకుండా లింక్ సిస్టమ్‌తో నగరానికి తరలిస్తున్నారు. కంపెనీ నుంచి బయటికి వచ్చిన కెమికల్ ట్యాంకర్లను ముందుగా తాండూరు, పరిగి, గుల్బర్గా, చించోల్ ప్రాంతాలకు చేరుకుంటాయి. అక్కడి నుంచి ఆయా ట్యాంకర్లను వేరే వ్యక్తులు షాద్‌నగర్, చేవెళ్ల, శంకర్‌పల్లికి చేరవేస్తారు. అక్కడి నుంచి ట్యాంకర్లకు పైలట్ వెహికిల్‌గా ద్విచక్ర వాహనం ముందు వెళ్తుంటుంది. కాళీమందిర్, గండిపేట, కాటేదాన్ ప్రాంతాలలో మీదుగా వెళుతూ సమాచారం ఇస్తుండగా అతని వెంట ట్యాంకర్లు అనుసరిస్తుంటాయి. నిర్దేశించిన ప్రాంతాల యజమానుల వద్దకు వెళ్లి ద్విచక్రవాహనదారుడు డబ్బులు చెల్లించిన తర్వాత అక్కడికి ట్యాంకర్లు తీసుకెళ్లి రసాయనాలను మూసీలోకి వదిలివేస్తున్నారు.

ఇలా వెలుగులోకి..

ప్రస్తుతం వర్షాలు లేకున్నా మూసీలో నీరు ప్రవహించడంతో పాటు దుర్గంధం వెదజల్లుతుండటంతో స్థానిక పీఠాధిపతికి అనుమానం కలిగింది. మూసీలోకి రసాయనాలు వదులుతున్నారనే అనుమానంతో నిఘా పెట్టారు. సోమవారం అర్ధరాత్రి దాటాక బాపుఘాట్ బ్రిడ్జి పక్కన ఇసుక వ్యాపార స్థలంలో మూడు టిప్పర్ల నుంచి మ్యాన్‌హోల్ తెరిచి నదిలోకి రసాయనాలు వదులుతుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. దీంతో రెండు ట్యాంకర్లతో మాఫియా అక్కడి నుంచి ఉడాయించింది. పోలీసులు అక్కడికి చేరుకొని సంబంధిత స్థల యజమానులపై కేసు నమోదు చేశారు. ట్యాంకర్‌ను స్వాధీనం చేసుకుని నిందితుల కోసం గాలిస్తున్నారు.





మూసీలోకి రసాయనాలు వదలడానికి ప్రత్యేక పైపులైన్, విషపూరిత రసాయనాలతో ట్యాంకర్

అనగనగా మెట్రో..

రెండో దశలో 8 లక్షలు.. 2030 నాటికి 10 లక్షల మంది ప్రయాణికులు




మెట్రో రెండో దశ డీపీఆర్ పుస్తకాలతో ఎన్వీఎస్ రెడ్డి..

- వచ్చే జనవరి మొదటి వారంలో పాతబస్తీలో పనులు ప్రారంభం
- నిధుల లభ్యతకు ఇబ్బందులేమీ లేవు
- నాలుగేళ్లలో 5 కారిడార్‌లు పూర్తి
- హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ మెట్రోరైల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి

సాక్షి, సిటీబ్యూరో: మెట్రో రెండోదశ నిర్మాణానికి నిధుల లభ్యతలో ఎలాంటి ఇబ్బంది లేదని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల జాయింట్ వెంచర్‌గా చేపట్టనున్న ఈ ప్రాజెక్టుకు తక్కువ వడ్డీ రేటుకు నిధులు అందజేసేందుకు అంతర్జాతీయ ఆర్థిక సంస్థలు ఆసక్తి చూపిస్తున్నాయని హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ మెట్రోరైల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు. 2028లో రెండో దశ పూర్తయ్యేనాటికి సుమారు 8 లక్షల మంది ప్రయాణికులు మెట్రో సేవలను వినియోగించుకుంటారని.. 2030 నాటికి 10 లక్షలకు చేరే అవకాశం ఉందన్నారు. రెండో దశ కారిడార్‌లలో ప్రయాణికుల డిమాండ్‌పై లీ అసోసియేషన్ సంస్థ రూపొందించిన కాంప్రహెన్సివ్ మొబిలిటీ నివేదిక (సీఎంపీ) ప్రకారం ప్రతిపాదించిన అయిదు కారిడార్‌లలో ప్రయాణికుల డిమాండ్ అత్యధికంగా ఉంటుందన్నారు. హైదరాబాద్ మెట్రోరైల్ మొదట దశ ప్రాజెక్టుకు 7 ఏళ్లు పూర్తయిన (ఈ నెల 28) సందర్భంగా మంగళవారం బేగంపేట్ మెట్రో భవన్‌లో విలేకరులతో ఆయన మాట్లాడారు. ఎన్వీఎస్ రెడ్డి ఏం చెప్పారంటే..

ఏడేళ్లలో 63.40 కోట్ల ప్రయాణికులు..

గత ఏడేళ్లలో నాగోల్– రాయదుర్గం, ఎల్బీనగర్–మియాపూర్, జూబ్లీ బస్టేషన్–ఎంజీబీఎస్ మూడు కారిడార్‌లలో 63.40 కోట్ల మంది ప్రయాణం చేశారు. రోజుకు 5 లక్షల మంది ప్రయాణం చేస్తుండగా.. ఈ ఏడాది ఆగస్టు 14న అత్యధికంగా 5.63 లక్షల మంది ప్రయాణం చేశారు.



రెండో దశ పూర్తిస్థాయిలో అందుబాటు లోకి వస్తే మొదటి, రెండు దశల్లో కలిపి సుమారు 15 లక్షల నుంచి క్రమంగా 20 లక్షలకు పెరిగే అవకాశం ఉంది. వచ్చే డిసెంబరు నెలాఖరుకు పాతబస్తీలో రోడ్డు విస్తరణలో భాగంగా కూల్చివేతలు చేపట్టనున్నాం. వచ్చే ఏడాది జనవరి మొదటి వారంలో రెండో దశ పనులు ప్రారంభమవుతాయి.

జాయింట్ వెంచర్..

- సమాజంలోని అన్ని వర్గాల ప్రయాణ అవసరాలకు అనుగుణంగా రెండో దశ రూట్‌లను ఎంపిక చేశాం. ఇది మొత్తం 6 కారిడార్‌లలో 116.4 కి.మీ. ఉంటుంది. ప్రస్తుతం ఎయిర్‌పోర్ట్ నుంచి ఫోర్త్‌సిటీ మెట్రోకు సర్వే పనులు ప్రారంభించాం. రెండో దశ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల (50: 50) జాయింట్ వెంచర్. ఈ ప్రాజెక్టు డీపీఆర్‌ను ఈ నెల 4న కేంద్రానికి అందజేశారు. కేంద్రం నుంచి అనుమతి లభించిన వెంటనే పనులు మొదలవుతాయి. ప్రస్తుతం 5 కారిడార్‌లలో చేపట్టనున్న 76.4 కి.మీ. కారిడార్‌ల నిర్మాణ వ్యయంలో రాష్ట్ర ప్రభుత్వం రూ.7,313 కోట్లు (30 శాతం), కేంద్రం రూ.4,230 కోట్లు (18 శాతం) చొప్పున అందజేయనున్నాయి. మిగతా 48 శాతం నిధు లు రూ.11,693 కోట్లను ప్రాజెక్ట్ రుణాలుగా కేంద్ర ప్రభుత్వం పూచీకత్తుగా ఇచ్చే సావరిన్ గ్యా రంటీతో జైకా, ఏడీబీ, ఎన్‌డీపీ వంటి మల్టీ లేటరల్ సంస్థల నుంచి సేకరించనున్నారు. మరో 4 శాతం నిధులు రూ.1,033 కోట్లను మాత్రం పీపీపీ విధానంలో సమకూర్చుకుంటారు. రెండోదశలో నిర్మాణ వ్యయం భారీగా తగ్గనుంది.

భూసేకరణ వేగవంతం...

ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు నిర్మించనున్న పాతబస్తీ మెట్రో ప్రాజెక్టులో భూసేకరణ ప్రక్రియ వేగవంతమైంది. రోడ్డు విస్తరణతో 1100 పైగా ఆస్తులు ప్రభావితం కానున్నాయి. వీటిలో ఇప్పటి వరకు 800 ఆస్తుల వివరాలను హైదరాబాద్ జిల్లా కలెక్టర్‌కు అందజేశాం. వాటిలో 200 కట్టడాల తొలగింపునకు ఆయన చర్యలు చేపట్టారు. డిసెంబర్‌లో పరిహారం చెల్లింపుతో పాటు కూల్చివేతలు చేపట్టనున్నారు. ప్రభుత్వ ధరల ప్రకారం అక్కడ గజానికి రూ.23,000 చొప్పున ఉంది. దానికి రెట్టింపుగా ప్రస్తుత మార్కెట్ విలువకు అనుగుణంగా గజానికి రూ.65,000 చొప్పున చెల్లించనున్నారు. మొత్తం ఆస్తుల సేకరణకు సుమారు రూ.700 కోట్ల వరకు ఖర్చయ్యే అవకాశం ఉంది.

3 కోచ్‌లు.. 35 కి.మీ వేగం..

ప్రస్తుతం మొదటి దశలో ఉన్నట్లుగానే రెండో దశలోనూ మెట్రో రైల్‌కు 3 కోచ్‌లు ఉంటాయి. గంటకు 35 కిలోమీటర్ల సగటు వేగంతో రైళ్లు నడుస్తాయి. ప్లాట్‌ఫాంలు మాత్రం 6 కోచ్‌లు నిలిపేందుకు వీలుగా నిర్మిస్తారు.

మెట్రో రెండో దశ అంచనాలు.. 2028 నాటికి ఇలా..

కారిడార్	కిలోమీటర్‌లు	నిర్మాణ వ్యయం (రూ.కోట్లలో)	స్టేషన్‌లు	ప్రయాణికులు
నాగోల్–ఎయిర్‌పోర్ట్	36.8	11,226	24	3,70,000
రాయదుర్గం–కోకాపేట్	11.6	4,318	8	92,000
ఎంజీబీఎస్–చాంద్రాయణగుట్ట	7.5	2,741	6	72,000
మియాపూర్–పటాన్‌చెరు	13.4	4,107	10	1,65,000
ఎల్బీనగర్–హయత్‌నగర్	7.1	1,877	6	97,000
మొత్తం	76.4	రూ.24,269 కోట్లు	54	7,96,000

ప్రాణాల మీదకు తెచ్చిన 'రీల్స్'



ఐసీయూలో చికిత్స పొందుతున్న వివేక్

స్టీరింగ్‌పై ఫోన్ ఉంచి వీక్షించిన ఆటో డ్రైవర్

- ఆగి ఉన్న ట్రాలీ వాహనాన్ని ఢీకొట్టడంతో ప్రమాదం
- ఆరుగురు ఇంజినీరింగ్ విద్యార్థులకు తీవ్ర గాయాలు
- క్షతగాత్రుల్లో డ్రైవర్ సహా ముగ్గురి పరిస్థితి విషమం

లంగర్‌హౌస్: ఆటో స్టీరింగ్‌పై సెల్‌ఫోన్ పెట్టి రీల్స్ చూస్తూ.. చెవిలో ఇయర్ ఫోన్లు పెట్టుకొన్న డ్రైవర్ ఆగిఉన్న ట్రాలీ వాహనాన్ని ఢీకొట్టిన ప్రమాదంలో ఆరుగురు ఇంజినీరింగ్ విద్యార్థులతో పాటు అతడికీ తీవ్ర గాయాలయ్యాయి. వీరిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉంది. మంగళవారం గోల్కొండ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈ ఘటన చోటుచేసుకుంది. ప్రత్యక్ష సాక్షులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండకు చెందిన కార్తీక్, సంగారెడ్డికి చెందిన తరుణ్ రెడ్డి, సాత్విక్, ఖమ్మంలో నివాసం ఉండే స్వరాజ్, ఆసిఫాబాద్‌కు చెందిన హరికృష్ణ ప్రాణ స్నేహితులు. వీరు ఇబ్రహీంబాగ్‌లోని వాసవీ ఇంజినీరింగ్ కళాశాలలో ఈసీఈ మూడో సంవత్సరం చదువుతున్నారు. మహబూబాబాద్‌కు చెందిన వివేక్ మెకానికల్ ఇంజినీరింగ్‌లో ఈ ఏడాది చేరాడు. వీరు లంగర్‌హౌస్ బాపునగర్‌లోని పీఎస్ఆర్ హాస్టల్‌లో.. వివేక్ తన తల్లితో కలిసి అద్దె ఇంట్లో ఉంటున్నారు. వీరు మంగళవారం ఉదయం 11 గంటలకు పరీక్షలు రాయాల్సి ఉండటంతో లంగర్‌హౌస్ బాపుఘాట్ వద్ద ఆటోలో బయల్దేరారు. రాందేవ్‌గూడ సమీపంలోకి రాగానే రోడ్డు మధ్యలో డివైడర్ పక్కనే ఓ ఆటో ట్రాలీ నిలిచి ఉంది. విద్యార్థులున్న ఆటో వేగంగా వచ్చి వెనక నుంచి ఆటో ట్రాలీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వివేక్, కార్తీక్, ఆటో డ్రైవర్ మల్లేష్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ముగ్గురి పరిస్థితి విషమంగా ఉంది. మరో నలుగురు విద్యార్థుల పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు.



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన ఆటో

ఆటో డ్రైవర్ నిర్లక్ష్యమే కారణం: క్షతగాత్రులు

ఆటో డ్రైవర్ నిర్లక్ష్యం వల్లే ప్రమాదం చోటుచేసుకుందని ప్రమాదంలో గాయపడి కోలుకుంటున్న విద్యార్థులు తెలిపారు. ప్రమాదానికి ముందు ఆటో డ్రైవర్ స్టీరింగ్‌పై సెల్‌ఫోన్‌లో రీల్స్ చూస్తున్నాడని, చెవిలో ఇయర్ ఫోన్స్ పెట్టుకున్నాడని క్షతగాత్రులు తెలిపారు. రోడ్డుపై ఆటో ట్రాలీ ఆగిఉన్న విషయం తాము గమనించి అరిచినా.. డ్రైవర్ చెవుల్లో ఇయర్ ఫోన్స్ ఉండటంతో వినిపించలేదని.. అతని కళ్లు రీల్స్‌పై ఉండటంతో అంతే వేగంగా దూసుకెళ్లి ఆటో ట్రాలీని ఢీకొన్నట్లు విద్యార్థులు తెలిపారు. ఆటో డ్రైవర్ మల్లేష్‌ను చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు.

ప్రజారోగ్యమే ప్రధాన ధ్యేయం



మేయర్

సాక్షి, సిటీబ్యూరో: ఆహార పదార్థాల భద్రత, నాణ్యతను కాపాడే ఉద్దేశంతోనే హోటళ్లు, రెస్టారెంట్లను ఆకస్మికంగా తనిఖీ చేస్తున్నట్లు జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి తెలిపారు. ఇటీవల చాదర్‌ఘాట్‌లోని ఆజాద్ మార్కెట్‌లో ఆకస్మిక తనిఖీ చేపట్టగా రెండు డ్రెస్డ్ చికెన్ షాపులు అత్యంత అపరిశుభ్ర పరిస్థితుల్లో నిర్వహిస్తున్నట్లు, అక్కడ ఎలుకలు తిరుగుతున్నట్లు గమనించామన్నారు. వెంటనే జీహెచ్ఎంసీ అధికారులకు ఆ షాపులను మూసివేయాలని ఆదేశించినట్లు తెలిపారు. సర్కిల్–14 డిప్యూటీ కమిషనర్, అసిస్టెంట్ మెడికల్ ఆఫీసర్ ఆఫ్ హెల్త్, వెటర్నరీ డిప్యూటీ డైరెక్టర్, అసిస్టెంట్ డైరెక్టర్, వెటర్నరీ ఆఫీసర్, సర్కిల్–14 జీహెచ్ఎంసీ అధికారుల బృందం చికెన్ షాపుల్లో ఇటీవల తనిఖీలు చేపట్టాయని మేయర్ పేర్కొన్నారు. అధికారులు స్వాధీనం చేసుకున్న అపరిశుభ్ర డ్రెస్డ్ చికెన్, లివర్ పదార్థాలను కొందరు దుండగులు బలవంతంగా తీసుకుపోయారని ఆమె తెలిపారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. పబ్లిక్ హెల్త్ నిబంధనలను ఉల్లంఘించిన రెండు షాపుల యజమానులకు ఇటీవల గోషామహల్ సర్కిల్ వెటర్నరీ ఆఫీసర్ నోటీసులు జారీ చేశారని పేర్కొన్నారు. జీహెచ్ఎంసీలోని అన్ని వ్యాపార స్థావరాలు, షాపుల యజమానులు శుభ్రత, ఆహార నాణ్యత ప్రమాణాలు పాటించాలని సూచించారు. నగర ప్రజల ఆరోగ్యం కోసం జీహెచ్ఎంసీ కట్టుబడి ఉంటుందని మేయర్ విజయలక్ష్మి ఉద్ఘాటించారు.



పరిశ్రమ భవనాన్ని అలుముకున్న దట్టమైన పొగలు

ఫ్యాబ్స్ పరిశ్రమలో భారీ అగ్ని ప్రమాదం

మంటలతో కుప్పకూలిన ఓ భవనం

- దట్టమైన పొగలతో పరిసరాలు భయానకం
- బయటికి పరుగులు తీసి ప్రాణాలు దక్కించుకున్న కార్మికులు
- ఘటనా స్థలికి 8 ఫైరింజన్లు.. ఒక బ్రాంటోస్కైలిఫ్ట్
- అర్ధరాత్రి వరకూ అదుపులోకి రాని మంటలు
- పెద్ద ఎత్తున ఆస్తి నష్టం వాటిల్లినట్లు అంచనా

జీడిమెట్ల: జీడిమెట్ల దూలపల్లి రోడ్డులోని ఎస్ఎస్‌వీ ఫ్యాబ్స్ పరిశ్రమలో భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. మంటల తాకిడికి పరిశ్రమలోని మూడు ఫ్లోర్లు దగ్ధమయ్యాయి. ఓ భవనం కుప్పకూలింది. అగ్నిప్రమాదం సంభవించగానే పరిశ్రమలోని కార్మికులంతా బయటకు పరుగులు తీసి ప్రాణాలు దక్కించుకున్నారు. పోలీసులు, స్థానికులు, అగ్నిమాపక శాఖ అధికారులు చెప్పిన వివరాల ప్రకారం.. జీడిమెట్ల ఫేజ్–5 దూలపల్లి రోడ్డులో సిరాజుద్దీన్ అనే వ్యక్తి ఎస్ఎస్‌వీ ఫ్యాబ్స్ పేరిట ప్లాస్టిక్ బ్యాగులు తయారు చేసే పరిశ్రమను నడుపుతున్నాడు. పరిశ్రమ గ్రౌండ్ ఫ్లోర్ సహా మరో రెండు ఫ్లోర్లు ఉండగా ఆపైన పెద్ద రేకుల షెడ్డు నిర్మించారు. పరిశ్రమలో మొత్తం 500 మంది కార్మికులు ఉండగా.. మంగళవారం జనరల్ షిఫ్ట్‌లో దాదాపు 200 మంది ఉన్నారు. మధ్యాహ్నం పరిశ్రమ మూడో అంతస్తులోని రేకుల షెడ్డులో కొంతమంది కార్మికులు ఆర్పీ (రీప్రాసెసింగ్) మెషీన్ వద్ద పనులు చేస్తున్నారు. 12.30 గంటల ప్రాంతంలో రేకుల షెడ్డులో ఒక్కసారిగా మంటలు అంటుకున్నాయి. కార్మికులు బతుకు జీవుడా అంటూ కిందకు పరుగులు తీశారు.

శ్రమించిన 50 మంది ఫైర్ సిబ్బంది..

సమాచారం అందుకున్న జీడిమెట్ల అగ్నిమాపక శాఖ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. అప్పటికే అక్కడ పెద్ద ఎత్తున ప్లాస్టిక్ నిల్వలు ఉండటంతో భారీగా మంటలు అలుముకున్నాయి. ప్రమాద తీవ్రతను గమనించిన అగ్నిమాపక శాఖ అధికారి శేఖర్‌రెడ్డి ఉన్నతాధికారులకు వివరించడంతో 8 వాహనాలు పరిశ్రమ వద్దకు చేరుకున్నాయి. దాదాపు అయిదు ఫైర్ స్టేషన్‌ల నుంచి వచ్చిన 50 మందికి పైగా అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పేందుకు తీవ్రంగా శ్రమించారు. మూడో అంతస్తులోకి నీటిని చిమ్మడం కష్టంగా మారడంతో బ్రాంటోస్కైలిఫ్ట్‌ను తెప్పించారు. మంటలు అర్ధరాత్రి వరకు కూడా అదుపులోకి రాలేదు.

పైనుంచి కింది అంతస్తు వరకు వ్యాపించిన మంటలు..

పరిశ్రమ విశాలంగా ఉండటంతో పాటు లోపల పెద్ద ఎత్తున ప్లాస్టిక్ బ్యాగులు నిల్వ ఉన్నాయి. పైన ఆర్పీ యంత్రం వద్ద అంటుకున్న మంటలు ఒక్కో అంతస్తు నుంచి నేరుగా కింది అంతస్తు వరకు వ్యాపించాయి. పరిశ్రమ భవనం మంటల తాకిడికి రెండో అంతస్తు గోడలు కూలిపోయాయి. అగ్ని ప్రమాదం సమాచారం అందడంతో ఘటనా స్థలికి బాలానగర్ ఏసీపీ హన్మంతరావు, జీడిమెట్ల ఇన్‌స్పెక్టర్ గడ్డం మల్లేష్, ఎస్ఐలు చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తోనే అగ్ని ప్రమాదం సంభవించినట్లు తెలుస్తోంది.



బ్రాంటోస్కైలిఫ్ట్‌తో మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది



ఘటనా స్థలి వద్ద పోలీసులు

సీపీ ఆన్ స్ట్రీట్!

- ఆపరేషన్ రోప్ కోసం రంగంలోకి కొత్వాల్
- ట్రాఫిక్ జామ్స్ తగ్గించడమే లక్ష్యంగా ముందుకు..
- షేక్‌పేట–టోలిచౌకి మధ్య స్వయంగా నిర్వహణ


ఆక్రమణలను పరిశీలిస్తున్న సీపీ ఆనంద్

సాక్షి, సిటీబ్యూరో: రాజధానిలోని రోడ్లపై ట్రాఫిక్ జామ్స్ తగ్గించడంతో పాటు అక్రమ పార్కింగ్ నిరోధం, ఆక్రమణల తొలగింపునకు ఉద్దేశించిన ఆపరేషన్ రిమూవల్ ఆఫ్ అబ్‌స్ట్రక్టివ్ పార్కింగ్ అండ్ ఎక్రోజ్‌మెంట్స్‌ను (రోప్) ట్రాఫిక్ విభాగం పునఃప్రారంభించింది. దీనికోసం స్వయంగా రంగంలోకి దిగిన కొత్వాల్ సీవీ ఆనంద్ మంగళవారం దాదాపు రెండు గంటల పాటు పర్యవేక్షించారు. నగర కమిషనరేట్ సరిహద్దు అయిన వెస్ట్‌జోన్‌లోని షేక్‌పేట నుంచి టోలిచౌకి రోడ్డు పక్కన, ఫుట్‌పాత్‌లపై ఉన్న ఆక్రమణల్ని తొలగించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట అదనపు సీపీ (ట్రాఫిక్) పి.విశ్వప్రసాద్, డీసీపీ (ట్రాఫిక్) వెంకటేశ్వర్లు సైతం ఉన్నారు.

ఆక్రమిస్తుంటే ఏం చేస్తున్నారని ఆగ్రహం..

నగర పోలీసులు వాస్తవానికి గత వారమే ఈ ఆక్రమణల తొలగింపు కార్యక్రమం చేపట్టాలని భావించారు. అయితే ఏళ్లుగా రోడ్ల పక్కన, ఫుట్‌పాత్‌లపై తాత్కాలిక నిర్మాణాలు చేసుకుని చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుంటున్న వారికి కొంత సమయం ఇవ్వాలని కొత్వాల్ నిర్ణయించారు. దీంతో స్థానిక అధికారుల ద్వారా వారికి నోటీసులు జారీ చేయించి సమయం ఇచ్చిన తర్వాత మంగళవారం తొలగింపు ప్రక్రియ చేపట్టారు. ఈ చిరు వ్యాపారులతో మాట్లాడిన ఆనంద్ కొందరు దాదాపు ఏడెనిమిదేళ్లుగా, మరికొందరు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి కొత్తగా అక్కడ వ్యాపారాలు చేసుకుంటున్నట్లు తెలుసుకున్నారు. దీంతో స్థానిక ట్రాఫిక్ పోలీసులను ఉద్దేశించిన కమిషనర్ 'ఇలా ఫుట్‌పాత్‌లు ఆక్రమణలకు గురవుతుంటే ఏం చేస్తున్నారు? ట్రాఫిక్ చీఫ్‌తో పాటు నేను వచ్చే వరకు స్పందించరా?' అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.

బడా వ్యాపారులను నిలదీసిన కొత్వాల్..

టోలిచౌకి ప్రాంతంలో రోడ్డుకు సమాంతరంగా సైకిల్ ట్రాక్ నిర్మించాలని గతంలో భావించారు. అయితే అక్కడ ఉన్న పరిస్థితుల నేపథ్యంలో ఇది పూర్తి స్థాయిలో కార్యరూపంలోకి రాలేదు. కొన్ని చోట్ల మాత్రమే పాక్షిక నిర్మాణం జరిగింది. దీని కారణంగా దాదాపు పది అడుగుల రోడ్డు నిరుపయోగం కావడంతో పాటు అక్రమ పార్కింగ్‌కు కేరాఫ్ అడ్రస్‌గా మారిందని కొత్వాల్ ఆనంద్ గుర్తించారు. దీంతో జీహెచ్ఎంసీ అధికారుల సాయంతో దాన్ని తొలగించి రోడ్డు విస్తరణ చేపట్టాలని ఆదేశించారు. ఈ ప్రాంతంలో ఉన్న కొందరు బడా వ్యాపారులు సైతం తమ ఎదురుగా ఉన్న ఫుట్‌పాత్‌లు ఆక్రమించడం, చిరు వ్యాపారులకు అద్దెకు ఇవ్వడం, పార్కింగ్‌కు వినియోగించుకోవడం చేస్తున్నట్లు తెలుసుకున్న ఆనంద్ వారినీ నిలదీశారు. ట్రాఫిక్ విభాగం అధికారులు గడిచిన 15 రోజుల స్పెషల్ డ్రైవ్‌లో స్వాధీనం చేసుకున్న 1500 సైరన్లు, ఫ్యాన్సీ హారన్లను రోడ్ రోలర్‌తో ధ్వంసం చేశారు.

ప్రజలు, నాయకులు సహకరించాలి

ఆపరేషన్ రోప్ విజయవంతం కావడానికి స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులతో పాటు ప్రజలు పోలీసులకు సహకరించాలని సీపీ ఆనంద్ ఈ సందర్భంగా కోరారు. ఈ మేరకు ముందుకు రావాలని అందరికీ పిలుపు ఇస్తున్నట్లు చెప్పారు. స్థానిక ఎమ్మెల్యే కౌసర్ సైతం ఈ కార్యక్రమానికి వస్తానని చెప్పారని, అయితే ఎందుకో ఇప్పుడు రాలేదన్నారు. 'ఫుట్‌పాత్‌లు ఆక్రమించిన చిరువ్యాపారులు తాము పేదలమని, ఎలా బతకాలని అంటున్నారు. ఆక్రమణలు తొలగించాలంటే కొంత మంది అడ్డు పడుతున్నారు. ఇది పేదరికానికి సంబంధించిన విషయం కాదు. వేల మంది ఎదుర్కొంటున్న ట్రాఫిక్ ఇబ్బంది' అని సీపీ పేర్కొన్నారు. ప్రజలంతా సహకరిస్తేనే నగరంలో ట్రాఫిక్ నియంత్రణ సాధ్యమవుతుందన్నారు.

'రైల్వే' కిల్లర్!

- ఎక్స్‌ప్రెస్ రైళ్లల్లోని దివ్యాంగుల బోగీలో సంచారం
- 35 రోజుల్లో ఐదు రాష్ట్రాల్లో అత్యాచారాలు, హత్యలు
- నిందితుడిని పట్టుకున్న గుజరాత్‌లోని వల్సాడ్ కాప్స్
- సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో హత్య చేసినట్లు అంగీకారం
- పీటీ వారెంట్‌పై ఇక్కడకు తీసుకురానున్న రైల్వే పోలీసులు


కరమ్‌వీర్ జాట్

సాక్షి, సిటీబ్యూరో: అతడి పేరు భోలో కరమ్‌వీర్ జాట్ అలియాస్ రాహుల్..స్వస్థలం హర్యానాలోని రోహ్‌తక్‌లో ఉన్న మోక్రా ఖాస్...గతంలో రాజస్థాన్, హర్యానా, ఉత్తరప్రదేశ్‌ల్లో నేరాలు చేశాడు. ఇటీవల 'రైల్వే' కిల్లర్‌గా మారాడు. ఈ ఏడాది అక్టోబర్ 17 నుంచి ఆదివారం (ఈ నెల 24) మధ్య 35 రోజుల్లో ఎక్స్‌ప్రెస్ రైళ్లల్లో సంచరిస్తూ ఐదు రాష్ట్రాల్లో ఐదు మర్డర్లు చేశాడు. వీటిలో కొన్ని సొత్తు కోసమైతే..మరికొన్ని అత్యాచారం, హత్యలు. గుజరాత్‌లోని వల్సాడ్ పోలీసులు ఈ నరహంతకుడిని సోమవారం పట్టుకున్నారు. విచారణలో ఆఖరి ఘాతుకాన్ని ఆదివారం ఉదయం సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో చేసినట్లు వెలుగులోకి వచ్చింది. ఈ మేరకు సికింద్రాబాద్ జీఆర్పీ అధికారులకు వల్సాడ్ పోలీసులు సమాచారం ఇచ్చారు. దీంతో పీటీ వారెంట్‌పై కరమ్‌వీర్‌ను నగరానికి తీసుకురావడానికి పోలీసులు సన్నాహాలు చేస్తున్నారు. వల్సాడ్ ఎస్పీ డాక్టర్ కరణ్ రాజ్ సింగ్ వాఘేలాను మంగళవారం 'సాక్షి' ఫోన్ ద్వారా సంప్రదించింది. ఆయన ఈ సీరియల్ కిల్లర్ పూర్వాపరాలు వెల్లడించారు.

చిన్ననాటి నుంచి చిత్రమైన ప్రవర్తన..

హర్యానాలోని వ్యవసాయ కుటుంబంలో పుట్టిన రాహుల్‌కు ఎడమ కాలికి పోలియో సోకింది. ఫలితంగా చిన్నతనం నుంచి ఆటపాటలకు దూరంగా ఉంటూ ఒంటరిగా ఉండేవాడు. విపరీతమైన భావాలు, చిత్రమైన ప్రవర్తన కలిగి ఉండేవాడటంతో కుటుంబం దూరంగా పెట్టింది. ఐదో తరగతితో చదువుకు స్వస్తి చెప్పిన రాహుల్ లారీ క్లీనర్‌గా పని చేస్తూ డ్రైవింగ్ నేర్చుకున్నాడు. అయితే పోలియో కారణంగా ఇతడికి ఎవరూ డ్రైవర్‌గా ఉద్యోగం ఇవ్వలేదు. దీంతో హైవే దాబాలో కార్మికుడిగా మారిన రాహుల్... అక్కడ పార్క్ చేసి ఉన్న లారీలను తస్కరించడం మొదలెట్టాడు. దీంతో పాటు లూటీలు, కిడ్నాప్‌లకు పాల్పడ్డాడు. ఈ ఆరోపణలపై రాజస్థాన్, హర్యానా, ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్‌ల్లో 13 కేసులు నమోదయ్యాయి. ఈ ఏడాది మే వరకు రాజస్థాన్‌లోని జోధ్‌పూర్ జైల్లో గడిపిన రాహుల్ బెయిల్‌పై విడుదలయ్యాడు. అక్కడ నుంచి గుజరాత్‌లోని ఉద్వాడ పట్టణానికి చేరుకుని ఓ హోటల్‌లో కార్మికుడిగా చేరాడు. కొన్ని రోజులు పని చేసి వాపి ప్రాంతానికి చేరుకుని ఫుట్‌పాత్స్ పైన గడిపాడు.

ఆ అవకాశాన్ని దుర్వినియోగం చేసుకుని..

వివిధ రైళ్లలో దివ్యాంగుల కోసం చివరలో ప్రత్యేక బోగీలు ఉంటాయి. వీటిలో ప్రయాణించే దివ్యాంగులను సాధారణంగా టీసీలు సైతం తనిఖీ చేయరు. పాసులు కలిగి ఉంటారనే ఉద్దేశంలోనే వదిలేస్తుంటారు. దీన్ని తనకు అనువుగా మార్చుకున్న రాహుల్ ఎక్స్‌ప్రెస్ రైళ్లల్లోని దివ్యాంగుల బోగీల్లో ఎక్కి దేశం మొత్తం తిరగడం ప్రారంభించాడు. ఈ ఏడాది జూన్ రెండో వారం నుంచి ఇలా దేశ సంచారం చేస్తున్న రాహుల్ అక్టోబర్ 17న తొలి హత్య చేశాడు. ఆ రోజు బెంగళూరు–మురుదేశ్వర్ రైలులో ప్రయాణిస్తుండగా బీడీ కాల్చడంపై తోటి ప్రయాణికుడు అభ్యంతరం చెప్పాడు. దీంతో విచక్షణకోల్పోయిన రాహుల్ గొంతు నులిమి చంపేశాడు. ఆపై అతడి వద్ద ఉన్న సొత్తు, సొమ్ము తీసుకుని రైలు దిగిపోయాడు. దీనిపై మంగుళూరులో ఉన్న ముల్కీ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది.

వరుసపెట్టి మరో నాలుగు హత్యలు..

ఆపై కతిహార్ ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణించిన రాహుల్ పశ్చిమ బెంగాల్‌లోని హౌరా స్టేషన్‌లో మరో వృద్ధుడి గొంతు కోసి చంపి దోపిడీకి పాల్పడ్డాడు. పుణే–కన్యాకుమారి ఎక్స్‌ప్రెస్‌లో మరో మహిళపై అత్యాచారం చేసి, కత్తితో గొంతు కోసి హత్య చేశాడు. వీటిపై ఆయా ఠాణాలో కేసులు నమోదయ్యాయి. ఈ నెల 14న ఉద్వాడలో తాను పని చేసిన హోటల్‌కు వెళ్లి జీతం తీసుకోవాలని భావించాడు. అక్కడకు వచ్చిన రాహుల్‌కు స్టేషన్ ప్లాట్‌ఫామ్‌పై ఒంటరిగా సంచరిస్తున్న యువతి కనిపించింది. ఆమెను సమీపంలోని మామిడి తోటలోకి లాక్కెళ్లి, అత్యా చారం చేసి చంపేశాడు. దీనిపై కేసు నమోదు చేసుకున్న వల్సాడ్ పోలీసులు ఘటనాస్థలిలో లభించిన బ్యాగ్ ఆధారంగా దర్యాప్తు ప్రారంభించారు. వివిధ రైల్వేస్టేషన్లలోని 2500 సీసీ కెమెరాల్లో ఫీడ్‌ను అధ్యయనం చేసి నిందితుడిని గుర్తించారు. ఉద్వాడ నుంచి రైలులో ఆంధ్రప్రదేశ్‌లోని మచిలీపట్నం చేరుకున్న రాహుల్ అట్నుంచి షిర్డీ, ఆపై బాంద్రా చేరుకున్నాడు.

సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో మహిళ హత్య..

అక్కడ నుంచి సికింద్రాబాద్ వచ్చిన రాహుల్ ఆదివారం తెల్లవారుజామున రైలు దిగాడు. ఆ సమయంలో తొమ్మిదో నెంబర్ ప్లాట్‌ఫామ్‌పై మంగుళూరు స్పెషల్ ఎక్స్‌ప్రెస్ ఆగి ఉంది. దాని సీట్ కమ్ లగేజ్ ర్యాక్ (ఎస్ఎల్ఆర్) కోచ్‌లో ఓ మహిళ ఒంటరిగా ఉండటం గమనించాడు. ఆమెను గొంతునులిమి చంపేసిన రాహుల్ నగదు, సెల్‌ఫోన్ తస్కరించాడు. అక్కడ నుంచి రైలులోనే ఉడాయించాడు. ఈ హత్యపై సికింద్రాబాద్ జీఆర్పీ అధికారులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. వివిధ రైళ్లు మారిన రాహుల్ బాంద్రా–భుజ్ ఎక్స్‌ప్రెస్‌లో సోమవారం గుజరాత్‌లోని వాపి చేరుకున్నాడు. అప్పటికే ఇతడి కదలికలు సాంకేతికంగా గమనిస్తున్న వల్సాడ్ పోలీసులు అక్కడ వలపన్ని పట్టుకున్నారు. అతడి నుంచి సికింద్రాబాద్‌లో చంపిన మహిళ నుంచి తీసుకున్న సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. ఇతడి అరెస్టుపై సికింద్రాబాద్ జీఆర్పీ పోలీసులకు సమాచారం ఇచ్చారు.

రేపు నీటి సరఫరాలో అంతరాయం

సాక్షి, సిటీబ్యూరో: ఆలియాబాద్ రిజర్వాయర్‌లోని 33/11 కేవీ పంపింగ్ స్టేషన్‌లో విద్యుత్ నిర్వహణ పనులు నేపథ్యంలో ఈ నెల 28న గురువారం రిజర్వాయర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో నీటి సరఫరా నిలిపివేస్తున్నట్లు జలమండలి అధికారులు తెలిపారు. బాదం మసీదు, బాలాగంజ్, మహంకాళి టెంపుల్, లాల్ దర్వాజ, మిత్ర క్లబ్, చత్రినాక, గాంధీ విగ్రహం, శ్రీనివాస్ హైస్కూల్ ప్రాంతం, శ్రీరామ్ నగర్, పాండురంగ రావ్ వీధి, సీబీబీ క్వార్టర్స్, హరిజన్ బస్తీ, గౌలిపుర, మేకల మండి, సర్దార్ పటేల్ నగర్, లక్ష్మీ నగర్, హమామ్ బౌలి, బోయిగూడ, కందికల్ గేట్, డీకే కాలనీ, రాజన్న బౌలి, ఖాద్రి చమన్ ఏరియాల్లో నీటి సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. వినియోగదారులు నీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు.

మందుల కొరత లేదు..

'సాక్షి' కథనంపై తెలంగాణ మెడికల్ సర్వీసెస్ స్పందన

సాక్షి, సిటీబ్యూరో: 'దగ్గు, జలుబు మందులూ కరువే' అన్న శీర్షికతో 'సాక్షి'లో ప్రచురితమైన కథనంపై తెలంగాణ మెడికల్ సర్వీసెస్ స్పందించింది. అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో సరిపడా మందులు ఉన్నాయని సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. సీఎంఎస్ హైదరాబాద్, సీఎంఎస్ రంగారెడ్డిలో అన్ని రకాల జబ్బులకు సంబంధించిన మందులు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. రాంటిడిన్, క్లోర్‌ఫెనిరమైన్ మాలియేట్ మందులు ఏఎంఎల్ మెడిసిన్ జాబితాలోలేవని వివరించారు. మందులు అయిపోయిన వెంటనే సంబంధిత సీఎంఎస్ స్టోర్స్ నుంచి తెప్పించుకుంటున్నట్లు పేర్కొన్నారు.

నిమ్స్ వైద్యుడికి అరుదైన గౌరవం


ఫెలోషిప్ అందుకుంటున్న డాక్టర్ శ్రీభూషణ్‌రాజు

సాక్షి, సిటీబ్యూరో: నిమ్స్‌లో నెఫ్రాలజీ విభాగాధిపతి డాక్టర్ శ్రీ భూషణ్‌రాజుకు ప్రతిష్టాత్మక మెడికల్ శాస్త్రవేత్తగా ఫెలోషిప్ దక్కింది. మంగళవారం ఎయిమ్స్–జోధ్‌పూర్‌లో జరిగిన నేషనల్ అకాడమీ ఆఫ్ మెడికల్ సైన్సెస్ 64వ స్నాతకోత్సవంలో ఈ ఫెలోషిప్‌ను ఆయన అందుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ కూడా పాల్గొన్నారు.

రెండు ఎస్టీపీలను సందర్శించిన ఈడీ

సాక్షి, సిటీబ్యూరో: ఎస్టీపీ ప్రాజెక్టులో భాగంగా నిర్మిస్తున్న రెండు మురుగు నీటి శుద్ధి కేంద్రాలను మంగళవారం జలమండలి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మయాంక్ మిట్టల్ సందర్శించారు. 320 ఎంఎల్డీ సామర్థ్యంతో నాగోల్‌లో, 10 ఎంఎల్డీ సామర్థ్యంతో వెన్నెల గడ్డలో నిర్మిస్తున్న ఎస్టీపీలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా నిర్మాణ పనుల్ని పరిశీలించి..ఎస్టీపీ ప్రాంగణంలో ఆహ్లాదకర వాతావరణం కోసం సుందరీకరణ పనులు చేపట్టాలని తెలిపారు. ముగింపు దశలో ఉన్న పనుల్ని వేగంగా పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ఆపరేషన్స్–1 సుదర్శన్, ఎస్టీపీ సీజీఎం పద్మజ, జీఎం సత్యనారాయణ, అధికారులు, నిర్మాణ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

గ్రేటర్‌లో సర్వే 81.96 శాతం పూర్తి

సాక్షి, సిటీబ్యూరో: సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే 81.96 శాతం పూర్తి అయిందని జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి తెలిపారు. ఇప్పటి వరకు 19,62,959 కుటుంబాల సర్వే నిర్వహించినట్లు పేర్కొన్నారు. వివరాలను డేటా ఎంట్రీకి అవసరమైన ఆపరేటర్లను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఏజెన్సీ నియమించిన ఆపరేటర్లకు సరైన శిక్షణ ఇచ్చి కుటుంబ సర్వే వివరాలను తప్పులు లేకుండా ఆన్‌లైన్‌లో నమోదు చేయించాలన్నారు.

హైదరాబాద్ మెట్రోకు త్వరలో నాగపూర్ కోచ్‌లు

సాక్షి, సిటీబ్యూరో: ప్రయాణికుల రద్దీకనుగుణంగా అదనపు కోచ్‌లను ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టినట్లు హైదరాబాద్ మెట్రోరైల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు. ప్రస్తుతం మూడు కారిడార్లలో మూడు కోచ్‌లతో మెట్రో రైళ్లు నడుస్తున్న సంగతి తెలిసిందే.రోజుకు 5 లక్షల మందికి పైగా రాకపోకలు సాగిస్తున్నారు. మియాపూర్–ఎల్బీనగర్, నాగోల్–రాయదుర్గం కారిడార్‌లలో ప్రయాణికుల రద్దీ అత్యధికంగా ఉంటుంది. దీంతో ఈ కారిడార్‌లలో కోచ్‌ల సంఖ్య పెంచాలనే ప్రతిపాదన చాలాకాలంగా ఉంది. ఈ మేరకు నాగ్‌పూర్ మెట్రో రైల్ నుంచి అద్దె ప్రాతిపదికను తెప్పించనున్నట్లు ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు. రోజురోజుకు ప్రయాణికుల రద్దీ పెరుగుతున్న దృష్ట్యా 4వ కోచ్‌ను ఏర్పాటు చేయాలని భావిస్తున్నట్లు పేర్కొన్నారు.

3వ స్థానానికి పడిపోయిన హెచ్ఎంఆర్..

హైదరాబాద్ మెట్రోరైల్ 3వ స్థానానికి పడిపోయింది. మొదట్లో ఢిల్లీ మెట్రో తరువాత హైదరాబాద్ మెట్రో రెండో స్థానంలో నిలిచింది. గత పదేళ్లలో మెట్రో విస్తరణకు చర్యలు చేపట్టలేదు. అదేసమయంలో ఇతర నగరాల్లో రెండు, మూడో దశ మెట్రో ప్రాజెక్టుల నిర్మాణం కొనసాగుతోంది. ప్రస్తుతం 415 కిలోమీటర్‌ల నెట్‌వర్క్‌తో ఢిల్లీ మొదటిస్థానంలో ఉండగా, 74 కిలోమీటర్‌లతో బెంగళూర్ 2వ స్థానాన్ని ఆక్రమించింది. 69 కిలో మీటర్‌లతో హైదరాబాద్ 3వ స్థానానికి పరిమితమైంది.

సోషల్ మీడియాపై ఆంక్షలు రాజ్యాంగ విరుద్ధం


డాక్టర్ సుదర్శన్

సాక్షి, సిటీబ్యూరో: సోషల్ మీడియాపై ఆంక్షలు విధించడం ముమ్మాటికీ రాజ్యాంగ వ్యతిరేకమేనని రాజకీయ వ్యూహకర్త, సెంటర్ ఫర్ పొలిటికల్ రీసెర్చ్–స్ట్రాటెజీ (సీపీఆర్ఎస్) వ్యవస్థాపకుడు డాక్టర్ మామిడి సుదర్శన్ అన్నారు. సోషల్ మీడియాలో ప్రశ్నించడానికి, దూషించడానికి మధ్య ఉన్న సున్నితమైన తేడాను గమనించలేకపోవటం ప్రభుత్వ పెద్దల వైఫల్యమన్నారు. రాజకీయ పార్టీల కరపత్రాలు, మౌత్ పీస్‌లుగా మారి ప్రజలకు తప్పుడు సమాచారం అందిస్తున్న కొన్ని పత్రికలు, టీవీలను ప్రజలు చీదరించుకొని వాస్తవాలు చెప్పడం కోసం సోషల్ మీడియా వైపు మళ్లుతుంటే అక్కసుతోనే ఆంక్షలు విధిస్తున్నారని విమర్శించారు. ఒకరిద్దరు అసభ్యకర పోస్టులు పెడితే రౌడీలు, స్మగ్లింగ్ చేసే వారిపై పెట్టినట్టు పీడీ యాక్ట్ పెట్టడం ఏంటని ప్రశ్నించారు. స్వీయ నియంత్రణ పాటించాలని సుప్రీంకోర్టు అనేక సందర్భాలలో మీడియాను హెచ్చరించినప్పటికి తెలుగు రాష్ట్రాలలో కొందరు మీడియాను వ్యాపార వస్తువుగా మార్చారని దుయ్యబట్టారు.

ఆహార భద్రతలో గోధుమ మిల్లింగ్ కీలకం

డబ్ల్యూపీపీఎస్ సదస్సులో నిపుణులు



సదస్సులో పాల్గొన్న గోధుమ మిల్లింగ్ ఇండస్ట్రీ నిపుణులు

సనత్‌నగర్: ప్రపంచ ఆహార భద్రతలో గోధుమ మిల్లింగ్ రంగం కీలకమని, అయితే ఆహార భద్రత డిమాండ్ కారణంగా ఆ ఇండస్ట్రీపై తీవ్ర ఒత్తిడి పెరుగుతుందని పలువురు నిపుణులు స్పష్టం చేశారు. సాంకేతిక ఆవిష్కరణలు జరిగినప్పుడే ఆ రంగంలోని సవాళ్లను ధీటుగా ఎదుర్కోగలమని అభిప్రాయపడ్డారు. వీట్ ప్రొడక్ట్స్ ప్రమోషన్ సొసైటీ (డబ్ల్యూపీపీఎస్) ఆధ్వర్యంలో బేగంపేటలోని తాజ్ వివంతా హోటల్‌లో మంగళవారం జరిగిన సదస్సులో 100 మందికిపైగా గోధుమ పరిశ్రమ రంగ నిపుణులు, ఉత్పత్తిదారులు హాజరై పలు కీలక అంశాలపై చర్చించారు. ధాన్యం నిల్వ పద్ధతుల్లో వచ్చిన మార్పులు, పెస్ట్ కంట్రోల్‌లో సరికొత్త పోకడలు, సాంకేతిక ఆవిష్కరణల దిశగా ఈ సదస్సు కొనసాగింది. ముఖ్యఅతిథిగా హాజరైన తెలంగాణ ఆహార భద్రత కమిషనర్, ఐఏఎస్ అధికారి ఆర్వీ కర్ణన్ మాట్లాడుతూ ప్రపంచ ఆహార భద్రత అవసరాలను తీర్చడంలో ఏకీకృత విధానం రావాలని పిలుపునిచ్చారు. ఆహార భద్రతా ప్రమాణాల మేరకు గోధుమ మిల్లింగ్ ఇండస్ట్రీ సుస్థిరత సాధించేందుకు వినూత్నమైన పెస్ట్ మేనేజ్‌మెంట్ పద్ధతులు చాలా ముఖ్యమన్నారు. తెలంగాణ రోలర్ ఫ్లోర్ మిల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మనీష్‌గుప్తా మాట్లాడుతూ గోధుమ మిల్లింగ్ పరిశ్రమలో స్థిరమైన విధానాలతో పాటు సాంకేతిక ఆవిష్కరణ జరగడం ముఖ్యమన్నారు. డబ్ల్యూపీపీఎస్ చైర్మన్ అజయ్ గోయల్ మాట్లాడుతూ గోధుమ మిల్లింగ్‌లో పెస్ట్ మేనేజ్‌మెంట్, ఆహార భద్రత వంటి సవాళ్లను పరిష్కరించడానికి మరిన్ని సదస్సుల నిర్వహణ అవసరమన్నారు. కాగా సదస్సులో భాగంగా క్లిష్టమైన అంశాలపై టెక్నికల్ సెషన్లు కొనసాగాయి.

నటుడు శ్రీతేజ్‌పై మహిళ ఫిర్యాదు


శ్రీతేజ్ (ఫైల్)

మూసాపేట: వంగవీటి, నా సామిరంగా, నారప్ప వంటి సినిమాల్లో నటించిన తెలుగు హీరో శ్రీతేజ్ పెళ్లి పేరుతో తనను మోసం చేశాడని ఆరోపిస్తూ ఓ మహిళ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో ఆయనపై కేసు నమోదైంది. కూకట్‌పల్లి ఇన్‌స్పెక్టర్ ముత్తు తెలిపిన వివరాల ప్రకారం.. కారంచేడుకు చెందిన ఓ మహిళ (35) మొయినాబాద్‌లో నివాసం ఉంటుంది. మూసాపేటలోని ఆంజనేయ నగర్‌లో నివాసం ఉండే సినీ హీరో శ్రీతేజ్‌తో 2014లో ఒక ఈవెంట్‌లో పరిచయం అయింది. ఆ తరువాత సోషల్ మీడియా ద్వారా మరింత దగ్గరయ్యారు. ఈ క్రమంలో శ్రీతేజ్ వివాహం చేసుకుంటానని నమ్మించి మోసం చేయడంతో పాటు ఖర్చుల నిమిత్తం తన వద్ద సుమారు రూ.20 లక్షలు తీసుకుని తిరిగి ఇవ్వలేదని మహిళ ఫిర్యాదులో పేర్కొంది. వాస్తవంగా ఈ ఏడాది ఏప్రిల్‌లోనే శ్రీతేజ్‌పై ఆ మహిళ కూకట్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి ఛార్జిషీట్ కూడా దాఖలు చేశారు. తిరిగి ఈ నెల 24వ తేదీన సదరు మహిళ గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్‌లో ఇదే అంశంపై శ్రీతేజ్‌పై ఫిర్యాదు చేయగా జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. కేసును కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేయటంతో మంగళవారం పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రెండు రోజులు.. నాలుగు జ్యువెలరీ షాపులు

- దృష్టి మళ్లించి దర్జాగా దొంగతనాలు
- కి'లేడీ'ని అరెస్టు చేసిన పోలీసులు
- 23 తులాల బంగారు ఆభరణాలు స్వాధీనం

కేపీహెచ్‌బీకాలనీ: కొనుగోలుదారు రూపంలో బంగారు నగల షోరూంలకు వెళ్లి..విలువైన బంగారు నగలు కొనుగోలు చేస్తున్నట్లు హడావుడి సృష్టించి..విక్రయదారుల దృష్టి మళ్లించి బంగారు నగలతో ఉడాయిస్తున్న ఓ కి'లేడీ' ఆట కట్టించారు కేపీహెచ్‌బీ పోలీసులు. రెండు రోజుల వ్యవధిలోనే నాలుగు పేరొందిన షోరూముల్లో బంగారు నగలు చోరీ చేసిన ఆమెను పట్టుకుని..సుమారు రూ.50 లక్షల విలువ చేసే 23 తులాల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. కూకట్‌పల్లి ఏసీపీ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం..మియాపూర్ గోకుల్ టవర్స్‌లో నివాసం ఉండే పుట్టా సునీత (41) ముఖానికి మాస్క్ ధరించి ఈ నెల 23న సాయంత్రం కేపీహెచ్‌బీ కాలనీ రోడ్డు నెంబర్.1లోని దేవి జ్యువెలరీస్‌కి వెళ్లింది. విలువైన బంగారు ఆభరణాలు చూపించమని సేల్స్‌మెన్‌లను అడిగిన ఆమె..వారి దృష్టి మళ్లించి విలువైన హారాన్ని దొంగిలించి అక్కడి నుంచి వెళ్లిపోయింది. ఇదే క్రమంలో టెంపుల్ బస్టాప్ వద్ద గల నాకోడా జ్యువెలరీస్‌లో కూడా అదే రోజు బంగారు ఆభరణాలు కొనే ముసుగులో అక్కడి వారి దృష్టి మళ్లించి విలువైన హారాన్ని దొంగిలించింది. కొద్దిసేపటి తర్వాత బంగారు హారం కనిపించకపోవడంతో అనుమానం వచ్చిన నాకోడా జ్యువెలరీస్ నిర్వాహకులు కేపీహెచ్‌బీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీసీ కెమెరాలను పరిశీలించిన పోలీసులు మాస్క్ వేసుకున్న మహిళే దొంగతనం చేసినట్లు నిర్ధారించుకొని నిఘా పెట్టి మంగళవారం ఉదయం అదుపులోకి తీసుకున్నారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌కు తరలించి విచారించగా చేసిన నేరాన్ని ఒప్పుకుంది. దేవి, నాకోడా జ్యువెలరీస్‌తో పాటు 22వ తేదీ నుంచి 24వ తేదీ వరకు సీఎంఆర్, సిరి షోరూమ్‌లలో కూడా చోరీకి పాల్పడినట్లు అంగీకరించింది. ఆమె వద్ద నుంచి 23 తులాల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు. తక్కువ సమయంలో దొంగను పట్టుకోవడంలో ప్రతిభ చూపిన కేపీహెచ్‌బీ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావు, డీఐ రవికుమార్, ఇతర పోలీస్ సిబ్బందిని డీసీపీ సురేష్ కుమార్, ఏసీపీ శ్రీనివాస్‌లు అభినందించారు.

ఏసీబీ వలలో విద్యుత్ అధికారులు


ఏసీబీకి పట్టుబడిన విద్యుత్ అధికారులు

ఘట్‌కేసర్: లంచం తీసుకుంటుండగా ఘట్‌కేసర్ విద్యుత్ సబ్‌స్టేషన్ ఏఈ బలరాంనాయక్, లైన్ ఇన్‌స్పెక్టర్ హేమంత్‌నాయక్‌తో పాటు ప్రైవేటు ఉద్యోగి బి.మహేశ్‌ను అవినీతి నిరోధక శాఖ అధికారులు మంగళవారం రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఎన్ఎఫ్‌సీ నగర్‌లో 11 కేవీ వైర్‌ను పాత స్తంభం నుంచి కొత్త స్తంభం, లైన్ కనెక్షన్ మార్చడానికి, సైడ్ ఆర్మ్‌ను మరొక స్తంభానికి ఇన్‌స్టాల్ చేయడానికి లైన్ క్లియరెన్స్ ఆమోదం కోసం ఏఈ రూ.10 వేలు, లైన్ ఇన్‌స్పెక్టర్ రూ.5 వేలు లంచం డిమాండ్ చేశారు. దీంతో బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. ఉమ్మడి రంగారెడ్డి రేంజ్ అధికారి ఆనంద్‌కుమార్ సూచన మేరకు మంగళవారం మధ్యాహ్నం బాధితుడు ప్రైవేటు ఉద్యోగికి రూ.15 వేలు అందజేస్తుండగా పట్టుకున్నారు. ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. సబ్‌స్టేషన్‌తో పాటు ఏఈ, లైన్ ఇన్‌స్పెక్టర్ నివాసంలో ఏకకాలంలో సోదాలు నిర్వహిస్తున్నారు.

కాంగ్రెస్ కృతజ్ఞత సభ పోస్టర్ ఆవిష్కరణ



ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో డిసెంబర్ 21న ఆర్ట్స్ కాలేజీ ఎదుట నిర్వహించనున్న కృతజ్ఞత సభను విజయవంతం చేయాలని కాంగ్రెస్ నేతలు విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఎదుట టీపీసీసీ అధికార ప్రతినిధి, ఓయూ పీహెచ్‌డీ విద్యార్థి చనగాని దయాకర్‌గౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా విచ్చేసిన రాష్ట్ర గ్రంథాయల చైర్మన్ డాక్టర్ రియాజ్, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ సభ విజయవంతం కోసం రూపొందించిన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ప్రజాపాలనకు ఏడాది పూర్తయిన సందర్భంగా నిర్వహిస్తున్న కృతజ్ఞత సభకు ముఖ్యఅతిథిగా టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్, మంత్రులు, ప్రజాప్రతినిధులు హాజరుకానున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ నాయకులు మెడ శ్రీను, క్రాంతికుమార్, సతీష్, వినయ్, మోహన్, భార్గవ్, శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫ్లైఓవర్ పనులు త్వరగా పూర్తి చేయాలి

సాక్షి, సిటీబ్యూరో: ఆరాంఘర్ – జూపార్కు వరకు నిర్మాణంలో ఉన్న ఫ్లైఓవర్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి అధికారులను ఆదేశించారు. మంగళవారం హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, వాటర్ వర్క్స్ ఈడీ మాయంక్ మిట్టల్, ఇతర అధికారులతో కలిసి ఫ్లైఓవర్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్.. కాలి నడకన ఆరాంఘర్ ఫ్లైఓవర్ పనులు పరిశీలించారు. ప్రధాన ఫ్లైఓవర్ పనులు నవంబర్ 30 వరకు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సర్వీస్ రోడ్డు నిర్మాణానికి మొత్తం 17 ఆస్తులు సేకరించాలని, ప్రస్తుతం పని జరిగేందుకు 5 ఆస్తులు సత్వరమే సేకరణ చేసిన పక్షంలో సర్వీస్ రోడ్డు పనులు ప్రారంభించే అవకాశం ఉంటుందని సి.ఈ దేవానంద్ కమిషనర్‌కు వివరించారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవం


పూర్ణాహుతి వేడుకల్లో ఎమ్మెల్సీ కవిత

వెంకటేశ్వరకాలనీ: బంజారాహిల్స్ రోడ్ నెం. 14లోని నందినగర్ శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో జరుగుతున్న తృతీయ వార్షికోత్సవ వేడుకలు మంగళవారం ముగిశాయి. ఈ సందర్భంగా ఆలయంలో నిర్వహించిన పూర్ణాహుతి వేడుకల్లో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, ఎమెల్సీ దేశపతి శ్రీనివాస్ పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకుముందు ఆలయంలో స్వామివారికి నిజాభిషేకం, లక్ష తమలపాకుల అర్చన, అన్నప్రసాద వితరణ, రథోత్సవం వేడుకలను వైభవంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వరకాలనీ డివిజన్ కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి, ఆలయ చైర్మన్ దశరథ్ చౌహాన్ తదితరులు పాల్గొన్నారు.


లోటస్‌పాండ్‌లో శుభ్రంగా కనిపిస్తున్న ఫుట్‌పాత్‌లు


ఫిలింఛాంబర్ వద్ద...

సత్ఫలితాలనిస్తున్న 'ఆపరేషన్ రోప్'

- క్లీన్‌గా కనిపిస్తున్న ఫుట్‌పాత్‌లు

బంజారాహిల్స్: ట్రాఫిక్ పోలీసులు ఆపరేషన్ రోప్ కార్యక్రమంలో భాగంగా ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు కార్యక్రమం మంచి ఫలితాలనిస్తోంది. గడిచిన 20 రోజులుగా ఖైరతాబాద్ నియోజకవర్గ వ్యాప్తంగా ప్రధాన రోడ్లు, అంతర్గత రోడ్లకిరువైపులా ఉన్న ఫుట్‌పాత్‌లపై ఏర్పాటు చేసిన ఆక్రమణలను ట్రాఫిక్ పోలీసులు తొలగిస్తున్నారు. దీంతో రోడ్లపై నడుస్తున్న పాదచారులు ఫుట్‌పాత్‌లపై నడుస్తున్నారు. దీనికితోడు రోడ్లపై అడ్డదిడ్డంగా పార్కింగ్‌లు కూడా కనపించడం లేదు. దీంతో ఆయా కాలనీవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా లోటస్‌పాండ్‌లో ఫుట్‌పాత్‌పై పెద్దఎత్తున ఏర్పాటు చేసిన ఆక్రమణలను, ఫిలించాంబర్ వద్ద, అపోలో ఆస్పత్రి వెనుకాల ఉన్న డబ్బాలను పూర్తిగా తొలగించడంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో ఆక్రమణల వల్ల ఈ ప్రాంతాల్లో పెద్దఎత్తున ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతుండేది. ట్రాఫిక్ ఏసీపీ కట్టా హరి ప్రసాద్ నేతృత్వంలో అటు బంజారాహిల్స్ పోలీసులు, ఇటు జూబ్లీహిల్స్ పోలీసులు ఆయా స్టేషన్ల పరిధిలో ఉన్న ఆక్రమణల తొలగింపును ఎప్పటికప్పుడు నిర్వహిస్తున్నారు. బంజారాహిల్స్ రోడ్ నెం. 10లో సైతం పెద్ద ఎత్తున ఏర్పాటు చేసిన ఆక్రమణలను పోలీసులు తొలగించారు.

తొలగింపు సరే.. తరలింపు ఏదీ..?

- ఎక్కడికక్కడే పేరుకుపోతున్న చెట్ల కొమ్మలు
- తొలగించని కాంట్రాక్టర్లు
- పట్టించుకోని విద్యుత్ శాఖ అధికారులు
- రాకపోకలకు తీవ్ర అంతరాయం



బంజారాహిల్స్: విద్యుత్ వైర్లకు చెట్ల కొమ్మలు తగిలితే విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం కలుగుతుందని టీజీఎస్‌పీడీసీఎల్ సెంట్రల్ బ్రేక్‌డౌన్ డిపార్ట్‌మెంట్ (సీబీడీ) కరెంటు వైర్లకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగిస్తుంది. వర్షాకాలం, చలికాలంలోనూ చెట్లు బాగా పెరిగే అవకాశం ఉండడంతో కొమ్మలను కొట్టేసే కార్యక్రమాన్ని సీబీడీ చేపడుతుంది. అయితే కొట్టేసిన చెట్ల కొమ్మలను మాత్రం రోడ్ల పక్కన, ఫుట్‌పాత్‌లపై సంబంధిత సిబ్బంది నిర్లక్ష్యంగా అక్కడే వదిలేసి వెళ్లిపోతున్నారు. దీంతో పేరుకుపోతున్న చెట్ల కొమ్మలతో రోడ్లు, ఫుట్‌పాత్‌లు ఇబ్బందికరంగా మారుతున్నాయి. రోజుల తరబడి చెట్ల కొమ్మలు తొలగించకపోవడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. ఎన్నోసార్లు చెట్ల కొమ్మలు తొలగించాలంటూ సంబంధిత అధికారులకు మొరపెట్టుకున్నా వినిపించుకోవడం లేదంటూ ఆరోపణలు వినిపిస్తున్నాయి. టీజీఎస్‌పీడీసీఎల్ బంజారాహిల్స్ డివిజన్ పరిధిలోని ఫిలింనగర్, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, మాదాపూర్, అమీర్‌పేట, యూసుఫ్‌గూడ, ఎస్‌కే నగర్ తదితర సబ్‌స్టేషన్ల పరిధిలో చెట్ల కొమ్మలను తొలగిస్తున్నారు. వేసవి కార్యాచరణ ప్రణాళికలో భాగంగా 45 రోజులపాటు చెట్ల కొమ్మల తొలగింపు కార్యక్రమం జరగనుంది. అయితే కొమ్మలు తొలగించిన తర్వాత సంబంధిత కాంట్రాక్టర్ ఎప్పటికప్పుడు వీటిని లారీల్లో తరలించాల్సి ఉండగా కాంట్రాక్టర్లు నిర్లక్ష్యం వహిస్తున్నారు. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, ఫిలింనగర్, శ్రీనగర్‌కాలనీ, శ్రీకృష్ణానగర్, పంజగుట్ట, సోమాజీగూడ, చింతల్ బస్తీ తదితర ప్రాంతాల్లో ఎక్కడికక్కడ కొట్టేసిన చెట్ల కొమ్మలు ఫుట్‌పాత్‌లపైనే రోజులతరబడి ఉంటున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కాంట్రాక్టర్‌తో కొట్టేసిన చెట్ల కొమ్మలు ఎప్పటికప్పుడు తొలగించే విధంగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు

వారం రోజుల క్రితం ఫిలింనగర్ కాలనీల్లో పలు ప్రాంతాల్లో పేరుకుపోయిన చెట్ల కొమ్మలను తొలగించాలని ఫిలింనగర్ సబ్ స్టేషన్ ఏఈకి ఫిర్యాదు చేశా. ఏడీఈకి చెప్పాలని నెంబర్ ఇచ్చారు. నేను ఏడీఈకి ఫిర్యాదు చేయగా తొలగిస్తామని చెప్పి ఆరు రోజులు దాటినా ఇప్పటి దాకా తొలగించలేదు. రోడ్ల పక్కనే ఈ చెట్ల కొమ్మలు ఉండడంతో అవి ప్రమాదకరంగా మారాయి. అంతేకాకుండా రోడ్లు ఇరుకుగా మారి రాకపోకలకు అంతరాయం కలుగుతుంది. ఇప్పటికైనా చెట్ల కొమ్మలను తొలగించిన వెంటనే తరలించాలి.

జూబ్లీహిల్స్ మాజీ కార్పొరేటర్ కాజా సూర్యనారాయణ


ఫిలింనగర్ రోడ్డునెంబర్-9లో పేరుకుపోయిన చెట్ల కొమ్మలు



ఏడుగురు ట్రాన్స్‌జెండర్ల అరెస్టు


పోలీసుల అదుపులో ట్రాన్స్‌జెండర్లు

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గృహ ప్రవేశ వేడుక జరుగుతున్న ఇంటి వద్దకు వచ్చి ఇబ్బందులకు గురిచేసిన ఏడుగురు ట్రాన్స్‌జెండర్లను వెస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... జూబ్లీహిల్స్‌లో ఓ గృహప్రవేశ వేడుక జరుగుతుండగా కొంతమంది ట్రాన్స్‌జెండర్లు అక్కడకు వచ్చి ఇబ్బంది పెడుతున్నారనే సమాచారం మేరకు వెస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అక్కడికి చేరుకున్నారు. అప్పటికే అక్కడ న్యూసెన్స్‌కు పాల్పడుతున్న బోయగూడకు చెందిన పప్పీ, మాదాపూర్ చందానాయక్ తండాకు చెందిన కుషీ చౌహాన్, మొహిని, అన్ని, యూసుఫ్‌గూడకు చెందిన అంజలి, బాలానగర్‌కు చెందిన స్టెల్లారాయ్‌లను అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సీఎంకు భారత రాజ్యాంగ పుస్తకం బహూకరణ


సీఎంకు రాజ్యాంగ పుస్తకం బహూకరిస్తున్న సీఎన్ రెడ్డి

రహమత్‌నగర్: ఢిల్లీలో తెలంగాణ రాష్ట్ర సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన రాజ్యాంగ దినోత్సవ వేడుకల్లో రహమత్‌నగర్ కార్పొరేటర్ సీఎన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డికి భారత రాజ్యాంగ పుస్తకాన్ని సీఎన్ రెడ్డి బహూకరించారు.

కింగ్‌కోఠిలో కమర్షియల్ భవనం సీజ్


భవనాన్ని సీజ్ చేస్తున్న జీహెచ్‌ఎంసీ సిబ్బంది.

కాచిగూడ: హిమాయత్‌నగర్ డివిజన్ కింగ్‌కోఠిలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన ఓ కమర్షియల్ భవనాన్ని జీహెచ్‌ఎంసీ అధికారులు, టౌన్ ప్లానింగ్ సిబ్బంది మంగళవారం సీజ్ చేశారు. జీహెచ్‌ఎంసీ డీఎంసీ మారుతి దివాకర్ మాట్లాడుతూ ఇంటి యజమాని రెసిడెన్షియల్ అనుమతి తీసుకుని కమర్షియల్ బిల్డింగ్ కట్టారని దీంతో సీజ్ చేశామని తెలిపారు. త్వరలోనే నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన కమర్షియల్ బిల్డింగ్‌ను కూల్చివేస్తామని ఆయన తెలిపారు.

సుంకర నరేష్‌కు న్యాయశ్రీ అవార్డు


న్యాయశ్రీ అవార్డు అందుకుంటున్న సుంకర నరేష్

శ్రీనగర్‌కాలనీ: ప్రముఖ న్యాయవాది, సామాజికవేత్త సుంకర నరేష్‌కు న్యాయశ్రీ అవార్డు లభించింది. మెగాసిటీ నవ కళావేదిక ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం రాత్రి నిర్వహించిన కార్యక్రమంలో న్యాయశ్రీ అవార్డు-2024ను తెలంగాణా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూరేపల్లి నంద చేతుల మీదుగా సుంకర నరేష్ అందుకున్నారు. సామాజిక స్పృహతో పాటు అట్టడుగు వర్గాల వారికి న్యాయసేవలను అందిస్తున్న న్యాయవాది సుంకర నరేష్ కృషి అభినందనీయమని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో వ్యవస్థాపక అధ్యక్షులు మల్లికార్జున రావు, దైవజ్ఞ శర్మ, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

నటుడు సోనూసూద్‌కు 'సంకల్ప్ కిరణ్' పురస్కారం

28న అవార్డు ప్రదానం చేయనున్న నిర్వాహకులు

బంజారాహిల్స్: ప్రతియేటా సుచిరిండియా ఫౌండేషన్ అందించే సంకల్ప్ కిరణ్ పురస్కారం ఈసారి ప్రముఖ నటుడు, సామాజిక వేత్త సోనూసూద్‌ను వరించనుంది. సుచిరిండియా ఫౌండేషన్ సంకల్ప్ దివస్ కార్యక్రమంలో భాగంగా ఈ నెల 28న లలితా కళాతోరణంలో జరగబోయే కార్యక్రమంలో నటుడు సోనూసూద్‌కు సంకల్ప్ కిరణ్ పురస్కారం అందజేయబోతున్నట్లు వ్యాపారవేత్త, సుచిరిండియా ఫౌండేషన్ అధినేత లయన్ కిరణ్ తెలిపారు. మంగళవారం జూబ్లీహిల్స్‌లోని ఆయన కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. తాము రెండు దశాబ్దాలుగా సామాజిక వేత్తలను, గొప్ప మానవతావాదులను గుర్తించి వారికి పురస్కారాలు అందిస్తున్నామని ఈసారి సోనూసూద్‌కు సంకల్ప్ కిరణ్ పురస్కారం అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా భారత్-బల్గేరియా రాయబార కార్యాలయ అంబాసిడర్ నికోలయ్ యాంకోవ్ పాల్గొంటున్నారని తెలిపారు.

భార్యను వేధిస్తున్న భర్తకు ఏడు రోజుల జైలు


సయ్యద్ ఖదిర్

బంజారాహిల్స్: మద్యం మత్తులో నిత్యం భార్యను చిత్రహింసలకు గురిచేస్తున్న భర్తకు న్యాయస్థానం ఏడురోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చింది. వివరాల్లోకి వెళితే... బంజారాహిల్స్ రోడ్డునెంబర్-12లోని సయ్యద్ నగర్ బస్తీకి సయ్యద్ ఖదిర్ (49) మద్యానికి బానిసై నిత్యం తాగి వచ్చి భార్య సాహీన్‌బేగంను తీవ్రంగా కొడుతూ వేధింపులకు గురిచేస్తున్నాడు. దీంతో భర్త వేధింపులు భరించలేక షాహీన్‌బేగం పోలీసులకు ఫిర్యాదు చేసింది. బంజారాహిల్స్ పోలీసులు నిందితుడిపై కేసు నమోదు చేసి మంగళవారం నాంపల్లిలోని పదో ప్రత్యేక మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపర్చారు. కేసును విచారణ చేసిన న్యాయమూర్తి నిందితుడికి వారం రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. పోలీసులు నిందితుడిని చంచల్‌గూడ జైలుకు తరలించారు. బంజారాహిల్స్ ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కొత్త చెరువులో మృతదేహం లభ్యం

ఫిలింనగర్: ఫిలింనగర్‌లోని కొత్త చెరువులో మంగళవారం ఉదయం ఓ వ్యక్తి మృతదేహం నీళ్లపై తేలడంతో స్థానికులు ఫిలింనగర్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్‌ఐ సతీష్‌కుమార్ ఘటనా స్థలానికి చేరుకుని డీఆర్‌ఎఫ్ బృందం సహకారంతో మృతదేహాన్ని బయటకు తీశారు. చనిపోయిన వ్యక్తి గురించి స్థానికంగా ఆరా తీయగా ఎలాంటి సమాచారం లభించలేదు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు. ఆచూకీ తెలిసిన వారు 8712661161 నెంబర్‌లో సంప్రదించాలని వారు కోరారు.

బాధితులకు సీఎంఆర్‌ఎఫ్ భరోసా

వెంకటేశ్వరకాలనీ: కష్టాల్లో ఉన్న వారికి సీఎం రిలీఫ్ ఫండ్ అండగా నిలుస్తుందని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. మంగళవారం ఆయన నివాసంలో జూబ్లీహిల్స్ రోడ్ నెం. 45 అంబేడ్కర్‌నగర్ బస్తీకి చెందిన పడిదల విశ్వనాథం అనారోగ్యంతో నిమ్స్ ఆస్పత్రిలో చేరగా చికిత్స నిమిత్తం రూ. 2 లక్షల ఎల్‌వోసీ లేఖను బాధిత కుటుంబానికి ఆయన అందజేశారు. ఈ కార్యక్రమంలో దయ్యాల దాసు, అశోక్, వెంకట్ నర్సు, వెంకన్న పాల్గొన్నారు.

చిన్నపాటి జాగ్రత్తలతో దంత సమస్యలు నివారించొచ్చు

ప్రముఖ దంత వైద్యులు డా.ప్రఫుల్లారెడ్డి


దంత పరీక్షలు నిర్వహిస్తున్న డా. ప్రఫుల్లారెడ్డి

రహమత్‌నగర్: చిన్నపాటి జాగ్రత్తలతో దంత సమస్యలను నివారించొచ్చని లయన్స్ క్లబ్ ఆఫ్ హైద్రాబాద్ సనత్‌నగర్ టీం కార్యదర్శి లయన్ డా. ప్రఫుల్లారెడ్డి పేర్కొన్నారు. బ్రహ్మశంకర్‌నగర్ సెయింట్ సాల్మాన్ హైస్కూల్లో మంగళవారం ఏర్పాటు చేసిన దంత వైద్య శిబిరంలో ఆయన పాల్గొని విద్యార్థులకు దంత పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దంత సమస్యలపై నిర్లక్ష్యం చేస్తే ప్రమాదకరంగా మారే అవకాశం ఉందన్నారు. ప్రపంచవ్యాప్తంగా వెంటాడుతున్న ఆరోగ్య సమస్యల్లో దంత సమస్య ఒకటని నిపుణులు స్పష్టం చేశారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ దంత వైద్యులు డా.శ్రీనివాస్ లయన్ ప్రభాకర్, పాఠశాల కరస్పాడెంట్ సుధాకర్, హెచ్‌ఎం ప్రీతి తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి



వెంగళరావునగర్: అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా తమ పేర్లను నమోదు చేసుకొని, ఓటు హక్కును వినియోగించుకోవాలని జీహెచ్‌ఎంసీ సర్కిల్-19 ఉప కమిషనర్ జకియా సుల్తానా తెలియజేశారు. వెంగళరావునగర్ డివిజన్ పరిధిలోని యూసుఫ్‌గూడ కృష్ణకాంత్‌పార్క్ వద్ద మంగళవారం జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో ఓటరు నమోదు అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన డీఎంసీ మాట్లాడుతూ 18 ఏళ్ళు నిండిన ప్రతి ఒక్కరూ తమ పేరును ఓటరు లిస్టులో పొందు పరచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎంసీతో పాటుగా ఏఎంఓహెచ్ సాలోమన్, శానిటేషన్ సూపర్‌వైజర్ విజయ్‌కుమార్, డీపీఓ, నోడల్ అధికారి, ఎస్‌హెచ్‌జీలు, ఆర్‌పీలు, బీఎల్‌ఓలు, జీహెచ్‌ఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.




సంవిధాన్ దివస్‌లో వివిధ సంఘాల ప్రతినిధులు


అంబేడ్కర్‌కు నివాళులు అర్పిస్తున్న బీజేపీ నేతలు

ఘనంగా భారత రాజ్యాంగ దినోత్సవం

భారత రాజ్యాంగ దినోత్సవ వేడుకలను ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ నియోజకవర్గ పరిధిలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భారత రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన హక్కులతోనే స్వేచ్ఛాయుత జీవితం గడుపుతున్నామని పేర్కొన్నారు. ప్రతీ పౌరుడు రాజ్యాంగాన్ని గౌరవించాలని కోరారు. ప్రపంచంలోనే భారత రాజ్యాంగానికి ఎంతో విశిష్టత కలిగి ఉందన్నారు.


అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న బెటాలియన్ అధికారులు, సిబ్బంది


వేడుకల్లో ఎర్రగడ్డ కాంగ్రెస్ నేతలు


బీఎస్‌పీ నేతల ఆధ్వర్యంలో వేడుకలు


నివాళులు అర్పిస్తున్న దళిత నాయకులు

ప్లాట్ రిజిస్ట్రేషన్ చేయకుండా మోసం

వెంగళరావునగర్: ప్లాట్ కొనుగోలు చేసిన మహిళకు రిజిస్ట్రేషన్ చేయకుండా రియల్ ఎస్టేట్ వ్యాపారి మోసం చేసిన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... గండిపేటలో నివాసం ఉండే రత్నం అనే మహిళ గత మూడేళ్ళ కిందట సంగారెడ్డి జిల్లా మానస్‌పల్లి గ్రామంలోని నేచర్‌కంట్రీ వెంచర్‌లో 202 చదరపు గజాలు కొనుగోలు చేసేందుకు వెంగళరావునగర్‌లోని సాయిసూర్య డెవలపర్స్ రియల్ ఎస్టేట్ సంస్థ కార్యాలయానికి వచ్చి రూ.26.57 లక్షలు చెల్లించింది. నగదు తీసుకున్న అనంతరం దాని యజమాని సతీష్ చంద్రగుప్త త్వరలోనే ప్లాట్‌ను రిజిస్ట్రేషన్ చేస్తానని చెప్పాడు. అయితే మూడేళ్ళయినా ప్లాట్ రిజిస్ట్రేషన్ చేయలేదు. ఎన్నిసార్లు ఫోన్ చేసినా మాయమాటలు చెబుతూ తప్పించుకుని తిరుగుతున్నాడు. దీంతో తాను మోసపోయానని గ్రహించి బాధితురాలు మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఖైరతాబాద్: సైఫాబాద్ డివిజన్ పరిధిలోని ఇందిరాపార్క్ సబ్‌స్టేషన్ పరిధిలో సబ్‌స్టేషన్ మెయింటెనెన్స్, చెట్ల తొలగింపులో భాగంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు అసిస్టెంట్ డివిజన్ మేనేజర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇందిరాపార్క్ సబ్‌స్టేషన్ పరిధిలో బుధవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు లోయర్ ట్యాంక్‌బండ్, గంగామహల్ కాలనీ, ఐ హాస్పిటల్, బాదాం గల్లీ, గ్యాస్ గోదాం, దోమల్‌గూడ మార్కెట్‌లలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు గగన్ మహల్ ఏరియా, పోలీస్ ఔట్‌పోస్ట్, బాలసాయి బాబా టెంపుల్, పిజెఆర్ రెసిడెన్సీ, జ్యోతి మార్కెట్ ఏరియాలతో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

వెంగళరావునగర్‌లో...

ఎంసీహెచ్ మార్కెట్, బీఎస్‌పురి 11కెవీ ఫీడర్లు గ్రీన్‌లాండ్స్, మోతీనగర్ సబ్‌స్టేషన్ల పరిధిల్లో జరుగుతున్న విద్యుత్ మరమ్మతుల కారణంగా బుధవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు అపరాజిత కాలనీ, ఎంసీహెచ్ మార్కెట్, ఎస్ఆర్‌టీ కాలనీ, గౌతంపురికాలనీ, మిడ్‌లాండ్ బేకరీ, బీ.ఎస్.పురి కాలనీ, నటరాజ్‌నగర్, రాజీవ్‌నగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని గ్రీన్‌లాండ్స్ సీబీడీ ఏడీఈ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజీవ్‌గాంధీ, కీర్తిలాల్, జ్ఞానేశ్వర్ 11కెవీ ఫీడర్లు గ్రీన్‌లాండ్స్, కుందన్‌బాగ్, మోతీనగర్ సబ్‌స్టేషన్ల పరిధిల్లో జరుగుతున్న మరమ్మతుల వల్ల శ్రీనివాస్ టవర్స్, అమోఘ ప్లాజా, మైటాస్, బ్లూమూన్ హోటల్, శ్రీనివాస్ టవర్స్, మనీలాండ్ చైనా, జ్ఞానేశ్వర్, స్నేహపురికాలనీ, మోతీనగర్, బబ్బుగూడ ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని దీనిని వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

రాజ్యాంగంపై అవగాహన ఉండాలి

కాచిగూడ: రాజ్యాంగంపై ప్రతీ పౌరుడికి అవగాహన కలిగి ఉండాలని తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలక్రిష్టరెడ్డి అన్నారు. తెలంగాణ మేధావుల ఫోరం ఆధ్వర్యంలో మంగళవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన జాతీయ రాజ్యాంగ దినోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడుతూ మన భారత రాజ్యాంగం ప్రపంచంలోనే అతిపెద్ద లిఖిత రాజ్యాంగంగా గుర్తింపు పొందిందన్నారు. ప్రతి ఇంట్లో ధర్మ గ్రంథంతో పాటు భారత రాజ్యాంగం ఉండాల్సిన అవసరం ఉందని ఆయన తెలిపారు. తెలంగాణ మానవ హక్కుల కమిషన్ మాజీ చైర్మన్, రిటైర్డ్ జడ్జి జస్టిస్ డాక్టర్ జి.చంద్రయ్య మాట్లాడుతూ ప్రజల్లో రాజ్యాంగం విలువ పట్ల అవగాహన పెంచడంతో పాటు రాజ్యాంగ స్ఫూర్తిని పెంపొందించాలని కోరారు. జస్టిస్ పీఎస్ నారాయణ, డీఎల్ పాండు, తెలంగాణ మేధావుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రాజ్ నారాయణ ముదిరాజ్, డాక్టర్ డి.జయసుధ చౌదరి, డాక్టర్ మొహ్మద్ అత్తర్ అలీ, డాక్టర్ ధనుంజయ నాయక్, డాక్టర్ రవితేజ తదితరులు పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో పురస్కార గ్రహీతలు ఎల్‌సీ గోపయ్య, ఎస్.దీపక్‌రాజ్, జి.వీరమ్మ, కెప్టెన్ డాక్టర్ మదుగు విజయ్‌కుమార్, డాక్టర్ మీరా, మహ్మద్ జాహిద్ దాని, శ్రీనివాస్ గండేమల్లె తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న 'థింక్' నాటక ప్రదర్శన

ఖైరతాబాద్: తెలుగు నాటక సమితి ఆధ్వర్యంలో మంగళవారం ఏజీ ఆఫీసు ఆడిటోరియంలో 'థింక్' నాటకాన్ని ప్రదర్శించారు. సిరిమువ్వ కల్చరల్ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో మంజునాథ రచన దర్శకత్వంలో గోవర్ధనరెడ్డి, సతీష్‌కుమార్, వేణుగోపాలరావు, ప్రశాంత్, రామకృష్ణ, మంజునాథ, ఎ.కె.శ్రీదేవి, సురభినాగరాజు, ఉమాశంకర్‌లు నటించి ఆకట్టుకున్నారు. సమాజంలో తల్లిదండ్రులు పిల్లల పట్ల చూపించే ప్రేమ, కొందరు పిల్లలు తల్లిదండ్రులకు చేసే గాయాలు ఈ ప్రదర్శనలో కళ్లకు కట్టినట్లు ప్రదర్శించి ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎకౌంటెంట్ జనరల్ మాధవి, సమితి అధ్యక్షులు బీ.వీ.వరలక్ష్మి, అచ్యుతరావు, రాణి, సుధారాణి, పెరుమాళ్లు, పద్మనాభం పాల్గొన్నారు.

ఆరాధన సంగీతోత్సవాల ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ

జనవరి 18 నుంచి త్యాగరాజ స్వామి వార్షిక ఆరాధన సంగీతోత్సవాలు

నల్లకుంట: జనవరి 18 నుంచి సద్గురు శ్రీత్యాగరాజ స్వామి 56వ వార్షిక ఆరాధన సంగీతోత్సవాలు 9 రోజుల పాటు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని గానసభ కార్యదర్శి కొణికి సాయి శ్రీనివాస శర్మ చెప్పారు. నల్లకుంటలోని న్యూరామాలయం ప్రాంగణంలో ఆరాధనోత్సవాల ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ మంగళవారం జరిగింది. దీనికి హాజరైన ప్రముఖ సంగీత విద్వాంసుడు, ఆలిండియా రేడియో కళాకారుడు డీవీ.మోహన్‌కృష్ణతో కలిసి సాయి శ్రీనివాసశర్మ ఆహ్వాన పత్రికను ఆవిష్కరించారు.


ఆహ్వాన పత్రికను ఆవిష్కరిస్తున్న డీవీ.మోహన కృష్ణ, కొణికి శ్రీనివాస శర్మ

వర్గీకరణ వ్యతిరేక శక్తులకు రాజ్యాంగం పేరెత్తే అర్హత లేదు

ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ మాదిగ


అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వంగపల్లి శ్రీనివాస్ మాదిగ

ముషీరాబాద్: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చెప్పిన సామాజిక న్యాయం అంటే సమాన పంపిణీ అని, వర్గీకరణ వ్యతిరేక శక్తులకు అంబేడ్కర్ పేరెత్తే అర్హత లేదని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్‌మాదిగ స్పష్టం చేశారు. విద్యానగర్‌లోని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యాలయంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 30 ఏళ్లుగా జరుగుతున్న న్యాయమైన ఎస్సీ వర్గీకరణ ఉద్యమానికి మాలలు మద్దతు పలికి రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడాలని కోరారు. వర్గీకరణను వ్యతిరేకిస్తున్న వారు ఎవరైనా రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా పనిచేస్తున్న వారే అని స్పష్టం చేశారు. జనాభా నిష్పత్తి ప్రకారం ఎవరి వాట ఎంత ఉందో వారికి అంత వాటా చెందాలని, ఒక సామాజిక న్యాయం కోసం పోరాటం జరుగుతుంటే అదేదో సొంత ఆస్తులు గుంజుకున్నట్లుగా వ్యవహరిస్తున్నారన్నారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు శ్యామ్‌రావు, కొల్లూరు వెంకట్, వరిగడ్డి చందు, ఎల్.నాగరాజు, కానుగంటి సురేష్, జన్నారపు జీవన్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

ఓటీఎస్ పొడిగించేనా?

- ఆలస్య రుసుం, వడ్డీ మాఫీ చేసినా..
- వినియోగదారుల నుంచి స్పందన కరువు
- సద్వినియోగం చేసుకున్నది 15 శాతమే..
- రూ.70 కోట్లకు మించని వసూళ్లు
- ప్రభుత్వానికి లేఖ రాసే యోచనలో జలమండలి



సాక్షి, సిటీబ్యూరో: నల్లా బిల్లుల మొండి బకాయిలను వసూలు చేసేందుకు అమలు చేస్తున్న వన్‌ టైమ్ సెటిల్‌మెంట్ పథకం గడువు మరో నెల పొడగించాలని జలమండలి యోచిస్తోంది. ఇప్పటికే రెండు నెలలు వెసులుబాటు కల్పించినప్పటికీ వినియోగదారుల నుంచి ఆశించిన స్పందన లేకపోవడంతో 2020 మాదిరిగా మరో నెల రోజులు పొడగించేలా ప్రభుత్వానికి లేఖ రాసేందుకు సిద్ధమైంది. వాస్తవంగా వన్‌టైమ్ సెటిల్‌మెంట్ పథకం సద్వినియోగం అంతంత మాత్రంగా తయారైంది. ఇప్పటి వరకు కనీసం 15 శాతం కనెక్షన్ దారులు మాత్రమే ఓటీఎస్ వినియోగించుకున్నట్లు తెలుస్తోంది. మొత్తం మీద రూ.70 కోట్ల వరకు బకాయిలు వసూలైనట్లు అధికారులు పేర్కొంటున్నారు. మొత్తం పెండింగ్ బిల్లుల్లో ప్రభుత్వ బకాయిలు అధికంగా ఉన్నట్లు తెలుస్తోంది.

నాలుగేళ్ల తర్వాత ఓటీఎస్

జలమండలి పరిధిలో నల్లా బిల్లుల పెండెన్సీ పెరిగిపోతుండటంతో నాలుగేళ్ల తర్వాత ప్రభుత్వం వన్‌టైమ్ సెటిల్‌మెంట్‌కు అవకాశం కల్పించింది. వినియోగదారుల ఆర్థిక వెసులబాటు కోసం వడ్డీతో సహా ఆలస్య రుసుం మాఫీతో గత నెల నుంచి వన్‌టైమ్ సెటిల్‌మెంట్ స్కీం(ఓటీఎస్)ను అమలు చేస్తోంది. ఇప్పటికే ఒకసారి గడువు ముగియడంతో వినియోగదారుల విజ్ఞప్తి మేరకు ఈ నెలాఖరు వరకు పొడగించింది. నల్లా బిల్లులు బకాయిపడిన కనెక్షన్ దారులందరూ ఓటీఎస్ సద్వినియోగం చేసుకొని వడ్డీ, ఆలస్య రుసుంతో మినహాయింపు పొందే విధంగా విస్తృత ప్రచారం చేస్తోంది. ఇప్పటికే వినియోగదారుల రిజిస్టర్డ్ మొబైల్స్‌కు పెండింగ్ బిల్లులకు సంబంధించిన సంక్షిప్త సమాచారం పంపించింది. మరోవైపు పెండింగ్ బిల్లుల వినియోగదారులను నేరుగా కలిసి ప్రత్యేకంగా ముద్రించిన కరపత్రాలతో వాటర్ బోర్డు సిబ్బంది అవగాహన కల్పిస్తున్నారు.

ఇదీ పరిస్థితి..

జలమండలి పరిధిలోని మొత్తం 13.71 లక్షల కనెక్షన్‌దారులు ఉండగా వన్‌టైమ్ సెటిల్‌మెంట్ పథకం ప్రకటించే నాటికి సుమారు 8.16 లక్షల వినియోగదారులు సుమారు రూ.3,044 కోట్లు బకాయి పడినట్ల జలమండలి రెవెన్యూ విభాగం లెక్కలు స్పష్టం చేస్తున్నాయి. అందులో చెల్లించని వడ్డీ రూ.896.79 మినహాయించి ప్రిన్సిపల్ అమౌంట్ రూ.2,147 కోట్లు బకాయిలు ఉన్నాయి. మొత్తం మీద బల్క్, కాలనీ, కమర్షియల్, ఇండస్ట్రీ, ఎంఎస్‌బీ మినహాయించి 7.72 లక్షల డొమెస్టిక్ కనెక్షన్లదారులు రూ.834 కోట్లు బకాయిపడినట్లు జలమండలి లెక్కలు వెల్లడిస్తున్నాయి.

ప్రభుత్వ విభాగాలకు లేఖ

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విభాగాలకు పెండింగ్ బిల్లుల చెల్లింపునకు జలమండలి యంత్రాగం లేఖలు రాసింది. మొత్తం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల 40 విభాగాల నుంచి ఆలస్య రుసుం, వడ్డీ మినహాయించి రూ.1,313 కోట్ల బకాయిలు రావాల్సి ఉంది. అందులో రాష్ట్ర ప్రభుత్వ శాఖల నుంచి రూ.1,229 కోట్లు, కేంద్ర ప్రభుత్వ విభాగాల నుంచి రూ.83 కోట్లు రావాల్సి ఉంది.

నిబంధనల్లో సైతం సడలింపు

తాజాగా వన్‌టైమ్ సెటిల్‌మెంట్ కింద బిల్లుల బకాయిల చెల్లింపు నిబంధనల్లో సైతం సడలింపు ఇచ్చింది. ఓటీఎస్–2020 మినహా అంతకుముందు ఓటీఎస్ సద్వినియోగం చేసుకొని ప్రయోజనం పొందిన వినియోగదారులకు సైతం 100 శాతం వడ్డీ, ఆలస్య రుసుం మాఫీ వర్తించే విధంగా నిబంధనలను సడలించింది. కేవలం గత పర్యాయం ఓటీఎస్–2020లో ప్రయోజం పొందిన కనెక్షన్ దారులకు మాత్రమే 50 శాతం వడ్డీ, ఆలస్య రుసుం వర్తిస్తోంది. భవిష్యత్‌లో క్రమం తప్పకుండా బిల్లులు చెల్లించే విధంగా అఫిడవిట్‌పై హామీ పత్రానికి బదులు తాజాగా స్వీయ ధ్రువీకరణ పత్రం సమర్పిస్తే సరిపోయే విధంగా నిబంధనలను సడలించింది.

వసూళ్ల కోసం..

మొండి బకాయిల వసూళ్ల కోసం జలమండలి ప్రత్యేక కార్యాచరణకు సిద్ధమైంది. ఉన్నతాధికారులు సమీక్షలపై సమీక్షలు నిర్వహిస్తూ క్షేత్రస్థాయి లైన్‌మెన్ల నుంచి ఉన్నతస్థాయి వరకు బాధ్యులను చేస్తూ వినియోగదారులు పెండింగ్ బిల్లులు క్లియర్ చేసే విధంగా చర్యలు చేపట్టారు. ప్రతి సర్కిల్ నుంచి సెక్షన్ వరకు టాప్–20 వినియోగదారుల జాబితా తయారు చేసి సర్కిల్‌లో సీజీఎం, డివిజన్‌లో జీఎం, డీజీఎం, సెక్షన్‌లో మేనేజర్లకు వసూళ్ల బాధ్యతలను అప్పగించారు. క్షేత్రస్థాయిలో లైన్ల వారిగా రెగ్యూలర్ మీటర్ రీడర్లు, కలెక్షన్ బృందాలను బిల్లుల వసూళ్ల కోసం రంగంలోకి దింపారు.

జల వనరులను కాపాడుకుందాం

సీఎస్ఐఆర్– నీరి సదస్సులో హైడ్రా కమిషనర్ రంగనాథ్



సదస్సులో మాట్లాడుతున్న ఏవీ రంగనాథ్

సనత్‌నగర్: విస్తరిస్తున్న పట్టణీకరణతో జల వనరులకు ముప్పు వాటిల్లుతోందని, దీనిపై మేథోమథనం జరిపి పరిష్కార మార్గాలను అన్వేషించాల్సిన అవసరం ఉందని హైడ్రా కమిషనర్ రంగనాథ్ అన్నారు. సీఎస్ఐఆర్–నీరి ఆధ్వర్యంలో అర్బన్ లేక్ మేనేజ్‌మెంట్‌పై మంగళవారం బేగంపేటలోని టూరిజం ప్లాజా హోటల్‌లో జరిగిన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రంగనాథ్ మాట్లాడుతూ చెరువులు, నాలాలను ఆక్రమణల చెర నుంచి విడిపించి జల వనరులను పరిరక్షించడమే హైడ్రా ప్రథమ కర్తవ్యమన్నారు. నేషనల్ రిమోట్ సెన్సింగ్ ఆధారంగా సేకరించిన డేటాను బట్టి 1979 నుంచి 2023 వరకు 61 శాతం చెరువులు ఆక్రమణకు గురయ్యాయన్నారు. చెరువులను కాపాడుకునేందుకు అందరం కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. పట్టణీకరణ వేగంగా జరుగుతున్న క్రమంలో పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. మరీ ముఖ్యంగా తెలంగాణలో నగరీకరణ వేగంగా జరుగుతోందని, దేశంలో పట్టణీకరణ కంటే 12 శాతం తెలంగాణలో ఎక్కువగా ఉందన్నారు. ఇలాంటి తరుణంలో ప్రకృతి వనరులను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. అప్పుడే భవిష్యత్తు తరాలకు మంచి వాతావరణాన్ని, మెరుగైన జీవనాన్ని అందించగలమన్నారు. ప్రకృతి వైపరీత్యాల నుంచి ప్రజలకు రక్షణ కల్పించడం, ప్రభుత్వ ఆస్తులు కాపాడటం, చెరువుల పరిరక్షణ, ప్రజావసరాలకు కేటాయించిన పార్కులు, రహదారులు, కబ్జాలకు గురికాకుండా కాపాడటం హైడ్రా ముఖ్య ఉద్దేశ్యమన్నారు. హైడ్రా చర్యల వల్ల సామాన్యుల్లో కూడా చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్, చెరువు క్యాచ్‌మెంట్ ఏరియా అనే అంశాలపై అవగాహన వచ్చిందన్నారు. ఇళ్లు కొనేటప్పుడు ఎఫ్‌టీఎల్, బఫర్, ప్రభుత్వ భూమి ఇలా వివరాలను తెలుసుకుని నగర ప్రజలు కొంటున్నారని, ప్రజలు మోసపోకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారన్నారు. ఐసీఎంఆర్–ఎన్ఐఎన్ మాజీ డైరెక్టర్ దినేష్ కుమార్ మాట్లాడుతూ భవిష్యత్తు తరాలకు కాలుష్యరహిత జల వనరులను అందించినప్పుడే వారు తినే ఆహారం కూడా స్వచ్ఛమైనదిగా ఉంటుందన్నారు. సీఎస్ఐఆర్–నీరి డైరెక్టర అతుల్ వైద్య మాట్లాడుతూ చెరువుల కాలుష్యం కారణంగా ఎన్నో రకాల ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. కార్యక్రమంలో సీఎస్ఐఆర్–నీరి చీఫ్ సైంటిస్ట్ షేక్ బాషా, సీనియర్ ప్రిన్సిపల్ సైంటిస్ట్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

దమ్ముంటే వికలాంగుల సమస్యలపై చర్చకు రావాలి

మంద కృష్ణ మాదిగకు ముత్తినేని వీరయ్య సవాల్


వికలాంగుల అలయ్ బలయ్‌లో మాట్లాడుతున్న ముత్తినేని వీరయ్య

చాదర్‌ఘాట్: మంద కృష్ణ మాదిగకు దమ్ము, ధైర్యం ఉంటే వికలాంగుల సమస్యలపై చర్చకు రావాలని రాష్ట్ర వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య సవాల్ విసిరారు. మంద కృష్ణ మాదిగ బీజేపీ, బీఆర్ఎస్‌లకు వికలాంగులను తాకట్టు పెట్టారని ఆయన మండిపడ్డారు. వివిధ సమస్యలతో వికలాంగులు ఆత్మహత్యలకు పాల్పడితే ఆయన ఎన్నడూ పరామర్శించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మలక్‌పేటలోని వికలాంగుల సంక్షేమ భవన్ వద్ద మంగళవారం నిర్వహించిన వికలాంగుల అలయ్ బలయ్ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజకీయంగా, ఆర్థికంగా పబ్బం గడుపుకోవడానికి మంద కృష్ణ మాదిగకు వికలాంగులే దొరికారా అని ప్రశ్నించారు. 10 ఏళ్ల పాలనలో కేంద్ర ప్రభుత్వం వికలాంగులకు ఎంతో అన్యాయం చేసిందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటి వరకు వికలాంగుల యాక్టుకు కమిషనర్, నేషనల్ ట్రస్టుకు చైర్మన్‌ను నియమించలేదన్నారు. కేంద్ర సర్వీసు ఉద్యోగాలకు వికలాంగులు పనికిరారని చట్టం చేశారన్నారు. వికలాంగుల హక్కుల చట్టంలో పలు సెక్షన్లు ఎత్తివేసేందుకు ప్రయత్నించారని వివరించారు. రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన కొద్దిసేపటికే దివ్యాంగురాలు రజినికి ఉద్యోగం ఇచ్చి వికలాంగులకు ఆత్మబంధువు అయ్యాడన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కోర్టు ఉద్యోగాల్లో వికలాంగులకు 4 శాతం రిజర్వేషన్ కేటాయిస్తూ జీఓ జారీ చేసిందన్నారు. మంద కృష్ణ మాదిగ బీజేపీకి అమ్ముడుపోయి వికలాంగుల సంఘాల మధ్య చిచ్చు పెట్టడానికి ప్రయత్నిస్తున్నాడని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో పలువురు వికలాంగుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

త్యాగాల చరిత్ర కమ్యూనిస్టులదే

- వందేళ్లలో ఎంతో మంది ప్రాణత్యాగాలు చేశారు
- కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయాలి
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు


మాట్లాడుతున్న కూనంనేని సాంబశివరావు

దిల్‌సుఖ్‌నగర్: దేశంలో త్యాగాల చరిత్ర కమ్యూనిస్టులదేనని భారత కమ్యూనిస్టు పార్టీ(సీపీఐ) రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ ఎల్‌బీనగర్ నియోజకవర్గం జనరల్ బాడీ సమావేశం కొత్తపేటలోని బాబు జగ్జీవన్‌రావ్ భవన్‌లో మంగళవారం నిర్వహించారు. సీపీఐ ఎల్‌బీనగర్ నియోజక వర్గ కార్యదర్శి సామిడి శేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ దేశంలో, రాష్ట్రంలో నిత్యం ప్రజల పక్షాన కొట్లాడి త్యాగాలు చేసిన వారంతా కమ్యూనిస్టులే అన్నారు. సీపీఐ 100 సంవత్సరాలు పూర్తి చేసుకుంటోందని, ఈ వంద సంవత్సరాల చరిత్రలో ఎంతో మంది కమ్యూనిస్టులు ప్రాణత్యాగాలు చేసి నిత్యం ప్రజల గొంతుకై నిలబడ్డారని గుర్తు చేశారు. దేశంలోనే మొదటి సారిగా సాయిధ పోరాటానికి పిలుపునిచ్చి దాదాపు 4,500 మంది తెలంగాణ గడ్డ కోసం అమరులై హైదరాబాద్ సంస్థానాన్ని దేశంలో విలీనం చేసిన త్యాగల చరిత్ర కమ్యూనిస్టులదని చెప్పారు. ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ ప్రాంతానికి నీళ్లు, నిధులు, నియామకాల్లో జరుగుతున్న అన్యాయాలపై పార్టీ ఉద్యమించిందని తెలిపారు. ప్రజా సమస్యలపై భూ సంస్కరణలు, ఇళ్ల స్థలాలు, పక్కా ఇళ్లు, ఉపాధి కోసం ఉద్యమాలు చేపట్టినట్లు వివరించారు. ఎన్నో మాయమాటలు చెప్పి ప్రజలను మధ్యపెట్టి సంక్షేమ పథకాల పేరుతో గద్దెనెక్కిన బీజేపీ, కాంగ్రెస్ హామీలను తుంగలో తొక్కి ప్రజలను మోసం చేశాయన్నారు. అదానీ ఇచ్చే రూ.100 కోట్లు వద్దనడాన్ని స్వాగతిస్తున్నామని, ఒప్పందంలో ఏమైనా అవినీతి జరిగిందా అనే కోణాన్ని ప్రభుత్వం బయటపెట్టాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్రాచారి, రంగారెడ్డి జిల్లా కార్యదర్శి జంగయ్య, ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె నరసింహ, ముత్యాల యాదిరెడ్డి, పర్వతాలు, ఫమీద, బాతరాజు నరసింహ, శ్రీదేవి, రామ్‌నారాయణ, బొడ్డుపల్లి కృష్ణ, రాములుగౌడ్, శ్రీవర్ధన్ రెడ్డి, సుధాకర్, శోభన్, అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణికి 574 దరఖాస్తులు

సాక్షి, సిటీబ్యూరో: మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో మంగళవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 574 దరఖాస్తులు అందాయి. మైనార్టీ వెల్ఫేర్‌కు సంబంధించి 198, విద్యుత్ శాఖకు 99, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు 98, రెవెన్యూ పరమైన సమస్యలపై 55, విద్యా శాఖకు 26, ప్రవాసి ప్రజావాణికి సంబంధించి 04, ఇతర శాఖలకు 94 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు చిన్నారెడ్డి, ప్రజాపాలన ప్రత్యేక అధికారి దివ్యదేవరాజన్, ఇతర అధికారులు దరఖాస్తులు స్వీకరించి, సందర్భకుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

ఓయూ ప్రవేశ ద్వారాలు రాత్రి 9 వరకు ఓపెన్

ఉస్మానియా యూనివర్సిటీ: తార్నాక నుంచి శివం రోడ్డుకు ఓయూ నుంచి వెళ్లే వాహనదారులకు శుభవార్త.. ఇక నుంచి ఓయూ ప్రవేశ ద్వారాలు రాత్రి 9 గంటల వరకు తెరిచి ఉంచనున్నారు. గతంలో రాత్రి 8 గంటల వరకే గేట్లను మూసివేయడంతో విద్యార్థులు, ఉద్యోగులతో పాటు వాహనదారులు ఇబ్బందులకు గురయ్యారు. ఈ విషయం వీసీ ప్రొ.కుమార్ దృష్టికి తీసుకువెళ్లగా రాత్రి 9 గంటల వరకు గేట్లను తెరిచి ఉంచాలని సెక్యూరిటీ సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు.

ప్రీమియర్ ఎనర్జీస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం



సాక్షి, సిటీబ్యూరో: ప్రముఖ సోలార్ సెల్, మాడ్యూల్ తయారీదారు ప్రీమియర్ ఎనర్జీస్ లిమిటెడ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని విజయవంతంగా నిర్వహించింది. రోటరీ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ దక్కన్, రోటరీ క్లబ్ ఆఫ్ లేక్ డిస్ట్రిక్ట్ మొయినాబాద్, రోటరీ చల్లా బ్లడ్ సెంటర్ భాగస్వామ్యంతో నిర్వహించిన ఈ రక్తదాన శిబిరంలో 200 మందికి పైగా ప్రీమియర్ ఎనర్జీస్‌కు చెందిన ఉద్యోగులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంస్థ మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓ చిరంజీవ్ సలుజా మాట్లాడుతూ.. తమ ఉద్యోగుల అద్భుతమైన స్పందనతో సేకరించిన రక్త యూనిట్లు వందల మందికి పునర్జన్మను అందిస్తాయని సంతోషం వ్యక్తం చేశారు. సంస్థ ఆధ్వర్యంలో చొరవ తమ సామాజిక బాధ్యతకు నిదర్శనం అన్నారు. రక్తం కొరత కారణంగా ఏ రోగి బాధపడకుండా తమ ప్రయత్నం దోహదపడుతుందని రోటరీ క్లబ్ ఆఫ్ లేక్ డిస్ట్రిక్ట్ మొయినాబాద్ వ్యవస్థాపకులు ఉదయ్ పిలానీ పేర్కొన్నారు. రోటరీ చల్లా బ్లడ్ సెంటర్ జెల్ టెక్నాలజీ ఇతర అధునాతన స్క్రీనింగ్ టెక్నాలజీలను ఉపయోగించి అంతరాయం లేని రక్తదాన ప్రక్రియను కొనసాగించింది. అనంతరం దాతలకు డోనర్ కార్డులు కూడా అందించారు. ఈ దాతలకు భవిష్యత్తులో రక్తం అవసరమైతే ఉచిత యూనిట్ కోసం రీడీమ్ చేసుకోవచ్చని నిర్వాహకులు తెలిపారు. శిబిరంలో భాగంగా సేకరించిన రక్తంలో 33 శాతం రక్తాన్ని ప్రభుత్వ ఆస్పత్రులకు ఉచితంగా అందిస్తామని పేర్కొన్నారు.

ఓయూ లైబ్రరీలో విద్యార్థుల ఇక్కట్లు


ఓయూ రీడింగ్ హాలులో విద్యార్థులు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్‌లోని యూనివర్సిటీ ప్రధాన లైబ్రరీ పక్కన అదనంగా నిర్మించిన రీడింగ్ హాల్‌లో సరైన వసతులను ఏర్పాటు చేయకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఉద్యోగాల పోటీ పరీక్షలకు చదివే విద్యార్థుల కోసం ప్రత్యేకంగా రీడింగ్ హాల్ నిర్మించారు. కానీ అందులో కుర్చీలు, టేబుల్స్, ఇతర మౌలిక వసతులు లేకపోవడంతో విద్యార్థుల చదువుకు ఆటంకాలు ఎదురవుతున్నాయి. ఎవరి కుర్చీ వారే తెచ్చుకొని రీడింగ్ హాల్‌లో చదువుకోవాల్సి వస్తోంది. హాలులో తాగునీటితో పాటు ఇతర మౌలిక వసతులు కల్పించాలని వీసీ ప్రొ.కుమార్‌ను విద్యార్థులు కోరుతున్నారు.

ఏజీ వర్సిటీ వజ్రోత్సవాల లోగో ఆవిష్కరణ


విశ్వవిద్యాలయం వజ్రోత్సవాల లోగోను ఆవిష్కరిస్తున్న మంత్రి

ఏజీవర్సిటీ: వచ్చేనెల నిర్వహించనున్న ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం వజ్రోత్సవాలు(డైమండ్ జూబ్లీ) లోగోను మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 60 ఏళ్ల క్రితం ప్రారంభమైన ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయాన్ని దేశంలోనే నంబర్–1 స్థానంలో నిలిపేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండారెడ్డి, ప్లానింగ్ బోర్డ్ వైస్ చైర్మన్ జి.చిన్నారెడ్డి, విశ్వవిద్యాలయం వీసీ జానయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎఫ్ఆర్ఎస్‌లో హైదరాబాద్‌కు రెండో స్థానం

సాక్షి, సిటీబ్యూరో: ప్రధానోపాధ్యాయుల పర్యవేక్షణ, ప్రయత్నాలతో ఎఫ్ఆర్ఎస్‌లో విద్యార్థుల హాజరు శాతం పెరిగి రాష్ట్రంలో హైదరాబాద్ జిల్లా ద్వితీయ స్థానంలో నిలిచినందుకు ప్రధానోపాధ్యాయులను హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అభినందించారు. కలెక్టరేట్ సమావేశం మందిరంలో పాఠశాలల్లో ఎఫ్ఆర్ఎస్ యాప్‌లో విద్యార్థుల హాజరు శాతం ఈ వారం పెంచిన 10పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో మంగళవారం ఏర్పాటు చేసిన 'కాఫీ విత్ కలెక్టర్' కార్యక్రమంలో డీఈఓ ఆర్.రోహిణితో కలిసి కాఫీ తాగారు. పాఠశాలల్లో హాజరు శాతం పెంచడంతో పాటు పిల్లలకు నాణ్యమైన విద్యాబోధన జరిగేలా ఉపాధ్యాయులు పిల్లలతో అనుబంధం పెంచుకొని వారికి మంచి భవిష్యత్తు ఇవ్వాలన్నారు. ఎఫ్ఆర్ఎస్ హాజరులో రాష్ట్రంలోనే హైదరాబాద్ జిల్లా అక్టోబర్ 21 నుంచి 26 వరకు మొదటి స్థానంలో, ఇప్పుడు ద్వితీయ స్థానంలో నిలిచిందన్నారు. పదో తరగతి పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించేందుకు ఉన్నత లక్ష్యంతో పని చేయాలన్నారు.



కదలిన ప్రభుత్వ యంత్రాంగం

సాక్షి ఎఫెక్ట్..

- బావిలోని నీటిని తోడేసి శుభ్రం చేశారు
- చనిపోయిన తాబేళ్లు, చేపలను తొలగించారు

నాంపల్లి: తాబేళ్లు, చేపలు మృత్యువాత శీర్షికన ఈ నెల 21న సాక్షిలో ప్రచురితమైన కథనానికి ప్రభుత్వ యంత్రాంగం కదలివచ్చింది. పబ్లిక్ గార్డెన్స్‌లోని తెలంగాణ శాసన మండలి ఆవరణలోని పురాతన బావిని వాటర్ వర్క్స్, హార్టికల్చర్, ఫిషరీస్ డిపార్ట్‌మెంట్లకు చెందిన అధికారులు సందర్శించారు. తాబేళ్లు, చేపలు మృతి చెందడానికి గల కారణాలపై ఆరా తీశారు. డ్రైనేజీ నీరు బావిలో ఏమైనా కలిసిందా! లేక విష ప్రయోగం జరిగిందా..? అనే కోణంలో హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ అండ్ సీవరేజ్ బోర్డు అధికారులు క్షుణ్ణంగా తనిఖీ చేశారు. లీకేజీలను గుర్తించేందుకు బావిలోని నీటిని పూర్తిగా తోడేశారు. చనిపోయిన తాబేళ్లు, చేపలను తొలగించారు. బావిని పూర్తిగా శుద్ధిచేసి కొత్త నీటిని నింపుతున్నారు. పురాతన బావిలోని చేపలు, తెలుగు లలిత కళా తోరణం ఎదురుగా ఉండే నీటి కొలనులోని చేపలు ఒకే రోజు మృత్యువాత పడ్డాయి. ఈ విషయంపై ప్రభుత్వం సీరియస్‌గా స్పందించింది. తాబేళ్లు, చేపల మృతిపై విచారణకు ఆదేశించింది. ఇందులో భాగంగానే రెండు రోజులుగా పురాతన బావిపై సంబంధిత శాఖ అధికారులు దృష్టి సారించారు. బావి చుట్టూ ఉన్న పలు సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నారు.



జాతీయ హాకీ మ్యాచ్‌లు ప్రారంభం





కంటోన్మెంట్: సికింద్రాబాద్‌లోని ఆర్ఆర్‌సీ మైదానంలో 14వ హాకీ ఇండియా సబ్ జూనియర్ ఉమెన్ నేషనల్ చాంపియన్‌షిప్ 2024 పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. భారత హాకీ జట్టు మాజీ కెప్టెన్, ట్రిపుల్ ఒలింపియన్ ముఖేశ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. వచ్చేనెల 6 వరకు జరిగే ఈ పోటీల్లో మొత్తం 29 జట్లు ఈ పోటీల్లో పాల్గొంటున్నాయి. 12 ఏళ్ల తర్వాత నగరంలో జాతీయ హాకీ క్రీడలు జరుగుతుండటం విశేషం. హాకీ ఇండియా తెలంగాణ హాకీ అసోసియేషన్ నిర్వహిస్తున్న ఈ పోటీలకు తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ సహకారం అందజేస్తోందని నిర్వాహకులు వెల్లడించారు. నగరాన్ని పలు జాతీయ, అంతర్జాతీయ పోటీలకు వేదికగా మార్చాలన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆలోచనల మేరకు తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ క్రీడా సంఘాలకు సహకారం అందజేస్తుందని పేర్కొన్నారు.

తొలిరోజు జార్ఖండ్–తెలంగాణ, తమిళనాడు – ఒడిశా, ఉత్తరప్రదేశ్ – రాజస్థాన్, మహారాష్ట్ర – అస్సాం, మధ్యప్రదేశ్ – పుదుచ్చేరి, కర్ణాటక – ఢిల్లీ మ్యాచ్‌లు జరిగాయి. తొలి మ్యాచ్‌లో ఆతిథ్య తెలంగాణ జట్టు ఓటమి పాలైంది. బుధవారం తెలంగాణ జట్టు చత్తీస్‌ఘడ్‌తో తలపడనుంది.





ఈ మధ్య మంచి సినిమా వచ్చింది చూశావా బ్రో.. ఇన్‌స్టాలో కొత్త రీల్ ట్రెండింగ్‌లో ఉంది తెలుసా మచ్చా.. యూట్యూబ్‌లో ఓ వీడియో వైరల్ అవుతోంది సెండ్ చేయాలా? ఈ తరం యువతను కదిపితే వారి నోటివెంట ఎక్కువగా వచ్చే మాటలు. మనలో చాలా మంది ఇలాగే మాట్లాడతారు కూడా. అదే ఏదైనా పుస్తకం గురించి చెప్పామనుకోండి.. పుస్తకమా.. పుస్తకం చదివే టైం ఎక్కడుంది.. అయినా ఈ రోజుల్లో పుస్తకాలు ఎవరు చదువుతారు చెప్పండి! అంటూ తిరిగి ప్రశ్నిస్తుంటారు. నిజమే పుస్తక పఠనం ఈ తరం యువతలో తగ్గిపోయిందని అనుకుంటారు. కానీ మనలో చాలా మంది ఈ ట్రెండ్స్‌ని ఫాలో అవుతూనే ఏదో ఒక పుస్తకాన్ని చువుతూ ఉంటారు. మరికొందరైతే పుస్తకాలంటే పడి చచ్చిపోతుంటారు. తెలుగుతో పాటు ఇంగ్లీష్ పుస్తకాలను తెగ చదివేస్తున్నారు. - సాక్షి, సిటీబ్యూరో


హైదరాబాద్ వైబ్స్



రీడ్.. రైట్.. రైట్

పుస్తక పఠనంపై యువతలో పెరుగుతున్న ఆసక్తి

- సోషల్ మీడియా కాలంలోనూ పలువురికి హాబీగా
- నవలలు, పొట్టి కథలు, ఆత్మకథలపై మక్కువ
- లైఫ్ స్టైల్ కథా రచనలతో ఆకట్టుకుంటూ
- పుస్తక రచనపైనా ఆసక్తి కనబరుస్తున్న యువత







ఇన్‌స్టా, ఫేస్‌బుక్, యూట్యూబ్ మాత్రమే చూసే ఈ తరం యువతీ, యువకుల్లో చాలా మంది పుస్తకాలు చదివే వాళ్లు కూడా ఉన్నారా అని మనలో కొందరికి డౌటనుమానం? అయితే అదంతా వట్టి అపోహనని ఏటా జరిగే హైదరాబాద్ బుక్ ఫెయిర్‌కు వచ్చే స్పందన రుజువు చేస్తోంది. వేలాది మంది యువత ఈ ఫెయిర్‌లో లక్షల సంఖ్యలో పుస్తకాలను కొనుగోలు చేస్తున్నారు. ఒకప్పుడు బుక్ ఫెయిర్‌లో అమ్మకాలు ఎలా ఉన్నాయో ఇప్పటికీ అలానే కొనసాగుతున్నాయని చెబుతున్నారు నిర్వాహకులు.


నవలలకు ప్రాధాన్యం..

పుస్తకాలు చదివే వారిలో ఎక్కువగా నవలలకు ప్రాధాన్యం ఇస్తున్నారు. పొట్టి వీడియోలు, షార్ట్ న్యూస్ లాగే పొట్టి కథలు చదివేందుకు ఇష్టపడుతున్నారు. తక్కువ నిడివిలో చెప్పాల్సిన విషయాన్ని చెప్పేసే నవలలకు యువత ఎక్కువగా అట్రాక్ట్ అవుతోంది. ఇక, వచన కవిత్వంపై కూడా యూత్ మనసు పారేసుకుంటోంది. దీంతో పాటు ప్రముఖుల ఆత్మకథలు చదివేందుకు చాలా మంది యువతీ, యువకులు ఆసక్తి కనబరుస్తున్నారు. ఒకప్పుడు ఇంగ్లిష్‌లో నవలలు చదివేందుకు కాలేజీ విద్యార్థులు మొగ్గు చూపేవారు. కానీ ఇప్పుడు మాతృభాష అయిన తెలుగు పుస్తకాలు చదివేందుకు ప్రయత్నిస్తున్నారు. మరీ ముఖ్యంగా చిన్నప్పటి నుంచి ఇంగ్లిష్ మీడియంలో చదువుకున్న వారు తెలుగు పుస్తకాలు చదివేందుకు ఆసక్తి చూపుతున్నారు.



పాఠకులు పెరుగుతున్నారు..

1990లలో పుస్తకాలు బాగా హిట్ అయ్యేవి. ఇప్పుడు ఆ పరిస్థితి మారింది. ఎంత ఆసక్తిగా ఉన్నా కూడా పుస్తకాలు చదివే వారు తక్కువయ్యారని చాలా మంది అంటుంటారు. కానీ పుస్తకాలు చదివేవారు బాగానే పెరిగారు. ఓ సినిమా బాగుంటే ఎలా చూస్తున్నారో.. మంచి కథ.. విభిన్న కథనంతో పుస్తకాలు మార్కెట్‌లోకి వస్తే కళ్లకద్దుకుని చదివే వారి సంఖ్య విపరీతంగా పెరిగిపోయింది. ఇటీవల వచ్చిన 'అమ్మ డైరీలో కొన్ని పేజీలు' అనే పుస్తకం దాదాపు లక్ష కాపీలు అమ్ముడుపోవడమే ఇందుకు నిదర్శనం. నిజ జీవితంలో జరిగే ఉదంతాలనే ఆసక్తిగా రాస్తే పుస్తకాలు చదువుతారని ఆ పుస్తక రచయిత నిరూపించారనడంలో అతిశయోక్తి లేదు. ఇలాంటి పుస్తకాలు చదివిన తర్వాత చాలా మంది ఏదైనా మంచి పుస్తకం ఉంటే చెప్పండి బ్రదర్ అని తెలిసిన వారిని ఇప్పటి యువతీ, యువకులు అడుగుతున్న సందర్భాలు కోకొల్లలు.



రచయితలుగానూ రాణిస్తూ..

ఇటీవలి కాలంలో పుస్తకాలు రాసేందుకు కూడా యువత ఆసక్తి కనబరుస్తోంది. ముఖ్యంగా మాతృభాషపై మమకారంతో తమకు సాధ్యమైనంత వరకూ రచనలు చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. కొందరు హాబీగా ఖాళీ సమయాల్లో రచనలు చేస్తుండగా.. కొందరు మాత్రం రచనను కెరీర్‌గా ఎంచుకుంటున్నారు. మంచి కథతో వస్తే పాఠకులు ఆదరిస్తారనే నమ్మకం పెరగడంతో, మంచి కథలు రాసేందుకు ప్రయత్నిస్తున్నారు. అందరికీ పుస్తకాలు అచ్చు వేయించుకునే పరిస్థితి ఉండకపోవచ్చు. అందుకే చాలా మంది సామాజిక మాధ్యమాల్లో చిన్న చిన్న కథలు రాస్తూ తమ అభిరుచిని చాటుకుంటున్నారు. ఇలా రాస్తూ.. రాస్తూ.. పుస్తకాలు ప్రచురించేసి, ఆదరణ పొందుతున్న వాళ్లూ లేకపోలేదు. ఇక, పుస్తకాలు, సోషల్ మీడియాలో రాస్తూ సినిమాల్లో గేయ రచయితగా, స్క్రిప్ట్ రైటర్‌గా కూడా వెళ్లేందుకు దారులు వెతుక్కుంటున్నారు.

వెలకట్టలేని అనుభూతి..



పుస్తక పఠనం ఎప్పటికీ వన్నె తరగనిది. సామాజిక మాధ్యమాలు తాత్కాలికమే. పుస్తకాలు చదివితే ఏదో వెలకట్టలేని అనుభూతి కలుగుతుంది. సోషల్ మీడియాలో సమయాన్ని వృథా చేసుకునే బదులు మంచి పుస్తకం చదివితే కొత్త ప్రపంచాన్ని చూసిన వాళ్లమవుతాం.

– డాక్టర్ మల్లెగోడ గంగాప్రసాద్, రచయిత

అవినాభావ సంబంధం



చిన్నప్పటి నుంచే చిన్న చిన్న కథలు, వ్యాసాలు రాయడం అలవాటు. తెలుగుపై మమకారంతో తెలుగులో పీజీ చేశాను. ప్రస్తుతం ఉస్మానియా యూనివర్సిటీలో తెలంగాణ రచయిత్రుల కథా సాహిత్యం– స్త్రీ జీవన చిత్రణ అనే అంశంపై పీహెచ్‌డీ చేస్తున్నాను. పుస్తక పఠనంతో భాషను మెరుగుపరుచుకోవచ్చు. నిజ జీవితానికి దగ్గరగా ఉండే కథలు ఆసక్తిగా ఉంటాయి.

– పెద్దపల్లి తేజస్వి, పరిశోధక విద్యార్థిని, ఓయూ

బంగారు భవితకు బాట..



పుస్తక పఠనం యువత బంగారు భవితకు బాటలు వేస్తుంది. సాహిత్య పఠనం ద్వారా సామాజిక స్పృహ కలుగుతుంది. పుస్తకం చదువుతుంటే ఎంతో మందితో సాన్నిహిత్యంగా ఉన్నట్టు అనిపిస్తుంది. భావ వ్యక్తీకరణ, భాషా నైపుణ్యం, ఏకాగ్రత, ఓర్పు, సహనం పెరుగుతుంది.

– రావెళ్ల రవీంద్ర, యువ రచయిత



సిటీలో వీణా వరల్డ్ నూతన బ్రాంచ్..

డొమెస్టిక్, ఇంటర్నేషనల్ టూరిజంలో ప్రత్యేక ప్యాకేజీలు

సాక్షి, సిటీబ్యూరో: దేశంలోని విభిన్న ప్రాంతాలతో పాటు యూరప్ వంటి పలు విదేశీ ప్రయాణాలకు ట్రావెలింగ్ సేవలు అందిస్తున్న 'వీణా వరల్డ్' నూతన బ్రాంచ్‌ను నగరం వేదికగా ప్రారంభించారు. దక్షిణాదిలోని తమ కస్టమర్లకు బెంగళూరుతో పాటు హైదరాబాద్‌లో తమ సేవలను అందించడంలో భాగంగా మంగళవారం ఈ నూతన బ్రాంచ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వీణా వరల్డ్ ఫౌండర్, ఎండీ సునీలా మాట్లాడుతూ.. 2013 నుంచి పర్యాటకులకు ట్రావెలింగ్ సేవలు అందిస్తున్న తమ సంస్థ 2023–24 సంవత్సరంలో ఏకంగా లక్ష మందిని తమ పర్యాటక గమ్యస్థానాలకు చేర్చామని తెలిపారు. వరల్డ్ టూర్‌లో భాగంగా ప్రత్యేకంగా యూరప్ టూర్ ప్యాకేజీలతో పాటు న్యూజిల్యాండ్, ఆస్ట్రేలియా, కొరియా, తైవాన్, సింగపూర్ వంటి ప్రపంచ దేశాలకు, డొమెస్టిక్ విభాగంలో గుజరాత్, రాజస్థాన్, కాశ్మీర్, కేరళ వంటి ప్రాంతాల్లో సేవలందిస్తున్నామన్నారు. ఒక్క యూరప్‌కే 70 ప్యాకేజీలు అందుబాటులో ఉన్నాయని, సీనియర్ సిటిజనులకు, మహిళలకు సురక్షిత ప్యాకేజీలు అందిస్తున్నామని వివరించారు. ఇప్పటి వరకూ దాదాపు 15 లక్షల మందికి తమ సేవలు అందాయన్నారు. హైదరాబాద్ నుంచి తమ కస్టమర్ల సంఖ్య విస్తృతంగా పెరగడంతో ఇక్కడే నూతన బ్రాంచ్ ఏర్పాటు చేశామని వివరించారు.



రూ. 80లకు 800 కి.మీ.!



- మార్కెట్‌లోకి సరికొత్త ఎలక్ట్రిక్ మోటార్ వాహనం
- చార్జింగ్ కష్టాలకు చెక్.. తొలిసారి బ్యాటరీ స్వాప్ ఆప్షన్..
- గ్రావిటన్ సంస్థ సరికొత్త ఆవిష్కరణ..

సాక్షి, సిటీబ్యూరో/రాయదుర్గం: ఎలక్ట్రిక్ వాహనాలకు చార్జింగ్ విషయంలో ఎదురవుతున్న సమస్యలకు విరుగుడుగా బ్యాటరీ స్వాపింగ్ ఆప్షన్‌తో ముందుకొచ్చింది గ్రావిటన్ అనే స్టార్టప్. దేశంలోనే తొలిసారిగా లిథియం మాంగనీస్ ఐరన్ ఫాస్ఫేట్ (ఎల్ఎంఎఫ్‌పీ)తో బ్యాటరీలు రూపొందించి.. ఈ బైక్‌ను అభివృద్ధి చేశారు. టీ–హబ్‌లో మంగళవారం జరిగిన కార్యక్రమంలో గ్రాండ్‌గా మోటార్ వెహికల్ 'క్వాంటా'ను గ్రావిటన్ వ్యవస్థాపకుడు, సీఈవో పరశురాం పాక గ్రాండ్ లాంచ్ చేశారు. అన్ని రకాల రోడ్లపై మన వాతావరణానికి అనుగుణంగా ఉండేలా ఈ బైక్‌ను డిజైన్ చేసినట్టు వెల్లడించారు. ఇది పూర్తి పవర్ రన్ ట్రెన్ టెక్నాలజీతో తయారు చేశామని వివరించారు. ఇలా చేసిన తొలి కంపెనీ తమదేనని, కన్యాకుమారి నుంచి కార్దుంగ్‌లా వరకూ ఆపకుండా ఈ బైక్‌పై వెళ్లి ఆసియా బుక్ ఆఫ్ రికార్డు సాధించామని తెలిపారు. మార్కెట్‌లో దీని ఎక్స్ షోరూమ్ ధర రూ.1.20 లక్షలు ఉంటుందన్నారు. తొలి బైక్‌ను తన చిన్ననాటి ఉపాధ్యాయునికి అందజేయడం గమనార్హం.



ఫుట్‌వేర్ డిజైనింగ్‌పై సింపోజియం

ఎఫ్‌డీడీఐ హైదరాబాద్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ తేజ్ లోహిత్‌రెడ్డి

రాయదుర్గం: ఫుట్‌వేర్ డిజైనింగ్ రంగంలో ఎఫ్‌డీడీఐ హైదరాబాద్‌కు ప్రత్యేక స్థానం ఉందని సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, ఐఏఎస్ అధికారి డాక్టర్ తేజ్ లోహిత్‌రెడ్డి పేర్కొన్నారు. రాయదుర్గంలోని ఫుట్‌వేర్ డిజైన్ అండ్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్ (ఎఫ్‌డీడీఐ) ప్రాంగణంలో మంగళవారం 'పాదరక్షలపై భద్రత–ప్రమాణాలు' అనే అంశంపై ప్రత్యేక సింపోజియం నిర్వహించారు. ప్రతి ఒక్కరికీ పాదరక్షలు ఎంతో ముఖ్యమైనవని, వాటి డిజైన్లను రూపొందించడంలో ఎఫ్‌డీడీఐ హైదరాబాద్ ప్రత్యేక స్థానం పొందిందన్నారు. ఈ రంగంలో నూతన ఆవిష్కరణలు, డిజైన్లపై తరచూ అవగాహన కల్పించేందుకు సింపోజియం ఏర్పాటు చేశామన్నారు. భారతీయ, అంతర్జాతీయ భద్రతపై బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్స్ (బీఐఎస్) సైంటిస్ట్ సత్తు సవిత, పాదరక్షల తయారీ దృక్పథం, పరిశ్రమ సవాళ్లు, అవకాశాలపై కౌన్సిల్ ఫర్ లెదర్ ఎక్స్‌పోర్ట్స్ ప్రతినిధులు రెహాన్ అజ్మాన్, పాదరక్షల డిజైన్లు, ఆవిష్కరణలు, ప్రదర్శనలపై ఎర్త్ ట్యూన్స్ ప్రతినిధి సంతోష్, డీఆర్‌డీఓ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ కె వీరబ్రహ్మం కేంద్రీకృత దృక్కోణాలు– నిర్మాణం, మైనింగ్, భారీ నుంచి ఇన్‌పుట్‌లు, పరిశ్రమలు, రక్షణ రంగాల అంశాలపై ప్రిన్స్‌జోషఫ్, పరిశోధనలు, సేఫ్టీ ఫుట్‌వేర్ డిజైన్ అంశాలపై సీఎస్ఐఆర్–ఐఐసీటీ సీనియర్ ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ అరుణ ప్రత్యేక ఉపన్యాసం చేశారు. అనంతరం బీఐఎస్ స్టాండర్డ్ క్లబ్ నిబంధనలకు అనుగుణంగా విద్యార్థులు పోస్టర్ ప్రదర్శన చేశారు.

సాంస్కృతిక సంగమం..

అలరించిన 'అడ్వెంచర్స్ ఇన్ ది వండర్లాండ్' ప్రదర్శనలు

సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని సీనియర్ సీడ్స్ ప్రైమరీ క్యాంపస్, సీడ్స్ ఏరియన్ క్యాంపస్ ఆధ్వర్యంలో సంగమం వార్షికోత్సవ వేడుకలను మియాపూర్‌లోని విశ్వనాథ్ గార్డెన్స్‌లో నిర్వహించారు. ముఖ్య అతిథిగా సంగారెడ్డి జిల్లా డిప్యూటీ కలెక్టర్ అశోక్ చక్రవర్తి, ప్రముఖ కథకురాలు రేణు చామర్తి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు నిర్వహించిన 'అడ్వెంచర్స్ ఇన్ ది వండర్లాండ్' అనే ప్రత్యేకమైన థీమ్ ఆధారంగా నృత్యాలు, గీతాలు, నాటికలు వీక్షకులను విశేషంగా అలరించాయి. సంస్థ వైస్–చైర్మన్ పాండు రంగాచారి, ఫౌండర్, మేనేజింగ్ డైరెక్టర్ ఈడ్పుగంటి నరేంద్ర ప్రసాద్, అకడెమిక్ హెడ్ డాక్టర్ జయశ్రీ నాయర్ పాల్గొన్నారు.





సోయగాల.. రిజొనెన్స్

3డీ ఎంబ్రాయిడరీ, పార్శీ-సుజిని-ఇన్‌స్పైర్డ్ డీటైలింగ్



నగరానికి చేరుకున్న రిజొనెన్స్ 2024/25 కలెక్షన్..




సాక్షి, సిటీబ్యూరో: బంజారాహిల్స్ వేదికగా అధునాతన ఫ్యాషన్ డిజైనింగ్ తళుకులను ప్రదర్శించే రిజొనెన్స్ 2024/25 కలెక్షన్ ఆవిష్కృతమైంది. ఇప్పటికే ఢిల్లీ వేదికగా ఫ్యాషన్ ఔత్సాహికుల ఆదరణ పొందిన రిజొనెన్స్ భాగ్యనగరానికీ విచ్చేసింది. నగరానికి చెందిన ప్రముఖ ఫ్యాషన్ ఐకాన్, వస్త్ర విక్రేత స్వప్న అనుమోలు ఆధ్వర్యంలో 'ది మిశ్రు స్టోర్' వేదికగా ఈ కలెక్షన్ ప్రారంభమైంది. కేవలం ఫ్యాషన్ మాత్రమే కాకుండా.. మల్టీ సెన్సరీ అనుభవాన్ని, అద్భుతమైన డిజైన్ల సమ్మోహనాన్ని ఈ వేదిక అందిస్తుంది. ఈ కార్యక్రమంలో భాగంగా స్వప్న అనుమోలు, సోనా రెడ్డి రూపొందించిన వైల్డ్ స్కేప్స్ వస్త్ర ప్రదర్శన ఫ్యాషన్ ప్రియులను ఆకట్టుకుంటుంది. ఈ వేదికలో విభిన్న జోన్‌లలో డ్రై టెక్స్చర్స్, మ్యూటెడ్ టోన్లతో రూపొందించిన వస్త్రాలను ప్రదర్శించారు. రిజొనెన్స్ అనేది పూర్తిగా వ్యక్తిగతమైన కలెక్షన్. ఇక్కడ క్రాఫ్టులు ప్రకృతి శక్తికి నిదర్శనమని మిశ్రు వ్యవస్థాపకురాలు, క్రియేటివ్ ఫ్యాషన్ డైరెక్టర్ స్వప్న అనుమోలు వివరించారు. ఇందులో 3డీ ఎంబ్రాయిడరీ, పార్శీ–సుజిని–ఇన్‌స్పైర్డ్ డీటైలింగ్ సహా వినూత్న పద్ధతులు ఉన్నాయని ఆమె పేర్కొన్నారు.


Government of Haryana | Kurukshetra Development Board कुरुक्षेत्र विकास मंडल | Partner State Odisha | Partner Country Tanzania

यद्यदाचरति श्रेष्ठस्तत्तदेवेतरो जनः।
स यत्प्रमाणं कुरुते लोकस्तदनुवर्तते॥
भगवद्गीता 3.21

International GITA Mahotsav 2024

28 November-15 December
Kurukshetra, Haryana





Programs

Time	Venue	Program
Thursday, 5 December		
09:00 am	Purushottampura Baag, Brahma Sarovar	Gita Yajna and Gita Pujan
11:15 am	Purushottampura Baag	Inauguration of the Pavilions of Haryana, Partner State Odisha and Partner Country Tanzania
12:30 pm	Srimad Bhagavadgita Sadan, Kurukshetra University	Inauguration of International Gita Seminar
05:00 pm	Purushottampura Baag, Brahma Sarovar	Bhajan Sandhya and Maha Aarti
06:00 pm	Purushottampura Baag, Brahma Sarovar	Cultural Evening
Monday, 9 December		
02:00 pm	Purushottampura Baag, Brahma Sarovar	Congregation of Saints (Sant Sammelan)
Tuesday, 10 December		
02:00 pm	Purushottampura Baag, Brahma Sarovar	All India Devasthanam Conference
Wednesday, 11 December		
9:00 am	Jyotisar-The Birthplace of Gita and Sannihit Sarovar	Complete recitation of Srimad Bhagavadgita and Gita Yajna
10:00 am	Theme Park	Global Gita Chanting by 18000 students
11:00 am	Purushottampura Baag, Brahma Sarovar	Cultural programs in Haryana and Odisha Pavilions
02:00 pm	Srimad Bhagavadgita Sadan, Kurukshetra University	48 Kos Tirtha Sammelan
03:00 pm	In front of Kurukshetra Development Board office	Departure of Gita Shobha Yatra
05:30 pm	Brahma Sarovar, Sannihit Sarovar & Jyotisar	Deepotsav
05:30 pm	48 Kos Kurukshetra region	Deepotsav at Tirthas
06:00 pm	Purushottampura Baag, Brahma Sarovar	Gita Maha Aarti and Deep Daan
06:30 pm	Purushottampura Baag, Brahma Sarovar	Cultural Evening
28 November - 15 December		
09:00 am	Brahma Sarovar	Crafts and Saras Fair - A confluence of renowned craftsmen
5 - 11 December		
09:00 am	Purushottampura Baag, Brahma Sarovar	State level exhibition by Information, Public Relations & Languages Department, Haryana
09:00 am	Brahma Sarovar	Gita Book Fair by Haryana Granth Academy
11:00 am	Purushottampura Baag & Mahila Ghats	Cultural Programs of Haryana & Odisha
06:00 pm	Purushottampura Baag, Brahma Sarovar	Cultural Evening



"सभी देशवासियों को गीता जयंती की अनंत शुभकामनाएं। श्रीमद्भगवद्गीता सदियों से मानवता का मार्गदर्शन करती आई है। अध्यात्म और जीवन-दर्शन से जुड़ा यह महान ग्रंथ हर युग में पथ प्रदर्शक बना रहेगा।"

- नरेन्द्र मोदी

@igmkkr
InternationalGitaMahotsav

www.internationalgitamahotsav.in
www.48koskurukshetra.com

Information, Public Relations & Languages Department, Haryana | www.prharyana.gov.in | Follow us on | @dipharyana

సాక్షి ఫ్యామిలీ
హైదరాబాద్
బుధవారం ॥ 27-11-2024

• స్ఫూర్తి

'క్రికెట్ ప్లేయర్ కావాలనుకుంటున్నాను' అనే మాట అబ్బాయిల నోట వినిపిస్తే అభినందనలు తెలుపుతారు. ఆశీర్వదిస్తారు. అదే మాట అమ్మాయిల నోటి నుంచి వినిపిస్తే..? అవాక్కవుతారు. 'అమ్మాయిలకు క్రికెట్ ఎందుకు?' అని కూడా అంటారు. లక్ష్యం మీద గురి పెట్టిన వారు మాత్రం అలాంటి మాటలను లక్ష్యపెట్టరు. అలాంటి ఒక అమ్మాయి శ్రీవల్లి. ఎన్నో సవాళ్లను అధిగమించి తన కలను నెరవేర్చుకున్న శ్రీవల్లి క్రికెట్‌లో రాణిస్తోంది. డిసెంబరు 4 నుంచి అహ్మదాబాద్‌లో జరగనున్న మ్యాచ్‌లో బీసీసీఐ సీనియర్ మహిళల జట్టులో హైదరాబాద్ తరఫున ప్రాతినిధ్యం వహించనుంది.



నీ ఆటే బంగారం... శ్రీవల్లీ

శ్రీవల్లికి క్రికెట్ అంటే చాలా ఇష్టం. అయితే ఆ ఇష్టం టీవీలో వీక్షణకే పరిమితం కాలేదు. చిన్న వయసులోనే బాల్, బ్యాట్‌తో గ్రౌండ్‌లో అడుగు పెట్టేలా చేసింది.

శ్రీవల్లి అయిదవ తరగతి చదువుతున్న రోజుల్లో...

స్కూల్ ప్లే గ్రౌండ్‌కు వెళ్లింది.

హైస్కూల్ అబ్బాయిలు అక్కడ క్రికెట్ ఆడుతున్నారు.

'అన్నా... నేను కూడా ఆడతాను' అని అడిగింది చిన్నారి శ్రీవల్లి.

వాళ్లు బిగ్గరగా నవ్వారు.

ఆ నవ్వులో ఎన్నో అర్థాలు ఉన్నాయి.

'అయిదో క్లాసు అమ్మాయి హైస్కూల్ అబ్బాయిలతో ఆడడం ఏమిటి!' అని కావచ్చు.

'ఆడపిల్లలు క్రికెట్ ఆడడం ఏమిటి!' అని కావచ్చు.

వారి వెటకారపు నవ్వులతో వెనక్కి వెళ్లిపోలేదు శ్రీవల్లి. పీఈటీ రహీం సార్‌కు చెప్పింది.

'నీ ఉత్సాహం సరే, వారితో ఆడగలవా?' అని అడిగారు సార్.

'ఆడతాను' అని ఉత్సాహంతో తల ఊపింది.

నిజానికి అది ఉత్సాహం మాత్రమే కాదు ఆత్మవిశ్వాసానికి సంబంధించిన తొలి సంకేతం. విజయపథం వైపు వేసిన తొలి అడుగు.

శ్రీవల్లి చేసిన బౌలింగ్‌లో సీనియర్లు షాట్లు బాగానే కొట్టారు. కానీ, తన స్పీడ్‌కు కొందరు బెంబేలెత్తడం పీఈటీ సార్ గమనించారు. లైన్ లెంగ్త్ సరిదిద్దితే శ్రీవల్లిని బాగా తీర్చిదిద్దవచ్చు అని గుర్తించారు. అక్కడ నుంచి తానే కోచ్‌గా మారారు. శ్రీవల్లి బౌలింగ్‌లోని లోపాలను సరిచేస్తూ క్రమంగా స్పీడ్‌బౌలర్‌గా తీర్చిదిద్దారు

'మీ అమ్మాయికి మంచి భవిష్యత్ ఉంది' అని శ్రీవల్లి తల్లిదండ్రులకు చెప్పారు.

'క్రికెట్ అంటే ఏదో సరదాగా ఆడుతోంది కానీ అమ్మాయిని డాక్టర్‌గా చూడాలనేది మా కల' అని వారు అని ఉంటే శ్రీవల్లి కల ఆవిరైపోయేది. అయితే సార్ మాట విని శ్రీవల్లి తల్లిదండ్రులు చాలా సంతోషించారు. కుమార్తెకు మరింత సాధన అవసరమనుకున్న తండ్రి లక్ష్మారెడ్డి శ్రీవల్లిని హైదరాబాద్ పంపాడు.

'పై చదువుల కోసమో, ఎంసెట్ కోచింగ్ కోసమో పిల్లల్ని హైదరాబాద్‌కు పంపిస్తారు గానీ క్రికెట్ కోచింగ్ కోసం పంపిస్తున్నావా!' అని బోలెడు ఆశ్చర్యపడిన వాళ్లు...

'క్రికెట్‌లో ఎవరికో ఒకరికి అదృష్టం దక్కుతుంది. ఆడినవాళ్లందరూ స్టార్‌లు కాలేరు' అని నిరాశపరిచిన వాళ్లూ ఉండొచ్చు.

ఎవరి నుంచి ఎలాంటి మాటలు వచ్చినా ఆ తల్లిదండ్రులకు బాగా నచ్చిన మాట...'మీ అమ్మాయికి క్రికెట్‌లో మంచి భవిష్యత్ ఉంది'

హైదరాబాద్‌లో కనిష్కనాయుడు శిక్షణలో క్రికెట్‌లో తన నైపుణ్యాన్ని మరింతగా మెరుగుపరుచుకుంది శ్రీవల్లి. ఫాస్ట్‌బౌలర్‌గానే కాకుండా, బ్యాటింగ్‌తోనూ ఆకట్టుకోగల ఆల్‌రౌండ్ నైపుణ్యాన్ని సొంతం చేసుకుంది.

బాల్యంలోనే పెద్ద కలలు కన్న శ్రీవల్లి టీనేజ్‌లో ఆ కలలను తన సాధనతో మరింత సాకారం చేసుకుంది.

ప్రపంచంలోనే అత్యంత ఫాస్ట్ బౌలర్‌గా రాణించాలనేది శ్రీవల్లి లక్ష్యం.

ఆమె కల నెరవేరాలని ఆశిద్దాం.


– అనిల్ కుమార్ భాషబోయిన
సాక్షి ప్రతినిధి, కరీంనగర్

ఆ స్ఫూర్తితోనే...


అబ్బాయిలతో పోల్చితే అమ్మాయిలు క్రికెట్ ఆడడానికి రకరకాల పరిమితులు ఉండొచ్చు. అయితే ఆడాలనే ఉత్సాహంతో పాటు సంకల్పబలం ఉంటే ఆ పరిమితులు మనకు అడ్డు కావు. ఎంతోమంది స్టార్ క్రికెట్ ప్లేయర్‌ల అపూర్వ విజయాలతో స్ఫూర్తి పొందాను. ఆ స్ఫూర్తితోనే క్రికెట్ గ్రౌండ్‌లోకి అడుగుపెట్టాను. ఫాస్ట్ బౌలర్‌గా రాణించాలనేది నా కల.

– కట్టా శ్రీవల్లి రెడ్డి

పాండిచ్చేరికి 10 కిలోమీటర్ల దూరంలో ఉన్న 'అరోవిల్'ను రహస్య నగరం అంటారు. కులం, మతం, డబ్బు లేకుండా కొంతమంది జీవించే ఇక్కడి నుంచే పెరిగి పెద్దదయ్యింది అహిల్య బామ్రూ. వ్యంగ్య వీడియోలు చేసే యూట్యూబర్‌గా ఈమె చేసిన 'ప్రయోగం' సక్సెస్ అయ్యి బాలీవుడ్ దాకా చేర్చింది. ఇటీవల విడుదలయ్యి ప్రశంసలు పొందుతున్న 'ఐ వాంట్ టు టాక్'లో అభిషేక్ బచ్చన్ కుమార్తెగా నటించింది. 'అరోవిల్'లో నాకు దొరికిన స్వేచ్ఛ నన్ను తీర్చిదిద్దింది అంటున్న అహిల్య జీవితం ఆసక్తికరం.



అరోవిల్



'ఐ వాంట్ టు టాక్'లో అభిషేక్ బచ్చన్ కుమార్తెగా అహిల్య బామ్రూ

రహస్య నగరి నుంచి బాలీవుడ్ వరకూ

న్యూస్‌మేకర్



అహిల్య బామ్రూ

'నేను ముంబైలో పెరిగి ఉంటే ఇలా ఉండేదాన్ని కానేమో. ఆరోవిల్‌లో పెరగడం వల్ల నేను ఒక భిన్నమైన వ్యక్తిత్వాన్ని నిర్మించుకోగలిగాను' అంటుంది అహిల్యా బ్రమూ.

అహిల్యా గురించి చెప్పాలంటే ఒక విజిటింగ్ కార్డు ఆ అమ్మాయికి చాలదు. ఆ అమ్మాయి గాయని, చిత్రకారిణి, డాన్సర్, నటి, వాయిస్‌ఓవర్ ఆర్టిస్ట్, డిజిటల్ క్రియేటర్...'ఇవన్నీ నేను ఆరోవిల్‌లో ఉచితంగా నేర్చుకున్నాను. ఉచితంగా నేర్పించేవారు అక్కడ ఉన్నారు. బయట ఇది ఏ మాత్రం సాధ్యం కాదు. ఎందుకంటే ప్రతిదానికీ డబ్బు కావాలి' అంటుంది అహిల్య.

ఇంతకీ ఆరోవిల్ అంటే? అదొక రహస్య నగరి. ఆధ్యాత్మిక కేంద్రం. లేదా భిన్న జీవన స్థావరం. ఇది పాండిచ్చేరికి 10 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. మనం కూడా సందర్శించవచ్చు. ఇక్కడ 42 దేశాలకు చెందిన 3000 మంది పౌరులు జీవిస్తున్నారు. వారి పని? డబ్బు ప్రస్తావన లేకుండా జీవించడం. పండించుకోవడం, తినడం, పుస్తకాలు చదువుకోవడం, తమకు వచ్చింది మరొకరికి నేర్పించడం, మెడిటేషన్. వీరు చేసేవాటిని 'గ్రీన్ ప్రాక్టిసెస్'. అంటే పృథ్వికీ, పర్యావరణానికీ ద్రోహం చేయనివి. అక్కడే అహిల్య పెరిగింది.

స్వేచ్ఛ ఉంటుంది

'మాది ముంబై. నేను అక్కడే పుట్టా. ఆ తర్వాత మా అమ్మానాన్నలు పాండిచ్చేరి వచ్చారు. అక్కడ నేను ఆశ్రమ పాఠశాలలో ఇంగ్లిష్, ఫ్రెంచ్, బెంగాలీ నేర్చుకున్నాను. ఆ తర్వాత ఆరోవిల్‌కు మారాము. అక్కడ విశేషం ఏమిటంటే చదువులో, జీవితంలో కావాల్సినంత స్వేచ్ఛ ఉంటుంది. ఏది ఇష్టమో అది నేర్చుకుంటూ పోవచ్చు. విసుగు పుడితే మానేయవచ్చు. బయట ప్రపంచానికి సంబంధం లేని పోటీతో జీవన శైలితో ఉండవచ్చు. ఇది అందరికీ సెట్ అవదు. కాని నాకు సెట్ అయ్యింది. నేను ఇక్కడ ఎన్నెన్ని నేర్చుకున్నానో చెప్పలేను. ఇక్కడ పెరగడం వల్ల నాకు ఆధ్యాత్మిక భావన అంటే ఏమిటో తెలిసింది. ప్రకృతితో ముడిపడి ఉండటం అంటే ఏమిటో తెలిసింది. భిన్న సంస్కృతులు, జీవితాలు తెలిశాయి. ఆరోవిల్ లక్ష్యం విశ్వమానవులను ఏకం చేయడం. ఇది చిన్న లక్ష్యం కాదు. మనుషులందరూ ఒకటే అని చాటాలి. బయట ఉన్న రొడ్డకొట్టుడు జీవితంతో, పోటీతో విసుగుపుట్టి ఎందరో ఇక్కడకొచ్చి ఏదైనా కొత్తది చేద్దాం అని జీవిస్తున్నారు. ఆరోవిల్ మీద విమర్శలు ఉన్నాయి. ఉండదగ్గవే. కాని ఇది ప్రతిపాదిస్తున్న జీవనశైలి నచ్చేవారికి నచ్చుతుంది' అంటుంది అహిల్య.

రీల్స్‌తో మొదలుపెట్టి...

వ్యంగ్యం, హాస్యం ఇష్టం అధికంగా ఉన్న అహిల్య సరదాగా రీల్స్‌తో మొదలుపెట్టి డిజిటల్ క్రియేటర్‌గా మారింది. మన దేశానికి వచ్చిన విదేశీయులు ఆవును చూసి, గేదెను చూసి ఎంత ఆశ్చర్యపోతుంటారో అహిల్య చాలా సరదాగా చేసి చూపిస్తుంది. అందరి యాక్సెంట్, బాడి లాంగ్వేజ్ ఇమిటేట్ చేస్తూ ఆమె చేసే వీడియోలకు ఫ్యాన్స్ కొల్ల. అందుకే అభిషేక్ బచ్చన్ ముఖ్యపాత్రలో నవంబర్ 22న విడుదలైన 'ఐ వాంట్ టు టాక్' సినిమాలో మొదటిసారిగా బాలీవుడ్ నటిగా మొదటి అడుగు వేయగలిగింది అహిల్య. ఈ సినిమాలో కేన్సర్ పేషంట్ అయిన సింగిల్ పేరెంట్ అభిషేక్ తన కూతురితో అంత సజావుగా లేని అనుబంధాన్ని సరి చేసుకోవడానికి పడే కష్టం, కూతురుగా అహిల్య పడే తాపత్రయం అందరి ప్రశంసలు పొందేలా చేశాయి.

● రీయూజ్

పేద పిల్లల రిచ్ ఫ్యాషన్

లక్నోలోని నిరుపేద పిల్లలు ప్రముఖ డిజైనర్ సబ్యసాచి స్ఫూర్తితో పెళ్లి దుస్తులను రూపొందించారు. ఈ విషయాన్ని సూచిస్తూ తీసిన వీడియోను ఇటీవల ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేశారు. వారు రూపొందించిన బ్రైడల్ వేర్‌ను ధరించి, మోడలింగ్ చేసిన వాళ్లలోనూ పేద పిల్లలూ ఉన్నారు.

ఫ్యాషన్ పరిశ్రమపై సబ్యసాచి ముఖర్జీ ప్రభావం అతని అద్భుతమైన డిజైన్‌లకు మించి విస్తరించింది. దీంతోపాటు భారతీయ సాంస్కృతిక, సంప్రదాయ హస్తకళనూ ప్రోత్సహిస్తుంది. లాభాపేక్ష లేని సంస్థ 'ఇన్నోవేషన్ ఫర్ ఛేంజ్' మార్గదర్శకత్వంలో సబ్యసాచి కళాఖండాలు, అతని దిగ్గజ డిజైన్‌లు ఇప్పుడు లక్నోలోని నిరుపేద పిల్లల బృందానికి స్ఫూర్తినిచ్చాయి.



ఈ నిరుపేద యువ డిజైనర్లు సగర్వంగా తమ క్రియేషన్‌లను ధరించి కెమెరా ముందు ఆత్మవిశ్వాసంతో పోజులిచ్చారు. 'మేం లక్నో ఆధారిత ఎన్జీవోతో కలిసి 400 మంది నిరుపేద పిల్లలతో కలిసి పని చేస్తున్నాం. ఈ పిల్లలకు ఉచిత విద్యను అందిస్తున్నాం. ఈ దుస్తులను మా విద్యార్థులు రూపొందించారు. ఇందులో ప్రదర్శనలు ఇస్తున్న విద్యార్థులందరూ మురికివాడల నుండి వచ్చినవారే. వారు తమ సృజనాత్మకత ద్వారా డిజైనర్ దుస్తులను రూపొందించడానికి ప్రయత్నిస్తున్నారు. స్థానికులు, చుట్టుపక్కల వ్యక్తుల నుండి స్వచ్ఛంద సంస్థ ద్వారా పొందే అన్ని దుస్తులను రీయూజ్ చేయడానికి ప్రయత్నిస్తారు. సబ్యసాచి సోషల్ మీడియా అకౌంట్‌లో మోడల్ దుస్తులను చూసిన తర్వాత వారు ఇలాంటి డిజైన్స్ చేయాలని నిర్ణయించుకున్నారు' అని ఇన్నోవేషన్ ఫర్ ఛేంజ్ ఎన్జీవో తెలిపింది. ప్రతిరోజూ తమ నైపుణ్యాలను మెరుగుపర్చడానికి శ్రద్ధగా కృషి చేస్తున్న 15 ఏళ్ల ఉత్సాహవంతమైన పిల్లలు ఈ వీడియోను చిత్రీకరించారు.

ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ప్రఖ్యాత డిజైనర్ సబ్యసాచి ముఖర్జీ కామెంట్స్ విభాగంలో హార్ట్ ఎమోజీని పోస్ట్ చేయడం ద్వారా వారికి తన ఆశీస్సులను, ప్రశంసలను అందజేశాడు. అంతేకాదు, ఈ వీడియోను తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో షేర్ చేశాడు. 'ఈ పిల్లలకు మరింత శక్తి... ప్రేమ, ఆశీర్వాదాలు అందాలి..' అంటూ కామెంట్స్ వస్తున్నాయి.

అందాన్ని మించిన తెలివి



ఐపీఎల్ (కె.కె.ఆర్) ఆక్షనీర్ జాహ్నవీ మెహతా

ఐపీఎల్ ఆటగాళ్ల 'వేలం' ముగిసింది. వేలంలో పాల్గొన్న 10 ఫ్రాంచైజీలూ కలిపి ఆటగాళ్ల కోసం రు. 639 కోట్లకు పైగా ఖర్చుపెట్టాయి. మరోవైపు – ఆది, సోమవారాల్లో తొలిరోజు పాట జరుగుతున్నంత సేపూ.. కోటి రూపాయల ప్రశ్న ఒకటి ఇంటర్నెట్‌ను పల్టీలు కొట్టిస్తూనే ఉంది.

''ఆమె ఎవరు? ఆమె పేరేంటి?'' – ఇదీ ఆ ప్రశ్న.

''ఆమె జాహ్నవీ మెహతా. కోల్‌కతా నైట్ రైడర్స్'' – ఇదీ జవాబు.

''జాహ్నవీ మెహతానా! సో క్యూట్'' – ఒకరు.

''దేవుడా! ఏమిటి ఇంతందం!!'' – ఇంకొకరు.

పాట ముగిసినా కూడా, ''ఇంతందంగా ఉన్నావే ఎవరే నువ్వు?'' అంటూ కొన్ని గంటల పాటు నెట్‌లో ఆమె కోసం వేట' సాగుతూనే ఉంది.

అందమే కాదు, అందాన్ని మించిన తెలివితేటలు ఉన్న అమ్మాయి జాహ్నవి మెహతా. డాటర్ ఆఫ్ జూహీ చావ్లా. అవునా! అక్కడేం పని ఈ అమ్మాయికి! అక్కడే మరి పని! కోల్‌కతా నైట్ రైడర్స్‌కి కో–ఓనర్ జూహి చావ్లా. టైమ్‌కి ఆమె వేలంపాటకు చేరుకోలేకపోయారు. ''ఇదుగో వస్తున్నా..'' అంటూ జెడ్డా ఫ్లయిట్ నుంచి వీడియో పంపారు. ఆమె వచ్చేలోపు పాట మొదలైందో, లేక ''నువ్వే పాడు'' అని అంతటి బాధ్యతను కూతురిపై ఉంచారో.. తల్లికి బదులుగా జాహ్నవి వేలం పాటలో పాల్గొంది. 21 మంది ఆటగాళ్లను దక్కించుకుంది. వాళ్లకు పెట్టిన ఖర్చు పోగా, ఇంకో ఐదు లక్షలు మిగిల్చింది కూడా!



కూతురు జాహ్నవితో తల్లి జూహీ చావ్లా

జాహ్నవి సోషల్ మీడియాలో కనిపించటం అరుదు. ఆమెకొక 'పబ్లిక్ ఇన్‌స్టాగామ్ పేజ్' ఉంది కానీ, అందులో 2022 తర్వాత ఒక్క పోస్టు కూడా ఆమె పెట్టలేదు. అయితే ఆ ఏడాది ఐపీఎల్ వేలంలో మాత్రం షారుక్ ఖాన్ కూతురు సుహానా, కొడుకు ఆర్యన్‌లతో కలిసి తొలిసారి కనిపించింది. తల్లి తరఫున జాహ్నవి, షారుక్ తరఫున సుహానా, ఆర్యన్ కోల్‌కతా నైట్ రైడర్స్ (కె.కె.ఆర్) వేలంలో కూర్చున్నారు. (షారుఖ్ కూడా కె.కె.ఆర్‌కి ఒక కో ఫౌండర్).

ఆ తర్వాత జాహ్నవి బాహ్య ప్రపంచానికి కనిపించటం మళ్లీ ఇప్పుడే! గత ఏడాదే ఆమె కొలంబియా యూనివర్శిటీ నుంచి గ్రాడ్యుయేషన్ పూర్తి చేసింది. అప్పుడు కూడా ఆమె సోషల్ మీడియాలోకి రాలేదు. జూహీ చావ్లానే గ్రాడ్యుయేషన్ గౌన్‌లో ఉన్న తన కూతురి కాన్వొకేషన్ ఫొటోను ఇన్‌స్టాగామ్‌లో పోస్ట్ చేసి, 'కొలంబియా క్లాస్ 2023' అని కాప్షన్ పెట్టి తన మురిపెం తీర్చుకున్నారు. జాహ్నవి స్కూల్ చదువు కూడా ఇంగ్లండ్‌లోనే అక్కడి చాటర్ హౌస్ స్కూల్లో సాగింది. అంతకుముందు ముంబైలోని ధీరూబాయి అంబానీ ఇంటర్నేషనల్ స్కూల్లో చదివింది.

తల్లి పోస్ట్ చేసిన ఫొటోలో గ్రాడ్యుయేషన్ గౌన్‌లో జాహ్నవిని అప్పుడు పెద్దగా ఎవరూ పట్టించుకున్నట్లు లేదు. ఇప్పుడు మాత్రం తల్లి తరఫున ఐపీఎల్ ఆక్షన్‌లో డార్క్ బ్లూ వెల్వెట్ జాకెట్, వైట్ టీ షర్టుతో కనిపించిన జాహ్నవిని చూసి ''ఎవరబ్బా ఈ అమ్మాయి?!'' అని ఆరాలు తీశారు. ఎవరో తెలిశాక, ''తల్లి పోలికలు ఎక్కడిపోతాయి?'' అని ఒకప్పటి మిస్ ఇండియా, బాలీవుడ్ అందాల నటి అయిన జూహీ చావ్లాను కూడా ఆరాధనగా ట్యాగ్ చేశారు.

'అందం ఒక్కటేనా తల్లి పోలిక? ఆ తెలివి మాత్రం!' అన్నట్లు ఈ ఏడాది ఐపీఎల్ ట్రోఫీ విజేత ఎవరో గుర్తుంది కదా. కోల్‌కతా నైట్ రైడర్స్.

లీగల్

మిమ్మల్ని ఒత్తిడి చేసే అధికారం వారికి లేదు

మేము ఒక అపార్ట్‌మెంట్ అద్దెకు తీసుకొని వ్యాపారం చేసుకుంటున్నాము. ఓనర్లతో మేం రాసుకున్న అగ్రిమెంటు ప్రకారం ఐదు సంవత్సరాల వరకు ఆ అపార్ట్‌మెంటు నుంచి మమ్మల్ని ఖాళీ చేయించేందుకు వీలు లేదు. కానీ ఓనర్ మమ్మల్ని తక్షణమే ఖాళీ చేయమని బలవంతం చేస్తున్నారు. అలా ఎలా చేస్తాం అని అగ్రిమెంట్ విషయం గుర్తు చేస్తే పోలీసు వారి దగ్గరికి వెళ్లి తన పరపతితో మాపై ఒత్తిడి చేస్తున్నారు. పోలీసు వారు కూడా మమ్ములను సెటిల్మెంట్ చేసుకోండి అంటున్నారు. ఈ పరిస్థితులలో మేము ఏం చేయాలి, సలహా ఇవ్వగలరు.

– బి.నారాయణ, హైదరాబాద్

సాధారణ పౌరులకస ఎటువంటి సమస్య వచ్చినా ముందుగా పోలీసు వారిని సంప్రదించాలి అని అనిపిస్తుంది. అది కుటుంబ సమస్య, భూమి తగాదా, అద్దె ఇల్లు ఖాళీ చేయకపోవటం వంటి ఏ సమస్య అయినా ముందుగా పోలీసు వారి దగ్గరికి వెళ్లి తమ సమస్యను పరిష్కరించాలి అని కోరుతూ ఉంటారు. అందులో తప్పు లేదు. అయితే మీ సమస్య సివిల్ పరిధిలోకి వస్తుందా లేదా ఏదైనా నేరం అంటే క్రిమినల్ చట్టం కింద జరిగిందా అని పోలీసువారు చూడాలి. సివిల్ కేసులలో పోలీసులు జోక్యం చేసుకునే వీలు లేదు. ఈ విషయాన్ని దిగువ కోర్టుల నుంచి సుప్రీంకోర్టు వరకు చాలా సార్లు స్పష్టం చేశాయి కూడా. అయినప్పటికీ సివిల్ కేసులలో కూడా పోలీసుల తరచు జోక్యం చేసుకుంటున్నారు అనేది వాస్తవం. సివిల్ కేసులలో పోలీసుల జోక్యాన్ని ప్రశ్నిస్తూ హైకోర్టులో నెల నెలా నమోదవుతున్న వందలాది కేసులే అందుకు నిదర్శనం. సివిల్ కేసులకు క్రిమినల్ రంగు పులిమి కేసులు పెట్టడం కూడా కొత్తేమీ కాదు. అలాంటి కేసులను కోర్టులు తిరస్కరించాయి! పోలీసు వారు సివిల్ కేసులను 'సెటిల్మెంట్ చేసుకోండి' అని ఒత్తిడి చేయడానికి వారికి ఎటువంటి అధికారమూ లేదు. అలాగని మీరు పోలీసు వారితో వాగ్వాదానికి దిగవలసిన అవసరం లేదు. మీ హక్కులను కాపాడుకోవడానికి చట్టబద్ధమైన చర్యలు మాత్రమే తీసుకోవాలి. మీకు పోలీసుల నుంచి అటువంటి ఒత్తిడి వస్తోందని అంటున్నారు కాబట్టి మీరు పై అధికారులకు ఫిర్యాదు చేయండి. ఫిర్యాదు తర్వాత కూడా మీ సమస్యకు తగిన పరిష్కారం లభించకపోతే హైకోర్టులో కేసు వేయవచ్చు. పూర్వాపరాలు విచారించిన తర్వాత హైకోర్టు మీకు రక్షణ కలిగిస్తుంది.

మీకు అగ్రిమెంట్ ఉంది అంటున్నారు కాబట్టి మీరు కూడా సివిల్ కోర్టును ఆశ్రయించి అగ్రిమెంట్‌ను అతిక్రమించేందుకు వీలు లేకుండా రక్షణ పొందవచ్చు.



- శ్రీకాంత్ చింతల,
హైకోర్టు న్యాయవాది

మీకున్న న్యాయపరమైన సమస్యలు, సందేహాలకోసం sakshifamily3@gmail.comకు మెయిల్ చేయవచ్చు.

బ్యూటిప్స్



- కీరదోస కాయని చక్రాల్లా కోసుకుని కళ్ళమీద పెట్టుకుంటే కంటి అలసట తగ్గుతుంది.
- రెండు స్పూన్ల చల్లని పాలలో కాటన్ బాల్స్‌ని ముంచి కళ్ళ చుట్టూ వలయాకారంగా మర్దించి 20 నిమిషాల తర్వాత చన్నీటితో శుభ్రంగా కడగాలి. ఇలా వారానికి రెండుసార్లు చేస్తే కంటి కింద నలుపు తగ్గి అందంగా ఉంటాయి.
- మెడ మురికి పట్టేసినట్లు నల్లగా ఉంటే... నాలుగు టీ స్పూన్ల పుల్లటి పెరుగులో రెండు స్పూన్ల బియ్యప్పిండి కలిపి మెడకు పట్టించి 20 నిమిషాల తర్వాత గోరువెచ్చని నీటితో కడిగేయాలి. ఇలా వారానికి రెండుసార్లు చేస్తే చర్మానికి పట్టిన నలుపుతోపాటు ముడతలు పోతాయి.
- టీ స్పూన్ అరటిపండు గుజ్జులో టీస్పూన్ తేనె కలిపిన మిశ్రమాన్ని పెదవులకు రాసి మసాజ్ చేసి గోరువెచ్చని నీటితో కడగాలి. ఇలా వారానికి రెండుసార్లు చేస్తే నల్లని పెదవులు గులాబీ రంగులోకి మారతాయి.
- టీస్పూన్ పాల మీగడ, అయిదారు గులాబి రేకులు తీసుకుని పేస్ట్ చేసిన మిశ్రమాన్ని పెదవులకు రాసుకుంటే పెదవులు పొడిబారకుండా మృదువుగా ఉంటాయి.
- చలికాలంలో లిప్‌స్టిక్ ఎంత తక్కువ వాడితే అంత మంచిది. లిప్ గార్డ్, మీగడ, వెన్న, నెయ్యి వంటివి రాసుకుంటూ ఉంటే పెదవులు పొడిబారకుండా అందంగా ఉంటాయి.
- టీ స్పూన్ ఆపిల్ గుజ్జులో టీ స్పూన్ అరటిపండు గుజ్జు, అయిదారు చుక్కల తేనె వేసి బాగా కలపాలి. ఆ మిశ్రమాన్ని ఫేస్ మాస్క్‌లా వేసుకుని 20 నిమిషాల తర్వాత గోరువెచ్చని నీటితో కడిగేయాలి. ఇలా వారానికి రెండుసార్లు చేస్తే ముఖంపై ఏర్పడ్డ ముడతలు, జిడ్డు తగ్గి ముఖం మెరుస్తూ కాంతివంతంగా ఉంటుంది.



స్వదేశానికి గంభీర్... రెండో టెస్టుకల్లా అడిలైడ్‌కు...

భారత క్రికెట్ జట్టు హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ ఉన్నపళంగా స్వదేశానికి పయనమయ్యాడు. 'అత్యవసర వ్యక్తిగత' పనుల నిమిత్తం భారత్‌కు బయలుదేరి వెళ్లిన అతను మళ్లీ అడిలైడ్‌లో వచ్చే నెల 6 నుంచి జరిగే రెండో టెస్టుకల్లా జట్టుతో కలుస్తాడని బోర్డు వర్గాలు తెలిపాయి. అయితే కాన్‌బెర్రాలో రెండు రోజుల వార్మప్ మ్యాచ్‌లో అతను జట్టుకు అందుబాటులో ఉండడు. 'గంభీర్ మంగళవారం తన కుటుంబంతో సహా భారత్‌కు బయలుదేరాడు. తప్పనిసరిగా వెళ్లాల్సిన పరిస్థితి రావడం వల్లే ఉన్నపళంగా అక్కడి నుంచి పయనమయ్యాడు. రెండో టెస్టు మొదలవ్వడానికి ముందే తిరిగి అడిలైడ్ చేరుకుంటాడు' అని భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) అధికారి ఒకరు వెల్లడించారు. మరోవైపు టీమిండియా నేడు కాన్‌బెర్రాకు చేరుకుంటుంది. అక్కడ ఆసీస్ ప్రధాని ఆంథోని అల్బనీస్ ఇచ్చే అధికారిక విందులో భారత క్రికెటర్లు పాల్గొంటారు. అక్కడే ఈ నెల 30, డిసెంబర్ 1 తేదీల్లో జరిగే రెండు రోజుల ప్రాక్టీస్ మ్యాచ్‌లో టీమిండియా... ప్రైమ్ మినిస్టర్ ఎలెవన్‌తో ఆడుకుంటుంది. అడిలైడ్ టెస్టు డేనైట్ మ్యాచ్ కావడంతో ఈ వార్మప్ పోరు కూడా పింక్‌బాల్‌తోనే నిర్వహిస్తారు. బరిలో తుది 11 మందికే పరిమితం కాకుండా భారత జట్టు సభ్యులంతా ఈ ప్రాక్టీస్ మ్యాచ్‌లో ఆడతారు.

వేలం కథా కమామిషు

విదేశీ క్రికెటర్లతో పోలిస్తే భారత ఆటగాళ్లకు భారీ డిమాండ్... ఆల్‌రౌండర్లకంటే కూడా స్పెషలిస్ట్ బ్యాటర్ లేదా బౌలర్‌పైనే దృష్టి... కోరుకున్న ఆటగాడి కోసం ఎంత మొత్తమైనా చెల్లించేందుకు పోటాపోటీ... కొందరు క్రికెటర్లకు అనూహ్య విలువ, మరికొందరికి తగినంత విలువ దక్కగా... ఎంతో మందికి సహజంగానే తీవ్ర నిరాశ ఎదురైంది... ఎప్పటిలాగే వేలం తర్వాత ప్రతీ జట్టు తాము ఎంచుకున్న ఆటగాళ్లతో సంతృప్తిగా ఉన్నట్లు ప్రకటించింది. రిటెయిన్ చేసుకున్న ప్లేయర్లతో పాటు పెద్ద సంఖ్యలో కొత్త ఆటగాళ్లతో ఆయా టీమ్‌లు ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 18వ సీజన్‌కు సరికొత్తగా సన్నద్ధమయ్యాయి.

–సాక్షి క్రీడా విభాగం

అనూహ్యాలకు వేదికగా ఐపీఎల్ వేలం

- భారత క్రికెటర్ల కోసం భారీగా ఖర్చు
- స్పెషలిస్ట్ ఆటగాళ్లతో జట్లు సిద్ధం

'ఐపీఎల్ వేలం అంటేనే ఆశ్చర్యకరమైన నిర్ణయాలకు వేదిక. అలా జరగకపోతే విశేషం కానీ జరిగితే కాదు. మీరు ఫలానా ఆటగాడి కోసం పోటీ పడితే అతని కోసం ఎంత దూరమైనా వెళ్లడమే వేలం స్వరూపం. కాబట్టి మా నిర్ణయం సరైందే'... లీగ్‌లో పెద్ద ఆటగాడిగా గుర్తింపు లేని వెంకటేశ్ అయ్యర్ కోసం రూ.23 కోట్ల 75 లక్షలు ఖర్చు చేసిన తర్వాత కోల్‌కతా నైట్‌రైడర్స్ సీఈఓ వెంకీ మైసూర్ చేసిన వ్యాఖ్య ఇది. నిజంగానే మరోసారి వేలం ఎక్కువ భాగం ఊహించిన దానికంటే భిన్నంగానే సాగింది. ఐపీఎల్ స్టార్‌లలో ఒకడైన డేవిడ్ వార్నర్‌ను ఎవరూ తీసుకోకపోవడం, ఆల్‌రౌండర్‌గా గుర్తింపు ఉన్న శార్దుల్ ఠాకూర్‌ను కనీస ధరకు కూడా తీసుకోకపోవడం అందుకు తగిన ఉదాహరణలు.

యువరాజ్ రికార్డును దాటి...


అర్‌‌ష్‌దీప్

గత దశాబ్దకాలంగా వేలంలో విదేశీ ఆటగాళ్ల హవానే కొనసాగింది. రెండుసార్లు మాత్రమే భారత క్రికెటర్లు అత్యధిక మొత్తం సొంతం చేసుకున్న జాబితాలో టాప్–3లో నిలిచారు. 13 ఏళ్ల తర్వాత ఈసారి మాత్రం టాప్–5 ఆటగాళ్లంతా భారత క్రికెటర్లే ఉన్నారు. రిషభ్ పంత్, శ్రేయస్ అయ్యర్, వెంకటేశ్ అయ్యర్, అర్‌‌ష్‌దీప్ సింగ్, యుజువేంద్ర చహల్ కనీసం రూ.18 కోట్లకంటే ఎక్కువ పొందారు. ఇప్పటి వరకు వేలంలో అత్యధిక మొత్తం పలికిన భారత ఆటగాడి రికార్డు యువరాజ్ సింగ్ (రూ.16 కోట్లు; ఢిల్లీ 2015లో) పేరిట ఉంది. ఆ తర్వాత ఆరు సార్లు ఈ మొత్తం దాటినా వారంతా విదేశీ క్రికెటర్లే. వేలంలో 120 మంది భారత క్రికెటర్ల కోసం ఫ్రాంచైజీలు రూ.383.40 కోట్లు ఖర్చు చేశాయి. 21 మందికి రూ.10 కోట్లకంటే ఎక్కువగా దక్కగా వీరిలో 12 మంది భారత క్రికెటర్లు కావడం విశేషం. 'ఇంపాక్ట్ ప్లేయర్' నిబంధన కారణంగా ఆల్‌రౌండర్లకంటే స్పెషలిస్ట్ బౌలర్లపై ఆసక్తి చూపడంతో రూ.18 కోట్లతో లెగ్‌స్పిన్నర్ చహల్ పంట పండింది. అఫ్గానిస్తాన్ స్పిన్నర్ నూర్ అహ్మద్‌కు కూడా రూ. 10 కోట్లు లభించడం గమనార్హం.

కుర్రాళ్లోయ్ కుర్రాళ్లు...

చక్కటి ప్రతిభతో ఇప్పుడిప్పుడే సత్తా చాటుతున్న కుర్రాళ్లపై కూడా ఫ్రాంచైజీలు ఆసక్తి చూపించాయి. కొందరిని స్థానిక లీగ్‌లలో ప్రదర్శన ద్వారా ఎంచుకోగా... మరికొందరిని భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని టీమ్‌లు తీసుకున్నాయి. 20 ఏళ్ల లోపు వయసు ఉన్న కుర్రాళ్లు 13 మందికి లీగ్‌లో అవకాశం దక్కింది. 21–30 ఏళ్ల వయసువారే 118 మంది ఉండటం ఈ ఫార్మాట్‌లో వారి విలువను చూపిస్తోంది. సుదీర్ఘ అనుభవం ఉన్నా 36 ఏళ్లు దాటిన వారిపై ఆసక్తి చూపించని టీమ్‌లు 9 మందిని అందులోనూ ఆరుగురిని నామ్‌కే వాస్తేగా కనీస ధరకు తీసుకున్నాయి. 13 ఏళ్ల 243 రోజుల వయసులో ఐపీఎల్‌కు ఎంపికైన బిహార్ అబ్బాయి వైభవ్ సూర్యవంశీ లీగ్ చరిత్రలో పిన్న వయస్కుడిగా కొత్త రికార్డు సృష్టించాడు. రాజస్తాన్ రాయల్స్ రూ.1 కోటి 10 లక్షలతో అతనికి మంచి విలువను కట్టబెట్టింది.


వెంకటేశ్ అయ్యర్

దూసుకెళ్లిన జితేశ్...

గత సీజన్‌లో ఆటగాళ్ల విలువతో పోలిస్తే ఈసారి కొందరు తారాజువ్వలా దూసుకుపోగా... మరికొందరి విలువ భారీగా పడిపోయింది. గత ఏడాది పంజాబ్ ఆటగాడిగా రూ.20 లక్షలు తీసుకున్న వికెట్ కీపర్ జితేశ్ శర్మకు బెంగళూరు రూ.11 కోట్లు చెల్లించింది. ఇది ఏకంగా 5400 శాతం పెరుగుదల కావడం విశేషం! గత ఏడాది రూ.30 లక్షలకు ఆడిన పేసర్ రసిక్ సలామ్‌కు ఏకంగా 20 రెట్లు ఎక్కువగా రూ.6 కోట్లు దక్కాయి. అర్‌‌ష్‌దీప్ రూ.4 కోట్ల నుంచి రూ.18 కోట్లకు... శ్రేయస్ రూ.12 కోట్ల 50 లక్షల నుంచి రూ.26 కోట్ల 75 లక్షలకు... వెంకటేశ్ అయ్యర్ రూ. 8 కోట్ల నుంచి రూ.23 కోట్ల 75 లక్షలకు చేరుకోవడం గమనార్హం. మిచెల్ స్టార్క్


శ్రేయస్ అయ్యర్

రూ.24 కోట్ల 75 లక్షల నుంచి రూ.11 కోట్ల 75 లక్షలకు పడిపోగా... స్యామ్ కరన్ విలువ భారీగా (రూ. 18 కోట్ల 50 లక్షల నుంచి రూ.2 కోట్ల 40 లక్షలకు) పడిపోయింది.

ఆర్‌సీబీ కెప్టెన్‌గా మళ్లీ కోహ్లి!

వేలంలో ముంబై ఎనిమిది మంది విదేశీ ఆటగాళ్లను తీసుకుంది. వీరిలో ముగ్గురికి ఇదే తొలి ఐపీఎల్ కాగా, మరో నలుగురి అనుభవం అంతంత మాత్రం. బౌల్ట్ మినహా జట్టంతా భారత ఆటగాళ్లపైనే ఆధారపడి ఉంది. చెన్నై జట్టు సమతూకంగా కనిపిస్తోంది. అశ్విన్, నూర్ అహ్మద్‌లతో స్పిన్ విభాగం పటిష్టంగా ఉంది. రిటెయిన్ చేసుకున్న ఐదుగురు హెడ్, క్లాసెన్, అభిషేక్ శర్మ, కమిన్స్, నితీశ్ కుమార్ రెడ్డిలపైనే సన్‌రైజర్స్ ఎక్కువగా ఆధారపడుతోంది. రహానే, మనీశ్ పాండేలను ఎంచుకొని కోల్‌కతా ఆశ్చర్యపర్చింది. గత టైటిల్ విజయంలో భాగమైన 12 మందిని కేకేఆర్ తిరిగి తీసుకోవడం విశేషం. పంజాబ్ కింగ్స్ ఎంచుకున్న ఎనిమిది మంది విదేశీయుల్లో ఐదుగురు ఆస్ట్రేలియన్‌లు కావడం కోచ్ పాంటింగ్ ప్రభావాన్ని చూపిస్తోంది. లక్నో జట్టులో భారత ఓపెనర్ లేకపోగా... టీమిండియా బౌలర్లతో జట్టు మెరుగ్గా కనిపిస్తోంది. కేఎల్ రాహుల్‌ను ఢిల్లీ క్యాపిటల్స్ తీసుకున్నా...అక్షర్ పటేల్‌నూ సారథిగా చేసే అవకాశాలు లేకపోలేదు. రాజస్తాన్ రాయల్స్ జట్టు కూడా విదేశీ క్రికెటర్లకంటే భారత ఆటగాళ్ల ప్రదర్శనపైనే ఎక్కువగా ఆధారపడుతోంది. చాలా ఏళ్లుగా పేస్ బౌలింగ్ సమస్యగా ఉన్న బెంగళూరు ఈసారి హాజల్‌వుడ్, భువనేశ్వర్‌లపై భారీ మొత్తం ఖర్చు చేసింది. ఈసారి స్టార్లపై కాకుండా సమష్టితత్వంపై జట్టు ఆధారపడుతోంది. ప్రస్తుత టీమ్‌ను చూస్తే విరాట్ కోహ్లి మరోసారి కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టడం లాంఛనమే కావచ్చు.

ప్రపంచ క్యాడెట్ చెస్ చాంప్ దివిత్ రెడ్డి



మోంటెసిల్వానో (ఇటలీ): ప్రపంచ క్యాడెట్స్ చెస్ చాంపియన్‌షిప్‌లో అండర్–8 ఓపెన్ విభాగంలో భారత్‌కు ప్రాతినిధ్యం వహించిన హైదరాబాద్ కుర్రాడు ఆదుళ్ల దివిత్ రెడ్డి చాంపియన్‌గా అవతరించాడు. నిర్ణీత 11 రౌండ్ల తర్వాత ఎనిమిదేళ్ల దివిత్ రెడ్డితోపాటు స్వయిన్ సాత్విక్ (భారత్), జిమింగ్ గువో (చైనా) 9 పాయింట్లతో ఉమ్మడిగా అగ్రస్థానంలో నిలిచారు. అయితే మెరుగైన టైబ్రేక్ స్కోరు ఆధారంగా తెలంగాణకు చెందిన దివిత్ రెడ్డికి టాప్ ర్యాంక్ దక్కింది. ఒడిశాకు చెందిన స్వయిన్ సాత్విక్‌కు రెండో స్థానం, జిమింగ్ గువోకు మూడో స్థానం ఖరారయ్యాయి. దివిత్ రెడ్డి ఆడిన 11 గేమ్‌లలో తొమ్మిదింటిలో గెలిచి, రెండింటిలో ఓడిపోయాడు. ఈ ఏడాది ఏప్రిల్‌లో అల్బేనియాలో జరిగిన వరల్డ్ క్యాడెట్ ర్యాపిడ్ చెస్ చాంపియన్‌షిప్‌లో దివిత్ రెడ్డి అండర్–8 విభాగంలో స్వర్ణ పతకం సాధించాడు.

డింగ్ లిరెన్‌తో గుకేశ్ రెండో గేమ్ 'డ్రా'



సింగపూర్ సిటీ: తొలి గేమ్‌లో ఎదురైన పరాజయం నుంచి భారత గ్రాండ్‌మాస్టర్ దొమ్మరాజు గుకేశ్ తేరుకున్నాడు. ప్రస్తుత ప్రపంచ చాంపియన్ డింగ్ లిరెన్ (చైనా)తో జరుగుతున్న ప్రపంచ చెస్ చాంపియన్‌షిప్ మ్యాచ్‌లో రెండో గేమ్‌ను గుకేశ్ 'డ్రా' చేసుకున్నాడు. 23 ఎత్తుల తర్వాత ఫలితం తేలే అవకాశాలు కనిపించకపోవడంతో ఇద్దరూ 'డ్రా'కు అంగీకరించారు. తొలి గేమ్‌లో డింగ్ లిరెన్ గెలిచిన సంగతి తెలిసిందే. వీరిద్దరి మధ్య మొత్తం 14 గేమ్‌లు జరుగుతాయి. రెండు గేమ్‌ల తర్వాత డింగ్ లిరెన్ 1.5–0.5తో గుకేశ్‌పై ఆధిక్యంలో ఉన్నాడు. నేడు జరిగే మూడో గేమ్‌లో గుకేశ్ తెల్ల పావులతో ఆడతాడు.

బీడబ్ల్యూఎఫ్ ఫైనల్స్‌కు గాయత్రి-ట్రెసా జోడీ అర్హత



న్యూఢిల్లీ: ప్రపంచ బ్యాడ్మింటన్ సమాఖ్య (బీడబ్ల్యూఎఫ్) వరల్డ్ టూర్ ఫైనల్స్‌కు పుల్లెల గాయత్రి గోపీచంద్–ట్రెసా జాలీ జోడీ అర్హత సాధించింది. మహిళల డబుల్స్‌లో గాయత్రి–ట్రెసా వరల్డ్ ర్యాంకింగ్ ప్రకారం అర్హత సాధించారు. మంగళవారం ప్రకటించిన ఈ ర్యాంకింగ్స్‌లో టాప్–8 జోడీలు ప్రతిష్టాత్మక ఫైనల్స్ టోర్నీ ఆడతాయి. భారత్ నుంచి ఈ టోర్నీలో వీరిద్దరు మాత్రమే బరిలోకి దిగుతున్నారు. ఈ సీజన్‌లో గాయత్రి–ట్రెసా నిలకడగా రాణించారు. చైనా మాస్టర్స్ టోర్నమెంట్‌లో ప్రిక్వార్టర్స్‌లోనే ఓడినా... ఇతర టోర్నీల ప్రదర్శన వారికి ఈ అవకాశం కల్పించింది. సింగపూర్ ఓపెన్, మకావు ఓపెన్‌లలో గాయత్రి–ట్రెసా సెమీఫైనల్‌కు చేరారు. ఇప్పటి వరకు బీడబ్ల్యూఎఫ్ టూర్ ఫైనల్స్‌లో మహిళల సింగిల్స్ విభాగంలో పీవీ సింధు మాత్రమే 2018లో విజేతగా నిలిచింది. సీజన్ చివరి టోర్నీకి అర్హత సాధించడం పట్ల ట్రెసా జాలీ సంతోషం వ్యక్తం చేసింది. 'తొలిసారి ఫైనల్స్‌కు క్వాలిఫై కావడం చాలా ఆనందంగా అనిపిస్తోంది. నాకౌట్ టోర్నీ కాదు కాబట్టి గ్రూప్ దశలో ప్రతీ మ్యాచ్‌లో అత్యుత్తమ ప్రదర్శన ఇచ్చేందుకు ప్రయత్నిస్తాం' అని ఆమె పేర్కొంది. చైనాలోని హాంగ్జూలో డిసెంబర్ 11–15 మధ్య బీడబ్ల్యూఎఫ్ ఫైనల్స్ జరుగుతుంది.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

సినిమా


● ఏఆర్ రెహమాన్


● మోహినీ డే

రెహమాన్‌గారు నాకు తండ్రిలాంటివారు - మోహినీ డే

''ఏఆర్ రెహమాన్ గారు నాకు తండ్రి లాంటివారు. మాపై వస్తున్న పుకార్లకి ఫుల్‌స్టాప్ పెట్టండి. మా గోప్యతను గౌరవించండి'' అన్నారు మోహినీ డే. ప్రముఖ సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్, ఆయన సతీమణి సైరా భాను పరస్పర అంగీకారంతో విడిపోతున్నట్లు ఇటీవల ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ ప్రకటన వెలువడిన కొన్ని గంటల వ్యవధిలోనే రెహమాన్ బృందంలోని సభ్యురాలు మోహినీ డే కూడా తన భర్త నుండి విడిపోయానని ప్రకటించారు. దాంతో రెహమాన్ దంపతులు విడాకులు తీసుకోవడానికి మోహినీ కారణం అంటూ వస్తున్న వార్తలను ఆమె ఖండించారు. ఇన్‌స్టాగ్రామ్ వేదికగా ఓ వీడియోను విడుదల చేశారు మోహినీ డే. ''రెహమాన్‌గారు ఒక లెజెండ్. నా కెరీర్‌లో ఆయన కీలక పాత్ర పోషించారు. నా లైఫ్‌కి రోల్ మోడల్. నాకు సంగీతం నేర్పిన నా తండ్రి ఏడాది క్రితం దూరం అయ్యారు. అప్పట్నుంచి రెహమాన్‌గారి బృందంలోని వారే సొంతవారిలా నన్ను ఆదరించారు. నాది, రెహమాన్‌గారి కుమార్తెలది ఒకే వయసు. ఆయన నన్ను తన కుమార్తెలానే చూసేవారు. 8 ఏళ్లకు పైగా ఆయన బృందంలో పని చేశాను. ఇప్పుడు మాపై ఇలాంటి వార్తలు రావడం బాధాకరం. ఇలాంటి సున్నితమైన అంశాల్లో సానుభూతి లేకుండా నిందలు వేయడం సరికాదు. ఈ వార్తలు సృష్టించినవారి మానసిక స్థితి చూస్తే బాధతో పాటు జాలేస్తోంది. ఇలాంటి వార్తలు నా కెరీర్‌కు అంతరాయం కలిగించలేవు'' అని పోస్ట్ చేశారామె.


● కృతీ సనన్

ప్రేక్షకులూ భాగస్వాములే!

''ఆర్టిస్టుగా ప్రతిభ ఉంటే ప్రేక్షకులు కనెక్ట్ అవుతారు. అప్పుడు ఇండస్ట్రీలో ఎవరూ ఎవర్నీ ఆపలేరు'' అని అంటున్నారు కృతీ సనన్. గోవాలో జరుగుతున్న 55వ ఇఫీ (ఇంటర్‌నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ ఇండియా) వేడుకల్లో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా అక్కడ జరిగిన సమావేశంలో బంధు ప్రీతి గురించి కృతీ సనన్ మాట్లాడిన వ్యాఖ్యలు బాలీవుడ్ చిత్ర పరిశ్రమలో చర్చనీయాంశమయ్యాయి. ''నేను ఇండస్ట్రీకి వచ్చిన సమయంలో నాకు మంచి ఆహ్వానమే లభించింది. అయితే ఫిల్మీ బ్యాక్‌గ్రౌండ్ లేనప్పుడు అవకాశాలను అందిపుచ్చుకోవడానికి కొంత సమయం పట్టడం సహజమే. మేగజీన్స్‌లో మన ఫొటోలు కనిపించేందుకు కూడా సమయం పట్టొచ్చు. ఇదంతా స్ట్రగుల్‌లో భాగమే. అయితే రెండు మూడు సినిమాలు చేసిన తర్వాత, ప్రతిభతో, బాగా కష్టపడితే ఏదీ ఆపలేదు'' అని అన్నారు. ఇంకా ఇండస్ట్రీలో బంధుప్రీతి గురించి కృతీ చెబుతూ– ''బంధుప్రీతి అపవాదు మొత్తం బాధ్యతను ఇండస్ట్రీయే మోయాల్సిన అవసరం లేదని నా అభిప్రాయం. ఈ విషయంలో ప్రేక్షకుల భాగస్వామ్యం కూడా ఉంది. స్టార్ కిడ్స్ అంటూ మీడియా వాళ్లు వారిపై ప్రత్యేక ఫోకస్ పెడతారు. దీంతో ఆడియన్స్ స్టార్ కిడ్స్‌ను ఫాలో అవుతుంటారు. స్టార్ కిడ్స్‌పై ప్రేక్షకులు ఆసక్తి చూపిస్తున్నారు కాబట్టి, స్టార్ కిడ్స్‌తోనే సినిమాలు తీయాలని నిర్మాతలు అనుకుంటారు. అయితే ఆడియన్స్‌కు కనెక్ట్ కాని వారు ఎవరూ ఇండస్ట్రీలో ఉండలేరు. అది నిజం. ప్రతిభ ఉన్నవాళ్లే ఉంటారు'' అన్నారు.

నా తోడుని కనుగొన్నాను - అక్కినేని అఖిల్


● అఖిల్, జైనబ్ రవ్జీ

హీరో అఖిల్ అక్కినేని నిశ్చితార్థం జైనబ్ రవ్జీతో జరిగింది. ఈ విషయాన్ని అఖిల్ తండ్రి, ప్రముఖ నటుడు–నిర్మాత నాగార్జున 'ఎక్స్' వేదికగా ధ్రువీకరించి, అఖిల్–జైనబ్‌ల నిశ్చితార్థ వేడుక ఫొటోలను షేర్ చేశారు. ''మా తనయుడు అక్కినేని అఖిల్ నిశ్చితార్థం జైనబ్ రవ్జీతో జరిగిందని తెలియజేయడానికి సంతోషిస్తున్నాం. మా ఫ్యామిలీలోకి కోడలిగా జైనబ్‌ను ఆనందంతో ఆహ్వానిస్తున్నాం. ఈ కాబోయే నూతన వధూవరుల జీవితాలు ప్రేమ, సంతోషాలతో నిండిపోవాలని ఆకాంక్షిస్తూ మీ అందరి ఆశీర్వాదం కోరుకుంటున్నాము'' అని 'ఎక్స్'లో పేర్కొన్నారు నాగార్జున. ''నా జీవితకాలపు తోడును కనుగొన్నాను. జైనబ్‌తో నా నిశ్చితార్థం జరిగిందని తెలియజేస్తున్నందుకు సంతోషంగా ఉంది'' అని 'ఇన్‌స్టా'లో అఖిల్ ఫొటోలను షేర్ చేశారు. రెండు కుటుంబాల సభ్యులు, బంధుమిత్రుల సమక్షంలో అఖిల్–జైనబ్‌ల నిశ్చితార్థం జరిగిందని తెలిసింది. వీరి వివాహ తేదీని వెల్లడించలేదు. ఇక జైనబ్ థియేటర్ ఆర్టిస్ట్‌గా, ఇన్‌ఫ్లూయెన్సర్‌గా రాణిస్తున్నారు. అఖిల్ – జైనబ్‌లకు రెండేళ్ల క్రితం ఏర్పడిన పరిచయం ప్రేమగా మారిందట. ఈ ప్రేమ త్వరలో వివాహ బంధం కానుంది. నాగార్జునకు, జైనబ్ తండ్రి జుల్ఫీ రవ్జీకి మంచి స్నేహబంధం కూడా ఉందని తెలిసింది. ఈ సంగతి ఇలా ఉంచితే... నాగార్జున పెద్ద తనయుడు నాగచైతన్య, శోభిత ధూళిపాళ్ల వివాహం డిసెంబరు 4న జరుగుతుందని సమాచారం. ఇలా అక్కినేని కుటుంబం ఫుల్ హ్యాపీ మూడ్‌లో ఉంది.

ఉద్యమ చిత్రం ఉక్కు సత్యాగ్రహం - సత్యా రెడ్డి

''విప్లవ కవి గద్దర్ అన్న నటించిన ఆఖరి చిత్రం మా 'ఉక్కు సత్యాగ్రహం'. ఎంతో మంది ఉద్యమకారుల్ని దృష్టిలో పెట్టుకొని ఈ సినిమా కథానాయకుడి పాత్రని తీర్చి దిద్దారాయన. నిజ జీవితానికి దగ్గరగా ఉన్న ఉద్యమ చిత్రం ఇది. ప్రేక్షకులు ఆదరించాలి'' అన్నారు సత్యా రెడ్డి. ఆయన లీడ్ రోల్‌లో నటించి, స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రం 'ఉక్కు సత్యాగ్రహం'. గద్దర్, పల్సర్ బైక్ ఝాన్సీ, ధర్మశ్రీ, ఎంవీవీ సత్యనారాయణ ఇతర పాత్రలు పోషించారు. జనం ఎంటర్‌టైన్మెంట్స్‌పై రూపొందిన ఈ సినిమాను ఈ నెల 29న రిలీజ్ చేయనున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో గద్దర్ కుమార్తె వెన్నెల మాట్లాడుతూ– ''ఉక్కు సత్యాగ్రహం' కోసం మా నాన్నగారు చాలా సమయం కేటాయించారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌ని ప్రైవేటీకరణ చేయకూడదనేది ఆయన ఉద్దేశం. నాన్నగారు ఈ సినిమాలో నటించినట్టు లేదు... జీవించినట్టు ఉంది. ఈ చిత్రం పెద్ద విజయం సాధించాలి''అన్నారు.


● వెన్నెల, సత్యా రెడ్డి

చాన్నాళ్ల తర్వాత ప్రేమకథతో వస్తున్నాను - సిద్ధార్థ్


● సిద్ధార్థ్, ఆషికా

''మిస్ యు' సినిమా నాకు చాలా ప్రత్యేకం. రాజశేఖర్ ఈ చిత్రకథ చెప్పినప్పుడు ఆసక్తిగా అనిపించింది. చాన్నాళ్ల తర్వాత 'మిస్ యు' లాంటి ఒక అందమైన ప్రేమకథతో తెలుగు ప్రేక్షకుల ముందుకు వస్తున్నా. ఈ సినిమాని ప్రేక్షకులు కచ్చితంగా ఆదరిస్తారని పిస్తోంది'' అని హీరో సిద్ధార్థ్ అన్నారు. ఎన్. రాజశేఖర్ దర్శకత్వంలో సిద్ధార్థ్, ఆషికా రంగనాథ్ జంటగా నటించిన చిత్రం 'మిస్ యు'. శామ్యూల్ మాథ్యూస్ నిర్మించిన ఈ సినిమాని ఏషియన్ సురేష్ ఎల్ఎల్‌పీ సంస్థ ఈ నెల 29న తెలుగు రాష్ట్రాల్లో విడుదల చేస్తోంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన 'మిస్ యు' ప్రీ రిలీజ్ వేడుకలో సిద్ధార్థ్ మాట్లాడుతూ– ''నేటి యువతరానికి మా మూవీ బాగా కనెక్ట్ అవుతుంది. 'మిస్ యు' తర్వాత నాకు మరిన్ని మంచి ప్రేమకథలు వస్తాయి. గిబ్రాన్ ఈ సినిమా కోసం ఎనిమిది అద్భుతమైన పాటలు ఇచ్చారు. శామ్యూల్‌గారు ప్యాషన్ ఉన్న నిర్మాత. ఈ సినిమాను మంచి ప్రొడక్షన్ విలువలతో నిర్మించారు. మా సినిమాని తెలుగులో రిలీజ్ చేస్తున్న ఏషియన్ సురేష్ ఎల్ఎల్‌పీ సంస్థకు కృతజ్ఞతలు'' అన్నారు.


● వేదిక

సస్పెన్స్... థ్రిల్


వేదిక ప్రధాన పాత్రలో నటించిన సస్పెన్స్ థ్రిల్లర్ ఫిల్మ్ 'ఫియర్'. డా. హరిత గోగినేని దర్శకత్వంలో డా. వంకి పెంచలయ్య, ఏఆర్ అభి నిర్మించిన సినిమా ఇది. ఈ చిత్రాన్ని డిసెంబరు 14న రిలీజ్ చేయనున్నట్లు ప్రకటించి, కొత్త పోస్టర్‌ను రిలీజ్ చేశారు. ''ఫియర్' సినిమా విడుదలకు ముందే పలు అంతర్జాతీయ అవార్డులను గెలుచుకుంది. హిందీ, తెలుగు, తమిళ, కన్నడ, మలయాళంలో రిలీజ్ చేసిన ఈ చిత్రం టీజర్‌కు ఇప్పటికే మంచి స్పందన లభించింది. ఓ డిఫరెంట్ సస్పెన్స్ థ్రిల్లర్ మూవీగా ఈ సినిమా ప్రేక్షకులను అలరిస్తుంది'' అని చిత్రయూనిట్ పేర్కొంది.

సినిమాలు ఎందరికో స్ఫూర్తినిస్తాయి - నిర్మాత ఏఎం రత్నం

''సినిమాలు ఎందరికో స్ఫూర్తినిస్తాయి. నేను తీసిన 'కర్తవ్యం' సినిమా చూసి చాలామంది అమ్మాయిలు పోలీస్ విభాగంలోకి వచ్చారు. 'భారతీయుడు' చూసి లంచాలు తీసుకోవద్దనే నిర్ణయానికి కొందరు ఉద్యోగులు వచ్చారు. 'బాయ్స్' మూవీ చూసి సినిమా అవకాశాల కోసం ప్రయత్నించానని 'కేజీఎఫ్' హీరో యశ్ చెప్పారు. అలా సినిమా ఎంతోమందికి స్ఫూర్తి అందిస్తుంది. 'ఝాన్సీ ఐపీఎస్' మూవీ ట్రైలర్ చాలా బాగుంది. ఈ సినిమా విజయం సాధించాలి'' అని ప్రముఖ నిర్మాత ఏఎం రత్నం ఆకాంక్షించారు. లక్ష్మీ రాయ్ ప్రధాన పాత్రలో గురుప్రసాద్ దర్శకత్వం వహించిన చిత్రం 'ఝాన్సీ ఐపీఎస్'. ఈ తమిళ చిత్రాన్ని ప్రతాని రామకృష్ణ గౌడ్ ఈ నెల 29న తెలుగులో విడుదల చేస్తున్నారు. ''ఝాన్సీ ఐపీఎస్'లో లక్ష్మీ రాయ్ త్రిపాత్రాభినయం చేశారు. మా సినిమాకి ప్రేక్షకుల సపోర్ట్ ఉండాలని కోరుకుంటున్నాను'' అన్నారు ప్రతాని రామకృష్ణ గౌడ్.


● ప్రతాని రామకృష్ణ గౌడ్, ఏఎం రత్నం, సుమన్

దర్శకుడిగా అదే నా అంతిమ లక్ష్యం - విక్రమ్ రెడ్డి



హర్ష నర్రా, సందీప్ సరోజ్, తరుణ్, సుప్రజ్ రంగా, సోనూ ఠాకూర్, నువ్వేక్ష, మేఘలేఖ, ఖుష్బూ చౌదరి హీరో హీరోయిన్లుగా నటించిన చిత్రం 'రోటి కపడా రొమాన్స్'. విక్రమ్ రెడ్డి దర్శకత్వంలో సృజన్ కుమార్ బొజ్జం, బెక్కెం వేణుగోపాల్ నిర్మించిన ఈ చిత్రం రేపు (గురువారం) విడుదల కానుంది. ఈ సందర్భంగా మంగళవారం జరిగిన విలేకర్ల సమావేశంలో విక్రమ్ రెడ్డి మాట్లాడుతూ– ''చిత్రం' సినిమా పోస్టర్‌పై దర్శకుడు తేజగారి పేరు చూసి, నేనూ దర్శకుడిని కావాలనుకున్నాను. ఇండస్ట్రీలోకి వచ్చి, కృష్ణవంశీ, పూరి జగన్నాథ్ వంటి దర్శకుల వద్ద అసిస్టెంట్‌గా చేయాలని ప్రయత్నించాను.. కుదర్లేదు. అయితే ఓ సారి పూరి జగన్నాథ్‌గారు నాతో మాట్లాడారు. డైరెక్ట్‌గా సినిమాలు చేసేందుకు ప్రయత్నించమన్నారు. అలా 'రోటీ కపడా రొమాన్స్' సినిమా తీశాను. కామెడీ, ఫ్రెండ్‌షిప్ నేపథ్యంలో సాగే యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ మూవీ ఇది. నలుగురు అబ్బాయిల జీవితాల్లోకి నలుగురు అమ్మాయిలు వచ్చాక వాళ్ల జీవితం ఎలా మారింది? అన్నది ఈ సినిమా కథనం. క్లైమాక్స్ సన్నివేశాలు హృదయాలను హత్తుకుంటాయి. ఈ సినిమా నిర్మాణం కోసం 'దిల్' రాజుగారితో కొంతకాలం ట్రావెల్ చేశాం. ఈ టైటిల్ ఆయన ఇచ్చిందే. మా సినిమా జర్నీ స్టార్ట్ అయ్యాక కొన్ని నిద్రలేని రాత్రులు గడిపాను. మాలాంటి సినిమాలకు స్పేస్ ఇవ్వమని వేడుకుంటున్నాను. ఆల్రెడీ మా సినిమాకు ప్రివ్యూలు వేశాం. పాజిటివ్ రెస్పాన్స్ లభిస్తోంది. నా ఏడేళ్ల జర్నీలో 15 కథలకు పైగా రాశాను. ఇక చిరంజీవి, రామ్‌చరణ్‌గార్లతో ఓ మల్టీస్టారర్ మూవీ తీయడమే నా అంతిమలక్ష్యం. కథ సిద్ధంగానే ఉంది'' అని అన్నారు.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
106	27
80,004	24,194

విదేశీ సూచీలు (సోమ రెండు రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్	19,164	△	108
డోజోన్స్	44,660	▽	77
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,259	▽	33
డాక్స్	19,296	▽	109
షాంఘై	3,260	▽	4
నికాయ్	38,442	▽	338

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

బులియన్ (రూ.లలో)

ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	75.690
బంగారం (99.5 స్వచ్ఛత)	75,387
వెండి (కిలో)	88,463

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	[illegible]	83.50	85.17
£	బ్రిటన్ పౌండ్	[illegible]	104.28	107.90
€	యూరో	[illegible]	86.82	90.10
¥	జపాన్ ఎన్ (100)	[illegible]	53.73	55.52
AU$	ఆస్ట్రేలియా డాలర్	[illegible]	53.63	56.23
S$	సింగపూర్ డాలర్	[illegible]	60.42	65.09
SAR	సౌదీ రియాల్	[illegible]	21.59	23.14
UAE D	యూఏఈ దిర్హామ్	[illegible]	22.07	23.85
¥	చైనా యువాన్	[illegible]	10.76	12.58

ఐపీవోలు.. అదే స్పీడ్

- డిసెంబర్‌లో మరో 10 కంపెనీలు
- రూ. 20,000 కోట్ల సమీకరణకు సై



న్యూఢిల్లీ: దేశీ స్టాక్ మార్కెట్లు ఇటీవల ఆటుపోట్లను చవిచూస్తున్నప్పటికీ ప్రైమరీ మార్కెట్లు జోరు చూపుతూనే ఉన్నాయి. వచ్చే నెల(డిసెంబర్)లో 10 కంపెనీలు పబ్లిక్ ఇష్యూలకు రానున్నాయి. స్టాక్ ఎక్స్ఛేంజీలలో లిస్టింగ్ ద్వారా ఉమ్మడిగా రూ. 20,000 కోట్లు సమీకరించే యోచనలో ఉన్నాయి. ఈ జాబితాలో సూపర్‌మార్ట్ దిగ్గజం విశాల్ మెగా మార్ట్‌తోపాటు.. బ్లాక్‌స్టోన్ పెట్టుబడులున్న డైమండ్ గ్రేడింగ్ కంపెనీ ఇంటర్నేషనల్ జెమ్మలాజికల్ ఇన్‌స్టిట్యూట్(ఇండియా), విద్యారుణాలందించే ఎన్‌బీఎఫ్‌సీ అవాన్సే ఫైనాన్షియల్ సర్వీసెస్, టీపీజీ క్యాపిటల్ సంస్థ సాయి లైఫ్ సైన్సెస్, ఆసుపత్రుల చైన్ పారస్ హెల్త్‌కేర్, ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ డీఏఎం క్యాపిటల్ అడ్వయిజర్స్, డయాగ్నోస్టిక్ చైన్ సురక్షా, ప్యాకేజింగ్ ఎక్విప్‌మెంట్ తయారీ కంపెనీ మమతా మెషినరీ, ట్రాన్స్‌రైల్ లైటింగ్ ఉన్నాయి. వివిధ రంగాలు, విభిన్న పరిమాణంలో కంపెనీలు నిధుల సమీకరణ బాటలో సాగుతున్నాయి. అసెంబ్లీ ఎన్నికల తాజా ఫలితాలు స్టాక్ మార్కెట్లో సానుకూల సెంటిమెంటుకు తెరతీయనున్నట్లు ఆన్‌లైన్ బ్రోకరేజీ ట్రేడ్‌జినీ సీవోవో త్రివేష్.డి. అభిప్రాయపడ్డారు. దీంతో ప్రైమరీ మార్కెట్ మరింత కళకళలాడే వీలున్నట్లు అంచనా వేశారు. ఈ ఏడాది(2024) ఐపీవోలకు అత్యంత ప్రోత్సాహకరంగా సాగినప్పటికీ ఇటీవల కొంతమేర ప్రతికూల ధోరణి నెలకొన్నట్లు తెలియజేశారు.

ఇష్యూల వివరాలు

విశాల్ మెగా మార్ట్ ఐపీవో ద్వారా రూ. 8,000 కోట్లు సమకూర్చుకోవాలని చూస్తోంది. ఇందుకు అనుగుణంగా ప్రమోటర్ సమయత్ సర్వీసెస్ ఎల్‌ఎల్‌పీ వాటాను విక్రయించనుంది. ఇక జెమ్మలాజికల్ ఇన్‌స్టిట్యూట్ రూ. 4,000 కోట్ల సమీకరణపై కన్నేసింది. దీనిలో భాగంగా రూ. 1,250 కోట్లు తాజా ఈక్విటీ జారీసహా.. రూ. 2,750 కోట్ల విలువైన షేర్లను బ్లాక్‌స్టోన్ సంస్థ, ప్రమోటర్ బీసీపీ ఏషియా–2 టాప్‌కో పీటీఈ ఆఫర్ చేయనుంది. కాగా.. వార్‌బర్గ్ పింకస్ సంస్థ ఒలివ్ వైన్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోట్ చేసిన అవాన్సే ఫైనాన్షియల్ రూ. 3,500 కోట్లు సమీకరించనుంది. తాజా ఈక్విటీ ద్వారా రూ. 1,000 కోట్లు, ప్రస్తుత వాటాదారుల షేర్ల విక్రయం ద్వారా రూ. 2,500 కోట్లు అందుకోనుంది. ఈక్విటీ నిధులను మూలధన పటిష్టతకు వెచ్చించనుంది.

రికార్డ్ సమీకరణ

ఈ ఏడాది ఇప్పటికే 75 కంపెనీలు ఉమ్మడిగా రూ. 1.3 లక్షల కోట్ల పెట్టుబడులను సమీకరించాయి. ఇది రికార్డ్ కాగా.. జాబితాలో హ్యుందాయ్ మోటార్ ఇండియా, బజాజ్ హౌసింగ్ ఫైనాన్స్, ఓలా ఎలక్ట్రిక్ మొబిలిటీ, బ్రెయిన్‌బీస్ సొల్యూషన్స్(ఫస్ట్‌క్రై), ఎన్‌టీపీసీ గ్రీన్ ఎనర్జీ చేరాయి. స్టాక్ ఎక్స్ఛేంజీలలో లిస్టింగ్ ద్వారా గతేడాది(2023)లో 57 కంపెనీలు రూ. 49,436 కోట్లు సమకూర్చుకున్నాయి. సుమారు 236 కంపెనీలు 2021–25 మధ్య కాలంలో ఐపీవోలకు వచ్చాయి. సగటున 27 శాతం లిస్టింగ్ లాభాలను అందించడం గమనార్హం.

సురక్ష @ రూ. 420-441

సమీకృత డయాగ్నోస్టిక్ చైన్ సురక్షా డయాగ్నోస్టిక్ పబ్లిక్ ఇష్యూ శుక్రవారం(29న) ప్రారంభంకానుంది. డిసెంబర్ 3న ముగియనున్న ఇష్యూకి రూ. 420–441 ధరల శ్రేణిని కంపెనీ తాజాగా ప్రకటించింది. ఇష్యూలో భాగంగా ప్రమోటర్లు, ప్రస్తుత ఇన్వెస్టర్లు 1,91,89,330 షేర్లను విక్రయానికి ఉంచనున్నారు. తద్వారా రూ. 846 కోట్లు సమీకరించాలని భావిస్తోంది. అయితే ఈక్విటీ జారీ లేనందున ఇష్యూ ద్వారా కంపెనీకి ఎలాంటి నిధులు లభించబోవు.

క్యూఆర్ కోడ్‌తో పాన్ కార్డ్

పాన్ 2.0 ప్రాజెక్టుకు కేంద్రం ఆమోదం

న్యూఢిల్లీ: క్యూఆర్ కోడ్‌తో కూడిన కొత్త తరహా పాన్ కార్డులను అందించే ప్రాజెక్ట్‌కు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. పాన్ 2.0 ప్రాజెక్టుకు రూ.1,435 కోట్లు వ్యయం చేయనుంది. ప్రస్తుత పాన్ స్థానంలో ఈ కొత్త శాశ్వత ఖాతా సంఖ్య (పాన్)ను పౌరులకు ఉచితంగా అందించనుంది. 10 అంకెల ఆల్ఫా న్యూమరిక్ నంబర్‌తో కూడిన పాన్‌ను ఆదాయపన్ను శాఖ జారీ చేస్తుందని తెలిసిందే. ఇప్పటికే జారీ అయిన పాన్‌లు అన్నీ చెల్లుతాయని, వాటిని మార్చుకోవాల్సిన అవసరం లేదని కేంద్ర సమాచార శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ స్పష్టం చేశారు. మూడు, నాలుగు భిన్నమైన గుర్తింపులు కాకుండా ఉమ్మడి గుర్తింపు కోసం వ్యాపార సంస్థలు డిమాండ్ చేస్తున్నట్లు మీడియాకు తెలిపారు. ప్రభుత్వ ఏజెన్సీల డిజిటల్ సిస్టమ్‌లు అన్నింటికీ పాన్ ఉమ్మడి గుర్తింపుగా ఉంటుందన్నారు. ప్రస్తుత పాన్/టాన్ 1.0 ఎకోసిస్టమ్‌కు ఇది మెరుగైన వెర్షన్ అని తెలిపారు. ఇప్పటి వరకు 78 కోట్ల పాన్‌లు జారీ కాగా, అందులో 98 శాతం వ్యక్తులకు సంబంధించినవి ఉన్నాయి.



పాన్ 2.0 ప్రత్యేకత ఏంటి?

పాన్‌ను 1972లో తొలిసారి ప్రవేశపెట్టారు. పన్ను చెల్లింపుదారుల గుర్తింపు నంబర్‌తో కూడిన డేటాబేస్ ఇది. ప్రస్తుతం పాన్ కోసం వినియోగిస్తున్న సాఫ్ట్‌వేర్ 15 ఏళ్ల క్రితం నాటిది. దీని స్థానంలో మెరుగైన టెక్నాలజీతో కూడినదే పాన్ 2.0. మోదీ సర్కారు డిజిటల్ ఇండియా కార్యక్రమంలో భాగంగా దీన్ని తీసుకొస్తున్నారు. ఇందులో క్యూఆర్ కోడ్ ఉండడంతో స్కాన్ చేయడం ద్వారా పాన్ సమాచారాన్ని సులభంగా షేర్ చేసుకోవచ్చు. భౌతిక పత్రాల అవసరం ఉండదు. పన్ను చెల్లింపుదారుల సమాచారంలో లోపాలకు అవకాశం ఉండదు. దరఖాస్తులను వేగంగా ప్రాసెస్ చేసేందుకు వీలుంటుంది. ప్రస్తుతం ఆధార్‌ను గుర్తింపునకు ఎలా వినియోగిస్తున్నామో.. ఆర్థిక లావాదేవీలకు పాన్ ఇదే మాదిరిగా పనిచేయనుంది. ప్రస్తుత పాన్‌లు అన్నీ చెల్లుతాయి. అయినప్పటికీ కొత్త పాన్ కోరిన వారికి ఎలాంటి చార్జీ లేకుండా ఆదాయపన్ను శాఖ అందిస్తుంది.

సూచీలకు స్వల్ప నష్టాలు

- సెన్సెక్స్ 106 పాయింట్లు డౌన్; 24,200 దిగువకు నిఫ్టీ



ముంబై: అంతర్జాతీయ మార్కెట్లలోని బలహీన సంకేతాలు, వాణిజ్యపరమైన ఉద్రిక్తతల ప్రభావంతో మంగళవారం దేశీయ స్టాక్ మార్కెట్ స్వల్ప నష్టాలతో ముగిసింది. సెన్సెక్స్ 106 పాయింట్లు నష్టపోయి 80,004 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 27 పాయింట్లు కోల్పోయి 24,194 వద్ద నిలిచింది. యుటిలిటీస్, పవర్, ఆటో, ఆయిల్‌అండ్‌గ్యాస్, సర్వీసెస్ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. ఐటీ, టెక్, టెలికమ్యూనికేషన్, మెటల్ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. ట్రంప్ తన ప్రమాణ స్వీకారం రోజు జనవరి 20న మెక్సికో, కెనడా నుంచి దిగుమతయ్యే వస్తువులపై 25%, చైనాల నుంచి దిగుమతయ్యే ఉత్పత్తులపై పది శాతం పన్ను విధింపునకు అవసరమైన పత్రాలపై సంతకం చేస్తానంటూ తెలపడంతో ప్రపంచ మార్కెట్లు నష్టపోయాయి.

- సీవేజ్ ట్రీట్మెంట్ సొల్యూషన్స్ ప్రొవైడర్ ఎన్విరో ఇన్‌ఫ్రా ఇంజినీర్స్ ఐపీఓ చివరి రోజు నాటికి 89.90 రెట్లు స్పందన వచ్చింది ఇష్యూలో భాగంగా కంపెనీ 3.07 కోట్ల షేర్లు జారీ చేయగా, 277 కోట్ల షేర్లకు బిడ్లు వచ్చాయి. క్యూఐబీ విభాగం 157 రెట్లు, రిటైల్ ఇన్వెస్టర్ల విభాగం 24 రెట్లు సబ్‌స్క్రయిబ్ అయ్యాయి.



150 గంటల్లో నిర్మాణం.. ఈప్యాక్ రికార్డు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ప్రీ–ఇంజనీర్డ్ బిల్డింగ్ మాన్యుఫాక్చరింగ్ కంపెనీ ఈప్యాక్ ప్రీఫ్యాబ్ అత్యంత తక్కువ సమయంలో భవనాన్ని నిర్మించి భారత్‌లో సరికొత్త రికార్డు నమోదు చేసింది. ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా తడ మండలం మంబట్టు వద్ద 1,51,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో భవనాన్ని కేవలం 150 గంటల్లో పూర్తి చేసి ఔరా అనిపించింది. ఈ ఘనతను సాధించి గోల్డెన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించినట్టు కంపెనీ ఎండీ సంజయ్ సింఘానియా తెలిపారు. భవన నిర్మాణానికి ఆధునిక ప్రీఫ్యాబ్రికేషన్, ప్రీ–ఇంజనీర్డ్ బిల్డింగ్ సాంకేతికతను వినియోగించినట్టుగా వివరించారు.

ఇక ఓలా నుంచి చౌక స్కూటర్లు

- ప్రారంభ ధర రూ.39,999
- కార్మికుల కోసం గిగ్ శ్రేణి

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఎలక్ట్రిక్ స్కూటర్ల తయారీలో ఉన్న ఓలా ఎలక్ట్రిక్ చౌక స్కూటర్లను ప్రవేశపెట్టింది. వాణిజ్య అవసరాలకై కార్మికుల కోసం గిగ్ శ్రేణిని పరిచయం చేసింది. ప్రారంభ ఆఫర్ కింద ఎక్స్‌షోరూంలో గిగ్ వేరియంట్ ధర రూ.39,999, గిగ్ ప్లస్ రూ.49,999 ఉంది. తక్కువ నిడివి ప్రయాణాల కోసం 1.5 కిలోవాట్ అవర్ బ్యాటరీని గిగ్ వేరియంట్‌కు పొందుపరిచారు. ఒకసారి చార్జింగ్‌తో 112 కిలోమీటర్లు ప్రయాణిస్తుందని కంపెనీ తెలిపింది. గరిష్ట వేగం గంటకు 25 కిలోమీటర్లు. దూర ప్రాంతాలకు బరువులు మోసేందుకు వీలుగా గిగ్ ప్లస్ వేరియంట్‌కు 1.5 కిలోవాట్ అవర్‌తో కూడిన బయటకు తీయడానికి వీలున్న సింగిల్/డ్యూయల్ బ్యాటరీ ఏర్పాటు ఉంది. 81 కిలోమీటర్లు ప్రయాణిస్తుంది. గరిష్ట వేగం గంటకు 45 కిలోమీటర్లు.



వ్యక్తిగత వినియోగం కోసం..

అలాగే నగర కస్టమర్ల కోసం వ్యక్తిగత వినియోగం కోసం ఎస్1 జెడ్ మోడల్ ఎలక్ట్రిక్ స్కూటర్‌ను ఓలా రూ.59,999 ధరలో అందుబాటులోకి తెచ్చింది. ఎస్1 జెడ్ ప్లస్ వేరియంట్ ధర రూ.64,999 ఉంది. వ్యక్తిగత, తేలికపాటి వాణిజ్య అవసరాలకు ఎస్1 జెడ్ ప్లస్ ఉపయోగించవచ్చని కంపెనీ తెలిపింది. ఎస్1 జెడ్, ఎస్1 జెడ్ ప్లస్ వేరియంట్లకు 1.5 కిలోవాట్ అవర్ సామర్థ్యంగల రిమూవబుల్ డ్యూయల్ బ్యాటరీలు ఉన్నాయి.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..
రుణ వృద్ధిపై బ్యాంకింగ్ దృష్టి
భారత్‌లో 5జీ జోరు

సైయెంట్ మోహన్ రెడ్డికి లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఇంటెలిజెంట్ ఇంజనీరింగ్ సేవల సంస్థ సైయెంట్ వ్యవస్థాపక చైర్మన్ బీవీఆర్ మోహన్ రెడ్డికి ప్రతిష్టాత్మక లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ పురస్కారం లభించింది. ఇంజనీరింగ్, టెక్నాలజీ రంగాలకు ఆయన అందించిన సేవలకు గాను ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డైరెక్టర్స్ (ఐవోడీ) నుంచి గోల్డెన్ పీకాక్ అవార్డును అందుకున్నారు. ఇటీవల లండన్‌లో జరిగిన ఐవోడీ వార్షిక సదస్సులో దీన్ని ప్రదానం చేశారు. మోహన్ రెడ్డి గతంలో నాస్కామ్ చైర్మన్‌గా వ్యవహరించారు. టీ–హబ్ ఫౌండింగ్ డైరెక్టర్లలో ఆయన ఒకరు కాగా, ఐఐటీ హైదరాబాద్, ఐఐటీ రూర్కీ గవర్నర్స్ బోర్డ్‌లకు చైర్మన్‌గా ఉన్నారు. కార్పొరేట్ రంగంలో అత్యుత్తమ ప్రమాణంగా గోల్డెన్ పీకాక్ అవార్డులకు అంతర్జాతీయంగా ప్రత్యేక గుర్తింపు ఉంది.



భవిత

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

కేంద్ర కొలువులకు.. జాబ్ క్యాలెండర్

» 2025 జాబ్ క్యాలెండర్ విడుదల చేసిన యూపీఎస్‌సీ
» డిగ్రీ అర్హతతోనే అనేక ఉద్యోగాలకు సిద్ధమయ్యే అవకాశం
» సివిల్స్ మొదలు ఎన్‌డీఏ వరకు పలు పరీక్షల తేదీలు ఖరారు
» పక్కా ప్రణాళికతో ప్రిపరేషన్ సాగిస్తే సక్సెస్ సాధ్యమే

యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ సంక్షిప్తంగా.. యూపీఎస్‌సీ! కేంద్ర ప్రభుత్వ ఉద్యోగార్థులకు ఎంతో సుపరిచితమైన పేరు! దేశంలోనే అతి పెద్ద రిక్రూట్‌మెంట్ బోర్డ్! బ్యాచిలర్ డిగ్రీతో పోటీ పడే అత్యున్నత సివిల్ సర్వీసెస్ మొదలు.. ఇంటర్మీడియెట్ అర్హతగా నిర్వహించే ఎన్‌డీఏ-ఎన్‌ఏ వరకు.. అనేక కీలక సర్వీసులకు యూపీఎస్సీ నియామక ప్రక్రియ చేపడుతుంది. ఇందుకోసం ముందుగానే ఆయా పరీక్షలకు సంబంధించి వార్షిక క్యాలెండర్ విడుదల చేస్తుంది. ఇటీవల 2025 సంవత్సరానికి సంబంధించి ఎగ్జామ్ క్యాలెండర్ విడుదల చేసింది. ఈ నేపథ్యంలో.. యూపీఎస్‌సీ నిర్వహించే ముఖ్యమైన పరీక్షలు, వాటి వివరాలు, దరఖాస్తుకు అర్హతలు, పరీక్షల తేదీలు తదితర ముఖ్య సమాచారం..

పరీక్షలు ఇవే

యూపీఎస్‌సీ 2025 రిక్రూట్‌మెంట్ క్యాలెండర్‌ను పరిశీలిస్తే.. సివిల్ సర్వీసెస్ సహా మొత్తం 15 పరీక్షలను నిర్వహిస్తోంది. సివిల్స్,ఐఎఫ్‌ఎస్,ఈఎస్‌ఈ, ఎన్‌డీఏ–ఎన్‌ఏ, సీడీఎస్‌ఈ, సీఎంఎస్ వంటి కీలక సర్వీసులకు నియామక ప్రక్రియ చేపడుతోంది.

సివిల్ సర్వీసెస్ ఎగ్జామినేషన్

- **ప్రిలిమ్స్ నోటిఫికేషన్ తేదీ:** 2025, జనవరి 22;
- **దరఖాస్తుకు చివరి తేదీ:** 2025, ఫిబ్రవరి 11;
- **ప్రిలిమ్స్ పరీక్ష తేదీ:** 2025, మే 25;
- **మెయిన్ ఎగ్జామినేషన్:** 2025 ఆగస్ట్ 22 నుంచి అయిదు రోజులు.
- **అర్హత:** బ్యాచిలర్ డిగ్రీ ఉతీర్ణులు, చివరి సంవత్సరం చదువుతున్న వారు దరఖాస్తుకు అర్హులు.

మూడు దశల్లో ఎంపిక ప్రక్రియ

సివిల్ సర్వీసెస్ ఎంపిక ప్రక్రియ మొత్తం మూడు దశల్లో జరుగుతుంది. అవి.. ప్రిలిమ్స్, మెయిన్స్, పర్సనాలిటీ టెస్ట్. ప్రిలిమినరీ పరీక్ష రెండు పేపర్లుగా మొత్తం 400 మార్కులకు ఉంటుంది. పేపర్–1లో జనరల్ అవేర్‌నెస్, జనరల్ నాలెడ్జ్, కరెంట్ అఫైర్స్ నుంచి ప్రశ్నలు ఉంటాయి. పేపర్–2లో కాంప్రహెన్షన్, ఇంటర్ పర్సనల్ స్కిల్స్, లాజికల్ రీజనింగ్ అండ్ అనలిటికల్ ఎబిలిటీ, డెసిషన్ మేకింగ్ అండ్ ప్రాబ్లమ్ సాల్వింగ్, జనరల్ మెంటల్ ఎబిలిటీ, బేసిక్ న్యూమరసీ, ఇంగ్లిష్ లాంగ్వేజ్ కాంప్రహెన్షన్ అంశాల నుంచి ప్రశ్నలు ఉంటాయి.

మెయిన్ ఎగ్జామినేషన్

రెండో దశలో పూర్తి డిస్క్రిప్టివ్ విధానంలో నిర్వహించే మెయిన్ ఎగ్జామినేషన్‌లో మొత్తం ఏడు పేపర్లు ఉంటాయి. అవి..జనరల్ ఎస్సే(పేపర్–1), జనరల్ స్టడీస్–1 (పేపర్–2), జనరల్ స్టడీస్ –2 (పేపర్–3), జనరల్ స్టడీస్–3 (పేపర్–4), జనరల్ స్టడీస్–4 (పేపర్–5), ఆప్షనల్ సబ్జెక్ట్ పేపర్–1 (పేపర్–6), ఆప్షనల్ సబ్జెక్ట్ పేపర్–2 (పేపర్–7). ఒక్కో పేపర్‌కు 250 మార్కులు చొప్పున మొత్తం 1750 మార్కులకు మెయిన్ పరీక్ష ఉంటుంది. పేపర్–6, పేపర్–7లకు సంబంధించి అభ్యర్థులు యూపీఎస్సీ నిర్దేశించిన 25 ఆప్షనల్ సబ్జెక్ట్‌లలో ఏదో ఒక సబ్జెక్ట్‌ను ఎంపిక చేసుకోవాలి. మెయిన్స్‌లో సాధించిన మార్కుల ఆధారంగా చివరగా పర్సనాలిటీ టెస్ట్ పేరుతో 275 మార్కులకు ఇంటర్వ్యూ నిర్వహిస్తారు. మెయిన్స్, ఇంటర్వ్యూ మార్కుల ఆధారంగా తుది విజేతలను ప్రకటిస్తారు.

ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్

- **ప్రిలిమ్స్ నోటిఫికేషన్ తేదీ:** 2025, జనవరి 22;
- **దరఖాస్తు చివరి తేదీ:** 2025, ఫిబ్రవరి 11;
- **ప్రిలిమ్స్ పరీక్ష తేదీ:** 2025, మే 25;
- **మెయిన్ ఎగ్జామినేషన్:** 2025 నవంబర్ 16 నుంచి ఆరు రోజులు.
- **అర్హత:** నిర్దేశిత సబ్జెక్ట్‌లతో బీఎస్సీ, బీటెక్ ఉత్తీర్ణత ఉండాలి.

మూడు దశల్లో ఎంపిక

- ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్..కేంద్ర అటవీ శాఖలో డివిజనల్ ఫారెస్ట్ ఆఫీసర్ హోదాలో అడుగు పెట్టేందుకు అవకాశం కల్పించే పరీక్ష ఇది. ఈ పరీక్ష కూడా మూడు దశల్లో ఉంటుంది. అవి.. ప్రిలిమ్స్, మెయిన్స్, పర్సనల్ ఇంటర్వ్యూ. సివిల్ సర్వీసెస్ ప్రిలిమ్స్ పరీక్షనే.. ఐఎఫ్‌ఎస్ ప్రిలిమ్స్‌గా పేర్కొన్నారు. అభ్యర్థులు సివిల్స్ నోటిఫికేషన్‌ను అనుసరించి ప్రిలిమ్స్‌కు దరఖాస్తు చేసుకోవాలి.
- సివిల్స్ ప్రిలిమ్స్‌లో చూపిన ప్రతిభ ఆధారంగా ఐఎఫ్‌ఎస్ మెయిన్‌కు ఎంపిక చేస్తారు. మెయిన్స్‌లో మొత్తం ఆరు పేపర్లు ఉంటాయి. పేపర్–1లో జనరల్ ఇంగ్లిష్–300 మార్కులు, పేపర్–2లో జనరల్ నాలెడ్జ్–300 మార్కులు, పేపర్–3 (ఆప్షనల్ సబ్జెక్ట్ పేపర్–1), పేపర్–4 (ఆప్షనల్ సబ్జెక్ట్–పేపర్ 2), పేపర్–5(ఆప్షనల్ సబ్జెక్ట్ –2 పేపర్–1), పేపర్– 6 (ఆప్షనల్ సబ్జెక్ట్ 2 పేపర్ –2). ఆప్షనల్ సబ్జెక్ట్‌లకు సంబంధించి ప్రతి పేపర్‌కు 200 మార్కులు ఉంటాయి. మెయిన్స్‌లో అర్హత సాధించిన అభ్యర్థులను చివరగా 300 మార్కులకు పర్సనల్ ఇంటర్వ్యూ నిర్వహిస్తారు. మెయిన్స్, ఇంటర్వ్యూ మార్కుల ఆధారంగా తుది విజేతలను ప్రకటిస్తారు.

ఇంజనీరింగ్ సర్వీసెస్ ఎగ్జామినేషన్

- **ప్రిలిమ్స్ నోటిఫికేషన్ తేదీ:** సెప్టెంబర్18, 2024
- **దరఖాస్తు చివరి తేదీ:** నవంబర్ 22, 2024
- **ప్రిలిమ్స్ పరీక్ష తేదీ:** 2025, జూన్ 6
- **మెయిన్స్ పరీక్ష తేదీ:** 2025, ఆగస్ట్ 10



- **అర్హత:** సంబంధిత బ్రాంచ్‌తో బీటెక్ ఉత్తీర్ణత ఉండాలి. చివరి సంవత్సరం చదువుతున్న అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

ఎంపిక ఇలా

- ఈఎస్‌ఈ ద్వారా కేంద్ర ప్రభుత్వ శాఖల్లో ఇంజనీరింగ్ విభాగంలో.. గ్రూప్–ఎ హోదాలో ఇంజనీర్ల నియామకాలు చేపడతారు. ఈ పరీక్షను సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగాల్లో నిర్వహిస్తారు. తాజాగా ఇండియన్ రైల్వే మేనేజ్‌మెంట్ సర్వీస్‌లో ఇంజనీరింగ్ విభాగాలకు కూడా ఈఎస్‌ఈ స్కోర్‌నే ప్రామాణికంగా తీసుకోనున్నట్లు ప్రకటించారు.
- ఇంజనీరింగ్ సర్వీసెస్ ఎగ్జామినేషన్ ప్రక్రియ మూడు దశల్లో ఉంటుంది(ప్రిలిమ్స్, మెయిన్స్, పర్సనల్ ఇంటర్వ్యూ). తొలి దశ ప్రిలిమినరీలో రెండు పేపర్లు ఉంటాయి. అవి..పేపర్–1 (జనరల్ స్టడీస్ అండ్ ఇంజనీరింగ్ ఆప్టిట్యూడ్–200); పేపర్–2 (ఇంజనీరింగ్ సంబంధిత సబ్జెక్ట్–300 మార్కులు).

మెయిన్ ఎగ్జామినేషన్

- ప్రిలిమ్స్‌లో చూపిన ప్రతిభ ఆధారంగా రెండో దశలో మెయిన్ ఎగ్జామినేషన్‌ను నిర్వహిస్తారు. ఇది పూర్తిగా డిస్క్రిప్టివ్ విధానంలో ఉంటుంది. మొత్తం రెండు పేపర్లుగా.. ఒక్కో పేపర్‌కు 300 మార్కులు చొప్పున మొత్తం 600 మార్కులకు మెయిన్ జరుగుతుంది. ఎంపిక ప్రక్రియలో చివరగా 200మార్కులకు ఇంటర్వ్యూ నిర్వహిస్తారు.

కంబైన్డ్ డిఫెన్స్ సర్వీసెస్ ఎగ్జామినేషన్

- **సీడీఎస్‌ఈ(1)నోటిఫికేషన్:** 2024, డిసెంబర్ 11
- **దరఖాస్తు చివరి తేదీ:** 2024, డిసెంబర్ 31;
- **పరీక్ష తేదీ:** 2025, ఏప్రిల్ 13.
- **సీడీఎస్‌ఈ (2) నోటిఫికేషన్:** 2025, మే 28.
- **దరఖాస్తు చివరి తేదీ:** 2025, జూన్ 17.
- **పరీక్ష తేదీ:** 2025, సెప్టెంబర్ 14.

అర్హతలు

- ఇండియన్ మిలటరీ అకాడమీ, ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమీకి బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి. అదేవిధంగా నేవల్ అకాడమీకి బీటెక్/బీఈ ఉత్తీర్ణత; ఎయిర్‌ఫోర్స్ అకాడమీకి బ్యాచిలర్ డిగ్రీ లేదా బీఈ/బీటెక్ ఉత్తీర్ణత ఉండాలి. దీంతోపాటు అభ్యర్థులు ఇంటర్మీడియెట్‌లో ఎంపీసీ గ్రూప్ చదివుండాలి. దరఖాస్తు తేదీ నాటికి చివరి సంవత్సరం చదువుతున్న వారు కూడా అర్హులే.

ఏటా రెండుసార్లు పరీక్ష

ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్‌లలో పర్మనెంట్ కమిషన్ ర్యాంకు హోదా పోస్ట్‌లకు చేపట్టే నియామక ప్రక్రియ.. కంబైన్డ్ డిఫెన్స్ సర్వీసెస్ ఎగ్జామినేషన్(సీడీఎస్‌ఈ). ఈ పరీక్షను ప్రతి ఏటా రెండుసార్లు (సీడీఎస్‌ఈ–1, సీడీఎస్‌ఈ–2) నిర్వహిస్తారు. సీడీఎస్‌ఈ ఎంపిక ప్రక్రియ రెండు దశల్లో జరుగుతుంది. తొలిదశలో రాత పరీక్ష ఉంటుంది. ఇండియన్ మిలటరీ అకాడమీ, ఇండియన్ నేవల్ అకాడమీ, ఎయిర్‌ఫోర్స్ అకాడమీ అభ్యర్థులకు 300 మార్కులకు; ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమీ అభ్యర్థులకు 200 మార్కులకు పరీక్ష నిర్వహిస్తారు. రాత పరీక్షలో నిర్దేశిత కటాఫ్ మార్కులు పొందిన అభ్యర్థులకు తదుపరి దశలో.. సర్వీస్ సెలక్షన్ బోర్డ్(ఎస్ఎస్‌బీ) ఆధ్వర్యంలో ఇంటెలిజెన్స్ అండ్ పర్సనాలిటీ టెస్ట్ నిర్వహిస్తారు.

ఎన్‌డీఏ, ఎన్ఏ ఎగ్జామినేషన్

- **ఎన్‌డీఏ, ఎన్ఏ(1)–2025 నోటిఫికేషన్:** 2024 డిసెంబర్ 11
- **దరఖాస్తు చివరి తేదీ:** డిసెంబర్ 31
- **పరీక్ష తేదీ:** 2025 ఏప్రిల్ 13.
- **ఎన్‌డీఏ, ఎన్ఏ (2)–2025 నోటిఫికేషన్:** మే 28, 2025;
- **దరఖాస్తు చివరి తేదీ:** 2025 జూన్ 17;
- **పరీక్ష తేదీ:** 2025, సెప్టెంబర్ 14
- **అర్హతలు:** ఆర్మీ వింగ్‌కి ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణత; ఎయిర్‌ఫోర్స్, నేవీ, నేవల్ అకాడమీకి మ్యాథ్స్, ఫిజిక్స్ సబ్జెక్ట్‌లుగా ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణత ఉండాలి.

ఇంటర్‌తోనే త్రివిధ దళాల్లో ఆఫీసర్

ఇంటర్మీడియెట్ అర్హతతోనే.. త్రివిధ దళాల్లో పర్మనెంట్ కమిషన్‌తో కొలువు అందించే పరీక్ష.. నేషనల్ డిఫెన్స్ అకాడమీ/నేవల్ అకాడమీ ఎగ్జామినేషన్. ఈ పరీక్షను కూడా యూపీఎస్‌సీ ఏటా రెండుసార్లు ఎన్‌డీఏ/ఎన్ఏ–1, ఎన్‌డీఏ/ఎన్ఏ–2 పేరుతో నిర్వహిస్తుంది. దీనిద్వారా..ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్(ఫ్లయింగ్ విభాగం, గ్రౌండ్ డ్యూటీ టెక్నికల్ విభాగం)లో లెఫ్టినెంట్, సబ్ లెఫ్టినెంట్, ఫ్లయింగ్ ఆఫీసర్ హోదాల్లో ఉద్యోగాల భర్తీ చేపడతారు. అదే విధంగా.. నేవల్ అకాడమీ (10+2 కేడెట్ ఎంట్రీ స్కీమ్)కు కూడా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. రాత పరీక్ష, ఎస్ఎస్‌బీ ఎంపిక ప్రక్రియ ద్వారా ఎంపిక చేపడతారు.

కొలువుతోపాటు కోర్సు

తొలి దశ రాత పరీక్షలో రెండు పేపర్లు ఉంటాయి. అవి..పేపర్–1(మ్యాథమెటిక్స్– 300 మార్కులు); పేపర్–2 (జనరల్ ఎబిలిటీ టెస్ట్–600 మార్కులు). రెండో దశలో 900 మార్కులకు ఎస్ఎస్‌బీ టెస్ట్/ఇంటర్వ్యూ నిర్వహిస్తారు. రెండు దశల ఎంపిక ప్రక్రియలో విజయం సాధించి తుది జాబితాలో నిలిచిన అభ్యర్థులకు నేషనల్ డిఫెన్స్ అకాడమీ, నేవల్ అకాడమీల్లో శిక్షణనిస్తారు. ఇది కూడా విజయవంతంగా పూర్తి చేసుకుంటే.. బీఏ, బీఎస్సీ, బీటెక్ పట్టాలు కూడా అందజేస్తారు. నేవల్ అకాడమీ 10+2 క్యాడెట్ ఎంట్రీ స్కీమ్‌కు ఎంపికై శిక్షణ పూర్తి చేసుకున్న వారికి.. కొలువుతోపాటు అప్లైడ్ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్, నేవల్ ఆర్కిటెక్చర్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ బ్రాంచ్‌లలో ఏదో ఒక బ్రాంచ్‌తో బీటెక్ సర్టిఫికెట్ కూడా అందజేస్తారు.



ఐఈఎస్ /ఐఎస్ఎస్

- **నోటిఫికేషన్ తేదీ:** 2025, ఫిబ్రవరి 12;
- **దరఖాస్తు చివరి తేదీ:** 2025, మార్చి 4
- **పరీక్ష తేదీ:** 2025, జూన్ 20

అర్హతలు

- ఐఈఎస్‌కు ఎకనామిక్స్ లేదా అప్లైడ్ ఎకనామిక్స్ లేదా బిజినెస్ ఎకనామిక్స్ లేదా ఎకనోమెట్రిక్స్ స్పెషలైజేషన్లతో పీజీ ఉత్తీర్ణత ఉండాలి.
- ఐఎస్ఎస్‌కు స్టాటిస్టిక్స్/మ్యాథమెటికల్ స్టాటిస్టిక్స్/అప్లైడ్ స్టాటిస్టిక్స్‌లలో ఏదో ఒక సబ్జెక్ట్‌తో బ్యాచిలర్ డిగ్రీ/పీజీ ఉత్తీర్ణత ఉండాలి.
- మినిస్ట్రీ ఆఫ్ స్టాటిస్టిక్స్ అండ్ ప్రోగ్రామ్ ఇంప్లిమెంటేషన్, కేంద్ర ఆర్థిక శాఖలో జూనియర్ టైమ్ స్కేల్‌తో అసిస్టెంట్ డైరెక్టర్, రీసెర్చ్ ఆఫీసర్ హోదాలో కొలువులు భర్తీ చేస్తారు.
- ఎంపిక ప్రక్రియ రెండు దశల్లో ఉంటుంది. అవి.. రాత పరీక్ష, పర్సనల్ ఇంటర్వ్యూ.

సీఏపీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్

- **నోటిఫికేషన్ తేదీ:** 2025 మార్చి 5;
- **దరఖాస్తు చివరి తేదీ:** 2025 మార్చి 25
- **పరీక్ష తేదీ:** 2025 ఆగస్ట్ 3
- **అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణత ఉండాలి. చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

అసిస్టెంట్ కమాండెంట్ కొలువు

కేంద్ర సాయుధ దళాల్లో(బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్; సీఆర్‌పీఎఫ్, సీఐఎస్ఎఫ్; ఐటీబీపీ, సశస్త్ర సీమాబల్) అసిస్టెంట్ కమాండెంట్ పోస్ట్‌ల కోసం కూడా యూపీఎస్‌సీ ఎంపిక ప్రక్రియ చేపడుతుంది. మొత్తం మూడు దశలు ఉంటాయి. తొలి దశ రాత పరీక్ష రెండు పేపర్లుగా ఉంటుంది. పేపర్–1(జనరల్ ఎబిలిటీ అండ్ ఇంటెలిజెన్స్ –250 మార్కులు); పేపర్–2 జనరల్ స్టడీస్, ఎస్సే, కాంప్రహెన్షన్ (200 మార్కులు). మొదటి దశ రాత పరీక్షలో పేపర్–1, 2లలో నిర్దేశిత కటాఫ్ సొంతం చేసుకున్న అభ్యర్థులకు రెండో దశలో ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్‌ను నిర్వహిస్తారు. రాత పరీక్ష, ఫిజికల్ ఎఫిషియెన్సీ టెస్ట్‌లలో పొందిన మార్కులు ఆధారంగా.. చివరగా 150 మార్కులకు పర్సనల్ ఇంటర్వ్యూ నిర్వహిస్తారు.

కంబైన్డ్ జియో సైంటిస్ట్ ఎగ్జామినేషన్

- **నోటిఫికేషన్ విడుదల:** 2024, సెప్టెంబర్ 4;
- **దరఖాస్తు చివరి తేదీ:** 2024, సెప్టెంబర్ 24;
- **ప్రిలిమినరీ పరీక్ష తేదీ:** 2025, ఫిబ్రవరి 9;
- **మెయిన్ పరీక్ష తేదీ:** 2025, జూన్ 21
- **అర్హత:** సంబంధిత స్పెషలైజేషన్‌లో పీజీ ఉత్తీర్ణత ఉండాలి.

సైంటిస్ట్ ఉద్యోగాలకు మార్గం

కంబైన్డ్ జియో సైంటిస్ట్ ఎగ్జామినేషన్ ద్వారా కేంద్ర ప్రభుత్వ శాఖల్లో జియాలజిస్ట్ (గ్రూప్–ఎ), జియో ఫిజిసిస్ట్, కెమిస్ట్–(గ్రూప్–ఎ), సైంటిస్ట్–బి (హైడ్రాలజీ), సైంటిస్ట్–బి (కెమికల్) (గ్రూప్–ఎ), సైంటిస్ట్–బి (జియో ఫిజిక్స్) గ్రూప్–ఎ పోస్ట్‌లు భర్తీ చేస్తారు. ఎంపిక ప్రక్రియలో మొదటగా ప్రిలిమినరీ పరీక్ష, తర్వాత మెయిన్ ఎగ్జామినేషన్, చివరగా పర్సనల్ ఇంటర్వ్యూ ఉంటాయి.

కంబైన్డ్ మెడికల్ సర్వీసెస్ ఎగ్జామినేషన్

- **ప్రిలిమ్స్ నోటిఫికేషన్ తేదీ:** 2025, ఫిబ్రవరి 19
- **దరఖాస్తు చివరి తేదీ:** 2025, మార్చి 11
- **ప్రిలిమ్స్ పరీక్ష తేదీ:** 2025, జూలై 20
- **అర్హతలు:** ఎంబీబీఎస్ ఉత్తీర్ణత ఉండాలి. చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

రెండు దశల్లో ఎంపిక

కేంద్ర ప్రభుత్వ పరిధిలోని శాఖల్లో వైద్యుల నియామకానికి నిర్వహించే పరీక్ష.. కంబైన్డ్ మెడికల్ సర్వీసెస్ ఎగ్జామినేషన్. ఈ పరీక్ష రెండు దశల్లో (ప్రిలిమ్స్, మెయిన్స్ ఎగ్జామినేషన్) ఉంటుంది. ఎంపిక ప్రక్రియలో తొలి దశ ప్రిలిమ్స్ రెండు పేపర్లు (పేపర్–1 జనరల్ మెడిసిన్ అండ్ పిడియాట్రిక్స్, పేపర్–2 ఎ) సర్జరీ; బి) గైనకాలజీ అండ్ ఆబ్‌స్టెట్రిక్స్; సి) ప్రివెంటివ్ అండ్ సోషల్ మెడిసిన్). రెండు పేపర్లు కలిపి 500 మార్కులకు పరీక్ష ఉంటుంది. రెండో దశలో 100 మార్కులకు పర్సనాలిటీ టెస్ట్ (ఇంటర్వ్యూ) నిర్వహిస్తారు.

- **వివరాలకు వెబ్‌సైట్:** https://upsc.gov.in

పెద్దపులి కలకలం

వాంకిడి(ఆసిఫాబాద్): కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో పెద్దపులి కలకలం సృష్టిస్తోంది. వాంకిడి మండలం బండకాస, ధాబా గ్రామాల శివారులో ఆదివారం ఐదు పశువులపై దాడి చేసింది. సోమవారం గోయేగాం అటవీ ప్రాంతంలోకి రాగా, మంగళవారం కూడా అక్కడే సంచరించింది. ఎఫ్ఆర్వో గోవింద్‌సింగ్ సర్దార్ ఆధ్వర్యంలో జిల్లా సిబ్బంది మహారాష్ట్ర అటవీ సిబ్బందితో కలిసి మహాగాం, కోస్టాడ అడవుల్లో వెతికినా పాదముద్రలు దొరకలేదు. కానీ గోయేగాం గ్రామానికి చెందిన కొందరు యువకులు పులి సంచారంపై తీసిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఎకో వంతెన సమీపంలోని ఖిండి దేవస్థానం మీదుగా పులి వెళ్తున్నట్లు వీడియోలో ఉంది. దీనిపై అధికారులను సంప్రదించగా వారు ధ్రువీకరించలేదు.




ఎకో వంతెన వద్ద ఖిండి దేవస్థానం మీదుగా వెళ్తున్న పెద్దపులి

రెడీ..వన్..టు..త్రీ..

సరిగ్గా గమనించండి.. ఇక్కడ వందలాదిగా ఎంపరర్ పెంగ్విన్‌లు ఉన్నా.. ఒక్క పెంగ్విన్ మాత్రం అన్నింటికన్నా ముందు దూకింది..

ఏదో సినిమాలో చెప్పినట్లు.. ప్రతి జనరేషన్‌కు ఓ టార్చ్ బేరర్ ఉంటాడట. ఈ పెంగ్విన్ల జనరేషన్‌కు ఇదే టార్చ్ బేరర్..

ఎందుకంటే.. ఈ పెంగ్విన్లు ఇప్పుడే తొలిసారిగా సముద్రంలో ఈదనున్నాయి. అన్నీ తటపటాయిస్తుంటే.. ఇది మాత్రం ఒక్కసారిగా ముందుకు దూకింది. అంటార్కిటికాలో తీసిన ఈ చిత్రం 'పిక్చర్స్ ఆఫ్ ద ఇయర్ ఎడిషన్' కోసం నేషనల్ జియోగ్రాఫిక్ చానల్ ఎంపిక చేసిన అత్యుత్తమ ఫొటోల్లో ఒకటిగా నిలిచింది. సాధారణంగా ఎంపరర్ పెంగ్విన్‌లు చిన్నస్థాయి మంచు ఫలకాలపైనే నివసిస్తాయి. అయితే, వాతావరణ మార్పులతో మంచు కరగడం ఇటీవల కాలంలో పెరిగింది. దాంతో అవి 50 అడుగుల ఎత్తున్న ఇలాంటి బలమైన, భారీ మంచు ఫలకాలను ఎంచుకుంటున్నాయని శాస్త్రవేత్తలు తెలిపారు. ఈ పెంగ్విన్‌లు ఓ స్థాయికి చేరాక.. వాటి తల్లిదండ్రులు వదిలేస్తాయి. అక్కడ్నుంచి అవే సొంతంగా వేటాడటం వంటివి నేర్చుకుంటాయి. అందులో భాగమే.. ఈ జంపింగ్.. జపాంగ్..



మన నగరం మన మెట్రో

హైదరాబాద్ మహా నగరంలో మెట్రోరైలు పరుగులకు అప్పుడే ఏడేళ్లు నిండాయి. 2017 నవంబర్ 28వ తేదీన ప్రజలకు మెట్రో సేవలు ఆరంభమయ్యాయి. ఈ ఏడేళ్లలో హైదరాబాద్ ప్రజా జీవితాన్ని మెట్రో విశేషంగా ప్రభావితం చేసింది. నాగోల్–రాయదుర్గం, మియాపూర్–ఎల్బీనగర్, జేబీఎస్–ఎంజీబీఎస్ కారిడార్‌లలో మెట్రో సేవలందజేస్తోంది. ఏడేళ్లప్రస్థానంలో ఎన్నో మార్పులు, మరెన్నో మైలురాళ్లు. 69 కి.మీల పొడవైన మూడు రూట్లలో నిత్యం లక్షలాది మంది ప్రయాణికులను తరలిస్తున్న మెట్రో ఓ జీవన రేఖలా మారింది. పర్యావరణ హితం, తక్కువ ప్రయాణ సమయం, కుదుపులు, ట్రాఫిక్ జామ్‌లకు తావులేని జర్నీ కావడంతో మెట్రో రైళ్లు ఎప్పుడు చూసినా కిటకిటలాడుతూ కన్పిస్తున్నాయి. దీంతో మాకూ మెట్రో రైలు కావాలనే డిమాండ్ నగరంలో ఊపందుకుంటోంది. దీంతో ఆ దిశగా విస్తరణకు కార్యాచరణ మొదలైంది. ఈ నేపథ్యంలో, శరవేగంగా విస్తరిస్తున్న మహానగరంలో ప్రయాణ కష్టాలను తీరుస్తూ, అన్ని వర్గాల ప్రయాణికులకు మెట్రో మరింత చేరువ కావాలంటే ఏం చేయాలి? ప్రయాణికుల అవసరాల మేరకు ప్రస్తుతం మెట్రో అందుబాటులో ఉందా? ఇంకా ఎలాంటి ఏర్పాట్లు చేయాలి? కోచ్‌లను అదనంగా ఏర్పాటు చేయవలసిన అవసరం ఉందా? మెట్రోస్టేషన్ల వద్ద పార్కింగ్ సమస్య ఎలా ఉంది? స్టేషన్లలో సదుపాయాలు ఎలా ఉన్నాయి? ఇంకా ఏం సదుపాయాలు కావాలి? మెట్రో వేళలు, సరికొత్త రూట్లు తదితర అంశాలపై మీ సందేహాలను తీర్చేందుకు 'సాక్షి'మీ ముందుకు వచ్చింది. మెట్రో రైలుతో మీ అనుభవాలు, దీనికి సంబంధించి మీ సూచనలు, సందేహాలు, ఏమైనా సమస్యలు ఉంటే 89777 94588 వాట్సాప్ నంబర్‌కు టెక్ట్స్, వాయిస్ మెసేజ్ రూపంలో పంపండి. హైదరాబాద్ మెట్రో రైల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి మీ ప్రశ్నలకు సమాధానాలిస్తారు. సందేహాలను నివృత్తి చేస్తారు. మెట్రో సేవలు విస్తరణ దిశగా తీసుకోనున్న చర్యలను వివరిస్తారు. వాటన్నింటినీ 'సాక్షి'ప్రచురిస్తుంది.



ఎన్వీఎస్ రెడ్డి

మీతో సాక్షి

ప్రచారం పీక్ దర్యాప్తు వీక్



శాస్త్రీయ ఆధారాల్లేక వీగిపోతున్న డ్రగ్స్ కేసులు

సాక్షి, హైదరాబాద్: గంజాయి, డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపాలని ప్రభుత్వ పెద్దలు పదేపదే సూచిస్తున్నా క్షేత్రస్థాయిలో ఆ పరిస్థితి కనిపించట్లేదు. మత్తుపదార్థాలను కట్టడి చేస్తున్నామంటూ అధికారులు భారీగా ప్రచారం చేస్తుండగా కేసుల దర్యాప్తు పేల వంగా సాగుతోందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నార్కోటిక్ డ్రగ్స్ అండ్ సైకోట్రోపిక్ సబ్‌స్టెన్సెస్ (ఎన్‌డీపీఎస్) చట్టం కింద నమోదు చేసిన కేసుల్లో చాలా వరకు వీగిపోవడమే అందుకు నిదర్శనం. దేశంలోనే తొలిసారిగా ఏర్పాటు చేసిన తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో (టీజీఏఎన్‌బీ) ఇటీవల విడుదల చేసిన గణాంకాలు ఈ విషయాన్ని చెప్పకనే చెబుతున్నాయి. ఈ ఏడాదిలో ఇప్పటివరకు నమోదైన 226 కేసులకుగాను కేవలం 39 కేసుల్లోనే శిక్షలు ఖరారయ్యాయి. అంటే ఆయా కేసుల్లో నేర నిరూపణ 17 శాతంగానే ఉంది. ఇక ఎక్సైజ్ శాఖ అధికారులు ఎన్‌డీపీఎస్ చట్టం కింద గత పదేళ్లలో నమోదు చేసిన కేసుల్లో నేర నిరూపణ అత్యంత తక్కువగా 0.85 శాతంగా ఉన్నట్లు ఆ శాఖ గణాంకాలే వెల్లడిస్తున్నాయి.


- నేర నిరూపణలో విఫలమవుతున్న టీజీ నార్కోటిక్స్ బ్యూరో, ఎక్సైజ్ శాఖ
- ఈ ఏడాదిలో 226 కేసులకుగాను 39 కేసుల్లోనే శిక్షలు ఖరారు
- ఎక్సైజ్ కేసుల్లో గత పదేళ్లలో 0.85 శాతానికి మించని కన్విక్షన్ రేట్
- ఎట్టకేలకు దర్యాప్తు అధికారులకు శిక్షణపై దృష్టిపెట్టిన అధికారులు

ఆధారాల సేకరణలో లోపాలే శాపాలై..

ఎన్‌డీపీఎస్ చట్టం కింద కేసుల నమోదు, మత్తుపదార్థాల స్వాధీనం, కోర్టుకు ఆధారాల సమర్పణ తదితర అంశాల్లో దర్యాప్తు అధికారులు చేస్తున్న కొన్ని పొరపాట్ల వల్లే ఎక్కువగా కేసులు వీగిపోతున్నాయి. చాలా వరకు ఎన్‌డీపీఎస్ కేసులు కనీసం విచారణ దశకు కూడా రాకుండానే సాంకేతిక కారణాలతో కోర్టులు కొట్టేస్తున్న సందర్భాలే ఎక్కువగా ఉంటున్నాయి. గంజాయి, డ్రగ్స్ సరఫరా సమాచారం అందాక దర్యాప్తు అధికారులు తన పై అధికారికి సమాచారం ఇవ్వడంతోపాటు వారి నుంచి లిఖితపూర్వకంగా ఆదేశాలు తీసుకోవాలి. ఆ తర్వాత తనిఖీ చేసేందుకు వెళ్లే సమయంలో ఇద్దరు పంచ్ విట్‌నెస్‌లను వెంట తీసుకెళ్లాలి. అందులో కనీసం ఒక్కరైనా ప్రభుత్వ ఉద్యోగి ఉండాలి. ఆ తర్వాత ఎవరి వద్ద తనిఖీ చేయడానికి వెళ్లారో ఆ వ్యక్తికి సదరు అధికారులు ఆప్షన్ ఫాం ఇవ్వాల్సి ఉంటుంది. దాని ప్రకారం..దర్యాప్తు అధికారులను అవతలి వ్యక్తులు తనిఖీ చేయవచ్చు (అధికారులే మత్తుపదార్థాలను తెచ్చి పెట్టారన్న సందేహాలకు తావు లేకుండా). ఆపై తనిఖీలను అధికారులు ప్రారంభించాలి. నూతన చట్టాల ప్రకారం ఈ వ్యవహారాన్ని వీడియో తీయాలి. సాంకేతిక అంశాల్లో జాగ్రత్తలు తీసుకోకపోయినా.. కొన్నిసార్లు పంచ్ విట్నెస్‌లు అందుబాటులో లేక అందుబాటులో ఉన్న వారితోనే పంచనామా చేయడం.. వారు సాక్ష్యం చెప్పడంలో తడబడటం వంటి కారణాలతో కేసులు నిలబడట్లేదు. సోదాల్లో దొరికిన మత్తుపదార్థాల నమూనాల సేకరణ, వాటికి సంఖ్య కేటాయింపు సైతం ఈ కేసుల్లో కీలకంకాగా అందులోనూ దర్యాప్తు అధికారులకు అవగాహన లేక కేసులు నిలబడట్లేదు.

శిక్షలు పెంచేలా శిక్షణపై దృష్టి..

ఈ నేపథ్యంలో ఎన్‌డీపీఎస్ కేసుల దర్యాప్తు పక్కాగా జరిగేలా చూడటంతోపాటు ఆధారాల సేకరణపై టీజీ నార్కోటిక్స్ బ్యూరో అధికారులు శిక్షణా తరగతుల నిర్వహణపై దృష్టిపెట్టారు. టీజీఏఎన్‌బీ ఆధ్వర్యంలో పోలీ స్, ఎక్సైజ్, ప్రాసిక్యూషన్, రైల్వే శాఖ అధికారులకు సైతం ఈ తరగతులు నిర్వహిస్తున్నారు. ఇప్పటివరకు 22,654 సిబ్బందికి శిక్షణ ఇచ్చినట్లు టీజీఏఎన్‌బీ అధికారులు తెలిపారు.



మైనర్లు.. మహా ముదుర్లు

- మహిళల వేధింపు ఘటనల్లో 29 మంది అరెస్టు
- రాచకొండ మహిళా భద్రతా విభాగం డీసీపీ ఉషా విశ్వనాథ్

సాక్షి, హైదరాబాద్: ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ప్రతి చోటా మహిళలకు వేధింపులు తప్పడం లేదు. ప్రేమ, పెళ్లి పేరుతో అమ్మాయిలు, మహిళలను వెంబడిస్తూ వేధింపులకు గురి చేస్తున్నారు. రాచకొండ కమిషనరేట్ పరిధిలో 15 రోజుల్లో 66 మంది ఈవ్ టీజర్లను అరెస్టు చేసినట్లు మహిళా భద్రతా విభాగం డీసీపీ ఉషా విశ్వనాథ్ తెలిపారు. ఆకతాయిలకు వారి కుటుంబ సభ్యుల సమక్షంలో మంగళవారం ఎల్బీ నగర్‌లోని సీపీ క్యాంపు కార్యాలయంలో కౌన్సెలింగ్ ఇచ్చామన్నారు. 15 రోజుల్లో రాచకొండ షీ టీమ్స్‌కు 93 ఫిర్యాదులు రాగా.. వీటిల్లో 66 మందిని అరెస్టు చేశామని తెలిపారు. ఇందులో 29 మంది మైనర్లు ఉన్నారన్నారు. వీరిపై ఆరు క్రిమినల్ కేసులు, 10 మందిపై పెట్టీ కేసులు నమోదు చేయగా, 54 మందికి కౌన్సెలింగ్ ఇచ్చినట్లు వెల్లడించారు. బస్టాండ్‌లు, రైల్వే స్టేషన్లు, మెట్రో స్టేషన్లు, స్కూళ్లు, కాలేజీలు, కూరగాయల మార్కెట్లు, బహిరంగ ప్రదేశాల్లో మఫ్టీలో తిరుగుతూ షీ టీమ్స్ డెకాయ్ ఆపరేషన్లు చేస్తున్నారని, బాలికలను, మహిళలను వెంబడించే, వేధించే పోకిరీల చేష్టలను సాక్ష్యాధారాలతో సహా పట్టుకొని న్యాయస్థానంలో హాజరు పరుస్తున్నామని ఉషా వివరించారు. 15 రోజుల్లో రాచకొండ షీ టీమ్స్ 58 అవగాహన కార్యక్రమాల ద్వారా 20,450 మందికి మహిళా చట్టాలు, హక్కులు, నేరాలు తదితరాలపై అవగాహన కల్పించాయని వెల్లడించారు. మెట్రో రైల్‌లో మహిళా కంపార్ట్‌మెంట్‌లో ప్రయాణిస్తున్న ఏడుగురు పురుషులను పట్టుకుని, మెట్రో స్టేషన్ అధికారులకు జరిమానా విధించామని ఆమె చెప్పారు.



ఈవ్ టీజర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న అధికారులు

'బయో సిమిలర్స్‌కి గమ్యస్థానంగా తెలంగాణ

ఇండో–బెల్జియన్ లైఫ్‌సైన్సెస్ సదస్సులో మంత్రి శ్రీధర్‌బాబు



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రం టీకాలు, జనరిక్ ఔషధాలు, కేన్సర్, ఇతర సంక్లిష్ట వ్యాధుల నివారణకు అవసరమైన బయో సిమిలర్స్ ఉత్పత్తిలో ప్రపంచ గమ్యస్థానంగా వృద్ధి చెందిందని ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు వెల్లడించారు. మంగళవారం మాదాపూర్‌లోని ఆవాసా హోటల్‌లో ఇండో–బెల్జియన్ లైఫ్‌సైన్సెస్ సదస్సును ప్రారంభించిన అనంతరం ఆయన ప్రసంగించారు. ప్రపంచవ్యాప్తంగా 33 శాతం వ్యాక్సిన్లు, జనరిక్ ఔషధాలు తెలంగాణ నుంచే సరఫరా అవుతాయని గుర్తు చేశారు. కొత్త అవకాశాలు, అనుకూల వాతావరణంతో బెల్జియం లైఫ్ సైన్సెస్ కంపెనీలకు ఆహ్వానం పలుకుతున్నామన్నారు. బలమైన భాగస్వామ్యం ద్వారా రెండు దేశాలు పరస్పర ప్రయోజనం పొందగలవన్న విశ్వాసం తనకుందని పేర్కొన్నారు.

బయో ఏషియా ప్రపంచ సదస్సుకు రండి

వచ్చే ఏడాది ఫిబ్రవరి 24–26 తేదీల్లో హైదరాబాద్‌లో జరగనున్న బయో ఏషియా ప్రపంచ సదస్సులో ఇండో–బెల్జియన్ లైఫ్ సైన్సెస్ సదస్సుకు హాజరైన ప్రముఖులంతా పాల్గొనాలని ఆహ్వానించారు. 'ఇండో–బెల్జియన్ లైఫ్ సైన్సెస్ కారిడార్‌ను బలపరచడం, ఆరోగ్య భవిష్యత్‌ను కలిసి ఆవిష్కరించడం 'అనే అంశంపై సాగిన ఈ సదస్సుకు బెల్జియం రాయబారి డిడియర్ వాండర్హాసెల్ట్, డాక్టర్ రెడ్డీస్ ఎండీ జీవీ ప్రసాద్, బయో ఏషియా అంతర్జాతీయ సలహా మండలి చైర్మన్ అజిత్‌శెట్టి తదితరులు హాజరయ్యారు.

రాజ్యాంగం.. మన జీవన విధానం

హైకోర్టు ఆవరణలో రాజ్యాంగ దిన వేడుకల్లో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ
సీఎస్ జస్టిస్ అలోక్ అరాధే, న్యాయమూర్తులు హాజరు

సాక్షి, హైదరాబాద్: రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యత అని, ప్రజల భాగస్వామ్యంతోనే అనుకున్న లక్ష్యాలను సాధించగలమని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పేర్కొన్నారు. ఇదే విషయాన్ని రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ కూడా చెప్పారని గుర్తు చేశారు. రాజ్యాంగం ఓ పుస్తకం మాత్రమే కాదని.. ఇది మన జీవన విధానమని వెల్లడించారు రాజ్యాంగాన్ని ఆమోదించి 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా హైకోర్టులో ఆవరణలో అడ్వొకేట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం రాజ్యాంగ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రత్యేక అతిథిగా గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ హాజరయ్యారు. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, అడ్వొకేట్ జనరల్ ఎ.సుదర్శన్‌రెడ్డి, బార్ కౌన్సిల్ చైర్మన్‌స్ ఎ.నరసింహారెడ్డి, పీపీ పల్లె నాగేశ్వర్‌రావు, హైకోర్టు అడ్వొకేట్ అసోసియేషన్ అధ్యక్షుడు అయ్యాడపు రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిష్ణుదేవ్ మాట్లాడుతూ.. '1949లో రాజ్యాంగం అమల్లోకి వచ్చింది. నేటికి 75 ఏళ్లు పూర్తయింది. ఈ రోజు మన దేశ చరిత్రలో ఒక మైలురాయిలా నిలిచిపోతుంది. రాజ్యాంగ ప్రవేశిక మన దేశాన్ని సార్వభౌమ, సామ్యవాద, లౌకిక, ప్రజాస్వామ్య, గణతంత్ర రాజ్యంగా పేర్కొంది. అంబేడ్కర్ ఎంతో దూరదృష్టితో మనకు రాజ్యాంగాన్ని బహుమతిగా ఇచ్చారు'అని పేర్కొన్నారు. ప్రాథమిక హక్కులు, ప్రాథమిక విధుల మధ్య సమతుల్యత ఉండాలన్న ప్రధాని మోదీ మాటలను ఆయన ఉద్ఘాటించారు. హక్కులకు ఎంత విలువిస్తున్నామో.. విధులను కూడా సమానంగా గౌరవించి పాటించాలని చెప్పారు.

సమష్టి సంకల్పానికి నిదర్శనం

జస్టిస్ అలోక్ అరాధే మాట్లాడుతూ.. 'అంబేడ్కర్ మనకు బహుమతిగా అందించిన రాజ్యాంగం చట్టపరమైన పత్రం మాత్రమే కాదు.. నైతిక దిక్సూచి. ప్రతి పౌరుడి హక్కులు, స్వేచ్ఛను కాపాడుతుంది. ప్రజాస్వామ్యాన్ని పెంపొందించడం, న్యాయాన్ని సమర్థించడం, అందరికీ సమానత్వాన్ని నిర్ధారించడం వంటి సమష్టి సంకల్పానికి ఇది నిదర్శనం'అని వివరించారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తులు, బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షురాలు దీప్తి, కార్యదర్శులు శాంతిభూషణ్, సంజీవ్‌కుమార్, సంయుక్త కార్యదర్శి వాసిరెడ్డి నవీన్, ఏఏజీలు ఇమ్రాన్‌ఖాన్, తేరా రజనీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మంగళవారం హైకోర్టులో జరిగిన రాజ్యాంగ దినోత్సవానికి హాజరైన గవర్నర్ జిష్ణుదేవ్‌కు జ్ఞాపికను అందజేస్తున్న హెచ్‌సీఏఏ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి. చిత్రంలో సీజే జస్టిస్ అలోక్ అరాధే, బార్ కౌన్సిల్ చైర్మన్ నరసింహారెడ్డి, ఉపాధ్యక్షురాలు దీప్తి తదితరులు

'పిటిషనర్ వ్యక్తిగత జీవితంలో జోక్యం వద్దు'

సాక్షి, హైదరాబాద్: చట్టం ప్రకారం విచారణ చేపట్టకుండా పిటిషనర్ వ్యక్తిగత జీవితంలో జోక్యం చేసుకోవద్దని రామగుండం సీపీకి హైకోర్టు తేల్చిచెప్పింది. సీపీ తమను వేధింపులకు గురిచేస్తున్నారని, ఉపశమనం కల్పించాలని కోరుతూ హైదరాబాద్‌కు చెందిన వంతడ్పుల స్వర్ణలత హైకోర్టులో ఈ నెల 19న రిట్ పిటిషన్ దాఖలు చేశారు. కూకట్‌పల్లి ప్రగతినగర్‌కు చెందిన స్వర్ణలత టీచర్‌గా చేస్తున్నానని పేర్కొన్నారు. ఆమె భర్త రమేశ్ కోసం గాలిస్తూ.. ఈ నెల 6వ తేదీన రామగుండం టాస్క్‌ఫోర్స్ పోలీసులు తనను కలిశారని చెప్పారు. రమేశ్ రామగుండం సీపీకి వ్యతిరేకంగా ఓ చానల్‌లో వార్త ప్రసారం చేయించారని, దాని వెనక ఎవరు ఉన్నారని తనను ప్రశ్నించారని తెలిపారు. ఆ సమయంలో తన భర్త ఊర్లో లేదని బదులిచ్చినా పోలీసులు నమ్మలేదని, తనను బలవంతంగా రామగుండం కమిషనరేట్‌కు తీసుకెళ్తామని బెదిరించారని ఆరోపించారు. తన భర్త కనిపించడం లేదని, అందుకు ఓ ఎస్సై కారణమంటూ ఫిర్యాదును బలవంతంగా రాయాలని ఒత్తిడి చేయగా తాను నిరాకరించానని తెలిపారు. తమను సీపీ వేధింపుల నుంచి కాపాడాలని కోరారు. ఈ పిటిషన్‌పై ఈ నెల 21న విచారణ చేపట్టిన జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి.. చట్టప్రకారం దర్యాప్తు కొనసాగించాలని సీపీకి స్పష్టం చేస్తూ విచారణ ముగించారు.

క్లుప్తంగా...

ముగ్గురు నాన్‌కేడర్ ఎస్పీల బదిలీ

సాక్షి, హైదరాబాద్: ముగ్గురు నాన్‌కేడర్ ఎస్పీలను బదిలీ చేస్తూ హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రవిగుప్తా మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. సీఐడీ ఎస్పీ ఎస్వీ నాగలక్ష్మిని రాచకొండ కమిషనరేట్ డీసీపీ సైబర్ క్రైమ్స్‌గా బదిలీ చేశారు. తెలంగాణ కమాండ్ కంట్రోల్ సెంటర్ ఎస్పీ (టెక్నికల్) కె.పుష్పను.. టీజీ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో నార్కోటిక్స్ కంట్రోల్ సెల్ ఎస్పీగా, సీఐడీ ఎస్పీ డాక్టర్ పి.లావణ్య నాయక్‌జాదవ్‌ను.. హైదరాబాద్ సిటీ మహిళా భద్రత విభాగం డీసీపీగా బదిలీ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 30 మంది నాన్‌కేడర్ అడిషనల్ ఎస్పీలను బదిలీ చేస్తూ మరో ఉత్తర్వు జారీ చేశారు.

సెలక్షన్ గ్రేడ్‌కు 33 స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పోస్టులు

ఉత్తర్వుల జారీపై సీఎంకు డీసీఏ కృతజ్ఞతలు

సాక్షి, హైదరాబాద్: రెవెన్యూ శాఖలోని 33 స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ల పోస్టులను.. సెలక్షన్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్లుగా అప్‌గ్రేడ్ చేయాలనే ప్రతిపాదనలను రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించిందని డిప్యూటీ కలెక్టర్స్ అసోసియేషన్ (డీసీఏ) రాష్ట్ర అధ్యక్షుడు వి.లచ్చిరెడ్డి తెలిపారు. డీసీఏ విజ్ఞప్తిపై సానుకూలంగా స్పందించి ఈ నిర్ణయం తీసుకున్నందుకు.. సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. అప్‌గ్రేడ్ అయిన పోస్టులకు సత్వరంగా సర్వీసు నిబంధనలను కల్పించాలని విజ్ఞప్తి చేశారు. దీంతో స్పెషల్ గ్రేడ్ నుంచి సెలక్షన్ గ్రేడ్‌కు డిప్యూటీ కలెక్టర్లు పదోన్నతి పొందుతారని చెప్పారు.

30నుంచి టీజీసెట్ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన

ఉస్మానియా యూనివర్సిటీ: టీజీసెట్–2024లో అర్హత సాధించిన అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన ఈ నెల 30 నుంచి డిసెంబర్ 3వ తేదీ వరకు జరగనుంది. సబ్జెక్టుల వారీగా ఈ నెల 30న క్యాంపస్ దూరవిద్య కేంద్రంలోని ఆన్‌లైన్ కౌన్సెలింగ్ సెంటర్‌లో పరిశీలన ప్రారంభం కానున్నట్లు అధికారులు పేర్కొన్నారు. పూర్తి వివరాలను ఉస్మానియా వెబ్‌సైట్లో చూడాలని సూచించారు.

అంతర్జాతీయ కోర్టుకు వెళ్తా!

'బ్యాలెట్ పేపర్ల' పిటిషన్‌ను సుప్రీం తిరస్కరించటం బాధాకరం: కేఏపాల్

సాక్షి, న్యూఢిల్లీ: ఎన్నికల్లో ఈవీఎంలను తొలగించి.. బ్యాలెట్ పేపర్లను ప్రవేశపెట్టేలా కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలని సుప్రీంకోర్టుకు వెళ్తే.. తాను ఏం అడుగుతున్నానో కూడా వినకుండా పిటిషన్‌ను న్యాయస్థానం తిరస్కరించిందని ప్రజాశాంతి పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు కేఏ పాల్ ఆవేదన వ్యక్తంచేశారు. ఈ విషయాన్ని వదిలిపెట్టబోనని.. అంతర్జాతీయ న్యాయస్థానానికి వెళ్తానని ప్రకటించారు. తాను దేశం బాగుకోసం ప్రయత్నాలు చేస్తుంటే ఏ ఒక్కరూ పట్టించుకోవడం లేదని అన్నారు. మంగళవారం ఢిల్లీలో మీడియాతో మాట్లాడారు. ప్రపంచంలోని పది దేశాలు మినహా మిగతా అన్ని దేశాలు ఎన్నికల్లో బ్యాలెట్ పేపర్‌నే వాడుతున్నాయని తెలిపారు. ఆ దేశాలన్నీ గతంలో ఈవీఎంలను వాడటం వల్లనష్టం జరుగుతుందని తెలుసుకున్నాయని పేర్కొన్నారు. గతంలో టీడీపీ అధినేత చంద్రబాబు, తాజాగా వైఎస్ఆర్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ కూడా బ్యాలెట్ పేపర్‌ను ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారని గుర్తు చేశారు.

ఐడియా ఇవ్వండి.. రూ.25 కోట్లు పట్టండి

'లూనా రీసైకిల్ చాలెంజ్'ప్రకటించిన నాసా

అంతరిక్ష ప్రయోగాలు అంటేనే అత్యంత ఖర్చుతో కూడుకున్న వ్యవహారం. ఒక శాటిలైట్‌ను అంతరిక్షంలోకి పంపాలంటేనే వందల కోట్ల రూపాయల వ్యయం అవుతుంది. అందులోనూ స్పేస్‌లోకి వెళ్లి తిరిగి వచ్చే ప్రయోగాలకైతే మరింత ఎక్కువ ఖర్చవుతుంది. నాసా లెక్కల మేరకు స్పేస్‌లోకి ఒక కిలో బరువును పంపి, తిరిగి భూమికి చేర్చడానికి అయ్యే ఖర్చు సుమారు రూ.కోటిన్నరపైనే. అయితే త్వరలో చంద్రుడిపైకి మనుషులను పంపేందుకు సిద్ధమవుతున్న నాసా... అక్కడికి తీసుకెళ్లే వస్తువులు, సామగ్రిని రీసైకిల్ చేసి, తిరిగి మరేదైనా అవసరానికి వినియోగించుకోగలిగే టెక్నాలజీలపై దృష్టి పెట్టింది. ఇందుకోసం క్రౌడ్ సోర్స్ విధానాన్ని అనుసరించాలని నిర్ణయించింది. అంటే నాసా శాస్త్రవేత్తలు, ఉద్యోగులు అని కాదు... ప్రపంచంలో ఎవరైనా తమకు తట్టిన వినూత్న ఆలోచనలను నాసాకు ఇవ్వొచ్చు. ఇందుకోసం మంచి బహుమతి ఇస్తామని నాసా ప్రకటించింది. ఇందుకోసం 'లూనా రీసైకిల్ చాలెంజ్'కార్యక్రమాన్ని చేపట్టింది.

రెండు దశల్లో రూ.25 కోట్ల బహుమతి


చంద్రుడిపైకి పంపే సామగ్రిలో ప్యాకేజింగ్ మెటీరియల్, వస్త్రాలు, లోహాలు, ప్లాస్టిక్ వంటి వాటిని రీసైకిల్ చేసి, వాడుకునేందుకు వీలైన వినూత్న ఐడియాలు ఇవ్వాలని నాసా ప్రకటించింది. అయితే వీలైనంత తక్కువ శ్రమతో, ఆచరణ సాధ్యంగా ఆ ఆలోచనలు ఉండాలని సూచించింది. వినూత్న ఐడియాలు ఇచ్చినవారికి తొలిదశలో రూ.8.45 కోట్లు (మిలియన్ డాలర్లు) అందజేస్తామని ప్రకటించింది. ఆ ఆలోచనలు, డిజైన్లను కంప్యూటర్ సిమ్యులేషన్ ద్వారా, ప్రొటోటైప్ తయారీ ద్వారా నిరూపిస్తే.. మరో రూ.17 కోట్లకుపైగా బహుమతి ఇస్తామని వెల్లడించింది.



సాక్షి సెంట్రల్ డెస్క్

ట్రెండ్ గ్రాఫిక్

ప్రపంచవ్యాప్తంగా నెటిజన్లు దేనికి ఇంటర్నెట్‌ను వాడుతున్నారనే విషయాన్ని తెలుసుకొనేందుకు వుయ్ ఆర్ సోషల్ అనే సంస్థ తాజాగా అధ్యయనం చేపట్టింది. 16 ఏళ్ల వయసు పైబడిన నెటిజన్ల నుంచి వివరాలు రాబట్టింది. దీని ప్రకారం ఈ ఏడాదిలో నెట్టింట గడిపేందుకు ప్రధానంగా ఏడు కారణాలను వినియోగదారులు పంచుకున్నారు. అత్యధికంగా 62.6 శాతం మంది తాము సమాచార అన్వేషణ కోసం ఇంటర్నెట్‌ను వినియోగిస్తున్నట్లు చెప్పారు. - సాక్షి, సెంట్రల్ డెస్క్



పిల్లల అశ్లీల వీడియోల కేసులో ఒకరి అరెస్టు

తెలంగాణ మహిళా భద్రత విభాగం సమాచారంతో పశ్చిమ బెంగాల్‌లో నిందితుడి అరెస్టు

సాక్షి, హైదరాబాద్: చిన్నారుల అశ్లీల వీడియోలను ఆన్‌లైన్‌లో విక్రయిస్తున్న ఒక వ్యక్తిని తెలంగాణ మహిళా భద్రత విభాగం ఇచ్చిన సమాచారంతో పశ్చిమబెంగాల్ పోలీసులు అరెస్టు చేశారు. సదరు వ్యక్తి మొబైల్‌లో మొత్తం వెయ్యిమంది పిల్లల లైంగిక వేధింపుల వీడియోలున్నట్టు గుర్తించారు. మహిళలు, పిల్లలపై నేరాల కట్టడిలో భాగంగా తెలంగాణ మహిళా భద్రత విభాగంలోని షీ సైబర్ ల్యాబ్ సిబ్బంది ఆన్‌లైన్‌లో సైబర్ పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సమయంలో.. వివిధ రాష్ట్రాల నేరస్తులతో కూడిన క్రిమినల్ నెట్‌వర్క్‌ను గుర్తించినట్టు మహిళా భద్రత విభాగం డీజీ శిఖాగోయల్ ఒక ప్రకటనలో తెలిపారు. నిందితుడి ఫోన్‌లో చైల్డ్ సెక్సువల్ అబ్యూజ్ మెటీరియల్ కొనుగోలుతో సంబంధం ఉన్న 46 మంది వ్యక్తుల నెట్‌వర్క్‌ను సైతం గుర్తించినట్టు వివరించారు. షీ సైబర్ ల్యాబ్ ఈ తరహాలో ఇప్పటి వరకు మొత్తం 180 చైల్డ్ సెక్సువల్ అబ్యూజ్ మెటీరియల్‌కు సంబంధించిన కీలక సమాచారం గుర్తించిందని పేర్కొన్నారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034. Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

సాక్షి ప్లస్
బుధవారం : 27-11-2024



హైదరాబాద్‌లో వందేమాతరం ప్రతిభా పురస్కారాల ప్రధాన కార్యక్రమంలో పాల్గొన్న సీఎం



శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులతో వందేమాతరం ఫౌండేషన్ ప్రతినిధులు



విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పిస్తున్న విద్యావేత్త చుక్కా రామయ్య(ఫైల్)

అక్షర యజ్ఞం

పేద బిడ్డల బాగు కోసం 19 ఏళ్లుగా వందేమాతరం ఫౌండేషన్ కృషి

- 70 గ్రామాల్లో స్టడీ సెంటర్ల ఏర్పాటు
- 'పది'విద్యార్థులకు 45రోజుల ఉచిత శిక్షణ శిబిరం
- కలాం–100 పేరిట విద్యార్థులకు బాసట

పేదబిడ్డల జీవితాల్లో విద్యా వెలుగులు నింపాలని.. వారికి నాణ్యమైన విద్య అందాలని దాదాపు రెండు దశాబ్దాలుగా ఆ సంస్థ అక్షర యజ్ఞం చేస్తోంది. అభాగ్యులకు అక్షరాలు నేర్పించి సమాజంలో నిలబెట్టాలని సంకల్పించింది. బడిఈడు పిల్లలకు సంస్కారవంతమైన చదువునిచ్చి బాధ్యతాయుతమైన పౌరులుగా తీర్చిదిద్దేందుకు అంకితభావంతో పనిచేస్తోంది 'వందేమాతరం ఫౌండేషన్'.

– తొర్రూరు



తొర్రూరులోని వందేమాతరం ఫౌండేషన్‌లో శిక్షణ పొందుతున్న విద్యార్థులు(ఫైల్)

తొర్రూరు కేంద్రంగా..

మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండల కేంద్రంగా కొనసాగుతున్న వందేమాతరం ఫౌండేషన్ ఎందరో సామాన్య పేదబిడ్డలను అసామాన్యులుగా తీర్చిదిద్దింది. అక్షరాస్యత పెరుగుతోంది..అరాచకాలు తగ్గలేదు. ఉద్యోగావకాశాలు పెరుగుతున్నాయి..నిర్భాగ్యులు ఉంటూనే ఉన్నారు. ఈ విషయాలే తొర్రూరు నివాసి తక్కెళ్లపల్లి రవీంద్రను ఆలోచనలో పడేశాయి. దీనికోసం ఏదైనా చేయాలనుకున్నాడు. ఈ క్రమంలోనే 2005లో వందేమాతరం ఉద్యమానికి శతాబ్ది ఉత్సవాలు జరుగుతున్నాయి. ఈమేరకు తన విద్యా ఉద్యమానికి 'వందేమాతరం'అని పేరుపెట్టారు. దీనిలో భాగంగా ప్రారంభంలో ప్రభుత్వ పాఠశాలల్లో అక్షరాభ్యాస కార్యక్రమాలు నిర్వహించారు. దీంట్లో విద్యార్థులు, ఉపాధ్యాయులతోపాటు గ్రామస్తుల్ని భాగం చేశారు. 'వందేమాతరం ఫౌండేషన్'కార్యక్రమాలు నచ్చి తొర్రూరులో ఎన్నారై డాక్టర్ అశోక్‌రెడ్డి తన కుమారుడు నితిన్ జ్ఞాపకార్థం కట్టించిన సామాజిక భవనాన్ని ఫౌండేషన్ కార్యక్రమాలకు వినియోగించుకోవడానికి ఇచ్చారు.

ఏటా 'పది'విద్యార్థులకు ఉచిత శిక్షణ శిబిరం

అనేకానేక కారణాలతో ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పిల్లలు మార్కుల్లో కార్పొరేట్ విద్యాసంస్థల విద్యార్థులతో పోటీ పడలేకపోతున్నారు. ఆ పరిమితులను అధిగమించడానికి ఫౌండేషన్ ఆధ్వర్యంలో పదోతరగతి పిల్లలకు వార్షిక పరీక్షల ముందు 45 రోజులపాటు విద్యా శిబిరాలు ఏర్పాటు చేసి అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు, జీవన నైపుణ్య శిక్షకుల చేత మెళకువలు నేర్పిస్తున్నారు. తొమిదేళ్లుగా చేపడుతున్న ఈ శిబిరంలో ఏటా 500 మంది విద్యార్థులకు భోజన, వసతి కల్పిస్తున్నారు. ఈ కార్యక్రమం మంచి ఫలితాలనిస్తోంది. ఎంతోమంది విద్యార్థులు పదికి పది గ్రేడ్ తెచ్చుకొని ట్రిపుల్ ఐటీల్లో చేరుతున్నారు. ఈ శిక్షణకు హాజరైన రాయపర్తి మండలం పెర్కవేడు గ్రామానికి చెందిన పుల్లూరు శరత్ ఇస్రోలో శాస్త్రవేత్తగా ఎంపికయ్యాడు. ఈ విధానం మెచ్చి పలు జిల్లాల కలెక్టర్లు ఇలాంటి శిబిరాలను ప్రభుత్వ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్నారు.

ఎన్నెన్నో కార్యక్రమాలు ఇలా...

- ప్రభుత్వ పాఠశాలల్లో చదివి అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన వారికి ఫౌండేషన్ జిల్లా, రాష్ట్ర స్థాయిలో ప్రతిభా పురస్కారాలు అందిస్తోంది. తాజాగా హైదరాబాద్‌లో ఫౌండేషన్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించి సీఎం రేవంత్‌రెడ్డి చేతులమీదుగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందించారు. రవీంద్ర కృషిని ముఖ్యమంత్రి ప్రశంసించారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఫౌండేషన్‌తో కలిసి ప్రభుత్వం పురస్కారాలు అందిస్తుందని సీఎం ప్రకటించారు.
- వీఎంఎఫ్ సంస్థ నిర్వహించే ఉచిత శిక్షణ శిబిరాల్లో శిక్షణ పొందిన వారిలో దాదాపు 680 మంది ఐఐటీలకు, 1,500 మంది పేరుమోసిన కళాశాలల్లో ఫ్రీ సీట్లకు అర్హత పొందారు.
- అక్షరాభ్యాసం కార్యక్రమం ద్వారా పదేళ్లలో పలు జిల్లాలకు చెందిన 1,93,500 మందికి పైగా విద్యార్థులను పాఠశాలకు దూరం కాకుండా ఉండేందుకు తోడ్పడింది.
- రాష్ట్రంలో చదువుపై అమితాసక్తి, చాలా ఉత్సాహవంతులైన ప్రభుత్వ పాఠశాలల్లోని పిల్లలను 'కలాం–100'అనే కార్యక్రమం ద్వారా ఎంపిక చేసి వారికి మెడిసిన్, ఐఐటీ, ఇతర పోటీ పరీక్షలకు అవసరమైన ఉచిత శిక్షణను ఫౌండేషన్ అందిస్తోంది. ఆరో తరగతిలో ఉన్నప్పుడే ఎంపిక చేసిన పిల్లలకు దాదాపు ఎనిమిదేళ్ల సుదీర్ఘకాలం పాటు శిక్షణ అందించేందుకు ఈ కార్యక్రమం తోడ్పడుతోంది.
- సంస్థ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని 70 గ్రామాల్లో స్టడీ సెంటర్లు ఏర్పాటు చేసి పేద బిడ్డలకు విద్యనందిస్తున్నారు.
- ఎస్సీఈఆర్టీతో కలిసి విద్యా ముసాయిదాను తయారు చేశారు.
- అక్షరాభ్యాసం మొదలు తల్లిదండ్రులకు వందనం వంటి కార్యక్రమాల ద్వారా స్ఫూర్తిగా నిలిచింది.
- బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రవేశపెట్టిన 'మన ఊరు–మన బడి'కార్యక్రమ ముసాయిదాకు ఫౌండేషన్ రూపకల్పన చేసింది. ఈ కార్యక్రమానికి ప్రభుత్వం రూ.7,200 కోట్లు కేటాయించేందుకు మూలమైంది.
- ఫౌండేషన్‌లో శిక్షణ పొందిన 680 మంది విద్యార్థులు ఎన్ఎంఎంఎస్ ఉపకార వేతనాలకు ఎంపికయ్యారు. రూ.2.80 కోట్ల ఉపకార వేతనాలు అందుకున్నారు.
- గత కొన్నేళ్లలో 903 మంది విద్యార్థులు ట్రిపుల్ ఐటీలకు, 47 మంది ఐఐటీలకు ఎంపికయ్యారు. వివిధ ఎన్ఐటీల్లో 105 మంది, 2,400 మంది విద్యార్థులు పాలిటెక్నిక్‌కు, 4వేల మంది ఇంటర్ ఉచిత విద్య అవకాశాలను అందిపుచ్చుకున్నారు. 280 మంది ప్రభుత్వ ఉద్యోగాలను పొందారు.
- సంస్థ కార్యక్రమాలు మహబూబ్‌నగర్ జిల్లా కల్వకుర్తిలో, ఏపీలోని పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలోనూ కొనసాగుతున్నాయి.
- వందేమాతరం ఫౌండేషన్‌కు ప్రముఖ విద్యావేత్త చుక్కా రామయ్య మెంటర్‌గా వ్యవహరిస్తున్నారు.



పేద బిడ్డల జీవితాల్లో వెలుగులు రావాలి

ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు ప్రతిభలో ఎవరికీ తీసిపోరు. వారికి తగిన తోడ్పాటు అందించకపోవడమే వారి ప్రతిభకు ప్రతిబంధకంగా మారుతోంది. వారిలోని నైపుణ్యాలను వెలికితీసి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేందుకే ఏటా ఉచిత శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నాం. దాతల సహాయంతో శిబిరం విజయవంతంగా నడుపుతున్నాం. విద్యతోపాటు జీవితంపై పలురకాల నైపుణ్య అంశాలపై విద్యార్థులకు తర్ఫీదు ఇస్తున్నాం. ప్రభుత్వం సైతం ఇలాంటి శిబిరాలను నిర్వహిస్తే పేద విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుంది.

– తక్కెళ్లపల్లి రవీంద్ర, వందేమాతరం ఫౌండేషన్ డైరెక్టర్



ఫౌండేషన్ కృషితో లక్షలాది మంది జీవితాల్లో వెలుగులు

పేద బిడ్డల అభ్యున్నతికి వందేమాతరం ఫౌండేషన్ చేస్తున్న కృషి వెలకట్టలేనిది. అక్షరాలు అందిస్తే పేద బిడ్డలు అత్యున్నత స్థాయికి ఎదుగుతారని రవీంద్ర అభిలాష. ఆయన సంకల్పానికి 2009 నుంచి తోడుగా ఉన్నాను. నా శేష జీవితంలో అత్యంత సంతృప్తినిచ్చే సేవ ఇదే. విద్యార్థులు చదువుతో సంస్కారం, క్రమశిక్షణ నేర్చుకోవడం మంచి పరిణామం.

– చుక్కా రామయ్య, ప్రముఖ విద్యావేత్త

డిసెంబర్ 1న చలో ఢిల్లీ: వీహెచ్

సాక్షి, హైదరాబాద్: డిసెంబర్ 1న 'సేవ్ డెమోక్రసీ'పేరుతో చలో ఢిల్లీ కార్యక్రమం చేపట్టనున్నట్లు మాజీ ఎంపీ, కాంగ్రెస్ సీనియర్ నేత వి.హనుమంతరావు తెలిపారు. గాంధీభవన్‌లో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం దేశానికి మార్గదర్శనం చేస్తున్న రాజ్యాంగాన్ని మార్చాలని చూస్తోందని ఆరోపించారు. రాజ్యాంగాన్ని కాపాడి దళిత, ఆదివాసీ, మైనార్టీలకు న్యాయం జరగాలని ఈ చలో ఢిల్లీ కార్యక్రమం చేపట్టినట్లు వీహెచ్ వెల్లడించారు. ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో సేవ్ డెమోక్రసీ సభ జరుగుతుందన్నారు. అందరికీ సామాజిక, ఆర్థిక న్యాయం జరగాలని రాహుల్ గాంధీ భావిస్తుంటే, నరేంద్ర మోదీ కార్పొరేట్ సంస్థలకు లబ్ధి చేకూరుస్తున్నారని వీహెచ్ మండిపడ్డారు.

డీజీపీ కార్యాలయంలో ఘనంగా రాజ్యాంగ దినోత్సవం

సాక్షి, హైదరాబాద్: భారత రాజ్యాంగం ఆమోదం పొంది 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా మంగళవారం లక్డీకాపూల్‌లోని డీజీపీ కార్యాలయంలో రాజ్యాంగ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శాంతిభద్రతల అడిషనల్ డీజీ మహేశ్ భగవత్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1949, నవంబర్ 26న భారత రాజ్యాంగం ఆమోదం పొందిందని, దేశ చరిత్రలో ఇది ఒక ప్రత్యేకమైన ఘట్టమని పేర్కొన్నారు. భారత రాజ్యాంగ రూపకల్పనలో బీఆర్ అంబేడ్కర్, బాబు రాజేంద్రప్రసాద్, ఇంకా అనేక మంది మహిళలు, ఇతర ప్రముఖులు ఎంతో కృషి చేశారని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా ఐజీ ఎం.రమేశ్ రాజ్యాంగ పీఠికను చదివి అందరితో ప్రతిజ్ఞ చేయించారు. రైల్వే, రోడ్డు భద్రత ఐజీ రమేశ్‌నాయుడు, ఏఐజీ రమణకుమార్, లీగల్ ఎస్పీ సీహెచ్.సతీశ్, ఇతర పోలీస్ అధికారులు, డీజీపీ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జస్టిస్ జగన్నాథరావు మృతిపై సీఎం సంతాపం

సాక్షి, హైదరాబాద్: సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ జగన్నాథరావు మృతి పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంతాపం తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా, కేరళ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా, సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ జగన్నాథరావు పలు కీలక కేసుల పరిష్కారంలో తనదైన ముద్ర వేశారని ముఖ్యమంత్రి గుర్తు చేశారు. జస్టిస్ జగన్నాథరావు కుమారుడు, జార్ఖండ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎం.ఎస్.రామచంద్రరావు, వారి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. జస్టిస్ జగన్నాథరావు అంత్యక్రియలు బుధవారం హైదరాబాద్‌లో జరగనున్నాయి.

ఏం జరిగిందని మానుకోటలో ధర్నా చేసినవ్?

- కేటీఆర్‌ను ప్రశ్నించిన ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ ఈరవత్రి అనిల్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఏం జరిగిందని కేటీఆర్ మానుకోటలో ధర్నా చేసిండో చెప్పాలని ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ ఈరవత్రి అనిల్ డిమాండ్ చేశారు. గాంధీభవన్‌లో మంగళవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ, తెలంగాణ ప్రజల ప్రాణాలను హింసించిన కాలాంతకులు కేసీఆర్ కుటుంబమని ధ్వజమెత్తారు. తెలంగాణ ప్రజలు ఇంకా కేసీఆర్ కుటుంబం చేసిన మోసాలని మర్చిపోలేదన్నారు. తమకు ఇక ఉద్యోగం రాదని 2021లో 14 మంది నిరుద్యోగ యువకులు చనిపోయారని, సిరిసిల్లలో ఇసుక లారీలను ఆపిన వ్యక్తులను లారీలతో తొక్కి చంపిన చరిత్ర ఎవరిదని ప్రశ్నించారు. ఖమ్మంలో మిర్చికి మద్దతు ధర ఇవ్వమని రైతులు అడిగితే సంకెళ్లు వేసి రోడ్ల మీద ఈడ్చుకెళ్లిన సంఘటన ఇంకా ఖమ్మం రైతులు మర్చిపోలేదన్నారు. బీఆర్ఎస్ హయాంలో ఎంత మంది దళితులు, నిరుద్యోగులు, రైతుల ఆత్మహత్యలకు కారణమయ్యారో ఇంట్లో కూర్చుని కేటీఆర్ ఆత్మ విమర్శ చేసుకుంటే మంచిదని పేర్కొన్నారు.



ప్లాస్టిక్ పైపుపై పెరిగిన పూల మొక్క

మట్టిలేకుండానే మొక్క పెరిగింది!

చెన్నారావుపేట: బలమైన మట్టిపోసి ఎరువులు వేసినా ఒక్కోసారి మొక్కలు సరిగా పెరగవు. కానీ ఫొటోలోని మొక్క ప్లాస్టిక్ పైపు చివరలో ఏపుగా పెరిగి పూలతో కళకళలాడుతుండటాన్ని అందరూ విచిత్రంగా చూస్తున్నారు. వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం జల్లీ గ్రామానికి చెందిన సంగం కొమ్మాలు ఇంటి ముందు ఉన్న బాత్రూం సెప్టిక్ ట్యాంకుకు ఏర్పాటు చేసిన ప్లాస్టిక్ పైపుపై ఉద్రాక్ష పూలమొక్క పెరగడమే కాకుండా పూలు పూసింది. ఈ మొక్క ఎలా పెరిగిందో అంతుచిక్కడం లేదని కొమ్మాలు తెలిపారు.

రాజ్యాంగంలో సమాన హక్కులు కీలకం

టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్

సాక్షి, హైదరాబాద్: రాజ్యాంగంలో సమాన హక్కులు అనే అంశం అత్యంత కీలకమైనదని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ అభిప్రాయపడ్డారు. రాజ్యాంగాన్ని ఆమోదించి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాజ్యాంగ మూలసూత్రాలను తుంగలో తొక్కి సొంత విధానాలతో బీజేపీ పాలించాలని చూస్తోందని విమర్శించారు. అందుకే కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ.. అంబేడ్కర్ రూపొందించిన రాజ్యాంగ విధానాలను కచ్చితంగా అమలు చేయాలని కోరుతున్నారన్నారు. సమావేశంలో ప్రొఫెసర్ తిరుమలి తదితరులు పాల్గొన్నారు.

దేశవ్యాప్తంగా 15 వేల జీపీల్లో 'ఎన్ఎంఎన్ఎఫ్'

ఏకలవ్య గ్రామీణ వికాస్ ఫౌండేషన్ వెల్లడి

సాక్షి, హైదరాబాద్: వచ్చే రెండేళ్లలో కేంద్ర ప్రభుత్వ కొత్త సేంద్రియ సహాయపథకం 'నేషనల్ మిషన్ ఆన్ నేచురల్ ఫార్మింగ్'(ఎన్ఎంఎన్ఎఫ్)ను దేశవ్యాప్తంగా 15 వేల గ్రామపంచాయతీ (జీపీలు) సమూహాల్లో అమలు చేస్తున్నట్టు ఏకలవ్య గ్రామీణ వికాస్ ఫౌండేషన్ తెలిపింది. ఈ పథకం ద్వారా కోటి మంది రైతులకు ప్రయోజనం చేకూర్చేలా ఏడున్నర లక్షల హెక్టార్ల విస్తీర్ణంలో పంటలు సాగు చేయనున్నట్టు ఒక ప్రకటనలో వెల్లడించింది. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రకృతి వ్యవసాయ పద్ధతులను అనుసరిస్తున్న ప్రాంతాలు, స్వయం సహాయకసంఘాలు, రైతు ఉత్పత్తి సంస్థలకు మొదటి ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు ఆ సంస్థ చైర్మన్ పి.వెంకటేశ్వర్‌రావు తెలిపారు. ఇందులో అదనంగా 10 వేల బయో ఇన్‌పుట్ రీసోర్స్ సెంటర్లు (బీఆర్‌సీ) ఏర్పాటుచేసి, వీటి ద్వారా రైతులకు ప్రకృతి వ్యవసాయం ఇన్‌పుట్స్‌ను సులభంగా అందుబాటులోకి తెచ్చేలా చర్యలు చేపడతారని వివరించారు. ఈ పథకానికి మద్దతుగా తమ ఫౌండేషన్ కృషి విజ్ఞాన కేంద్రాల వద్ద బయో కంట్రోల్ ల్యాబొరేటరీని ఏర్పాటు చేసి 2,700 మంది రైతులకు 12,500 లీటర్ల బయోఇన్‌పుట్స్‌ను అందించినట్లు వెల్లడించారు.

రాజ్యాంగంతోనే ప్రజాస్వామ్య వ్యవస్థకు రక్షణ

మాజీ గవర్నర్ విద్యాసాగర్ రావు

సాక్షి, హైదరాబాద్: భారత ప్రజాస్వామ్య వ్యవస్థ రక్షణ, మౌలిక జీవన విలువలను ముందుకు తీసుకెళ్లేందుకు రాజ్యాంగం మార్గం చూపుతుందని మాజీ గవర్నర్ సీహెచ్ విద్యాసాగర్ రావు అభిప్రాయపడ్డారు. భారత రాజ్యాంగాన్ని ఆమోదించి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా.. బీజేపీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన రాజ్యాంగ దినోత్సవాల్లో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడుతూ.. అశోక చక్రం, సత్యమేవ జయతే నినాదం, త్రివర్ణ పతాకంలోని విలువల అమలుకు కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ ఎన్.రాంచందర్ రావు తదితరులు పాల్గొన్నారు.

రాజధాని నగరంలో అభివృద్ధి పనులపై

సీఎం తీసుకున్న చర్యలివీ

- సికింద్రాబాద్ జూబ్లీ బస్‌స్టేషన్ నుంచి శామీర్‌పేట వరకు రాజీవ్ రహదారిపై రూ.2,232 కోట్లతో ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం చేపట్టాలని ప్రభుత్వ నిర్ణయించింది. అలాగే హైదరాబాద్–నాగ్‌పూర్‌జాతీయ రహదారిపై రూ.1,580 కోట్లతో డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి భూమిపూజ పూర్తయింది.
- ఈ కారిడార్ల నిర్మాణంతో పాటు మెహిదీపట్నం స్కై వాక్ నిర్మాణాలకు ప్రధాన అడ్డంకిగా ఉన్న రక్షణ భూములను రాష్ట్ర ప్రభుత్వానికి బదిలీ చేసేందుకు ముఖ్యమంత్రి పలుమార్లు ఢిల్లీకి వెళ్లి కేంద్రంతో సంప్రదింపులు జరిపారు.
- హైదరాబాద్‌లోని చెరువులు, కుంటలు, నాలాలు, ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణకు హైడ్రా ఏర్పాటు. పోలీస్, ట్రాఫిక్, హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీ సమన్వయంతో కార్యాచరణ ప్రారంభించిన హైడ్రా.
- మూసీ నది పునరుజ్జీవంపై ప్రత్యేక దృష్టి. నగరంలోని జంట జలాశయాలు హిమాయత్‌సాగర్, ఉస్మాన్‌సాగర్‌ను పునరుద్ధరించేలా ప్రతిపాదనలు. మూసీ నదిలోకి చేరుతున్న మురికి నీటిని శుద్ధి చేసేందుకు 39 ఎస్టీపీల ఏర్పాటుకు ప్రణాళిక.
- గోదావరి నుంచి మరో 20 టీఎంసీల నీటిని హైదరాబాద్‌కు తరలించి తాగునీటి అవసరాలతో పాటు, మూసీలో స్వచ్ఛమైన నీటి ప్రవాహానికి వీలుగా సరికొత్త ప్రాజెక్టుకు రూపకల్పన. బాపూఘాట్‌లో అంతర్జాతీయ స్థాయిలో గాంధీ ఐడియాలజీ సెంటర్ ఏర్పాటు
- మీర్ ఆలం చెరువు సమీపంలో రూ.360 కోట్ల అంచనా వ్యయంతో 4–లేన్ వంతెన నిర్మాణం. ఎల్‌బీ నగర్ సమీపంలో బైరామాల్ గూడ ఫ్లైఓవర్ ప్రారంభం. ఆరంఘర్ నుంచి జూపార్క్ వరకు త్వరలో ప్రారంభం కానున్న ఫ్లైఓవర్



- రూ.24,237 కోట్లతో మెట్రో రైలు రెండవ దశ ప్రాజెక్టుకు కేబినెట్ ఆమోదం. ఫేజ్–2లో పాతబస్తీ, కొత్త నగరం గుండా ఎయిర్ పోర్టు వరకు 76.4 కిలోమీటర్ల మెట్రో విస్తరణ.
- హైకోర్టు నూతన భవనానికి బుద్వేల్‌లో 100 ఎకరాల స్థలం కేటాయింపు. ఉస్మానియా కొత్త ఆస్పత్రి భవనాన్ని గోషా మహల్ సమీపంలో నిర్మించేందుకు స్థలం కేటాయింపు.
- హైదరాబాద్ సిటీ ఇన్నొవేషన్ అండ్ ట్రాన్స్‌ఫర్మేటివ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (హెచ్‌సీఐటీఐ) ప్రాజెక్టులో భాగంగా జీహెచ్ఎంసీ పరిధిలో రహదారుల నిర్మాణానికి దాదాపు రూ.8,996 కోట్లతో ప్రతిపాదనలు. రూ.596.2 కోట్ల అంచనాలతో వరద నీటి కాలువల నిర్మాణం.
- కేబీఆర్ పార్క్ చుట్టూ రూ.826 కోట్ల అంచనాలతో ఆరు జంక్షన్ల అభివృద్ధి ప్రాజెక్టుకు పరిపాలన అనుమతుల మంజూరు.
- హైదరాబాద్ నగర విస్తరణ, అభివృద్ధి లక్ష్యంగా దాదాపు రూ.18 వేల కోట్లతో రీజనల్ రింగ్ రోడ్ దక్షిణ భాగం నిర్మాణం. ఉమ్మడి మెదక్ జిల్లాలోని సంగారెడ్డి నుంచి ప్రారంభమై రంగారెడ్డి జిల్లా చేవెళ్ల, శంకర్‌పల్లి మీదుగా మహబూబ్‌నగర్‌లోని ఆమనగల్లు, కందుకూరు, ఇబ్రహీంపట్నం నుంచి నల్లగొండ జిల్లా చౌటుప్పల్ వరకు 189 కిలోమీటర్ల పొడవున ఈ రహదారి.
- హైదరాబాద్‌లో 30 వేల ఎకరాల్లో ఫ్యూచర్ సిటీ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నద్ధమైంది. యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీకి శంకుస్థాపన చేసింది. త్వరలోనే స్పోర్ట్స్ యూనివర్సిటీ నెలకొల్పనుంది. ఫార్మా సిటీతో పాటు ఏఐ సిటీ, సాఫ్ట్‌వేర్, లైఫ్ సైన్సెస్, హెల్త్ కేర్ టెక్నాలజీ పరిశ్రమల పవర్ హబ్‌గా దీన్ని తీర్చిదిద్దుతోంది. రీజనల్ రింగ్ రోడ్డు నుంచి అవుటర్ రింగ్ రోడ్డు వరకు రేడియల్ రోడ్లతో పాటు ఫ్యూచర్ సిటీలో గ్రీన్‌ఫీల్డ్ రహదారి నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసింది.

అంబేడ్కర్ లేకుంటే రాజ్యాంగం లేదు

ఎంపీ మల్లు రవి, కడియం కావ్య

సాక్షి, న్యూఢిల్లీ: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అనే వ్యక్తి లేకపోతే రాజ్యాంగం లేదని నాగర్ కర్నూల్ ఎంపీ మల్లు రవి, కడియం కావ్య పేర్కొన్నారు. రాజ్యాంగం ద్వారా సమాన హక్కులు కల్పించిన మహోన్నత వ్యక్తి అంబేడ్కర్ అని కొనియాడారు. మంగళవారం రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలంగాణ భవన్‌లోని బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద 'కరెన్సీపై అంబేడ్కర్ ఫొటో సాధన సమితి'జాతీయ అధ్యక్షుడు జేరిపోతుల పరశురామ్ ఆధ్వర్యంలో వేడుకలను నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలతో నివాళులు అర్పించిన అనంతరం కేక్ కట్ చేసి సంబురాలు చేశారు.



డిసిప్లెన్డ్ బర్డ్స్

పక్షులు కూడా క్రమశిక్షణ పాటిస్తాయి అనడానికి ఈ చిత్రమే నిదర్శనం. ఆకాశంలో చక్కర్లు కొడుతున్న ఈ పక్షులు వరుస క్రమంలో శబ్దం చేస్తూ పరుగులు తీస్తూ మంగళగిరి వద్ద 'సాక్షి' కెమెరాకు చిక్కాయి.
– సాక్షి, ఫొటోగ్రాఫర్,గుంటూరు



'ప్లాస్టిక్'కు ఆక్టోపస్ విలవిల

సముద్రంలో పడేస్తున్న ప్లాస్టిక్ వ్యర్థాలను తిని జలచరాలు మృత్యువాతప డుతున్నాయి. విశాఖలోని ఫిషింగ్ హార్బర్‌లో ఒక ఆక్టోపస్ ప్లాస్టిక్ గ్లాస్‌కు చిక్కుకొని విలవిల్లాడుతుండగా..మత్స్యకారుడు వలతో దాన్ని బయటకు తీసి ప్లాస్టిక్ గ్లాస్‌ను తొలగించాడు.
–విశాఖపట్నం



వామ్మో... 8 అడుగుల నాగుపాము

తిరుమలలో బీ–టైప్ 23వ క్వార్టర్స్ ప్రాంతంలో 8 అడుగుల నాగుపాము ప్రజలను భయభ్రాంతులకు గురిచేసింది. ఘటనాస్థలానికి స్నేక్ క్యాచర్ భాస్కర్ నాయుడు వచ్చి పామును పట్టుకుని అటవీ ప్రాంతంలో వదిలిపెట్టారు.
– తిరుమల

విద్యుత్ ఒప్పందాలు.. చార్జీల భారంపై విచారణ జరపాలి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

సాక్షి, అమరావతి: ఇంధనం, విద్యుత్ కొనుగోలు ఖర్చు సర్దుబాటు చార్జీలకు సంబంధించి విద్యుత్ పంపిణీ సంస్థలు దాఖలు చేసిన పిటిషన్లపై అభ్యంతరాల స్వీకరణ గడువు కొనసాగింపుతోపాటు బహిరంగ విచారణ జరపాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు కోరారు. ఈ విషయమై ఆంధ్రప్రదేశ్ విద్యుత్ రెగ్యులేటరీ కమిషన్ కార్యదర్శికి రాసిన లేఖను మంగళవారం మీడియాకు విడుదల చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తాజాగా అదానీ సంస్థలతో గ్రీన్ ఎనర్జీ పేరుతో ఒప్పందాలు చేసుకుంటున్నారని, భూములు కేటాయిస్తున్నారని, వీటిని నిలిపివేసి ఒప్పందాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

ఆయా, నైట్ వాచ్‌మెన్‌ల గౌరవ వేతనాలు విడుదల

సాక్షి, అమరావతి: పాఠశాలల్లో పని చేస్తున్న ఆయా, నైట్ వాచ్‌మెన్‌ల గౌరవ వేతన బకాయిలను విడుదల చేస్తూ పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు రూ.285.90 కోట్లను మంజూరు చేశారు. అదనపు నిధులు, పెండింగ్ నిధులు కలిపి 2025 మార్చి నాటి చెల్లింపులకు అనుగుణంగా కేటాయించినట్టు పేర్కొన్నారు.

క్రమం తప్పకుండా వేతనాలు చెల్లించాలి: ఏపీటీఎఫ్–అమరావతి

పాఠశాలల్లో పనిచేస్తున్న ఆయాలు, నైట్ వాచ్‌మెన్‌లకు ప్రతి నెల సకాలంలో వేతనాలు చెల్లించాలని ఏపీటీఎఫ్ అమరావతి రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీవీ ప్రసాద్, రాధాకృష్ణ డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన పథక నిర్వహణకు గాను ఎప్పటికప్పుడు నిధులు మంజూరు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

ఉపాధ్యాయుల సెలవులపై పరిమితి సరికాదు

సాక్షి, అమరావతి: ఉపాధ్యాయుల సెలవుల వినియోగంపై పరిమితిని విధించడంపై ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) రాష్ట్ర అధ్యక్షుడు బాలాజీ, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ మంగళవారం ఓ ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులు అత్యవసర, ఆరోగ్య కారణాలతో నిల్వ ఉన్న సాధారణ సెలవులు (సీఎల్స్), ప్రత్యేక సాధారణ సెలవులు (ఎస్సీఎల్స్) వినియోగించుకోవడంపై ఆంక్షలు విధించడాన్ని తప్పుపట్టారు. వెంటనే దీనిని రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సకాలంలో సిలబస్ పూర్తి చేస్తూ అపార్ నమోదులో తీవ్ర ఒత్తిడికి గురవుతున్న ఉపాధ్యాయులపై ఇలాంటి ఆంక్షలు తగదని సూచించారు. ఉన్నతాధికారులు కిందిస్థాయి అధికారులపై ఒత్తిడి తెస్తూ ఉపాధ్యాయులకు సెలవులు మంజూరు చేయకుండా వేధిస్తున్నారని మండిపడ్డారు.

పీఆర్ ఈఎన్‌సీ ఆఫీసులో సీఈగా నథానియల్

సాక్షి, అమరావతి: రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ కార్యాలయంలో ప్రస్తుతం ఉపాధి హామీ పథకం చీఫ్ విజిలెన్స్ ఆఫీసరుగా పనిచేస్తున్న కేజే నథానియల్ పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ ఈఎన్‌సీ కార్యాలయంలో సీఈగా నియమితులయ్యారు. ఈ మేరకు పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధిశాఖ ప్రధాన కార్యదర్శి శశిభూషణ్‌కుమార్ ఆదేశాలు జారీ చేశారు.

నాసిరకం ఆహార పదార్థాలు విద్యార్థులకు హానికరం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో పాఠశాలల బయట విక్రయిస్తున్న నాసిరకం ఆహార పదార్థాలు తిని విద్యార్థుల ఆరోగ్యం ప్రమాదంలో పడుతోందని మున్సిపల్ టీచర్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు రామకృష్ణ మంగళవారం ఓ ప్రకటనలో ఆందోళన వ్యక్తం చేశారు. స్థానిక రాజకీయ నాయకులతో ప్రోద్బలంతో కొంతమంది వ్యక్తులు విషపూరిత, కల్తీ, మత్తు పదార్థాలతో చేసిన చాక్లెట్లు, ఐస్‌క్రీమ్స్‌లను తయారు చేసి విద్యార్థులకు విక్రయిస్తున్నట్టు తల్లిదండ్రుల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయని తెలిపారు.

కణకణ మండే అగ్ని కీలల నుంచి ఎగసిపడే నిప్పురవ్వలు.. పిడికిళ్లు బలంగా బిగించి మలాటు(పెద్ద సుత్తి వంటి సాధనం)లతో ఇనుప కమ్మెలపై కార్మికులు గట్టిగా కొడుతున్న శబ్దాలు ఆ ఊళ్లో సర్వసాధారణం. ముఖ్యంగా వ్యవసాయ సీజన్‌లో రైతన్నకు ఉపయోగపడే కొడవళ్లతో పాటు, ఇతర పనిముట్ల తయారీలో రేయింబవళ్లు శ్రమిస్తూంటుంది నడకుదురు గ్రామం.

కొడవలి.. బతుకు వారధి



మూడు తరాలుగా కొడవళ్ల తయారీ .నడకుదురులో పలు కుటుంబాలకు ఇదే వృత్తి

- ఉమ్మడి తూర్పు గోదావరితో పాటు పలు జిల్లాలకు ఎగుమతులు
- వ్యవసాయ సీజన్‌లో రైతుల అడుగులు ఆ గ్రామం వైపే..

కాకినాడ సిటీ: వ్యవసాయ సీజన్ ప్రారంభమైందంటే ఎక్కువ మంది రైతుల అడుగులు నడకుదురు గ్రామం వైపే పడతాయి. కాకినాడ సిటీకి కూతవేటు దూరాన.. కరప మండలంలో ఉన్న ఈ ఊరు పంట కోతలకు అవసరమైన కొడవళ్ల తయారీకి పెట్టింది పేరు. వరి, మినుముతో పాటు, గడ్డి కోతలకు అవసరమైన కొడవళ్లను, ఇతర పనిముట్లను నడకుదురు గ్రామంలో తయారు చేస్తూంటారు. సుమారు 80 ఏళ్ల క్రితం ఈ గ్రామంలో కొడవళ్ల తయారీ ప్రారంభమైంది. ప్రస్తుతం నాణ్యమైన కొడవళ్లను నైపుణ్యంతో తయారు చేయడంలో మూడో తరం కార్మికులు నిమగ్నమై ఉన్నారు. ఈ గ్రామంలో 4 కుటుంబాలకు చెందిన వారు 46 మందికి పైగా ఐదుకు పైగా కొలుముల్లో పని చేస్తున్నారు. నడకుదురులో తయారైన కొడవళ్లు తెలుగు రాష్ట్రాల నలుమూలలకూ సరఫరా అవుతున్నాయి. అంతేకాకుండా మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లోని కొన్ని ప్రాంతాలకు సైతం ఇక్కడి కొడవళ్లు ఎగుమతి అవుతున్నాయి.

గిట్టుబాటు కాక..

కొడవళ్ల తయారీకి ఉపయోగించే బేల్ బద్దలను రాజమహేంద్రవరం, మండపేట, విశాఖపట్నంతో పాటు విజయవాడ తదితర ప్రాంతాల నుంచి కిలోల లెక్కన కొనుగోలు చేసి, దిగుమతి చేసుకుంటారు. ఏటా ముడి సరకు ధరలు పెరుగుతున్నా కొడవళ్ల ధరలు పెరగడం లేదు. బేల్ బద్దల లోడు గత ఏడాది రూ.58 వేల నుంచి రూ.60 వేలు ఉండగా ఈ సంవత్సరం రూ.65 వేలకు పెరిగింది. దీంతో పాటు కొడవలి తయారీకి అవసరమైన బొగ్గులు, చెక్కతో పాటు రవాణా చార్జీలు కూడా పెరుగుతున్నాయి. తమ శ్రమ వృథా అవుతోందని, వస్తున్న డబ్బులు గిట్టుబాటు కావడం లేదని కార్మికులు ఆవేదన చెందుతున్నారు. తయారైన కొడవళ్లకు అమర్చేందుకు చెక్కతో చేసిన పిడులు అవసరమవుతాయి. ఈ పిడులు తయారు చేసేందుకు గతంలో గ్రామంలోనే ప్రత్యేకంగా కార్మికులుండేవారు. వేరే ఉపాధి అవకాశాలతో కొంత మంది, శ్రమకు తగిన ఫలితం దక్కక మరి కొంత మంది ఈ వృత్తికి దూరమయ్యారు.

యాంత్రీకరణతో తగ్గిన డిమాండ్

వ్యవసాయంలో కొన్నేళ్లుగా పెరుగుతున్న యాంత్రీకరణ కొడవళ్ల తయారీపై కొంత మేర ప్రభావం చూపింది. గతంలో నడకుదురు నుంచి వేలాదిగా కొడవళ్ల అమ్మకాలు జరిగేవి. ప్రస్తుతం వీటికి డిమాండ్ బాగా తగ్గిందని, దీంతో పని వారు కూడా రావడం లేదని తయారీదార్లు చెబుతున్నారు. తమ కార్ఖానాల్లో ఏడాదంతా కొడవళ్లు తయారు చేసినా.. వ్యవసాయ సీజన్ ప్రారంభమైన నాలుగు నెలలూ పని ఒత్తిడి అధికంగా ఉండేదని అంటున్నారు. ఇప్పుడు ఆ పరిస్థితి తగ్గిందని, దీంతో ఉపాధి తగ్గి, తాము ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని చెబుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో తమకు వివిధ రకాల సంక్షేమ పథకాలతో ఆర్థికంగా ఆదుకొనేవారని, ప్రస్తుత ప్రభుత్వం అవిధంగా ఆదుకోకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పేర్కొంటున్నారు.

కొలిమిలో కాలి.. కొడవలిగా మారి..

కొడవళ్లు తయారు చేసే కార్మికులు రెక్కలు ముక్కలు చేసుకుంటూంటారు. తొలుత ముడి ఇనుప బద్దీలను కొలిమిలో ఎర్రగా కాలుస్తారు. అనంతరం, ఆ ఇనుప బద్దలను మలాటులతో బలంగా కొట్టి, కొడవలి ఆకృతిలోకి మలుస్తారు. ఆ తర్వాత దానికి సాన పట్టి, నొక్కులు కొట్టి, చెక్క పిడులు అమరుస్తారు. ఒక్కో కొలిమిలో రోజుకు సుమారు 200 కొడవళ్లు తయారు చేస్తూంటారు. వీటిని రూ.40, రూ.60, రూ.80, రూ.120 ధరల్లో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ తయారు చేస్తారు. గతంలో నడకుదురు గ్రామంలో సీజన్‌లో 80 వేలకు పైగా కొడవళ్లు తయారు చేసేవారు. ప్రస్తుతం వ్యవసాయ రంగంలో యాంత్రీకరణ పెరగడంతో కొడవళ్లకు గిరాకీ తగ్గింది. దీంతో ఈ కార్మికులు వ్యవసాయ, ఇంటి పనులకు ఉపయోగించే గునపాలు, పారలు, కత్తి పీటల వంటి వాటితో పాటు పంచాయతీ కార్మికులు వినియోగించే వివిధ రకాల వస్తువులు తయారు చేస్తూ జీవనం సాగిస్తున్నారు.

సబ్సిడీపై రుణాలివ్వాలి



గతంతో పోలిస్తే ప్రస్తుతం పరిస్థితులు ఎంతగానో మారిపోయాయి. నాటికి, నేటికి ముడి సరకుల ధరల్లో ఎంతో వ్యత్యాసం ఉంది. మేము చేసే కొడవళ్లకు గిరాకీ ఉన్నా.. గిట్టుబాటు ధర దక్కడం లేదు. ప్రభుత్వం మాపై దృష్టి సారించి, కుటీర పరిశ్రమగా అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపట్టాలి. సబ్సిడీపై రుణాలు అందించడంతో పాటు ముడి వస్తువులకు సబ్సిడీ కూడా ఇవ్వాలి.
– కణిత నాగేశ్వరరావు, కొడవళ్ల తయారీదారు, నడకుదురు

నాణ్యత పాటిస్తాం



నడకుదురులో మా మూడు కుటుంబాలకు చెందిన వారు కొడవళ్ల తయారీలో నిరంతరం శ్రమిస్తూంటారు. నాణ్యమైన ముడి ఇనుమును ఉపయోగించటంతో పాటు నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ కొడవళ్లు తయారు చేస్తాం. దీంతో అవి ఎక్కువ కాలం రైతులకు ఉపయోగపడతాయి. అందువల్లనే మా నడకుదురు కొడవళ్లకు మంచి పేరు ఉంది. పంట కోత యంత్రాలు రావడంతో కొన్నాళ్లుగా కొడవళ్లకు డిమాండ్ తగ్గింది.
– కణితి రాంబాబు, కొడవళ్ల తయారీ కార్మికుడు, నడకుదురు

బాబూ..సూపర్ సిక్స్ ఎప్పుడు?

తిరుపతి కలెక్టరేట్ వద్ద కార్మికులు, రైతు సంఘాల నేతలు ధర్నా

తిరుపతి అర్బన్: సీఎం చంద్రబాబునాయుడు సూపర్ సిక్స్ ఇవ్వరా.. ఎన్నికల ముందు ఎంతో గొప్పగా చెప్పారు.. అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని ఎందుకు పట్టించుకోవడం లేదంటూ సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగారావు ప్రశ్నించారు. మంగళవారం కలెక్టరేట్ వద్ద కార్మికులు, రైతు సంఘాల నేతలతో కలసి పెద్ద ఎత్తున ధర్నా చేపట్టారు. ఆయన మాట్లాడుతూ గొప్ప మెజారిటీతో రాష్ట్ర ప్రజలు కూటమి ప్రభుత్వాన్ని గెలిపించారు. అయితే సంక్షేమ పథకాలు మాటేంటో చెప్పాల్సి ఉంది. చిరుద్యోగులను తొలగించడం దారుణంగా పేర్కొన్నారు. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేటీకరణ దిశగా అడుగులు వేస్తున్న సీఎం, డిప్యూటీ సీఎం పట్టించుకోకపోవడం దురదృష్టకరంగా పేర్కొన్నారు. విద్యుత్ చార్జీలు ఇష్టారాజ్యంగా పెంచేస్తున్నారని చెప్పారు. నిత్యావసర సరుకుల ధర పెరుగుదలను పట్టించుకోకపోవడం సిగ్గుచేటుగా పేర్కొన్నారు. మరోవైపు పీఎం నరేంద్రమోదీ రైతులకు చెందిన మూడు నల్లచట్టాలను రద్దు చేస్తామని హామీ ఇచ్చి.. మాట తప్పారని విమర్శించారు. మోదీ సర్కార్ అవినీతిమయంగా మారిందని చెప్పారు. దేశాన్ని లూటీచేస్తున్నారని ఆరోపించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పోరాటం చేస్తామని ఆయన హెచ్చరించారు.

6న కృష్ణవేణి సంగీత నీరాజనం

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ చరిత్ర, సంగీత–సంస్కృతిని విశ్వవ్యాప్తం చేసేలా డిసెంబర్ 6 నుంచి 8వతేదీ వరకు విజయవాడలో కృష్ణవేణి సంగీత నీరాజనం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం కేంద్ర పర్యాటక శాఖ అధికారులతో కలిసి సచివాలయంలో సీఎం చంద్రబాబుతో భేటీ అయ్యారు.

కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ, సంగీత్ నాటక అకాడమీ, ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక, పర్యాటక శాఖ సంయుక్తంగా తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో జరుగనున్న «కృష్ణవేణి సంగీత నీరాజనం» కార్యక్రమానికి సీఎంను ఆహ్వానించారు. ఆంధ్రుల సాంస్కృతిక వైభవం, వారసత్వం, సంప్రదాయాలతో పాటు విశిష్ట వంటకాలు, హస్తకళలు, చేనేత వస్త్రాలు, ప్రాచుర్యంలో లేని ప్రాంతాలకు ప్రచారం కల్పించనున్నామన్నారు. అనంతరం ఎకో, టెంపుల్, క్రూయిజ్, అడ్వెంచర్, రీజినల్, వెల్ నెస్ టూరిజంలో సర్క్యూట్‌లపై చర్చించారు. పర్యాటక శాఖ కార్యదర్శి వినయ్ చంద్, ఎండీ ఆమ్రపాలీ పాల్గొన్నారు.

'స్వామినాథన్ కమిటీ సిఫార్సులు అమలు చేయాలి'

నరసరావుపేట: రైతులు, వ్యవసాయ రంగాన్ని ఆదుకునేందుకు స్వామినాథన్ కమిటీ సిఫార్సులు అమలు చేసి కేరళ తరహాలో గిట్టుబాటు ధర కల్పించడంతోపాటు రైతు భరోసా కల్పించాలని రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ జాతీయ రైతు, కౌలు రైతు, కార్మిక సంఘాల సమన్వయ సమితి పిలుపు మేరకు మంగళవారం పల్నాడు జిల్లా నరసరావుపేట గాంధీ పార్కు వద్ద నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ కార్యాలయ కార్యనిర్వాహక అధికారికి వినతిపత్రం అందజేశారు.

ఆధ్యాత్మిక సమాచారం

శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 7 కంపార్ట్‌మెంట్లు నిండాయి. సోమవారం అర్ధరాత్రి వరకు 63,637 మంది స్వామి వారిని దర్శించుకోగా 24,016 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. హుండీలో రూ.4.2 కోట్లు సమర్పించారు. దర్శన టికెట్లు లేని భక్తులకు 8 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

భక్తజన సంద్రమైన మద్దిక్షేత్రం



జంగారెడ్డిగూడెం రూరల్: ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం మండలంలోని గురవాయిగూడెం శ్రీమద్ది ఆంజనేయస్వామి వారి క్షేత్రంలో కార్తీక మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. క్షేత్రం భక్తులతో కిటకిటలాడింది. వేకువ జాము నుంచే భక్తులు స్వామి వారి దర్శనం కోసం క్యూలైన్‌లో బారులు తీరారు. 108 ప్రదక్షిణలు చేసి భక్తులు తమ మొక్కులను తీర్చుకున్నారు. ఆదాయం రూ.7,30,906 వచ్చిందని, చక్రదేవరపల్లి గ్రామస్తుల సహకారంతో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించామని ఆలయ సహాయ కమిషనర్ ఆర్‌వీ చందన తెలిపారు.

కమనీయం.. సాములోరి కల్యాణం



రాజంపేట టౌన్ : పట్టణంలోని గాంధీసర్కిల్‌లో మంగళవారం రాత్రి శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి, శివ పార్వతుల కల్యాణ మహోత్సవం కమనీయంగా సాగింది. ప్రముఖ పురోహితులు శశిధర్ స్వామి నేతృత్వంలో జరిగిన కల్యాణ మహోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. తొలుత కల్యాణ ఉత్సవ మూర్తులను ప్రత్యేక పుష్పాలతో, పట్టువస్త్రాలతో శోభాయమానంగా అలంకరించి ప్రత్యేకంగా తయారు చేసిన వేదికపై కొలువుదీర్చారు. అనంతరం పురోహితులు శాస్త్రోక్తంగా కల్యాణ వేడుకను జరిపించారు. అంతకుముందు ఎదుర్కోళ్లను నిర్వహించారు.

జీతాలివ్వండి 'స్వామీ'



సాంఘిక సంక్షేమ అంబేడ్కర్ గురుకులాల సిబ్బంది వేతన వెతలు

- 7 వేల మంది బోధన, బోధనేతర సిబ్బందికి జూన్ నుంచి ఆలస్యంగా జీతాలు
- అక్టోబర్ నెల జీతం కోసం ఇప్పటికీ ఎదురు చూపులే

సాక్షి, అమరావతి: అక్టోబరు నెల జీతాలు నవంబరు 1న రావాలి. నవంబరు చివరి వారం వచ్చేసినా ఇంకా జీతాలు రాలేదు. సగటు ఉద్యోగికి 26 రోజులు జీతం రాకపోతే ఆ కుటుంబం పడే అవస్థలు అన్నీ ఇన్నీ కావు. రాష్ట్ర సాంఘిక సంక్షేమ అంబేడ్కర్ గురుకుల విద్యాలయాల సంస్థ ఉద్యోగులు ఇప్పుడు జీతాలు రాక నానా అవస్థలు పడుతున్నారు. వేల కుటుంబాలు అప్పుల పాలవుతున్నాయి. జీతాలు ఎప్పుడిస్తారు స్వామీ అంటూ మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామికి సాంఘిక సంక్షేమ గురుకుల (ఏపీఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్) పాఠశాలలు, కాలేజీల సిబ్బంది మొరపెట్టుకుంటున్నారు. అయినా ఏడు వేల మందికిపైగా బోధన, బోధనేతర సిబ్బంది వేతన వెతలను కూటమి సర్కారు పట్టించుకోవడంలేదు. ప్రభుత్వం వెంటనే స్పందించి ప్రభుత్వ ఉద్యోగులకు మాదిరిగానే తమకు కూడా 010 పద్దు ద్వారా ఒకటో తేదీన వేతనాలను చెల్లించాలని గురుకుల సిబ్బంది కోరుతున్నారు.

గురుకులాల్లో కాంట్రాక్టు, పార్ట్‌టైమ్, ఔట్‌సోర్సింగ్ టీచర్ల పరిస్థితి మరీ దయనీయంగా ఉంది. కూటమి ప్రభుత్వం వచ్చాక జూన్ నెల నుంచే వేతనాలు సరిగా ఇవ్వక, బకాయిలు సైతం పేరుకుపోతున్నాయని వాపోతున్నారు. జీతాల సమస్యను గురుకుల ఉద్యోగులు కొద్ది రోజుల క్రితం మంత్రి డీబీవీ స్వామి, అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో ఇంకా నిధులు విడుదల కాలేదని సమాధానం వచ్చిందని చెబుతున్నారు. దీంతో కాంట్రాక్టు, పార్ట్‌టైమ్, ఔట్ సోర్సింగ్ సిబ్బంది అప్పులతోనే కాలం వెళ్లదీయాల్సి వస్తోందని వాపోతున్నారు. జీతాలు లేక కొన్ని జిల్లాల్లో వంట సిబ్బంది, సెక్యూరిటీ గార్డులు ఉద్యోగాలు వదిలి వెళ్లిపోతున్నారు.

పెండింగ్ జీతాలకూ దిక్కు లేదు..


ఏపీఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్‌లో కాంట్రాక్టు టీచర్స్ 754 మంది, పార్ట్‌టైమ్ గెస్ట్ ఫ్యాకల్టీ 1,983 మంది, ఔట్ సోర్సింగ్ నాన్ టీచింగ్, కుకింగ్, కేటరింగ్ సిబ్బంది 1,853 మంది ఉన్నారు. వీరి అటెండెన్స్‌ను సంబంధిత స్కూల్, కాలేజీ ప్రిన్సిపాల్స్ ప్రతి నెలా 20వ తేదీకి జిల్లా కోఆర్డినేటర్స్(డీసీ)కి పంపించాలి. జిల్లా కోఆర్డినేటర్ జిల్లా మొత్తం అటెండెన్స్ కన్సాలిడేట్ చేసి సెక్రటరీకి పంపిస్తారు. కొన్ని సందర్భాల్లో క్లరికల్ సిబ్బంది చేసే చిన్న చిన్న తప్పుల కారణంగా కొన్ని నెలల పాటు జీతాలు పడటంలేదు. ఇలా కొద్ది నెలలుగా జీతాలు రాని వారు చాలా మంది ఉన్నారు. ఆలా జీతాలు పడని వారి కోసం సప్లిమెంటరీ శాలరీ ఫైల్ పెట్టి వేతనాలు చెల్లించాలి. గురుకులాల్లో మాత్రం ఒక్కసారి జీతాలు పడకపోతే పట్టించుకునే నాథుడే లేడు. పార్ట్ టైమ్ టీచర్స్ ఇదేమని అడిగితే ఏదో కారణంతో రెన్యువల్ చేయకుండా ఆపేస్తున్నారు. రెగ్యులర్ టీచర్స్‌తో పాటు సేవలందించే కాంట్రాక్టు, పార్ట్‌టైమ్ టీచర్స్ జీతాల గురించి సంబంధిత ప్రిన్సిపాల్స్ కూడా పట్టించుకోవడంలేదు. దీంతో జీతాలు పెండింగ్‌లో పడి, తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారు. ఉన్నతాధికారుల వద్ద గోడు వినిపించినా ఉపయోగం ఉండటంలేదని కాంట్రాక్టు, పార్ట్ టైమ్ టీచర్స్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

విద్యా సమాచారం

పీజీ స్పాట్ అడ్మిషన్లకు అనుమతి

తిరుపతి సిటీ: ఎస్వీయూ, పద్మావతి మహిళా వర్సిటీలలో ఎంఏ, ఎమ్‌కాం, ఎమ్మెస్సీతో పాటు పలు పీజీ కోర్సులలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి ఉన్నత విద్యామండలి అనుమతిస్తూ ఉత్తర్వులు జారీచేసింది. పీజీ సెట్-2024 అర్హత సాధించని విద్యార్థులు, సెట్‌కు పరీక్షలు రాయని విద్యార్థులు సైతం ప్రవేశం పొందేందుకు వెసులుబాటు కల్పించింది. స్పాట్ అడ్మిషన్లలో ప్రవేశం పొందిన విద్యార్థులు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఉండదు. త్వరలో వర్సిటీలో అడ్మిషన్ల ప్రక్రియను ప్రారంభించనున్నారు.

ఆరుద్ర కవిత పుస్తకావిష్కరణ



విశాఖ విద్య: ఆవంత్స సోమసుందర్, ఆరుద్ర శత జయంతి ఉత్సవాలు ఆంధ్ర విశ్వ విద్యాలయం తెలుగు శాఖ, అరసం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఏయూ తెలుగు విభాగంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో అరసం ప్రచురించిన 'ఆరుద్ర కవిత'పుస్తకాన్ని వీసీ ఆచార్య శశిభూషణరావు ఆవిష్కరించారు. తెలుగు శాఖాధిపతి ఆచార్య అప్పారావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో వై.విజయకుమార్, మార్క్సిస్ట్ అధ్యయన కేంద్రం నిర్వాహకుడు జె.వి.సత్యనారాయణమూర్తి, అరసం జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరి శివ ప్రసాద్, తిరుపతి శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం విశ్రాంత ఆచార్యుడు మేడిపల్లి రవికుమార్, ఆచార్య చందు సుబ్బారావు, అరసం నాయకులు ఉప్పల అప్పలరాజు, క్షేత్రపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక ఆవిష్కరణలపై వర్క్‌షాపు

తిరుపతి సిటీ: ఎస్వీయూ డేటా సైన్స్ విభాగం మంగళవారం సాంకేతిక ఆవిష్కరణ, ఉత్పత్తి అభివృద్ధి, మన భవిష్యత్తు అనే అంశాలపై వర్క్‌షాపు నిర్వహించింది. ప్రిన్సిపల్ ప్రొఫెసర్ పీవీ నరసయ్య, కంప్యూటర్ సైన్స్ హెడ్ ప్రొఫెసర్ జి.అంజన్‌బాబు, ప్రొఫెసర్ పద్మావతమ్మ.. సాంకేతిక రంగంపై ప్రపంచం ఎలా ఆధారపడుతోందో తెలియజేశారు. విద్యార్థులు సాంకేతిక నైపుణ్యాలను అందిపుచ్చుకుని దేశాభివృద్ధిలో తమవంతు పాత్ర పోషించాలన్నారు. యువ శాస్త్రవేత్త డాక్టర్ పద్మనాభం అలియాస్ పవన్ మాట్లాడుతూ సాంకేతిక ఆవిష్కరణలు, ఉత్పత్తి అభివృద్ధి అనేవి ఎప్పటికప్పుడు మార్కెట్ అవసరాలను తీర్చడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయన్నారు. కొత్త సాంకేతికతలు, అన్వేషణా సామర్థ్యాలు, వినియోగదారుల అవసరాలపై దృష్టి సారించి పలు సంస్థలు తమ ఉత్పత్తులను మెరుగు పరచుకుంటున్నాయన్నారు. ఈ ఆవిష్కరణలు ఆరోగ్య, ఇంజినీరింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఆటోమేషన్ తదితర రంగాలలో వేగంగా ప్రగతి సాధిస్తున్నాయని తెలిపారు.

సాక్షి ప్లస్
బుధవారం ॥ 27-11-2024

సాగుబడి
అనూరాధ కార్తె : డిసెంబర్ 2 వరకు
జ్యేష్ఠ కార్తె : 3 నుంచి



బ్రెడ్‌ఫ్రూట్ (సీమ పనస)

బ్రెడ్‌ఫ్రూట్ (ఆర్టోకార్పస్ ఆల్టిలిస్) చెట్లు ఉష్ణమండల ప్రాంతాల్లో పెరుగుతాయి. పనస, బ్రెడ్‌నట్, అంజీర, మల్బరీలకు దగ్గరి జాతికి చెందినదే. తెలుగులో 'సీమ పనస', 'కూర పనస' అంటారు. ఫిలిప్పీన్స్, న్యూగినియా, మలుకు దీవులు, కరిబియన్ దీవుల ప్రాంతం దీని పుట్టిల్లు. ఇప్పుడు దక్షిణాసియా, ఈశాన్య ఆసియా, పసిఫిక్ మహాసముద్ర తీర ప్రాంతాలు, కరిబియన్, సెంట్రల్ అమెరికా, ఆఫ్రికా దేశాల్లో సాగవుతోంది.

కొత్త పంట

ఈ చెట్టుకు కాచే కాయలు లేత ఆకుపచ్చని రంగులో ఆకర్షణీయంగా ఉంటాయి. ఈ కాయలనే (పండుగా కాదు) అనేక రూపాల్లో తింటూ ఉంటారు. పసిఫిక్ దీవుల్లోని ప్రజలు అనాదిగా దీన్ని బ్రెడ్ లేదా బంగాళదుంపల మాదిరిగా దైనందిన ఆహారంగా తింటున్నారు.

బ్రెడ్‌ఫ్రూట్ చెట్లలో విత్తనాలు ఉన్న, లేని రెండు రకాలున్నాయి. ఈ చెట్టు 26 మీటర్ల ఎత్తువరకు పెరుగుతుంది. అదే చెట్టుకు ఆడ, మగ పూలు పూస్తాయి. లేతగా ఉన్నప్పు లేత ఆకుపచ్చగా, పండినప్పుడు ముదురు పసుపు రంగులో దీని కాయలు ఉంటాయి. తొక్కపైన చిన్నపాటి బుడిపెలు ఉంటాయి. లోపలి గుజ్జు లేత గోధుమ రంగులో చక్కని వాసనతో కొంచెం తియ్యగా ఉంటుంది. దీని కాయలు కిలో నుంచి 5 కిలోల వరకు బరువు పెరుగుతాయి.

పోషక విలువలు

బ్రెడ్‌ఫ్రూట్ తినగానే జీర్ణమైపోయేది కాదు. నెమ్మదిగా అరుగుతుంది. దీనిలో కాంప్లెక్స్ కార్బొహైడ్రేట్లు, జీర్ణమయ్యే పీచుపదార్థం, ముఖ్యమైన విటమిన్లు, విటమిన్ సి, పొటాషియం వంటి ఖనిజాలు ఇందులో పుష్కలంగా ఉన్నాయి. యాంటీఆక్సిడెంట్లకు కూడా ఇది నెలవు.

ఉత్పాదకత, సుస్థిరత

ఎదిగిన ఒక బ్రెడ్‌ఫ్రూట్ చెట్టు ఏడాదికి 200 కిలోలకు పైగా కాయలు కాస్తుంది. నాటిన తర్వాత వేరూనుకొని బతికితే చాలు. తర్వాత ఢోకా ఉండదు. మొండిగా పెరిగి, కాయలనిస్తుంది. ప్రతికూల వాతావరణాన్ని ఎదుర్కొని, నిస్సారమైన భూముల్లోనూ బతుకుతుంది. అందువల్లే ఉష్ణమండల ప్రాంతాల్లో ప్రజలకు కరువు కాలాల్లో కూడా సుస్థిరంగా ఆహారాన్ని అందిస్తుంది.

ఎన్నో రకాలుగా తినొచ్చు

బ్రెడ్‌ఫ్రూట్‌ను పచ్చిగా, లేతగా, పండుగా.. ఇలా ఏ దశలోనైనా తినొచ్చు. పూర్తిగా మగ్గిన పండుకు బంగాళదుంప రుచి వస్తుంది కాబట్టి అనేక వంటకాలు చేసుకోవచ్చు. పెరిగిన కాయను ఉడకబెట్టుకొని, కుమ్ములో పెట్టుకొని, వేపుకొని, కాల్చుకొని తినొచ్చు. పచ్చి బ్రెడ్‌ఫ్రూట్ కాయలను పిండి చేసి పెట్టుకొని, బేకరీ ఉత్పత్తుల్లో కూడా కలుపుకోవచ్చు. ఇందులో గ్లుటెన్ ఉండదు కాబట్టి సెలియాక్ జబ్బు ఉన్న వారు కూడా తినొచ్చు. తీపి పదార్థాల్లో, రుచికరమైన ఆహార పదార్థాల్లో భాగం చేసుకోవచ్చు.

పోషక విలువలు

బ్రెడ్‌ఫ్రూట్‌లో పోషకవిలువలతో పాటు ఔషధ విలువలు కూడా ఉన్నాయి. మధుమేహం, కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడానికి ఉపయోగపడే ముఖ్యమైన అమినోయాసిడ్లు, ప్రొటీన్లు, పీచుపదార్థం ఇందులో ఉంటాయి. విటమిన్ సి, బి1, బి5తో పాటు పొటాషియం, రాగి వంటి మినరల్స్ ఉన్నాయి.

ఈ కాయలో కొవ్వు, సోడియం స్వల్పంగా, పీచుపదార్థం అధికంగా ఉంటాయి. రెండు కప్పుల బ్రెడ్‌ఫ్రూట్ ముక్కల్లో 4.4 మిల్లీ గ్రాముల సోడియం, 60 గ్రాముల పిండిపదార్థాలు, 2.4 గ్రాముల మాంసకృత్తులు, 227 కేలరీల శక్తి, 24.2 గ్రాముల చక్కెర, 0.5 గ్రాములు కొవ్వు, 10.8 మిల్లీ గ్రాముల పీచు పదార్థం ఉంటాయి. రెండు కప్పుల బ్రెడ్‌ఫ్రూట్ ముక్కలు తింటే ఆ రోజుకు సరిపోయే పొటాషియంలో 23% లభించినట్లే.

రోగనిరోధక శక్తి

పుష్కలంగా విటమిన్ సి, యాంటీఆక్సిడెంట్లను అందించటం ద్వారా రోగనిరోధక శక్తిని పెంపొందించటం, ఇన్ఫెక్షన్లను దూరంగా ఉంచగలగటం బ్రెడ్‌ఫ్రూట్ ప్రత్యేకత. ఫ్రీ రాడికల్స్ వల్ల కలిగే దుష్ప్రభావాలను నిర్మూలించటం, దీర్ఘరోగాల బెడదను తగ్గించటంతో పాటు దేహం బరువును తగ్గించుకోవటానికి ఉపకరిస్తుంది. కాల్షియం, మెగ్నీషియం, ఫాస్ఫరస్ వంటి ఖనిజాలు ఉండటం వల్ల ఎముక పుష్టికి దోహదపడుతుంది. విటమిన్ ఎ ఉండటం వల్ల కంటి చూపునకు కూడా మంచిదే. వెంటనే అరిగిపోకుండా క్రమంగా శక్తినిస్తుంది కాబట్టి రోజంతా చురుగ్గా ఉండేలా చేస్తుంది.




క్లైమెట్ మర్మాలు

క్లైమెట్ ఓవర్‌షూట్

వాతావరణ మార్పుల్ని ఎదుర్కొనే ప్రయత్నంలో భాగంగా ప్రపంచ దేశాల మధ్య పారిస్ ఒప్పందం కుదిరింది. భూతాపాన్ని ప్రమాదకరమైన స్థితికి పెరగనీయకుండా ఉండాలంటే ఉష్ణోగ్రతలను పారిశ్రామిక విప్లవ కాలానికి ముందుతో పోల్చితే సాధ్యమైనంత వరకు 1.5 డిగ్రీల సెల్షియస్ కన్నా పెరగనీయకూడదన్నది పారిస్ ఒప్పందం నిర్దేశిస్తోంది. ఎట్టిపరిస్థితుల్లోనూ 2 డిగ్రీల సెల్షియస్‌కు దాటి ఉష్ణోగ్రతలు పెరగనీయకూడదన్నది సంకల్పం. వాతావరణ మార్పును లెక్కించేటప్పుడు దీర్ఘకాలంలో పెరిగిన ప్రపంచ సగటు ఉష్ణోగ్రతలను పరిగణనలోకి తీసుకుంటారు. అయితే, పారిస్ ఒప్పంద కాలంలో భయపడినట్టే ఇప్పుడు, తాత్కాలికంగానైనా, ఉష్ణోగ్రతలు అనుకున్న లక్ష్యాల పరిధిని దాటి పెరుగుతున్నాయి. గత కొద్ది నెలలు చరిత్రలో ఎన్నడూ లేనంతగా అధిక ఉష్ణోగ్రతలు (సాధారణం కన్నా 3–4 డిగ్రీలు) పెరుగుతూ పాత రికార్డుల్ని తిరగరాస్తున్న సంగతి మనం గమనిస్తున్నాం.

పరిధి దాటి ఉష్ణోగ్రతలు తాత్కాలికంగానైనా బాగా పెరిగే సందర్భాలు పెరుగుతూ ఉంటే ప్రపంచం మరింత ప్రమాదకర స్థితికి చేరినట్లు భావించాలి. అపరిమితంగా ప్రపంచ ఉష్ణోగ్రతలు పెరగటం అనేది దీర్ఘకాలం కొనసాగితే.. ఆ దుష్ప్రభావం ప్రకృతిలోని పర్యావరణ వ్యవస్థల్ని, జీవవైవిధ్యాన్ని, మానవ సమాజాలను తిరిగి సవరించుకోలేనంతగా కష్టనష్టాలకు గురిచేస్తుంది. ముఖ్యంగా, నీటి వనరులు అడుగంటిన ప్రాంతాలు, సముద్ర తీర ప్రాంతాలు, ఇతర సమస్యాత్మక ప్రాంతాల్లో జీవజాతులకు పెనుముప్పు దాపురిస్తోంది. అధిక ఉష్ణోగ్రతలు చవిచూసే రోజుల్ని తగ్గించుకోవాలంటే.. ఈ దశాబ్దంలోనే మానవాళి విడుదల చేస్తున్న కర్బన ఉద్గారాలను గణనీయంగా తగ్గించుకునేలా చిత్తశుద్ధితో అన్ని దేశాలూ కార్యాచరణ చేపట్టి అమలు చేయాల్సి ఉంది. అయితే, వాతావరణ శిఖరాగ్ర సమావేశం నిర్ణయాలు అందుకు సుదూరంగానే మిగిలిపోతున్నాయి. అంటే.. మరిన్ని 'క్లైమెట్ ఓవర్‌షూట్' కష్టాలు రానున్నాయన్న మాట.



పేనుబంకను వదిలించేదెలా?



మీ గార్డెన్‌లో పేనుబంక (అఫిడ్స్)ను నియంత్రించటం ఒక సవాలుతో కూడుకున్న పని. కానీ, పేనుబంక పురుగులను అదుపు చేయటానికి అనేక ప్రభావవంతమైన మార్గాలు ఉన్నాయి. మీరు అనుసరించగల కొన్ని సూచనలు:

1. మీ మొక్కలను క్రమం తప్పకుండా తనిఖీ చేయండి
ముడుచుకున్న ఆకులపై అంటుకునే పదార్థం లేదా స్లైమ్ లేదా ఆకులపై పేనుబంక సోకుతున్న సంకేతాలు ఏమైనా ఉన్నాయేమో గమనించటం కోసం మీ మొక్కలను తరచుగా తనిఖీ చేయండి.

2. వేపనూనె వాడండి
వేప నూనె అఫిడ్స్‌ను నియంత్రిండానికి వాడే సహజమైన పురుగుమందు. లేబుల్ సూచనల ప్రకారం వేప నూనెను నీటితో కలిపి పేనుబంక సోకిన మొక్కలపై పిచికారీ చేయండి.

ఇంటి పంట

3.సబ్బు నీరు స్ప్రే చేయండి
పేనుబంకను నియంత్రించడానికి తేలికపాటి డిష్ సోప్‌ను నీటిలోకలిపి ప్రభావిత మొక్కలపై స్ప్రే చేయవచ్చు.

4. గార్లిక్ స్ప్రే ఉపయోగించండి
వెల్లుల్లి సహజ క్రిమిసంహారక లక్షణాలను కలిగి ఉంటుంది. ఇది పేనుబంకను నియంత్రించడంలో సహాయపడుతుంది. వెల్లుల్లి రసాన్ని నీటితో కలపండి. ప్రభావిత మొక్కలపై పిచికారీ చేయండి.

5. ప్రయోజనకరమైన కీటకాలు
లేడీబగ్స్, లేస్‌వింగ్, పరాన్నజీవి కందిరీగలు వంటి ప్రయోజనకరమైన కీటకాలు పేనుబంకను వేటాడతాయి. అఫిడ్స్ పురుగుల సంతతిని నియంత్రించడానికి మీ గార్డెన్ లో ఈ కీటకాలు పెరిగేలా చూసుకోండి.

6. తోట పరిశుభ్రత పాటించండి
కలుపు మొక్కలను తొలగించండి. తెగులు సోకిన మొక్కలను తీసి దూరంగా పారవేయండి. పురుగుల ముట్టడిని నివారించడానికి ఎక్కువ ఎరువులు వేయకుండా ఉండండి.

7. స్క్రీన్లు, రో కవర్లను ఉపయోగించండి
అఫిడ్స్ మీ మొక్కలను ఆశించకుండా నిరోధించడానికి ఫైన్-మెష్ స్క్రీన్లు లేదా ఫైన్-వెటెడ్ రో కవర్లను ఉపయోగించండి.

8.జీవ నియంత్రణ
పేనుబంకను తినే పక్షులు, సాలె పురుగులు వంటి సహజ మాంసాహారులను ప్రోత్సహించటం ద్వారా జీవ నియంత్రణకు అవకాశం కల్పించండి.

9. పర్యవేక్షించండి, పునరావృతం చేయండి
మీ గార్డెన్‌లో మొక్కలను క్రమం తప్పకుండా పర్యవేక్షించండి. పేనుబంకను సమర్థవంతంగా అరికట్టే నియంత్రణ చర్యలను అవసరాన్ని బట్టి పునరావృతం చేయండి.

– హేపీ గార్డెనర్స్ అడ్మిన్ టీం

బసిల్ (తులసి) సాగు.. ఆదాయం ఎంతో తెలుసా?

- 50 హెక్టార్లలో 3 వేల టన్నుల బసిల్ ఆకు ఉత్పత్తి
- టన్ను ధర 550 యూరోలు (సుమారుగా రూ. 49 వేలు).. మొత్తం రూ. 14.66 లక్షల ఆదాయం
- విత్తటం, కోత అంతా భారీ యంత్రాలతోనే..
- ఇటలీ యువ రైతు ఫిలిప్పో కర్రర విజయగాథ



ఫిలిప్పో కర్రర 28 ఏళ్ల యువ రైతు. అతనిది ఇటలీలోని ఉత్తర ప్రాంతంలోని పర్మ నగరం. ఇటలీలో పెద్ద కమతాలే ఎక్కువ. ఇప్పుడు సగటు వ్యవసాయ క్షేత్రం విస్తీర్ణం సుమారు 11 హెక్టార్లు. అక్కడ కమతాల సైజు పెరుగుతూ వస్తోంది. 2000వ సంవత్సరంలో 5 హెక్టార్లున్న సగటు కమతం విస్తీర్ణం 2010 నాటికి 8 హెక్టార్లకు, తర్వాత 11 హెక్టార్లకు పెరిగింది. వ్యవసాయక కుటుంబంలో పుట్టిన ఫిలిప్పో చదువు పూర్తిచేసుకొని ఏడేళ్ల క్రితం వ్యవసాయంలోకి దిగాడు. పేరుకు వ్యవసాయమే అయినా వాణిజ్య దృష్టితో సేద్యం చేయటంలో దిట్ట ఫిలిప్పో. అతను పగ్గాలు చేపట్టేటప్పటికి వారి కుటుంబ వ్యవసాయ కంపెనీ పది హెక్టార్లలో పంటలు సాగు చేస్తుండేది. ఈ ఏడేళ్లలోనే 150 హెక్టార్లకు విస్తరించిందంటే యువ రైతు ఫిలిప్పో పట్టుదల, కార్యదక్షతలను అర్థం చేసుకోవచ్చు. 50 హెక్టార్లలో ఇటాలియన్ బసిల్ పంటను పండిస్తున్నాడాయన. బసిల్ తులసి జాతికి చెందిన పంట. ఇందులో తీపి రకం కూడా ఉంటుంది. పచ్చి కూరగాయలు, ఆకుకూరలు, పండ్లతో కూడిన సలాడ్లలో కలుపుకొని తింటారు. బసిల్ నుంచి నూనెను కూడా వెలికితీసి అనేక ఔషధాల్లో వాడుతూ ఉంటారు.

1996లో పుట్టిన ఫిలిప్పోను ఆ దేశంలో కొత్త తరం రైతులకు, వాణిజ్య స్ఫూర్తికి ప్రతీకగా యువత పరిగణిస్తున్నారు. 'నేను ఏడేళ్ల క్రితం మా వ్యవసాయం బాధ్యతలు తీసుకున్నాను. పది హెక్టార్ల పొలానికి బాధ్యత తీసుకున్నాను. మా తాత పారిశ్రామిక పద్ధతుల్లో భారీ విస్తీర్ణంలో టొమాటోలు సాగు చేసేవారు (ఇటలీ ఉత్తర భాగంలో ఎక్కువ టొమాటోలే సాగవుతూ ఉంటాయి). బసిల్ పంటను అధిక విస్తీర్ణంలో పెంచడానికి అనువైనదిగా గుర్తించాను. ఇది అధికాదాయాన్నిచ్చే పంట. అయితే, రైతులు కొద్ది విస్తీర్ణంలోనే సాగు చేస్తున్నారు. నేను భారీ యంత్రాలు ఉపయోగించటం ద్వారా ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేయటం ప్రారంభించాను. బసిల్ ఆకులను తాజాగా, సువాసనతో కూడి ఉండాలని దీనితో ఉత్పత్తులు తయారు చేసే కంపెనీలు ఆశిస్తుంటాయి..' అంటారు ఫిలిప్పో.

మనుషులతో కాకుండా భారీ యంత్రాలతో బసిల్ పంట కోతను చేపట్టాలనుకున్నప్పుడు.. తమ పొలంలో మడుల సైజుకు తగిన విధంగా పంట కోత యంత్రాన్ని ఆయన ప్రత్యేకంగా డిజైన్ చేయించి తయారు చేయించాడు. ఫిలిప్పో బసిల్ ఆకును ఆ రంగంలో పేళ్లానుకున్న 6 కంపెనీలకు విక్రయిస్తుంటాడు. 'నేను ఆర్థిక శాస్త్రం, వాణిజ్య శాస్త్రం చదివాను. కానీ, వ్యవసాయం అంటే నాకు చాలా ఇష్టం' అన్నాడు. 'ఆరుబయట పొలాల్లో విస్తారంగా బసిల్ పంటను నాణ్యమైన దిగుబడి తీసే విధంగా సాగు చేయటం సవాళ్లతో కూడిన పని. అయితే, ఈ పంటలోనే ఎదిగే అవకాశం ఉందని నేను గుర్తించాను. మా కంపెనీ 3 వేల టన్నుల బసిల్ ఆకులను పండిస్తోంది. టన్ను ధర 550 యూరోలు (సుమారుగా రూ. 49 వేలు). అనేక విషయాలపై ఆధారపడి ఈ ధరలో హెచ్చుతగ్గులుంటాయి అని ఫిలిప్పో చెప్పాడు. 50 ఎకరాల్లో ఏడాదికి రూ. 14.66 లక్షల ఆదాయం పొందుతున్నాడు.

ఏప్రిల్ రెండోవారంలో బసిల్ విత్తటం ప్రారంభిస్తాం. మొదటి కోత జూన్ రెండోవారంలో మొదలవుతుంది. అక్టోబర్ వరకు కోతలు కొనసాగుతాయి. 'ఈ ఏడాది సెప్టెంబర్ రెండో వారం వరకు దిగుబడి, నాణ్యత బాగున్నాయి. భారీ వర్షం కురవటంతో పంట దెబ్బతింది.' అన్నాడు ఫిలిప్పో.

పొద్దున్న, సాయంత్రపు వేళల్లో బసిల్ ఆకుల్ని కత్తిరిస్తే వాటి నాణ్యత, రంగు, వాసన బాగుంటాయి. మేం కత్తిరించిన కొద్ది గంటల్లోనే ఫుడ్ కంపెనీకి చేర్చుతాము అని చెప్పాడు. ఇటలీలో ఒకానొక పెద్ద సహకార బ్యాంకింగ్ వ్యవస్థ 'ఎమిల్‌బంక'. ఫిలిప్పో కర్రరకు దీని మద్దతు ఉంది. 'ఫిలిప్పోకు వ్యవసాయం పట్ల ఉన్న మక్కువ, వ్యాపారాత్మక దృష్టి అమోఘమైనవి' అని ఎమిల్‌బంక ప్రతినిధి ఆంద్రియా కలెఫ్పి ప్రశంసించారు.



బిజినెస్ రీల్

ఏంజెల్ వన్ నుంచి మ్యూచువల్ ఫండ్స్ సేవలు

ఆమోదం తెలిపిన సెబీ

న్యూఢిల్లీ: ప్రముఖ బ్రోకింగ్ సంస్థ ఏంజెల్ వన్ అస్సెట్ మేనేజ్‌మెంట్ (ఏఎంసీ) సేవల్లోకి ప్రవేశించేందుకు మార్గం సుగమమైంది. తన అనుబంధ సంస్థ 'ఏంజెల్ వన్ అస్సెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ' మ్యూచువల్ ఫండ్స్ సేవలు ప్రారంభించేందుకు వీలుగా సెబీ నుంచి ఆమోదం లభించినట్లు ప్రకటించింది. ఈ పరిణామాలతో బీఎస్ఈలో ఏంజెల్ వన్ షేరు 4 శాతం లాభపడి రూ.2,909కు దూసుకుపోయింది. ''ఏంజెల్ వన్ మ్యూచువల్ ఫండ్‌కు సర్టిఫికెట్ ఆఫ్ రిజిస్ట్రేషన్‌ను నవంబర్ 25, 2024న సెబీ జారీ చేసింది. ఏంజెల్ వన్ మ్యూచువల్ ఫండ్‌కు అస్సెట్ మేనేజ్‌మెంట్ కంపెనీగా ఏంజెల్ వన్ లిమిటెడ్ వ్యవహరించేందుకు సెబీ నుంచి అనుమతి లభించింది''అని స్టాక్ ఎక్స్ఛేంజీలకు ఏంజెల్ వన్ సమాచారం ఇచ్చింది. ఇండెక్స్ ఫండ్స్, ఈటీఎఫ్‌ల ఆధారిత ప్యాసివ్ ఫండ్స్‌ను తక్కువ ఖర్చుకే ఇన్వెస్టర్లకు అందించనున్నట్లు ప్రకటించింది.

సైబర్ సెక్యూరిటీ రంగంలోకి ఇక్రా

కోల్‌కత: ఇక్రా అనుబంధ కంపెనీ ఇక్రా అనలిటిక్స్ తాజాగా భారత్‌లో 3–5 బిలియన్ డాలర్ల విలువైన సైబర్ సెక్యూరిటీ మార్కెట్‌లోకి ప్రవేశిస్తున్నట్లు ప్రకటించింది. ప్రముఖ ప్రపంచ సైబర్ రిస్క్ మేనేజ్‌మెంట్ సంస్థ, మూడీస్ భాగస్వామి అయిన బిట్‌సైట్ సహకారంతో ఈ విభాగంలోకి ఎంట్రీ ఇస్తున్నట్లు వెల్లడించింది. ఈ భాగస్వామ్యం భారత్‌లోని క్లయింట్లకు అత్యాధునిక సైబర్ రిస్క్ మేనేజ్‌మెంట్ సొల్యూషన్స్ అందించడానికి వీలు కలుగుతుందని కంపెనీ తెలిపింది. భారతీయ సైబర్ సెక్యూరిటీ రంగం వచ్చే ఐదేళ్లలో ఏటా 13–15 శాతం వృద్ధి చెందుతుందని అంచనా. తాజా నిర్ణయంతో భవిష్యత్తులో కంపెనీ వ్యాపార వృద్ధికి తోడ్పడుతుందని ఆశిస్తున్నట్లు ఇక్రా అనలిటిక్స్ తెలిపింది.

స్విచ్ మొబిలిటీ, వెర్టిలో జత

న్యూఢిల్లీ: ఎలక్ట్రిక్ బస్, లైట్ కమర్షియల్ వెహికిల్స్ తయారీలో ఉన్న స్విచ్ మొబిలిటీ ఆటోమోటివ్ తాజాగా లీజింగ్, ఫైనాన్సింగ్ సొల్యూషన్స్ కంపెనీ వెర్టిలోతో భాగస్వామ్యం కుదుర్చుకున్నట్లు మంగళవారం తెలిపింది. ఇందులో భాగంగా వచ్చే 3–5 సంవత్సరాల్లో భారత్ అంతటా 1,000 ఎలక్ట్రిక్ వాహనాలను వినియోగంలోకి తెస్తాయి. అధునాతన ఎలక్ట్రిక్ బస్సులు, ఎలక్ట్రిక్ లైట్ కమర్షియల్ వెహికల్స్ కోసం వెర్టిలో నిధులు సమకూరుస్తుంది. అలాగే స్థిర రవాణా పరిష్కారాలను అవలంబించే లక్ష్యంతో వ్యాపార సంస్థలు, మున్సిపాలిటీలకు ఈ వాహనాలను లీజుకు ఇస్తుంది. హిందూజా గ్రూప్‌లో భాగమైన అశోక్ లేలాండ్ అనుబంధ కంపెనీయే స్విచ్ మొబిలిటీ.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

27-11-2024

విశాఖ	585–00
చిత్తూరు	603–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	595–00
విజయవాడ	595–00
రిటైల్ ధర (డజను)	84.00
హైదరాబాద్	590–00
వరంగల్	592–00
రిటైల్ ధర	6.50

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
SHRIRAMFIN	3,044.00	3.26
BRITANNIA	5,012.00	2.2
ASIANPAINT	2,505.70	1.87
BEL	297.8	1.86
INFY	1,920.20	1.61

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
ADANIENT	2,166.85	-4.02
ADANIPORTS	1,131.50	-3.03
ULTRACEMCO	11,110.85	-3.03
BAJAJ-AUTO	9,151.00	-2.87
SUNPHARMA	1,763.35	-1.98

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	5,917
ఎన్ఎస్ఈ	87,510
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	3,84,659
ఎఫ్ఐఐ	+ 1,158
డీఐఐ	- 1,911

ముడిచమురు... (బ్యారల్)

నైమెక్స్ లైట్ స్వీట్	68.54	$ 68.94
బ్రెంట్	72.03	$ 72.48

జొమాటో క్విప్ @ రూ. 266

రూ. 8,500 కోట్ల సమీకరణకు సై



న్యూఢిల్లీ: ఫుడ్ డెలివరీ ప్లాట్‌ఫామ్ జొమాటో అర్హతగల సంస్థాగత ఇన్వెస్టర్లకు షేర్ల జారీ(క్విప్) ద్వారా రూ. 8,500 కోట్ల సమీకరణకు తెరతీసింది. సోమవారం ప్రారంభమైన క్విప్‌నకు షేరుకి రూ. 265.91 చొప్పున ఫ్లోర్ ధరగా నిర్ణయించింది. బోర్డు ఏర్పాటు చేసిన నిధుల సమీకరణ కమిటీ క్విప్‌నకు ఆమోదముద్ర వేసినట్లు ఫుడ్ అగ్రిగేటర్ కంపెనీ సీఈవో దీపిందర్ గోయల్ వెల్లడించారు. బ్యాలన్స్‌షీట్ పటిష్టత కోసమే పెట్టుబడుల సమీకరణ చేపట్టినట్లు తెలియజేశారు. క్విప్ నేపథ్యంలో జొమాటో షేరు బీఎస్ఈలో 2.4% బలపడి రూ. 280 వద్ద ముగిసింది.

గృహ రుణాలకు నూరు శాతం పన్ను ప్రయోజనం

- అందుబాటు ధరల ఇళ్ల నిర్వచనం సవరించాలి
- తద్వారా డిమాండ్‌ను పెంచొచ్చు
- కేంద్ర ప్రభుత్వానికి క్రెడాయ్ కీలక సూచనలు



న్యూఢిల్లీ: గృహ రుణాలకు చెల్లించే వడ్డీ మొత్తంపైనా ఆదాయపన్ను ప్రయోజనం కల్పించాలని రియల్టర్ల మండలి 'క్రెడాయ్' కేంద్ర ప్రభుత్వానికి కీలక సూచన చేసింది. ఇలా చేయడం వల్ల అందుబాటు ధరల ఇళ్లు, మధ్య శ్రేణి ఇళ్ల అమ్మకాలకు డిమాండ్ పెరుగుతుందని పేర్కొంది. అలాగే, రూ.45 లక్షలుగా ఉన్న అందుబాటు ధరల ఇళ్ల నిర్వచనాన్ని రూ.75–80 లక్షలకు పెంచాలని కోరింది. క్రెడాయ్ 25వ వ్యవస్థాపక దినం సందర్భంగా ప్రెసిడెంట్ బొమన్ ఇరానీ మీడియాతో మాట్లాడారు. నిర్మాణంలోని రూ.75–80 లక్షల ధరల్లోని ఇళ్ల ప్రాజెక్టులకు ఒక శాతం జీఎస్‌టీని అమలు చేయాలని, తద్వారా డిమాండ్‌కు ఊతం లభిస్తుందని చెప్పారు. ప్రస్తుతం రూ.45 లక్షల ధరల్లోపు నిర్మాణంలోని ఇళ్లకే ఒక శాతం జీఎస్‌టీ అమల్లో ఉంది. ఇంతకుమించిన ఇళ్లకు 5 శాతం జీఎస్‌టీ వసూలు చేస్తున్నారు. పైగా డెవలపర్లు ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్‌ను పొందేందుకు వీల్లేదు. ''ఎప్పుడో 2017లో రూ.45 లక్షల్లోపు ఇళ్లను అందుబాటు ధరల ఇళ్లుగా నిర్ణయించారు. నాటి నుంచి వార్షిక ద్రవ్యోల్బణాన్ని పరిగణనలోకి తీసుకుని చూసినా, ఈ ధరల పరిమితి రూ.75–80లక్షలకు సవరించాల్సి ఉంది''అని బొమన్ ఇరానీ పేర్కొన్నారు. ధరల పరిమితిని పెంచడం వల్ల కొనుగోలుదారులు తక్కువ జీఎస్‌టీ నుంచి ప్రయోజనం పొందుతారని చెప్పారు.

మరో కీలక సూచన..

ఇక అందుబాటు ధరల ఇళ్లకు ఎలాంటి ధరల పరిమితి విధించొద్దని క్రెడాయ్ మరో కీలక సూచన చేసింది. దీనికి బదులు మెట్రోల్లో 60 మీటర్ల కార్పెట్ ఏరియా, నాన్ మెట్రోల్లో 90 మీటర్ల కార్పెట్ ఏరియాను అందుబాటు ధరలకు పరిమితిగా కొనసాగించాలని కోరింది. పన్ను తగ్గించడం ద్వారా వినియోగదారుల చేతుల్లో నిధులు మిగులు ఉండేలా చూడాలని బొమన్ ఇరానీ ప్రభుత్వానికి సూచించారు. ప్రస్తుతం గృహ రుణాలపై ఒక ఆర్థిక సంవత్సరంలో రూ.2లక్షల వరకు వడ్డీ చెల్లింపులపై సెక్షన్ 24 కింద ఆదాయపన్ను మినహాయింపు ప్రయోజనం ఉండగా, దీని స్థానంలో చెల్లించిన వడ్డీ మొత్తానికి (నూరు శాతం) పన్ను మినహాయింపు ఇవ్వాలని క్రెడాయ్ నూతన ప్రెసిడెంట్‌గా ఎన్నికైన శేఖర్ పటేల్ కోరారు. నూరు శాతం పన్ను మినహాయింపు ఇవ్వడం డిమాండ్‌ను పెద్ద ఎత్తున పెంచుతుందని ఇరానీ అభిప్రాయపడ్డారు. ప్రభుత్వం నుంచి వివిధ రకాల ఆమోదాల కోసం 12–18 నెలల సమయం పడుతోందని, ఈ విషయంలో వ్యాపార సులభతర నిర్వహణకు వీలుగా చర్యలు తీసుకోవాలని క్రెడాయ్ చైర్మన్ మనోజ్ గౌర్ డిమాండ్ చేశారు.

సెప్టెంబర్‌లో పెరిగిన 'టర్మ్' డిపాజిట్లు



ముంబై: టర్మ్ డిపాజిట్ల వృద్ధి రేటు సెప్టెంబర్‌లో గణనీయంగా పెరిగింది. ఆకర్షణీయమైన రాబడులను అందించడం టర్మ్ డిపాజిట్లకు లాభించిన అంశం. షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంక్‌లకు సంబంధించి ఆర్‌బీఐ విడుదల చేసిన గణాంకాల ప్రకారం, మొత్తం డిపాజిట్లలో టర్మ్ డిపాజిట్ల వాటా 2024 సెప్టెంబర్‌లో (2023 ఇదే నెలతో పోల్చి) 59.8 శాతం నుంచి 61.4 శాతానికి ఎగసింది. 7 శాతానికి పైగా వడ్డీ రేటు కలిగిన టర్మ్ డిపాజిట్ల వృద్ధి రేటు గత ఏడాది సెప్టెంబర్‌లో 54.7 శాతం ఉంటే తాజాగా ఈ రేటు 68.8 శాతానికి పెరిగింది. ఇక బ్యాంక్ డిపాజిట్ వృద్ధి రేటు సమీక్షా నెల్లో గత ఏడాది తరహాలోనే 11.7 శాతం వృద్ధినే నమోదుచేసుకుంది. అన్ని విభాగాల ప్రజల డిపాజిట్లు (గ్రామీణ/సెమీ–అర్బన్/అర్బన్/మెట్రోపాలిటన్) రెండంకెల వార్షిక వృద్ధిని నమోదు చేశాయి. మొత్తం డిపాజిట్లలో 51.4 శాతం వ్యక్తులు కలిగి ఉన్నారు. వీరిలో మహిళా డిపాజిటర్లు దాదాపు 40 శాతం కావడం గమనార్హం.

కొత్త ప్రాజెక్టుతో రూ. 2,500 కోట్ల ఆదాయం: సుమధుర గ్రూప్

హైదరాబాద్: రియల్ ఎస్టేట్ సంస్థ సుమధుర గ్రూప్ కొత్తగా పాలెస్ రాయల్ పేరిట లగ్జరీ ప్రాజెక్టును హైదరాబాద్‌లో ప్రారంభించింది. దీన్నుంచి రూ. 2,500 కోట్ల ఆదాయాన్ని అంచనా వేస్తున్నట్లు సంస్థ సీఎండీ జి. మధుసూదన్ వెల్లడించారు. 7.35 ఎకరాల విస్తీర్ణంలో 4, 5 బెడ్రూమ్ ఫ్లాట్లు 523 ఉంటాయని పేర్కొన్నారు. 2029 డిసెంబర్ నాటికి డెలివరీ ఉంటుంది. 85,000 చ.అ. ఫ్లోటింగ్ క్లబ్‌హౌస్, అయిదు అంచెల బేస్‌మెంట్ పార్కింగ్ మొదలైనవి ఫీచర్లు ఉంటాయి.

భారత్‌లో 5జీ జోరు

- మొబైల్ చందాదారుల్లో 74% వాటా
- ఆరేళ్లలో మూడింతలై 97 కోట్లకు
- ఎరిక్సన్ కంజ్యూమర్‌ల్యాబ్ నివేదిక



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: టెలికం రంగంలో భారత్‌లో 5జీ కొత్త పుంతలు తొక్కుతోంది. 2030 నాటికి 5జీ చందాదార్ల సంఖ్య మూడురెట్లు దూసుకెళ్లి 97 కోట్లకు చేరుతుందని నెట్‌వర్కింగ్, టెలికమ్యూనికేషన్స్ దిగ్గజం ఎరిక్సన్ రూపొందించిన కంజ్యూమర్‌ల్యాబ్ రిసర్చ్ నివేదిక వెల్లడించింది. ఆ సమయానికి మొత్తం మొబైల్ కస్టమర్లలో 5జీ యూజర్ల వాటా ఏకంగా 74 శాతానికి ఎగబాకుతుందని తెలిపింది. ఎరిక్సన్ మొబిలిటీ రిపోర్ట్ ప్రకారం 2024 చివరి నాటికి భారత్‌లో 5జీ సబ్‌స్క్రిప్షన్‌లు 27 కోట్లు నమోదు కావొచ్చని అంచనా. ఇది దేశంలోని మొత్తం మొబైల్ కస్టమర్లలో 23 శాతం. ఇక అంతర్జాతీయంగా 5జీ చందాదార్ల సంఖ్య ఈ ఏడాది చివరికల్లా దాదాపు 230 కోట్లుగా ఉంటుంది. ఇది మొత్తం గ్లోబల్ మొబైల్ సబ్‌స్క్రిప్షన్లలో 25 శాతానికి సమానం. అలాగే 2030 నాటికి ప్రపంచవ్యాప్తంగా 630 కోట్ల మంది 5జీ మొబైల్ సేవలను వినియోగిస్తారని నివేదిక అంచనా వేస్తోంది.

2027 నాటికి 4జీని దాటి..

5జీ వినియోగదార్ల సంఖ్య 2027లో ప్రపంచవ్యాప్తంగా ఉన్న 4జీ సబ్‌స్క్రిప్షన్లను అధిగమిస్తాయని అంచనా. మొదటిసారిగా 6జీ సేవలు 2030లో ప్రారంభం కావొచ్చు. భారత్‌లోని స్మార్ట్‌ఫోన్ వినియోగదారులు మెరుగైన పనితీరు కోసం వీడియో కాలింగ్, స్ట్రీమింగ్, ఆన్‌లైన్ చెల్లింపులకు అదనంగా ఖర్చు చేయడానికి సిద్ధంగా ఉన్నారు. 5జీ వినియోగదార్లలో ఆరుగురిలో ఒకరు తమ ప్రస్తుత నెలవారీ మొబైల్ ఖర్చులో 20 శాతం ఎక్కువ చెల్లించడానికి రెడీగా ఉన్నారని ఎరిక్సన్ ఆగ్నేయాసియా, భారత్ నెట్‌వర్క్ సొల్యూషన్స్ హెడ్ ఉమాంగ్ జిందాల్ తెలిపారు. జనరేటివ్ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (జెన్ ఏఐ) అప్లికేషన్లు 5జీ పనితీరును నడిపించే కీలక సాధనాలుగా ఉద్భవించాయి. జెన్ ఏఐ యాప్‌లను ఉపయోగించే స్మార్ట్‌ఫోన్ యూజర్ల సంఖ్య వచ్చే ఐదేళ్లలో పెరుగుతుంది. భారత్‌లోని 5జీ స్మార్ట్‌ఫోన్ కస్టమర్లలో 67 శాతం మంది వచ్చే ఐదేళ్లలో ప్రతీ వారం జెన్ ఏఐ యాప్‌లను ఉపయోగిస్తారని నివేదిక వివరించింది.

రుణ వృద్ధిపై బ్యాంకింగ్ దృష్టి

- మూడు, నాలుగు నెలల్లో కొత్త ప్రొడక్టుల ఆవిష్కరణ
- ఫైనాన్షియల్ సేవల కార్యదర్శి నాగరాజు వెల్లడి



న్యూఢిల్లీ: రుణ వృద్ధిని మెరుగుపరిచేందుకు ప్రభుత్వ రంగ బ్యాంకులు రానున్న కొద్ది నెలల్లో కొత్త ప్రొడక్టులను ఆవిష్కరించనున్నట్లు ఆర్థిక సేవల కార్యదర్శి ఎం నాగరాజు మంగళవారం తెలిపారు. ''రుణ వృద్ధి మెరుగుపడాలని మేము కోరుకుంటున్నాము. భారత్ పెద్ద సంఖ్యలో యువతను కలిగి ఉన్నందున వీలైనంత ఎక్కువ రుణ వృద్ధి జరగాలని మేము భావిస్తున్నాము''అని సీఐఐ ఇక్కడ నిర్వహించిన ఫైనాన్షియల్ ఇన్‌క్లూజన్ ఫిన్‌టెక్ సదస్సులో పేర్కొన్నారు. సూక్ష్మ, లఘు, చిన్న, మధ్య (ఎంఎస్ఎంఈ) తరహా పరిశ్రమలు (ఎంఎస్ఎంఈ)సహా అన్ని రంగాలకు రుణాన్ని అందించడానికి ప్రభుత్వ రంగ బ్యాంకులు రాబోయే 3–4 నెలల్లో కొత్త ఉత్పత్తులను ప్రారంభించబోతున్నాయని ఆయన చెప్పారు. చిన్న రుణగ్రహీతలకు క్రెడిట్ లభ్యతను మెరుగుపరచడానికి గత కొన్ని సంవత్సరాలుగా ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుందని తెలిపారు. ఇప్పటి వరకూ ఎటువంటి ఫైనాన్షియల్ రికార్డులులేని వారికి రుణం ఇవ్వడానికి కొత్త క్రెడిట్ మోడల్‌ను ప్రకటించడం ఇందులో ఒకటని తెలిపారు.

ఇంకా ఆయన ఏమన్నారంటే..

- బ్యాంకింగ్ రంగం పటిష్టంగా ఉన్నప్పటికీ, పెరుగుతున్న డిజిటల్ మోసాలు ఆర్థిక రంగ స్థిరత్వానికి ప్రమాదం కలిగిస్తున్నాయి. ఈ సవాలును పరిష్కరించడంపై బ్యాంకులు దృష్టి సారించాలి. డిజిటల్ ఆవిష్కరణలు, ఆర్థిక అక్షరాస్యత రెండూ ఈ సమస్యను అరికట్టడంలో సహాయపడతాయి.
- బ్యాంకింగ్ సవరణ బిల్లును ప్రస్తుతం జరుగుతున్న శీతాకాల సమావేశాల్లో ప్రవేశపెట్టే అవకాశం ఉంది. ఈ సవరణలు బ్యాంకింగ్ నిబంధనలలో మార్పులను తీసుకురావడానికి నిర్దేశించడం జరిగింది. డైరెక్టర్లకు వడ్డీ అంశాలను పునర్నిర్వచించడం, బ్యాంక్ డిపాజిట్ల కోసం నామినీల సంఖ్యను పెంచడం వంటివి ఉన్నాయి.
- ఫిన్‌టెక్‌ల విషయానికి వస్తే, స్టార్టప్‌ల పరంగా భారతదేశం మూడవ అతిపెద్ద దేశంగా అవతరించింది. ఈ రంగంలో దాదాపు 13,000 సంస్థలు పనిచేస్తున్నాయి. అందరికీ ఆర్థిక సేవలను అందుబాటులోనికి తీసుకురావడానికి ఫిన్‌టెక్ సంస్థలతో సన్నిహిత సంబంధాలు నెరపడానికి ప్రభుత్వం తగిన ప్రయత్నాలు చేస్తోంది.
- ఫిన్‌టెక్ పరిశ్రమకు సులభతరమైన వ్యవస్థను అందించడానికి ప్రభుత్వం నిరంతరం ప్రయత్నిస్తోంది. పటిష్ట డిజిటల్ మౌలిక సదుపాయాల ఏర్పాటు, పరిశ్రమకు భారీ అవకాశాలను తీసుకురాగల పీఎం సురక్ష బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన వంటి పథకాలు వీటిలో ఉన్నాయి. ఇవి ఈ పరిశ్రమలకు అపార అవకాశాలను అందించే వీలుంది.
- ''ఈస్ ఆఫ్ డూయింగ్ బిజినెస్''విషయంలో పురోగతికి ప్రభుత్వం గత కొన్నేళ్లుగా పలు చర్యలు తీసుకుంటోంది.
- ఆవిష్కరణను ప్రోత్సహించడం– నియంత్రణ వ్యవస్థ సమగ్రతను రక్షించడం మధ్య చక్కటి సమతుల్యత అవసరం.

గ్రామీణ ప్రాంతాల్లో సాంకేతిక పరివర్తన అవశ్యం: నాబార్డ్ చైర్మన్ షాజీ కేవీ

కాగా ఈ కార్యక్రమం సందర్భంగా నాబార్డు చైర్మన్ షాజీ కెవి మాట్లాడుతూ, వ్యవస్థలో సాంకేతిక పరివర్తన కీలకమన్నారు. ముఖ్యంగా గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో దీని ఆవశ్యకత ఎంతో ఉందని ఉద్ఘాటించారు. పెద్ద బ్యాంకులు ఎక్కువ డిజిటలైజేషన్‌తో లాభపడగా, సహకార బ్యాంకులు–ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు డిజిటలైజేషన్ ప్రయోజనాలను అదే స్థాయిలో పొందలేకపోతున్నట్లు షాజీ తెలిపారు. కొత్త టెక్నాలజీలలో పెట్టుబడులు పెట్టేందుకు ఈ బ్యాంకుల వద్ద తగినంత నిధులు లేకపోవడం ఒక సమస్యగా మారిందని అభిప్రాయపడ్డారు. కాబట్టి కొత్త డిజిటల్ విప్లవంలో ఆర్ఆర్‌బీలు, సహకార బ్యాంకులను చేర్చడానికి సంబంధిత వర్గాలన్నీ తగిన కృషి చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. దేశంలో వృద్ధికి సంబంధించి మెరుగైన సమానత్వాన్ని తీసుకురావడానికి ఇటీవల ప్రకటించిన ప్రభుత్వ పథకాలను ఫిన్‌టెక్ కంపెనీలు సద్వినియోగం చేసుకోవచ్చని ఆయన సిఫార్సు చేశారు.

టాటా సియెరా మళ్లీ వస్తోంది



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: వాహన తయారీ దిగ్గజం టాటా మోటార్స్ సియెరా ఎస్‌యూవీ వచ్చే ఏడాది భారత రోడ్లపై పరుగుతీయనుంది. 2025 ద్వితీయార్థంలో ఈ మోడల్ రీ–ఎంట్రీ ఇవ్వనుందని కంపెనీ ప్రకటించింది. వచ్చే ఏడాది పండుగల సీజన్ నాటికి కస్టమర్ల చేతుల్లోకి వచ్చే అవకాశం ఉంది. తొలుత ఎలక్ట్రిక్ వర్షన్‌లో ఇది రంగ ప్రవేశం చేయనుంది. తర్వాత ఇంటర్నల్ కంబషన్ ఇంజన్ (ఐసీఈ) ఆధారిత సియెరా మార్కెట్లోకి రానుంది. అడాప్టివ్ టెక్ ఫార్వార్డ్ లైఫ్‌స్టైల్ (అట్లాస్) ప్లాట్‌ఫామ్‌పై సియెరా ఐసీఈ, అలాగే హారియర్ ఈవీలో ఉపయోగించిన జెన్2 ఈవీ ప్లాట్‌ఫామ్‌పై సియెరా ఈవీ రూపుదిద్దుకోనుందని సమాచారం. అడాస్ ఫీచర్లను జోడిస్తున్నట్టు తెలుస్తోంది. సియెరా కాన్సెప్ట్ వర్షన్‌ను 2020, 2023 ఆటో ఎక్స్‌పో వేదికల్లో టాటా మోటార్స్ ప్రదర్శించింది. అయితే తయారీకి సిద్ధంగా ఉన్న వెర్షన్ ఇంకా వెల్లడి కాలేదు. మరోవైపు హ్యారియర్ ఈవీ 2025 తొలి త్రైమాసికంలో అందుబాటులోకి వస్తోంది.

బ్యాంక్ గ్యారంటీ మినహాయింపుతో భారం తగ్గుతుంది

టెల్కోల సమాఖ్య సీవోఏఐ వెల్లడి



న్యూఢిల్లీ: గత స్పెక్ట్రం కొనుగోళ్లకు సంబంధించి బ్యాంక్ గ్యారంటీల నుంచి మినహాయింపు ఇవ్వాలని కేంద్రం నిర్ణయించడం వల్ల టెల్కోలపై గణనీయంగా ఆర్థిక భారం తగ్గుతుందని సెల్యులార్ ఆపరేటర్స్ అసోసియేషన్ సీవోఏఐ తెలిపింది. దీనితో నెట్‌వర్క్‌ను విస్తరించేందుకు, టెక్నాలజీ అప్‌గ్రేడ్ చేసుకోవడానికి నిధుల లభ్యత మెరుగుపడుతుందని పేర్కొంది. 2022కి ముందు నిర్వహించిన వేలంలో కొనుగోలు చేసిన స్పెక్ట్రంనకు సంబంధించి టెలికం సంస్థలు బ్యాంక్ గ్యారంటీలను సమర్పించాలన్న నిబంధన నుంచి మినహాయింపునిచ్చే ప్రతిపాదనకు కేంద్ర క్యాబినెట్ ఆమోదముద్ర వేసింది. దీనితో ప్రధానంగా వొడాఫోన్ ఐడియాకు భారీగా ఊరట లభించనుంది. వొడాఫోన్ ఐడియా రూ. 24,747 కోట్ల బ్యాంకు గ్యారంటీ సమర్పించాల్సి ఉండగా, దానికి గడువు కూడా ముగిసిపోయింది. అటు భారతి ఎయిర్‌టెల్, రిలయన్స్ జియోకి కూడా ఊరట లభిస్తుంది.

రెపో లావాదేవీలకు మార్క్ టు మార్కెట్



న్యూఢిల్లీ: మ్యూచువల్ ఫండ్స్ తిరిగి కొనుగోలు చేసే రెపో లావాదేవీలకు కొత్త మదింపు కొలమానాలను ప్రవేశపెట్టాలని సెబీ నిర్ణయించింది. అన్ని రకాల మనీ మార్కెట్, డెట్ సాధనాలకు ఒకే విధమైన విలువ మదింపు కొలమానాలు ఉండాలన్నదే సెబీ నూతన నిబంధనల్లోని ఉద్దేశ్యంగా తెలుస్తోంది. ఈ నూతన నిబంధనలు జనవరి 1 నుంచి అమల్లోకి రానున్నట్టు సెబీ ప్రకటించింది. తిరిగి కొనుగోలు చేసే (రెపో) లావాదేవీలు, ట్రిప్స్ సహా 30 రోజుల కాల వ్యవధితో ఉండే వాటికి సైతం మార్క్ టు మార్కెట్ విలువ వర్తిస్తుందని సెబీ తన ఆదేశాల్లో పేర్కొంది. ప్రస్తుతం 30 రోజుల కాల వ్యవధితో కూడిన రెపో లావాదేవీలు, ట్రిపార్టీ రెపో (ట్రెప్స్)కు వాస్తవ వ్యయాలతోపాటు అక్రూయల్ విధానంలో విలువను నిర్ణయిస్తున్నారు. ఓవర్‌నైట్ రెపో మినహా అన్ని రకాల రెపో లావాదేవీలకు, మనీ మార్కెట్, డెట్ సెక్యూరిటీల విలువను వ్యాల్యూషన్ ఏజెన్సీల నుంచి పొందాల్సి ఉంటుంది. స్వల్పకాల నిధుల సమీకరణకు రెపో సాధనం ఉపకరిస్తుంటుంది. తర్వాతి కాలంలో తిరిగి కొనుగోలు చేస్తానన్న హామీతో రెపోలను విక్రయదారు జారీ చేస్తుంటారు.

హెచ్‌సీఎల్ నుంచి డేటా ట్రస్ట్ షీల్డ్



న్యూఢిల్లీ: ఐటీ రంగ సంస్థ హెచ్‌సీఎల్‌టెక్ తాజాగా యూఎస్‌కు చెందిన చిప్ తయారీ దిగ్గజం ఇంటెల్ సహకారంతో డేటా ట్రస్ట్ షీల్డ్ పేరుతో ఎంటర్‌ప్రైస్ డేటా సెక్యూరిటీ సర్వీసులను ప్రారంభించింది. క్లౌడ్ వ్యవస్థలో సున్నిత సమాచార రక్షణను ఇది మెరుగుపరుస్తుందని కంపెనీ తెలిపింది. ఇంటెల్ ట్రస్ట్ డొమైన్ ఎక్స్‌టెన్షన్స్ (ఇంటెల్ టీడీఎక్స్), ఇంటెల్ ట్రస్ట్ అథారిటీ వంటి విశ్వసనీయ సాధనాలను ఉపయోగించడం ద్వారా క్లౌడ్ కార్యకలాపాల సమయంలో సున్నిత సమాచారాన్ని భద్రపరచడానికి డేటా ట్రస్ట్ షీల్డ్ రూపొందించినట్టు వివరించింది. ఈ సొల్యూషన్ గూగుల్ క్లౌడ్‌లో పరీక్షించామని, భవిష్యత్తులో ఇతర భారీ క్లౌడ్ సర్వీస్ ప్రొవైడర్లతో అనుసంధానిస్తామని కంపెనీ తెలిపింది. ఈ సేవలు డేటా భద్రతలో ఒక ప్రధాన ముందడుగు అని, అధిక స్థాయి రక్షణను అందిస్తుందని హెచ్‌సీఎల్‌టెక్ ఈవీపీ ఆనంద్ స్వామి వివరించారు. ఇంటెల్ యొక్క అధునాతన సాంకేతికతను ఉపయోగించడం ద్వారా ఈ సొల్యూషన్ డిజిటల్ ఆస్తులను సురక్షితం చేస్తుంది. క్లౌడ్ వ్యవస్థపై విశ్వాసం పెంచుతుందని అన్నారు.

సుమేధా ఫిస్కల్ సర్వీసెస్‌తో టీ9ఎల్ క్యూబ్ జట్టు



న్యూఢిల్లీ: దేశీయంగా స్టార్టప్ వ్యవస్థను పటిష్టం చేసే దిశగా లిస్టెడ్ కంపెనీ సుమేధా ఫిస్కల్ సర్వీసెస్‌తో చేతులు కలిపినట్లు టీ9ఎల్ క్యూబ్ వెల్లడించింది. క్రికెటర్ వీరేంద్ర సెహ్వాగ్, ఇతర ప్రముఖ లాయర్లు, ప్రైవేట్ ఈక్విటీ పార్ట్‌నర్లు, పరిశ్రమ దిగ్గజాల నుంచి టీ9ఎల్ క్యూబ్ నిధులు సమీకరించిన నేపథ్యంలో ఈ వ్యూహాత్మక భాగస్వామ్యం ప్రాధాన్యం సంతరించుకుంది. అధిక వృద్ధికి అవకాశమున్న వర్ధమాన అంకుర సంస్థలను గుర్తించి, వాటి ఎదుగుదలకు తోడ్పడే సేవలను టీ9ఎల్ అందిస్తుంది. టీ9ఎల్ ఇన్‌క్యుబేట్ చేసిన బడా స్టార్టప్‌లలో స్పాట్‌డ్రాఫ్ట్, డాక్విటీ, అడ్డా52, క్రెడిహెల్త్, నిరోగ్ స్ట్రీట్ మొదలైనవి ఉన్నాయి.

సౌదీలో వేదాంతా పెట్టుబడులు

- రూ. 16,800 కోట్లకు సై
- కాపర్ ప్రాజెక్టులపై దృష్టి



న్యూఢిల్లీ: మైనింగ్ దిగ్గజం వేదాంతా లిమిటెడ్ సౌదీ అరేబియాలో కాపర్ ప్రాజెక్టును చేపట్టనుంది. ఇందుకు 2 బిలియన్ డాలర్లు(సుమారు రూ. 16,800 కోట్లు) ఇన్వెస్ట్ చేయనుంది. ఇందుకు సొంత అనుబంధ సంస్థ వేదాంతా కాపర్ ఇంటర్నేషనల్ ద్వారా సౌదీ పరిశ్రమలు, మినరల్ రిసోర్సెస్, పెట్టుబడుల శాఖతో ఒప్పందాన్ని కుదుర్చుకుంది. 400 కిలో టన్నుల వార్షిక సామర్థ్యం(కేటీపీఏ)తో గ్రీన్‌ఫీల్డ్ కాపర్ స్మెల్టర్, రిఫైనరీ ఏర్పాటుకు తెరతీయనుంది. దీంతోపాటు 300 కిలో టన్నుల కాపర్ రాడ్ ప్రాజెక్ట్‌ను సైతం నెలకొల్పనుంది. సౌదీ విజన్ 2030కు అనుగుణంగా కాపర్ ప్రాజెక్టులపై 2 బిలియన్ డాలర్లు ఇన్వెస్ట్ చేసే లక్ష్యంతో తాజా ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు వేదాంతా ఒక ప్రకటనలో తెలియజేసింది. దీనిలో భాగంగా తొలుత 3 కోట్ల డాలర్ల వ్యయంతో ఏడాదికి 125 కిలో టన్నుల కాపర్ రాడ్ మిల్ ప్రాజెక్టును ప్రారంభించనున్నట్లు పేర్కొంది. ఇందుకు అన్ని అనుమతులు లభించడంతోపాటు భూమిని సైతం పొందినట్లు వెల్లడించింది. ప్రాజెక్టు నిర్మాణ పనులు త్వరలోనే ప్రారంభంకాగలవని తెలియజేసింది.

జార్ఖండ్ 11 తెలంగాణ 0



జాతీయ సబ్ జూనియర్ హాకీ టోర్నీ ప్రారంభం

సాక్షి, హైదరాబాద్: హాకీ ఇండియా ఆధ్వర్యంలో జాతీయ సబ్ జూనియర్ మహిళల హాకీ చాంపియన్‌షిప్ మంగళవారం ప్రారంభమైంది. సికింద్రాబాద్‌లోని దక్షిణ మధ్య రైల్వే స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో డిసెంబర్ 6వ తేదీ వరకు ఈ టోర్నీ జరుగుతుంది. తొలి రోజు ఆతిథ్య తెలంగాణ జట్టుకు నిరాశ ఎదురైంది. జార్ఖండ్ జట్టు 11–0 గోల్స్ తేడాతో తెలంగాణ జట్టును ఓడించి శుభారంభం చేసింది. జార్ఖండ్ తరఫున జమునా కుమారి (14వ, 34వ, 49వ, 49వ, 59వ నిమిషాల్లో) ఐదు గోల్స్... శ్రుతి కుమారి (28వ, 40వ నిమిషాల్లో) రెండు గోల్స్... సుకర్మణి ముండు (19వ నిమిషంలో), అనుప్రియ సోరెంగ్ (56వ నిమిషంలో), హెమ్రోమ్ లియోని (58వ నిమిషంలో), సంగా సుగన్ (10వ నిమిషంలో) ఒక్కో గోల్ సాధించారు. తొలి రోజు జరిగిన ఇతర మ్యాచ్‌ల్లో మహారాష్ట్ర 7–1తో అస్సాంపై, ఒడిశా 9–0తో తమిళనాడుపై, ఉత్తరప్రదేశ్ 11–0తో రాజస్తాన్‌పై, ఢిల్లీ 2–1తో కర్ణాటకపై గెలిచాయి.

మధ్యప్రదేశ్ 33 గోల్స్...

గ్రూప్ 'హెచ్'లో భాగంగా పుదుచ్చేరితో జరిగిన మ్యాచ్‌లో మధ్యప్రదేశ్ జట్టు గోల్స్ వర్షం కురిపించింది. మధ్యప్రదేశ్ జట్టు ఏకంగా 33–0 గోల్స్ తేడాతో పుదుచ్చేరి జట్టును ఓడించింది. మధ్యప్రదేశ్ తరఫున పుఖ్రామ్‌బమ్ సల్లూ 8 గోల్స్... నాషీన్ నాజ్ 6 గోల్స్... కేశర్ భబర్ 5 గోల్స్ చేశారు. కనక్ పల్, సుజాత, కృష్ణ శర్మ 3 గోల్స్ చొప్పున సాధించారు. రోనక్ పర్మార్ 2 గోల్స్... రూబీ రాథోడ్.. గుంజన్ కౌర్... స్నేహ దావె ఒక్కో గోల్ చేశారు.

బరిలో 28 జట్లు...

మొత్తం 28 జట్లను ఎనిమిది గ్రూప్‌లుగా విభజించారు. గ్రూప్ 'ఎ'లో దాద్రా అండ్ నాగర్ హవేలి అండ్ డమన్ డియు, హరియాణా, మణిపూర్ జట్లు... గ్రూప్ 'బి'లో ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, తెలంగాణ జట్లు... గ్రూప్ 'సి'లో ఒడిశా, హిమాచల్‌ప్రదేశ్, తమిళనాడు జట్లు... గ్రూప్ 'డి'లో రాజస్తాన్, ఉత్తరాఖండ్, ఉత్తరప్రదేశ్ జట్లున్నాయి. గ్రూప్ 'ఇ'లో అరుణాచల్‌ప్రదేశ్, చండీగఢ్, మిజోరం, కేరళ జట్లు... గ్రూప్ 'ఎఫ్'లో ఢిల్లీ, బిహార్, జమ్మూ కశ్మీర్, కర్ణాటక జట్లు... గ్రూప్ 'జి'లో అస్సాం, గుజరాత్, మహారాష్ట్ర, పంజాబ్ జట్లు... గ్రూప్ 'హెచ్'లో ఆంధ్రప్రదేశ్, బెంగాల్, మధ్యప్రదేశ్, పుదుచ్చేరి జట్లున్నాయి. లీగ్ మ్యాచ్‌లు ముగిశాక ఎనిమిది గ్రూపుల్లో తొలి స్థానంలో నిలిచిన ఎనిమిది జట్లు క్వార్టర్ ఫైనల్‌కు అర్హత సాధిస్తాయి. డిసెంబర్ 3న క్వార్టర్ ఫైనల్స్, 5న సెమీఫైనల్స్, 6న ఫైనల్ జరుగుతాయి.

'క్రో–థోర్ప్' ట్రోఫీ కోసం న్యూజిలాండ్, ఇంగ్లండ్ పోరు



లండన్: భారత్, ఆస్ట్రేలియాల మధ్య జరుగుతున్న ప్రతిష్టాత్మక 'బోర్డర్–గావస్కర్ ట్రోఫీ'లాగే ఇకపై న్యూజిలాండ్, ఇంగ్లండ్‌ల జట్ల మధ్య 'క్రో–థోర్ప్ ట్రోఫీ' నిర్వహించనున్నారు. న్యూజిలాండ్ దివంగత దిగ్గజం మార్టిన్ క్రో, ఇంగ్లండ్ దివంగత లెజెండ్ గ్రాహం థోర్ప్‌ల పేరిట ఈ ఏడాది నుంచి ద్వైపాక్షిక సిరీస్ అంకురార్పణ జరగనుంది. విజేతకు బహూకరించే ట్రోఫీకి మరో ప్రత్యేకత కూడా ఉంది. ఆ ఇద్దరు దిగ్గజ క్రికెటర్ల బ్యాట్‌లను ఉపయోగించి 'క్రో–థోర్ప్ ట్రోఫీ'ని రూపొందించారు. న్యూజిలాండ్‌కు చెందిన ప్రముఖ డిజైనర్ డేవిడ్ ఎన్‌గవాటి ఈ కలప (బ్యాట్) ట్రోఫీని తయారు చేశారు. ప్రపంచ శ్రేణి కళాకృతులను, వినియోగదారుల అభిరుచులకు తగ్గ ఆకృతులను (కస్టమ్ డిజైన్) తయారు చేయడంలో 'మహా క్రియేటివ్' సంస్థకు మంచి పేరుంది. డేవిడ్‌కు చెందిన ఈ సంస్థే గతంలో కివీస్, సఫారీల మధ్య జరిగిన టోర్నీ కోసం 'తంగివాయ్ షీల్డ్'ను రూపొందించింది. దిగ్గజ క్రికెటర్ల విషయానికొస్తే అసలైన క్రికెట్ ఫార్మాట్ (టెస్టు)లో అటు మార్టిన్ క్రో... ఇటు గ్రాహం థోర్ప్ అంతర్జాతీయ క్రికెట్‌లో తమదైన ముద్ర వేశారు. తన కెరీర్‌లో 77 టెస్టులాడిన క్రో 45.36 సగటుతో 5444 పరుగులు చేశాడు. ఇందులో 17 సెంచరీలు, 18 అర్ధసెంచరీలున్నాయి. 143 వన్డేల్లో 38.55 సగటుతో 4704 పరుగులు సాధించాడు. 4 శతకాలు, 34 అర్ధశతకాలు బాదాడు. థోర్ప్ సరిగ్గా 100 టెస్టులాడాడు. 44.66 సగటుతో 6744 పరుగులు చేశాడు. 16 సెంచరీలు, 39 ఫిఫ్టీలున్నాయి. వన్డే కెరీర్‌లో 82 మ్యాచ్‌ల్లో 37.18 సగటుతో 2380 పరుగులు చేశాడు. 21 అర్ధసెంచరీలున్నాయి. సాధారణంగా క్రికెట్ ట్రోఫీలన్నీ లోహం (మెటల్)తోనే తయారవుతాయి. కానీ 'కో–థోర్ప్ ట్రోఫీ' మాత్రం భిన్నమైంది. ఇరు దిగ్గజ క్రికెటర్ల కుటుంబాలు బ్యాట్లు ఇవ్వడంతో డేవిడ్ తన నైపుణ్యంతో కలప 'టోఫీ'గా మలిచాడు. దీన్ని మార్టిన్ సోదరి డెబ్ క్రో, మాజీ ఇంగ్లండ్ సారథి మైకేల్ అథర్టన్ కలిసి గురువారం క్రైస్ట్‌చర్చ్‌లో మొదలయ్యే తొలి టెస్టు సందర్భంగా జరిగే కార్యక్రమంలో ఆవిష్కరిస్తారు.

సిక్కి–సుమీత్ జోడీ శుభారంభం



లక్నో: సయ్యద్ మోడీ ఇంటర్నేషనల్ వరల్డ్ టూర్ సూపర్–300 బ్యాడ్మింటన్ టోర్నీ మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో భారత జోడీలు శుభారంభం చేశాయి. తెలంగాణకు చెందిన సిక్కి రెడ్డి–సుమీత్ రెడ్డి ద్వయం... గద్దె రుత్విక శివాని–రోహన్ కపూర్ జోడీ తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో గెలిచి ప్రిక్వార్టర్ ఫైనల్‌కు అర్హత పొందాయి. తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో టాప్ సీడ్ సిక్కి–సుమీత్ 21–10, 21–18తో సంజీత్ సుబ్రమణియన్–గౌరీ కృష్ణ (భారత్)లపై... రుత్విక–రోహన్ 21–14, 21–12తో నితిన్–అనఘా (భారత్)లపై విజయం సాధించారు. హైదరాబాద్‌కే చెందిన కె.మనీషా–షేక్ గౌస్ జోడీ కూడా ప్రిక్వార్టర్ ఫైనల్‌కు చేరింది. తొలి రౌండ్‌లో మనీషా–షేక్ గౌస్ 21–16, 12–21, 21–19తో నితిన్ కుమార్–రిధి కౌర్ తూర్ (భారత్)లను ఓడించారు. మహిళల సింగిల్స్ విభాగంలో భారత ప్లేయర్లు నవ్య కందేరి, తన్వీ శర్మ, మాన్సి సింగ్ మెయిన్ 'డ్రా'కు అర్హత పొందారు. క్వాలిఫయింగ్ మ్యాచ్‌ల్లో నవ్య 21–8, 21–8తో సాక్షి గహ్లావత్‌పై, తన్వీ శర్మ 21–12, 21–10తో ఆశి రావత్‌పై, మాన్సి సింగ్ 21–11, 14–21, 21–12తో బోనం ప్రశంసపై గెలిచారు. పురుషుల సింగిల్స్ విభాగంలో భారత క్రీడాకారులు రిత్విక్, సిద్ధార్థ్ ప్రతాప్ సింగ్, సనీత్ దయానంద్ మెయిన్ 'డ్రా'కు చేరుకున్నారు. మరోవైపు పురుషుల డబుల్స్ విభాగం నుంచి టాప్ సీడ్ సాత్విక్ సాయిరాజ్–చిరాగ్ శెట్టి (భారత్) జోడీ చివరి నిమిషంలో వైదొలిగింది.

విండీస్‌దే విజయం

201 పరుగులతో ఓడిన బంగ్లాదేశ్

నార్త్‌సౌండ్: బంగ్లాదేశ్‌తో జరిగిన తొలి టెస్టులో ఆతిథ్య వెస్టిండీస్ జట్టు 201 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించింది. రెండు టెస్టుల ఈ సిరీస్‌లో కరీబియన్ జట్టు 1–0తో ఆధిక్యంలో నిలిచింది. ఆఖరి రోజు మంగళవారం లాంఛనమైన 3 వికెట్లను పడగొట్టేందుకు విండీస్ బౌలర్లకు ఎంతోసేపు పట్టలేదు. తొలి సెషన్‌లో మొదలైన ఏడు ఓవర్లలోపే మిగిలిన 3 వికెట్లను తీయడంతో వెస్టిండీస్ భారీ విజయాన్ని నమోదు చేసింది. 334 పరుగుల లక్ష్యం ఛేదించే క్రమంలో ఓవర్‌నైట్ స్కోరు 109/7తో ఐదో రోజు రెండో ఇన్నింగ్స్‌ను కొనసాగించిన బంగ్లాదేశ్ 38 ఓవర్లలో 132 పరుగులకే ఆలౌటైంది. క్రితం రోజు స్కోరుకు 23 పరుగులు మాత్రమే జోడించి మిగతా మూడు వికెట్లను కోల్పోయింది. ఓవర్‌నైట్ బ్యాటర్లలో హసన్ (0)ను అల్జారీ జోసెఫ్ ఖాతా తెరువనీయలేదు. కాసేపటికి జాకిర్ అలీ (31; 5 ఫోర్లు)ను అతనే అవుట్ చేశాడు. ఆఖరి వరుస బ్యాటర్ షోరిఫుల్ ఇస్లామ్ రిటైర్డ్ నాటౌట్‌గా వెనుదిరగడంతో 132 పరుగుల వద్ద బంగ్లాదేశ్ రెండో ఇన్నింగ్స్‌కు తెరపడింది. తొలి ఇన్నింగ్స్‌ల్లో విండీస్ 450/9 వద్ద డిక్లేర్ చేస్తే, బంగ్లాదేశ్ 269/9 స్కోరు వద్ద డిక్లేర్ చేసింది. 181 పరుగుల ఆధిక్యం పొందిన విండీస్ రెండో ఇన్నింగ్స్‌లో 152 పరుగులకు ఆలౌటైంది. దీంతో ప్రత్యర్థి ముందు 334 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. ఇరు జట్ల మధ్య కింగ్‌స్టన్ వేదికపై ఈ నెల 30 నుంచి చివరిదైన రెండో టెస్టు జరగనుంది.

తెలంగాణ స్విమ్మర్ల పతకాల వేట



సాక్షి, హైదరాబాద్: జాతీయ స్కూల్‌గేమ్స్ సమాఖ్య (ఎస్‌జీఎఫ్‌ఐ) స్విమ్మింగ్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ స్విమ్మర్లు అదరగొట్టారు. రాజ్‌కోట్‌లో అండర్–14, అండర్–17, అండర్–19 వయో పరిమితి విభాగాలలో జరుగుతున్న ఈ టోర్నీలో ఇప్పటి వరకు తెలంగాణ స్విమ్మర్లు ఏడు పతకాలు సాధించారు. అండర్–17 బాలుర విభాగంలో మైలారి సుహాస్ ప్రీతమ్ రెండు స్వర్ణ పతకాలు గెలిచాడు. 200 మీటర్ల వ్యక్తిగత మెడ్లే ఫైనల్‌ను సుహాస్ ప్రీతమ్ 2ని:13.73 సెకన్లలో పూర్తి చేసి అగ్రస్థానాన్ని దక్కించుకున్నాడు. 100 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్ ఫైనల్‌ను సుహాస్ ప్రీతమ్ 59.74 సెకన్లలో పూర్తి చేసి టాపర్‌గా నిలిచాడు. అండర్–17 బాలుర 200 మీటర్ల మెడ్లే విభాగంలో ధూళిపుడి వర్షిత్ రజతం నెగ్గాడు. వర్షిత్ 2ని:14.04 సెకన్లలో గమ్యానికి చేరి రెండో స్థానాన్ని పొందాడు. అండర్–17 బాలికల బ్యాక్‌స్ట్రోక్ ఈవెంట్‌లో నిత్య సాగిశ్రీ (1ని:09.24 సెకన్లు) రజతం... 50 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్ ఈవెంట్‌లో (32.40 సెకన్లు) కాంస్యం సాధించింది. అండర్–14 బాలికల బ్యాక్‌స్ట్రోక్ ఈవెంట్‌లో కర్రా శివాని (1ని:11.38 సెకన్లు) రజత పతకాన్ని దక్కించుకుంది. అండర్–19 బాలుర బ్యాక్‌స్ట్రోక్ ఈవెంట్‌లో సైకత్ ఛటర్జీ (28.92 సెకన్లు) కాంస్య పతకాన్ని సొంతం చేసుకున్నాడు. తెలంగాణ స్విమ్మింగ్ జట్టుకు జాన్ సిద్ధిఖీ కోచ్‌గా ఉన్నారు.

రెజ్లర్ బజరంగ్‌పై నాలుగేళ్ల నిషేధం



న్యూఢిల్లీ: భారత స్టార్ రెజ్లర్ బజరంగ్ పూనియాపై నాలుగేళ్ల నిషేధం విధించారు. అతను డోపింగ్‌లో పట్టుబడలేదు. కానీ... ఈ ఏడాది మార్చిలో జాతీయ జట్టు సెలక్షన్ ట్రయల్స్‌లో నమూనాలు ఇచ్చేందుకు నిరాకరించడంతో ఏప్రిల్ 23న జాతీయ డోపింగ్ నిరోధక సంస్థ (నాడా) తాత్కాలిక సస్పెన్షన్ వేటు వేసింది. ప్రపంచ రెజ్లింగ్ (యూడబ్ల్యూడబ్ల్యూ) కూడా అతన్ని సస్పెండ్ చేసింది. దీనిపై బజరంగ్ అప్పీలుకు వెళ్లగా మే 31న ఊరటనిస్తూ సస్పెన్షన్‌ను ఎత్తివేశారు. తదనంతరం 'నాడా' అతనికి నోటీసులిచ్చింది. ఈ అంశంపై విచారణ జరిపిన నాడా ప్యానెల్ నమూనాలు ఇచ్చేందుకు నిరాకరించడం, అందుబాటులో లేకపోవడం శిక్షార్హమేనని తేల్చింది. దీంతో 4 ఏళ్ల శిక్షను ఖరారు చేసింది.

29 తర్వాతే చాంపియన్స్ ట్రోఫీ నిర్వహణపై నిర్ణయం: ఐసీసీ



దుబాయ్: చాంపియన్స్ ట్రోఫీ–2025 నిర్వహణ విషయంలో అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) ఈ వారాంతంలో తుది నిర్ణయానికి వచ్చే అవకాశం ఉంది. ఆతిథ్య జట్టు పాకిస్తాన్ ఎలాగైనా టోర్నీ మొత్తాన్ని తమ దేశంలోనే నిర్వహించాలని పట్టుబడుతోంది. అయితే పాక్‌తో సరిహద్దు వైరం కారణంగా భారత జట్టు అక్కడికి వెళ్లేది లేదని ఇప్పటికే స్పష్టం చేసింది. టీమిండియా పాక్ గడ్డపై ఆడేందుకు భారత ప్రభుత్వం కూడా అనుమతి ఇవ్వలేదు. భారత్ ఆడే మ్యాచ్‌లను మరో తటస్థ వేదికపై నిర్వహించేలా 'హైబ్రీడ్ మోడల్' ప్రతిపాదన ఉంది. దీనికి పాక్ ససేమిరా అంటోంది. ఈ నేపథ్యంలో ఐసీసీ సమావేశం కానుంది. నవంబర్ 29న ఈ బోర్డు మీటింగ్ జరుగుతుంది. ఐసీసీ సభ్యదేశాల మధ్య ఏకాభిప్రాయం కోసం దీనిపై చర్చ జరగనుంది. అయితే ఫలితం దక్కకపోతే చివరకు ఓటింగ్ ద్వారా చాంపియన్స్ ట్రోఫీ నిర్వహణను తేల్చాల్సి రావచ్చు. ఐసీసీ బోర్డు మీటింగ్‌లో 12 మంది శాశ్వత సభ్యదేశాల, 3 అసోసియేట్ దేశాల ప్రతినిధులు పాల్గొంటారు. వీరితో పాటు ఐసీసీ స్వతంత్ర డైరెక్టర్, చైర్మన్, సీఈఓ కూడా కూడా హాజరవుతారు. డిసెంబర్ 1న జై షా ఐసీసీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించక ముందు ప్రస్తుత చైర్మన్ గ్రెగ్ బార్క్‌లే నేతృత్వంలో జరగనున్న చివరి సమావేశం ఇదే కానుంది. సాధారణంగా ఐసీసీ టోర్నీ కోసం వేదికలు, తేదీలు, టికెట్ల వివరాలతో పూర్తి షెడ్యూల్‌ను కనీసం టోర్నీకి 100 రోజుల ముందు ప్రకటిస్తారు. తాజా అనిశ్చితి నేపథ్యంలో ఐసీసీ దీనిని వెల్లడించలేదు.

హాకీ గ్రేట్ అశోక్ కుమార్‌కు యాంజియోప్లాస్టీ

న్యూఢిల్లీ: భారత హాకీ దిగ్గజం, దివంగత మేజర్ ధ్యాన్‌చంద్ కుమారుడు, మాజీ ప్లేయర్ అశోక్ కుమార్‌కు యాంజియోప్లాస్టీ సర్జరీ జరిగింది. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని కుటుంబసభ్యులు తెలిపారు. ఆదివారం 74 ఏళ్ల అశోక్‌కు గుండెపోటు వచ్చింది. ఛాతీలో విపరీతమైన నొప్పి రావడంతో స్థానిక ప్రైవేట్ ఆస్పత్రిలో చేరిన ఆయన్ని పరీక్షించిన హృద్రోగ నిపుణులు గుండెకు రక్త ప్రసరణ చేసే నాళాలు అక్కడక్కడ మూసుకుపోయాయని తేల్చారు. దీంతో వెంటనే స్టంట్లు వేయాల్సిన అవసరం రావడంతో మంగళవారం డాక్టర్లు విజయవంతంగా సర్జరీ పూర్తి చేసినట్లు కుటుంబవర్గాలు తెలిపాయి. 1975లో హాకీ ప్రపంచకప్ గెలిచిన అజిత్‌పాల్ సింగ్ సారథ్యంలో భారత జట్టులో అశోక్ సభ్యుడు. 1972లో జరిగిన మ్యూనిచ్ ఒలింపిక్స్‌లో కాంస్య పతక విజేత జట్టులోనూ అశోక్ ఉన్నాడు.

చెస్ చాంపియన్స్ స్వర, సాత్విక్



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర అండర్–9 చెస్ చాంపియన్‌షిప్‌లో బాలికల విభాగంలో స్వర దీపక్ ఫాస్గే, బాలుర విభాగంలో తిమ్మరాజు వెంకట సాత్విక్ విజేతలుగా నిలిచారు. ఎల్బీ స్టేడియంలో జరిగిన ఈ టోర్నీలో బాలికల విభాగంలో 58 మంది, బాలుర విభాగంలో 129 మంది ప్లేయర్లు పోటీపడ్డారు. బాలికల విభాగంలో తొలి ఐదు స్థానాల్లో నిలిచిన స్వర దీపక్ ఫాస్గే, పువ్వాల సాయి అంశిత, సయ్యద్ రాధా (రంగారెడ్డి), అనయ శర్మ (హైదరాబాద్), దువ్వల మధుశ్రీ (రంగారెడ్డి)... బాలుర విభాగంలో తొలి రెండు స్థానాల్లో నిలిచిన వెంకట సాత్విక్ (కొత్తగూడెం), అన్విత్ శ్రీవాస్తవ (రంగారెడ్డి) జాతీయ అండర్–9 చాంపియన్‌షిప్‌లో తెలంగాణకు ప్రాతినిధ్యం వహిస్తారని తెలంగాణ రాష్ట్ర చెస్ సంఘం అధ్యక్షుడు కేఎస్ ప్రసాద్ తెలిపారు.

యోధాస్‌పై తలైవాస్ పైచేయి



నోయిడా: ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్)లో తమిళ్ తలైవాస్ వరుస పరాజయాలకు బ్రేక్ వేస్తూ ఈ సీజన్‌లో ఐదో విజయాన్ని నమోదు చేసింది. మంగళవారం జరిగిన పోరులో తలైవాస్ 40–26 స్కోరుతో యూపీ యోధాస్‌పై ఘనవిజయం సాధించింది. డిఫెండర్ మొయిన్ షఫాగి (8 పాయింట్లు) అదరగొట్టగా, రెయిడర్లు నరేందర్ ఖండోలా (6), మసన ముత్తు (6) రాణించారు. డిఫెండర్లు రోనక్, ఆశిష్, నితీశ్, అమీర్ హుస్సేన్ తలా 2 పాయింట్లు చేశారు. యూపీ తరఫున గగన్ గౌడ 8, అశు సింగ్ 5, భవానీ రాజ్‌పుత్ 3 పాయింట్లు సాధించారు. నిజానికి తొలి అర్ధభాగంలో చకచకా పాయింట్లు సాధించిన యోధాస్ రెండో అర్ధభాగంలో తేలిపోయింది. 17–12తో పైచేయి సాధించిన యూపీ ద్వితీయార్ధంలో మరో 9 పాయింట్లే చేసి ఏకంగా 28 పాయింట్లను సమర్పించుకుంది. తొలి అర్ధభాగంలో తలైవాస్ ఒకసారి ఆలౌట్ కాగా, రెండో అర్ధభాగంలో తలైవాస్ ఆటగాళ్ల దూకుడుకు యూపీ యోధాస్ ఏకంగా మూడు సార్లు ఆలౌట్ కావడం విశేషం. మరో మ్యాచ్‌లో దబంగ్ ఢిల్లీ, పట్నా పైరేట్స్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్ 39–39తో 'టై' అయ్యింది. పట్నా రెయిడర్ దేవాంక్ (15) క్రమం తప్పకుండా పాయింట్లు తెచ్చిపెట్టగా, డిఫెండర్ దీపక్ (7) ఆకట్టుకున్నాడు. దబంగ్ జట్టులో రెయిడర్ అశు మలిక్ (11), ఆల్‌రౌండర్ ఆశిష్ (7), రెయిడర్ నవీన్ కుమార్ (6) రాణించారు. నేడు జరిగే పోటీల్లో హరియాణా స్టీలర్స్‌తో పుణేరి పల్టన్... బెంగాల్ వారియర్స్‌తో గుజరాత్ జెయింట్స్ తలపడనున్నాయి.

అదరగొట్టిన అయూబ్

62 బంతుల్లో 17 ఫోర్లు, 5 సిక్స్‌లతో 113 నాటౌట్

రెండో వన్డేలో జింబాబ్వేపై 10 వికెట్లతో పాకిస్తాన్ విజయం



బులవాయో: తొలి వన్డేలో ఎదురైన ఓటమి నుంచి పాకిస్తాన్ జట్టు వెంటనే తేరుకుంది. జింబాబ్వేతో మంగళవారం జరిగిన రెండో వన్డేలో పాకిస్తాన్ ఏకంగా 10 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. మొదట బ్యాటింగ్‌కు దిగిన జింబాబ్వే 32.3 ఓవర్లలో 145 పరుగులకే ఆలౌటైంది. తొలి వన్డే ఆడుతున్న లెగ్ స్పిన్నర్ అబ్రార్ అహ్మద్ 33 పరుగులిచ్చి 4 వికెట్లు పడగొట్టి జింబాబ్వేను దెబ్బ తీశాడు. సల్మాన్ ఆఘా 26 పరుగులిచ్చి 3 వికెట్లు తీయగా...సయీమ్ అయూబ్, ఫైసల్ అక్రమ్‌లకు ఒక్కో వికెట్ దక్కింది. జింబాబ్వే ఇన్నింగ్స్‌లో సీన్ విలియమ్స్ (31; 2 ఫోర్లు) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. అనంతరం పాకిస్తాన్ జట్టు 18.2 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 148 పరుగులు సాధించి గెలుపొందింది. ఓపెనర్ సయీమ్ అయూబ్ 62 బంతుల్లో 17 ఫోర్లు, 5 సిక్స్‌లతో చెలరేగి 113 పరుగులతో అజేయ శతకం సాధించాడు. మరో ఓపెనర్ అబ్దుల్లా షఫీక్ (48 బంతుల్లో 32 నాటౌట్; 4 ఫోర్లు) నాటౌట్‌గా ఉన్నాడు. సయీమ్ అయూబ్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు లభించింది. పాకిస్తాన్ గెలుపుతో మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో రెండు జట్లు 1–1తో సమంగా ఉన్నాయి. సిరీస్ విజేతను నిర్ణయించే మూడో వన్డే గురువారం జరుగుతుంది.

5 ఇప్పటి వరకు 975 వన్డే మ్యాచ్‌లు ఆడిన పాకిస్తాన్ జట్టు 10 వికెట్ల తేడాతో ప్రత్యర్థి జట్టుపై గెలుపొందడం ఇది ఐదోసారి మాత్రమే. గతంలో న్యూజిలాండ్‌పై (1986లో), బంగ్లాదేశ్‌పై (2008లో), వెస్టిండీస్‌పై (2011లో), జింబాబ్వేపై (2011లో) పాక్ ఈ ఘనత సాధించింది.

దివంగత క్రికెటర్ హ్యూస్ గౌరవార్థం...

అడిలైడ్ టెస్టులో సీఏ సంస్మరణ కార్యక్రమం



పెర్త్: ఆట ఆడే మైదానంలో ఆయువు కోల్పోయిన ఆస్ట్రేలియన్ క్రికెటర్ ఫిలిప్ హ్యూస్‌కు దశమ వర్ధంతి సందర్భంగా క్రికెట్ ఆస్ట్రేలియా (సీఏ) ఘనమైన నివాళులు అర్పించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. వచ్చే నెల 6 నుంచి 10 వరకు అడిలైడ్‌లో జరిగే రెండో టెస్టు ప్రారంభానికి ముందు సంస్మరణ కార్యక్రమం నిర్వహించనుంది. ఇందులో భాగంగా పదేళ్ల క్రితం మృతి చెందిన తమ క్రికెటర్‌ను ఆ జట్టు తరఫున 13వ ప్లేయర్‌గా ఆ టెస్టు జాబితాలో చేర్చనుంది. అలాగే 63 సెకన్ల పాటు (చివరగా అతను చేసిన స్కోరు) ప్రేక్షకుల కరతాళ ధ్వనులతో అడిలైడ్ ఓవల్ మైదానం మార్మోగనుంది. దీంతోపాటు తమ దేశవాళీ క్రికెట్ టోర్నీ షెఫీల్డ్ షీల్డ్ ట్రోఫీలో మూడు మ్యాచ్‌ల పాటు ఆటగాళ్లంతా నల్ల రిబ్బన్‌లతో (ఆర్మ్‌బ్యాండ్) బరిలోకి దిగుతారు. ఈ మూడు మ్యాచ్‌లు జరిగే వేదికల వద్ద ఆసీస్ జాతీయ పతాకాన్ని అవనతం చేయనున్నట్లు సీఏ తెలిపింది. 2014లో దేశవాళీ టోర్నీ ఆడుతున్న 25 ఏళ్ల హ్యూస్... పేసర్ సీన్ అబాట్ బౌన్సర్‌కు బలయ్యాడు. బుల్లెట్‌లా దూసుకొచ్చిన బౌన్సర్ అంతే వేగంతో తల వెనుకవైపు బలంగా తాకింది. దీంతో ఉన్నపళంగా హ్యూస్ పిచ్‌పైనే నేలకొరిగాడు. వెంటనే ఆస్పత్రికి తరలించి చికిత్స అందజేసినా... ఫలితం లేకపోయింది. కోమాలోకి వెళ్లిన బ్యాటర్ తన పుట్టినరోజు (30)కు మూడు రోజుల ముందు నవంబర్ 27న తుదిశ్వాస విడిచాడు. ఈ దివంగత లెఫ్ట్ హ్యాండ్ బ్యాటర్ ఆసీస్ తరఫున అంతర్జాతీయ కెరీర్‌లో 26 టెస్టులు, 25 వన్డేలు, ఒక టి20 మ్యాచ్ ఆడాడు.

చైనా, మెక్సికో, కెనడా దిగుమతులపై భారీ పన్నులు

25 శాతం సుంకాలు విధించాలని ట్రంప్ నిర్ణయం

- చైనాపై 10% అదనపు పన్ను
- ద్రవ్యోల్బణాన్ని పెంచుతాయని హెచ్చరిస్తున్న ఆర్థికవేత్తలు

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడిగా గెలుపొందిన డొనాల్డ్ ట్రంప్ అమెరికాకు మూడు అతి పెద్ద వాణిజ్య భాగస్వాములైన మెక్సికో, చైనా, కెనడాలకు షాకిచ్చారు. మెక్సికో, కెనడా నుంచి వచ్చే దిగుమతి అయ్యే వస్తువులపై 25 శాతం సుంకం విధించాలని భావిస్తున్నట్లు ట్రంప్ సోమవారం వెల్లడించారు. చట్టవిరుద్ధమైన డ్రగ్స్ వ్యాపారం, వలసలను అరికట్టేందుకే ఈ నిర్ణయం తీసుకుంటున్నట్లు సొంత సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ట్రూత్ సోషల్'ట్రంప్ వెల్లడించారు. ఈ మేరకు అందులో ట్రంప్ పలు పోస్టులు పెట్టారు. ''జనవరి 20న నేను అధ్యక్షుడిగా ప్రమాణం చేశాక తీసుకోబోయే కార్యనిర్వాహక చర్యల్లో ఇది కూడా ఒకటి. సరిహద్దులతో పాటు మెక్సికో, కెనడాల నుంచి దిగుమతి చేసుకునే అన్ని ఉత్పత్తులపై 25% సుంకం విధిస్తా. ఇందుకు అవసరమైన అన్ని దస్త్రాలపై అదే రోజున సంతకం చేస్తా''అని పేర్కొన్నారు. చైనా వస్తువులపై దిగుమతి పన్నును అదనంగా 10 శాతం పెంచుతానని చెప్పారు. అమెరికాలో అక్రమ రవాణాపై చర్యల్లో భాగంగా చైనా వస్తువులపై అదనపు సుంకాలు తప్పవన్నారు. 2023లో మెక్సికో ఎగుమతి చేసిన వస్తువుల్లో 83 శాతం ఎగుమతులు ఒక్క అమెరికాకే వెళ్ళాయి. కెనడా ఎగుమతుల్లో 75 శాతం ఎగుమతులు ఒక్క అమెరికాకే వెళ్తున్నాయి. వాణిజ్యం కోసం మూడు దేశాలు ఉమ్మడిగా కుదుర్చుకున్న 'అమెరికా-మెక్సికో-కెనడా ఒప్పందం (యూఎస్ఎంసీ)'ఒడంబడికను ట్రంప్ కొత్త పన్నుల విధానం ఉల్లంఘించి అవకాశముంది. మూడు దేశాల మధ్య స్వేచ్ఛావాణిజ్య ఒప్పందానికి బాటలు వేస్తూ స్వయంగా ట్రంప్ 2020లో తీసుకున్న నిర్ణయం ఇది. సొంత విధానానికి తూట్లు పొడుస్తూ ట్రంప్ నూతన అమెరికా వాణిజ్య విధానాలను అవలంభించబోతున్నారు.

ఆరేళ్ల సమీక్షలో భాగంగా..

ఎన్నికల వేళ ట్రంప్ ఆర్థిక ఎజెండాలో దిగుమతి పన్నుల అంశం కీలకంగా మారింది. దిగుమతి సుంకాలు విధిస్తానని తన ఎన్నికల ప్రచారంలో పదే పదే ట్రంప్‌చెప్పారు. తాను అధికారంలోకి రాగానే భారీగా సుంకాలు పెంచుతానని చెప్పారు. చైనా దిగుమతులపై 60శాతం కంటే ఎక్కువ సుంకాలు విధిస్తామని ట్రంప్ గతంలో వాగ్దానం చేశారు. ఇది తన మొదటి పదవీకాలంలో విధించిన సుంకాల కంటే చాలా ఎక్కువ. అన్ని దేశాల నుంచి దిగుమతులపై 10 శాతం నుంచి 20 శాతం సుంకాలు విధిస్తామని ట్రంప్ ప్రకటించారు. అమెరికా-మెక్సికో సరిహద్దు మీదుగా వచ్చే ప్రతి కారుపై 200 శాతం వరకు సుంకాలు విధిస్తామని చెప్పారు. బాధ్యతలు స్వీకరించిన తర్వాత యూఎస్ఎంసీ ఒడంబడిక ఆరేళ్ల సమీక్ష నిబంధనను అధికారికంగా అమలు చేయాలనే ఉద్దేశాన్ని వ్యక్తం చేశారు. ఇది 2026 జూలైలో ఉండొచ్చని అంచనా వేస్తున్నారు.

వాణిజ్య యుద్ధాల్లో ఎవరూ గెలవరు: చైనా

చైనా వస్తువులపై అదనపు పన్ను విధిస్తానని ట్రంప్ చేసిన ప్రకటనపై వాషింగ్టన్‌లోని చైనా రాయబార కార్యాలయ ప్రతినిధి స్పందించారు. 'వాణిజ్య యుద్ధంలో ఎవరూ గెలవలేరు'అని లియు పెంగ్యు అన్నారు. చైనా-అమెరికాల ఆర్థిక, వాణిజ్య సహకారం పరస్పర ప్రయోజనకరంగా ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. 2023 అమెరికా-చైనా సమావేశం తర్వాత చైనా తీసుకున్న చర్యలను కూడా ఆయన ఉదహరించారు. కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో కార్యాలయం, కెనడా విదేశాంగ మంత్రిత్వ శాఖ వెంటనే స్పందించలేదు. గతంలో ఒకానొక దశలో కెనడా, అమెరికాలు పరస్పరం తమ ఉత్పత్తులపై ఆంక్షలు విధించుకోవడం చివరికి యూఎస్ఎంసీఏకు దారితీసింది.



ద్రవ్యోల్బణం పెరగొచ్చు: ఆర్థికవేత్తలు

ట్రంప్ అధిక పన్నులు వృద్ధిని దెబ్బ తీస్తాయని, ద్రవ్యోల్బణాన్ని పెంచుతాయని ఆర్థికవేత్తలు హెచ్చరిస్తున్నారు. 1930ల కాలం నాటి స్థాయికి నెట్టివేస్తాయని ఆర్థికవేత్తలంటున్నారు. పన్నులకు లోబడి వస్తువులను దిగుమతి చేసేవారు.. ఆ భారాన్ని వినియోగదారులపై మోపుతారని హెచ్చరిస్తున్నారు. ట్రంప్ బృందం మాత్రం దీనిని కొట్టిపారేస్తోంది. అమెరికా ఆర్థిక వ్యవస్థతో పాటు భాగస్వామ్యులకు ఇవి ఎంతగానో ఉపయోగపడతాయని వాదిస్తోంది. ఉత్పాదక రంగంలో ఉద్యోగాలు పెరుగుతాయని చెబుతోంది.

రాహుల్ ద్వంద పౌరసత్వం వివాదం

డిసెంబర్ 19న అలహాబాద్ హైకోర్టు విచారణ

అలహాబాద్: కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ ద్వంద పౌరసత్వం వివాదంపై దాఖలైన పిటిషన్‌ను పరిశీలిస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం మంగళవారం అలహాబాద్ హైకోర్టుకు తెలిపింది. ఈ పిటిషన్‌పై డిసెంబర్ 19వ తేదీన విచారణ జరపనున్నట్లు హైకోర్టు తెలిపింది. రాహుల్ గాంధీ ద్వంద పౌరసత్వ వివాదంపై సీబీఐతో దర్యాప్తు చేయించాలంటూ బీజేపీ నేత, న్యాయవాది విఘ్నేశ్ శిశిర్ పిటిషన్ వేశారు. రాహుల్‌కు బ్రిటిష్ పౌరసత్వం కూడా ఉన్నట్లు యూకే ప్రభుత్వ ఈ మెయిళ్ల ఆధారంగా తెలుసుకున్నట్లు వీఎస్ఎస్ శర్మ అనే వ్యక్తి తెలిపారని పిటిషనర్ పేర్కొన్నారు. 'ఈ విషయంపై శర్మ 2022లో యూకే అధికారులను సంప్రదించగా కొన్ని అంశాలను వారు ధ్రువీకరించారు. అయితే, వాటిని బయట పెట్టేందుకు నిరాకరించారు. రాహుల్ లిఖిత పూర్వక సమ్మతితో మాత్రమే ఆ వివరాలను బహిర్గతం చేయగలమని చెప్పారు'అని విఘ్నేశ్ శిశిర్ పిటిషన్‌లో తెలిపారు. పిటిషనర్ తెలిపిన అంశాలపై కేంద్ర హోంశాఖ పరిశీలన జరుపుతోందని డిప్యూటీ సొలిసిటర్ జనరల్ ఎస్‌బీ పాండే ఈ నెల 25న అలహాబాద్ హైకోర్టుకు వివరించారు. జస్టిస్ అత్తావుర్ రహ్మాన్ మసూది, జస్టిస్ సుభాష్ విద్యార్థిలతో కూడిన ధర్మాసనం డిసెంబర్ 19న విచారణ జరిపి పిటిషన్‌పై తుది నిర్ణయం తీసుకోనుంది. ఇలా ఉండగా, బీజేపీ నేత సుబ్రమణ్యస్వామి ఇలాంటి పిటిషన్‌నే ఢిల్లీ హైకోర్టులో వేశారు. అయితే, అలహాబాద్ హైకోర్టు నిర్ణయం వెలువడ్డాక మాత్రమే దీనిపై విచారణ జరుపుతామని కోర్టు పేర్కొంది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 9ని అనుసరించి ఒక వ్యక్తి భారత పౌరుడిగా ఉంటూ మరో దేశం పౌరసత్వం కలిగి ఉండటానికి వీలులేదు.

రాజ్యాంగంపై పార్లమెంట్‌లో చర్చించాలి

మల్లికార్జున ఖర్గే డిమాండ్

న్యూఢిల్లీ: రాజ్యాంగంపై పార్లమెంట్ ఉభయ సభల్లో చర్చించాలని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే చెప్పారు మంగళవారం డిమాండ్ చేశారు. దేశంలో ఇటీవల జరిగిన అనుచిత సంఘటనలపైనా చర్చ చేపట్టాల్సిన అవసరం ఉందని చెప్పారు. రాజ్యాంగంపై రెండు రోజులపాటు చర్చించాలని కోరుతూ రాజ్యసభ చైర్మన్, లోక్‌సభ స్పీకర్‌కు తాను, రాహుల్ గాంధీ లేఖలు రాసినట్లు వెల్లడించారు. ప్రభుత్వ ప్రతిస్పందన కోసం ఎదురు చూస్తున్నామని తెలిపారు. చర్చ కోసం తగినంత సమయం కేటాయించాలన్నారు. రాజ్యాంగం బోధిస్తున్న మంచి గురించి అందరూ తెలుసుకోవాలని చెప్పారు. దేశంలో రాజ్యాంగ పీఠిక సక్రమంగా అమలవుతోందా? కాంగ్రెస్ సీనియర్‌నేత దిగ్విజయ్ సింగ్ ప్రశ్నించారు. ప్రజలకు స్వేచ్ఛ, న్యాయం దక్కుతున్నాయా? భావ వ్యక్తీకరణ స్వేచ్ఛ ఉందా? సౌభ్రాతృత్వం కనిపిస్తోందా? అని అన్నారు. ప్రజల్లో విశ్వాసం పాదుకొల్పినప్పుడే సబ్ కా సాత్, సబ్‌కా వికాస్ సాధ్యమవుతుందని తెలిపారు. చెప్పింది అమలు చేయండి, బోధించే ముందు ఆచరించండి అని ప్రధాని నరేంద్ర మోదీకి దిగ్విజయ్ సూచించారు.

రాష్ట్రపతిని రాహుల్ అవమానించారు: బీజేపీ

న్యూఢిల్లీ: రాష్ట్రపతి ద్రౌపది ముర్మును విపక్ష నేత, కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ అవమానించారని బీజేపీ మండిపడింది. సంవిధాన్ దివస్ సందర్భంగా పార్లమెంట్ పాత భవనంలో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్రపతికి రాహుల్ అభివాదం చేయలేదని ఆక్షేపించింది. ఈ మేరకు రెండు వీడియోలను మంగళవారం 'ఎక్స్'లో పోస్టు చేసింది. ''రాహుల్ గాంధీ చాలా అహంకారి. రాష్ట్రపతి కళ్లెదుటే ఉన్నా కనీసం అభివాదం చేయలేదు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము గిరిజన తెగకు చెందిన మహిళ. అందుకే కాంగ్రెస్ యువరాజు అవమానించారు. సభలో రాష్ట్రపతి నిల్చుంటే రాహుల్ నింపాదిగా కూర్చున్నారు. కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ రాష్ట్రపతిని అవమానిస్తూనే ఉంది. ఇదేం చౌకబారు మనస్తత్వం''అని బీజేపీ ఆగ్రహం వ్యక్తం చేసింది.

ఆర్‌బీఐ గవర్నర్‌కు స్వల్ప అస్వస్థత

చెన్నై/ముంబై: రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్‌బీఐ)గవర్నర్ శక్తికాంత్ దాస్ అస్వస్థతకు గురయ్యారు. సోమవారం రాత్రి ఎసిడిటీ సంబంధిత సమస్యతో చెన్నైలోని అపోలో ఆస్పత్రిలో చేరారు. పరిస్థితి మెరుగవడంతో మంగళవారం ఉదయం ఆయన్ను ఆస్పత్రి నుంచి డిశ్చార్జి చేశారు. ఆర్‌బీఐ గవర్నర్ దాస్ ఆరోగ్యంపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. తమిళనాడు కేడర్‌కు చెందిన 1980 బ్యాచ్ ఐఏఎస్ అధికారి శక్తి కాంత దాస్ మూడేళ్ల కాలానికి గాను 2018 డిసెంబర్ 12వ తేదీన ఆర్‌బీఐ గవర్నర్‌గా బాధ్యతలు చేపట్టారు. ప్రభుత్వం ఆయన పదవీ కాలాన్ని 2021లో పొడిగించింది.

29న సీడబ్ల్యూసీ భేటీ

న్యూఢిల్లీ: కాంగ్రెస్ పార్టీ అత్యున్నత నిర్ణాయక మండలి కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ(సీడబ్ల్యూసీ) ఈ నెల 29వ తేదీన ఢిల్లీలో సమావేశం కానుంది. ఇటీవలి హరియాణా, మహారాష్ట్ర, జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై ఈ సమావేశంలో చర్చిస్తారని భావిస్తున్నారు. ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ సమావేశాల్లో అదానీ అంశంపై ప్రభుత్వాన్ని ఎలా ఇరుకునపెట్టాలనే విషయం కూడా ప్రస్తావనకు రానుంది. కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే అధ్యక్షతన జరిగే ఈ భేటీలో అగ్ర నేతలు రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీ కూడా పాల్గొంటారు. మరికొద్ది నెలల్లో ఢిల్లీ, బిహార్ అసెంబ్లీ ఎన్నికలకు ఏర్పాట్లు, పొత్తులపైనా నిర్ణయం తీసుకుంటారని భావిస్తున్నారు.

ఒక్క రాత్రిలోనే 188 డ్రోన్లు..

- ఉక్రెయిన్‌లోని లక్ష్యాలపైకి ప్రయోగించిన రష్యా
- కీవ్‌లో ఏడుగంటలపాటు ఆగకుండా మోగిన సైరన్లు

కీవ్: రష్యా మరోసారి రెచ్చిపోయింది. సోమవారం ఒక్క రాత్రిలోనే తమ దేశంలోని 17 ప్రాంతాల్లోని లక్ష్యాలపైకి రికార్డు స్థాయిలో ఏకంగా 188 డ్రోన్లను ప్రయోగించింది. వీటిల్లో చాలా వరకు తమ గగనతల రక్షణ వ్యవస్థలు కూల్చివేశాయని ఉక్రెయిన్ ఆర్మీ ప్రకటించింది. ఇంతకు ముందెన్నడూ ఈ స్థాయిలో దాడి జరగలేదని పేర్కొంది. ఈ దాడితో జాతీయ విద్యుత్ పంపిణీ వ్యవస్థకు నష్టం వాటిల్లిందని, పలు చోట్ల నివాస భవనాలు దెబ్బతిన్నాయని తెలిపింది. డ్రోన్లు దూసుకు వస్తుండటంతో రాజధాని కీవ్‌లో ఏడు గంటలపాటు సైరన్లు మోగుతూనే ఉన్నాయని అధికారులు తెలిపారు. ఇలా ఉండగా, ఉక్రెయిన్‌లోని వెయ్యి కిలోమీటర్లకు పైగా ఉన్న యుద్ధక్షేత్రంలో గత 24 గంటల వ్యవధిలో రష్యా బలగాలతో జరిగిన ఘర్షణల్లో సగానికి పైగా డొనెట్స్క్‌లోని పొక్రోవ్‌స్క్, కురాకోవ్ ప్రాంతాల్లోనే చోటుచేసుకున్నాయన్నారు. డొనెట్స్క్ రీజియన్‌లోని ఉక్రెయిన్ బలగాల సరఫరా లైన్లను అడ్డుకునే లక్ష్యంతో రష్యా బలగాలు ముందుకు చొచ్చుకుపోతుండటంపై అమెరికాకు చెందిన ఓ సంస్థ ఆందోళన వ్యక్తం చేసింది. అయితే, ఎంతో కీలకమైన డొనెట్స్క్ రీజియన్‌లోని మొత్తం 3 వేల చదరపు మైళ్ల భూభాగాన్ని స్వాధీనం చేసుకోవాలన్న లక్ష్యాన్ని సాధించడం రష్యాకు తేలికైన వ్యవహారం మాత్రం కాదని పేర్కొంది. ఇలా ఉండగా, తమ సరిహద్దు ప్రాంతాలపైకి ఉక్రెయిన్ ప్రయోగించిన 39 డ్రోన్లను అడ్డుకున్నట్లు రష్యా ఆర్మీ తెలిపింది.

సీఐసీ, ఎస్ఐసీల్లో ఖాళీలను సత్వరమే భర్తీ చేయండి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సుప్రీంకోర్టు ఆదేశం

న్యూఢిల్లీ: కేంద్ర సమాచార కమిషన్(సీఐసీ), రాష్ట్ర సమాచార కమిషన్(ఎస్ఐసీ)లలో ఖాళీలు కొనసాగుతుండటంపై సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. ఖాళీల భర్తీకి తీసుకున్న చర్యలను తమ ముందుంచాలని జస్టిస్ సూర్య కాంత్, జస్టిస్ ఉజ్జల్ భూయాన్‌ల ధర్మాసనం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది. సత్వరమే సీఐసీ, ఎస్ఐసీలలో పోస్టుల భర్తీ ప్రక్రియను ప్రారంభించి, నాలుగు వారాల్లోగా పూర్తి చేయాలని నిర్దేశించింది. సీఐసీలోని ప్రధాన సమాచార కమిషనర్ సహా మొత్తం 11 పోస్టులకుగాను ఏకంగా 8 ఖాళీలుండటమేంటని కేంద్రం తరఫున హాజరైన అదనపు సొలిసిటర్ జనరల్ బ్రిజేందర్ చహార్‌ను ప్రశ్నించింది. తెలంగాణ, జార్ఖండ్, త్రిపురల్లోని ఎస్ఐసీలు పూర్తిగా నిర్వీర్యమయ్యాయని, అసలక్కడ సమాచార కమిషనర్లే లేరని తెలిపింది. ఖాళీలను నింపేందుకు తక్షణమే చర్యలకు ఉపక్రమించాలని ఆయా రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులను కోరింది. సమాచార కమిషన్లలో పోస్టులను భర్తీ చేయాలంటూ గతేడాది అక్టోబర్ 30న సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించలేదని ఈ సందర్భంగా పిటిషనర్ అంజలీ భరద్వాజ్ తరఫున న్యాయవాది ప్రశాంత్ భూషణ్ తెలిపారు.



ప్రపంచంలోనే అత్యంత వృద్ధుడు కన్నుమూత

లండన్: ప్రపంచంలోనే అత్యంత కురువృద్ధుడిగా తొమ్మిది నెలలపాటు కొనసాగిన జాన్ ఆల్ఫ్రెడ్ టిన్నిస్‌వుడ్ కన్నుమూశారు. ఆయన వయస్సు 112 ఏళ్లు. లివర్‌పూల్‌లోని వృద్ధాశ్రమంలో సోమవారం తుదిశ్వాస విడిచారని ఆయన కుటుంబం తెలిపింది. టిన్నిస్‌వుడ్ లివర్‌పూల్‌లో 1912 ఆగస్టు 26వ తేదీన జన్మించారు. ఆగస్టులో 112వ జన్మదినం జరుపుకున్నారు. ఇంత సుదీర్ఘ కాలం జీవించడం కేవలం అదృష్టమని చెప్పే టిన్నిస్‌వుడ్.. మనం ఎక్కువ కాలం జీవించాలా, స్వల్ప కాలమా అన్నది మన చేతుల్లో లేదని ఆయన తెలిపేవారని కుటుంబం గుర్తు చేసింది. ప్రపంచంలోనే అత్యంత ఎక్కువ కాలం జీవించిన వ్యక్తిగా టిన్నిస్‌వుడ్ పేరు ఈ ఏడాది ఏప్రిల్‌లో గిన్నిస్ ప్రపంచ రికార్డుల్లో నమోదైంది. బ్రిటిష్ ఆర్మీ పే కార్ప్స్‌లో సైనికుడిగా రెండో ప్రపంచ యుద్ధంలో పాల్గొన్నారు. రెండు ప్రపంచయుద్ధాలు ఆయన జీవితకాలంలోనే జరిగాయి. టిన్నిస్‌వుడ్‌కు కుమార్తె సుసాన్, నలుగురు మనవళ్లు, ముగ్గురు మునిమనవలు ఉన్నారు. భార్య బ్లోడ్‌వెన్ 1986లో చనిపోయారు.

ఇంట్లో కూడా రక్షణ లేదు

రోజుకు 140 మంది మహిళలు ఇళ్లలోనే హతం

- జీవిత భాగస్వామి, కుటుంబీకుల చేతుల్లోనే తనువు చాలిస్తున్నారు
- 2023 ఐరాస నివేదికలో దిగ్భ్రాంతికర వాస్తవాలు వెల్లడి

ఐక్యరాజ్య సమితి: గడపలో ఉన్న సుఖం ఎక్కడా దొరకదని ఓ సామెత. నిజమే ఇంట్లో ఉన్నప్పుడు కలిగే హాయి, నిశ్చింత బాగుంటుంది. అయితే చాలా మంది మహిళలకు సొంత ఇల్లు కూడా నరకంగా మారిందని ఐక్యరాజ్యసమితి తాజా అధ్యయనంలో తేలింది. ప్రపంచవ్యాప్తంగా రోజుకు సగటున 140 మంది మహిళలు, బాలికలు ఇంట్లో సొంత మనుషుల చేతుల్లో ప్రాణాలు కోల్పోతున్నారు. వీరంతా అత్యంత సన్నిహితులు, జీవిత భాగస్వాములు లేదా కుటుంబ సభ్యుల చేతిలో చనిపోయారని ఐక్యరాజ్యసమితికి చెందిన ఐరాస మహిళలు, మాదక ద్రవ్యాలు, నేరాల సంబంధ విభాగం ఒక నివేదికను విడుదలచేసింది. 2023లో ప్రపంచవ్యాప్తంగా సుమారు 51,100 మంది మహిళలు, బాలికల మరణాలకు సన్నిహితులే కారణమని వెల్లడించింది. ఈ సంఖ్య 2022లో 48,800 ఉండగా.. 2023లో 51,100కు పెరిగిందని నివేదిక పేర్కొంది. 2023లో హత్యకు గురైన మహిళల్లో దాదాపు 60 శాతం మంది కుటుంబీకుల, సన్నిహితుల చేతుల్లో చనిపోయిన వారే. మహిళలు, బాలికల హత్యలను నిరోధించడానికి ప్రపంచవ్యాప్తంగా ఆయా దేశాల ప్రభుత్వాలు ఎంతగా ప్రయత్నించినప్పటికీ మహిళల హత్యాకాండ ఆగట్లేదని నివేదిక ఆందోళన వ్యక్తంచేసింది. సమస్యలు వచ్చినప్పుడు సకాలంలో జోక్యం చేసుకోవడం ద్వారా ద్వారా ఈ హత్యలను నివారించగలుగుతామని నివేదిక అభిప్రాయపడింది. మహిళలపై హింస నిర్మూలన దినోత్సవం సందర్భంగా ఇటీవల ఈ నివేదిను ఐక్యరాజ్యసమితి విడుదల చేసింది. ప్రతిచోటా మహిళలు, బాలికలు ఈ తీవ్రమైన లింగ ఆధారిత హింస బారిన పడుతున్నారని, ఇందుకు ఏ ప్రాంతం మినహాయింపు కాదని నివేదిక పేర్కొంది. 2023లో ఆఫ్రికాలో అత్యధికంగా 21,700 హత్యలు జరిగాయి. ఆ ఖండంలోని జనాభాతో పోల్చినా ప్రతి లక్ష మందిలో 2.9 మంది బాధితులున్నారు. ఆసియాలో ప్రతి లక్ష మందిలో 0.8 మంది బాధితులుండగా యూరప్‌లో మాత్రం లక్ష మందిలో మహిళా బాధితులు అత్యల్పంగా 0.6 శాతం మాత్రమే ఉన్నారని వివరించింది. ఉత్తర, దక్షిణ అమెరికాల్లో కలిపి గత ఏడాది ప్రతి లక్ష మందిలో 1.6 మంది మహిళలు సొంత వ్యక్తుల చేతుల్లో హత్యకు గురయ్యారు. ఆ్రస్టేలియా, న్యూజిలాండ్, ఫిజీవంటి 14 దేశాలతో కూడిన ఓషనియా ప్రాంతంలో ప్రతి లక్ష మందిలో 1.5 మంది మహిళలు దారుణహింసను ఎదుర్కొన్నారు. లింగ వివక్ష, పురుషాహంకారం వల్ల మహిళలపై హింసాత్మక దాడులు కొనసాగుతున్నాయని ఐక్యరాజ్యసమితి మహిళా డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ న్యారాజాయీ గుంబోంజ్వాండా ఆందోళన వ్యక్తంచేశారు. ఈ గణాంకాలు అధికారికమైనవి మాత్రమేనని, అసలు లెక్కలోకి రానివి, అజ్ఞాతంగా ఉండిపోయినవి ఎన్నో ఉన్నాయన్నారు. యూరప్, అమెరికాల్లో ఎక్కువగా అక్రమసంబంధాలను నెరిపిన మహిళలే హత్యలకు గురయ్యారు.



సహజీవనం వికటించి కక్ష సాధింపులు

ఆందోళన వ్యక్తం చేసిన సుప్రీం

న్యూఢిల్లీ: పరస్పర అంగీకారంతో దీర్ఘ కాలం పాటు సహజీవనం చేశాక పొరపచ్చాలతో విడిపోయే జంటలు కక్ష సాధింపులకు దిగుతుండటంపై సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. దాదాపు తొమ్మిదేళ్లపాటు కలిసి ఉన్న తర్వాత అత్యాచారం, మోసానికి పాల్పడ్డాడంటూ మాజీ సహజీవన భాగస్వామిపై ఓ మహిళ పెట్టిన కేసును న్యాయస్థానం కొట్టివేసింది. ఇంత సుదీర్ఘమైన శారీరక సంబంధానికి నేరాన్ని ఆపాదించడం తీవ్ర పరిణామాలకు దారితీస్తుందని జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ ఎస్.కోటీశ్వర్ సింగ్‌ల ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఇటీవల కాలంలో ఇటువంటి పెడ ధోరణులు పెరిగిపోవడంపై ఆందోళన వ్యక్తం చేసింది. పెళ్లి చేసుకుంటానంటూ నమ్మించి పలుమార్లు లైంగికంగా వాడుకున్నాడంటూ నవీ ముంబైకి చెందిన వ్యక్తిపై ఓ మహిళ ఫిర్యాదు చేసింది. ఈ కేసును కొట్టివేయాలంటూ ఆ వ్యక్తి వేసిన పిటిషన్‌ను 2018లో బాంబే హైకోర్టు కొట్టివేసింది. దీంతో, అతడు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. మంగళవారం విచారణ చేపట్టిన ధర్మాసనం పైవ్యాఖ్యలు చేస్తూ బాంబే హైకోర్టు ఆదేశాలను పక్కనబెట్టింది.

ట్రంప్ వచ్చాక అదానీ కేసు వెనక్కి!

అటార్నీ రవి బాత్రా వెల్లడి

న్యూయార్క్: భారత పారిశ్రామికవేత్త గౌతమ్ అదానీపై అమెరికాలో నమోదు కేసును డొనాల్డ్ ట్రంప్ అధికార పగ్గాలు చేపట్టిన తర్వాత ఉపసంహరించే అవకాశం లేకపోలేదని ప్రముఖ ఇండియన్-అమెరికన్ అటార్నీ రవి బాత్రా చెప్పారు. ఇండియాలో పలువురు అధికారులకు 265 బిలియన్ డాలర్ల మేర లంచాలు ఇచ్చినట్లు అదానీపై కేసు నమోదైన విషయం విదితమే. అదానీపై వచ్చిన ఆరోపణల్లో పస లేదని, కేసులో లోపాలు ఉన్నాయని ట్రంప్ అధ్యక్షుడైన తర్వాత అమెరికా ప్రభుత్వం భావిస్తే కేసును వెనక్కి తీసుకొనే అవకాశం ఉన్నట్లు రవి బాత్రా వెల్లడించారు.

ఆకాశానికి నిచ్చెన

బాల భీముడు స్వర్గానికి నిచ్చెన వేశాడని చిన్నప్పుడు కథల్లో చదువుకున్నాం. అంతులేని నిచ్చెనను ఆకాశంలోకి వేశాడని చెప్పుకున్నాం. అయితే, పాతకాలంనాటి ఒక అంతస్తు ఎత్తు నిచ్చెన ఎక్కితేనే వామ్మో అనేస్తాం. అలాంటిది అత్యంత పొడవైన నిచ్చెనను ఎక్కగలరా ? అని ఇప్పుడు చైనా ప్రపంచవ్యాప్తంగా ధైర్యవంతులైన పర్యాటకులకు సవాల్ విసిరింది. సవాల్ స్వీకరించిన వేలాది మంది ఔత్సాహిక పర్యాటకులు చలో చైనా అంటున్నారు. అత్యంత ప్రమాదకరంగా ఉండే పర్వతమయ ప్రాంతంలో రెండు కొండలను కలుపుతూ ఒక భారీ నిచ్చెనను అక్కడ ఏర్పాటుచేశారు. పట్టుకుంటే జారిపోయే సన్నని అత్యంత నునుపైన నిటారు నిచ్చెనను ఎక్కేందుకు ఇప్పుడు జనం క్యూలు కడుతున్నారు. చైనాలోని హునాన్ ప్రావిన్స్‌లోని జాంగ్‌జియాజీ నేచర్‌పార్క్‌లోని మౌంట్ క్విజింగ్ కొండ నుంచి సమీప కొండకు ఈ పొడవైన నిచ్చెనను నిర్మించారు. నేల నుంచి ఏకంగా 5,000 అడుగుల ఎత్తులో 551 అడుగుల పొడవున ఈ 'టియాంటీ'నిచ్చెనను ఎక్కాల్సి ఉంటుంది. చైనా భాషలో టియాంటీ అంటే ఆకాశ నిచ్చెన అని అర్థం. రోజూ 1,200 మందికిపైగా జనం ధైర్యంగా దీనిని ఎక్కేస్తున్నారు. చాలా మంది భయపడి వెనుతిరుగుతున్నారు. సగం మెట్లు ఎక్కాక కిందికి చూస్తే కళ్లు తిరగడం ఖాయం. కింద మొత్తం లోయ ఉంటుంది. నాకు కోటి రూపాయలు ఇచ్చినాసరే ఈ నిచ్చెనను మాత్రం ఎక్కనుబాబోయ్ అని కొందరు నెటిజన్లు సంబంధిత వీడియోలు చూశాక కామెంట్లు చేశారు. నిచ్చెన ఎక్కేటప్పుడే కాదు ఎక్కకముందు కూడా పర్యాటకులు వామ్మో అంటున్నారు. ఎందుకంటే టికెట్ ధర ఏకంగా రూ.8,500. నాలుగు అడుగుల కంటే ఎక్కువ ఎత్తు ఉన్న వ్యక్తులనే నిచ్చెన మీదకు అనుమతిస్తున్నారు. చైనాలో ఔట్‌డోర్ క్రీడలు ఆడే వారి సంఖ్య గత ఏడాది 40 కోట్లకు చేరింది. దీంతో ఎప్పటికప్పుడు కొత్త రకం సాహసక్రీడలను చైనా సంస్థలు పరిచయం చేస్తున్నాయి.

- సాక్షి, నేషనల్ డెస్క్



ట్రంప్‌కు భారీ రిలీఫ్

2020 ఎన్నికల కేసు కొట్టివేత

వాషింగ్టన్: కాబోయే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు పాత కేసుల్లో వరుసబెట్టి ఊరట లభిస్తోంది. 2020లో ఎన్నికల ఫలితాలను తారుమారుచేసేందుకు ప్రయత్నించారన్న ఆరోపణలపై కొనసాగుతున్న క్రిమినల్ కేసును తాజాగా జిల్లా న్యాయస్థానం కొట్టేసింది. శ్వేతసౌధం నుంచి కీలక పత్రాలను తరలించారన్న అభియోగాలపై నమోదైన మరో కేసులోనూ ట్రంప్‌కు ఊరట లభించింది. దేశాధ్యక్ష స్థానంలో కొనసాగుతున్న వ్యక్తిని ఎలాంటి కేసులోనూ విచారించకూడదన్న అమెరికా చట్టాలకు లోబడి ట్రంప్‌పై ఉన్న కేసును కొట్టేస్తున్నట్లు డిస్ట్రిక్ట్ జడ్జి తాన్యా చుట్కాన్ తెలిపారు. ఈ వివరాలను ట్రంప్ తరఫు న్యాయవాది జాక్ స్మిత్ వెల్లడించారు. జాక్ అభ్యర్థనమేరకు ఈ కేసును జడ్జి కొట్టేశారు. 1970ల నాటి న్యాయశాఖ నియమనిబంధనలను ప్రాసిక్యూటర్లు ఉదహరించారు. ప్రస్తుత అధ్యక్షుడిపై క్రిమినల్ ప్రాసిక్యూషన్ చేయడం ఆ దేశాధ్యక్షుడి పూర్తి స్థాయి కార్యనిర్వాహక సామర్థ్యాన్ని దెబ్బతీసినట్లవుతుందని, ఇది అమెరికా రాజ్యాంగాన్ని ఉల్లంఘించడమేనని ప్రాసిక్యూటర్లు పేర్కొన్నారు. ట్రంప్ వైట్‌హౌస్‌కు తిరిగి రాక ముందే కేసును కొట్టివేయాలని డిపార్ట్‌మెంట్ పాలసీలో ఉందని ప్రాసిక్యూటర్లు చెప్పారు. దీంతో యూఎస్ డిస్ట్రిక్ట్ జడ్జి తాన్యా చుట్కాన్ ఈ క్రిమినల్‌ను కేసును కొట్టివేస్తూ తీర్పు వెలువరించారు. ట్రంప్ అధ్యక్షుడు కాబోతున్నారన్న ఏకైక కారణంగా ఈ కేసును ప్రస్తుతానికి మూసేస్తున్నారు. అయితే ట్రంప్ నాలుగేళ్ల పదవీకాలం ముగిశాక ట్రంప్‌పై ఈరోజు మూసేసిన కేసులను ఆనాడు మళ్లీ తెరిచే అవకాశం ఉంది.

ఇలాంటివి ఎప్పుడూ జరగలేదు: ట్రంప్

2020 ఎన్నికల నాటి కేసును కొట్టివేయడంపై ట్రంప్ స్పందించారు. ''ఈ కేసులు చట్టవిరుద్ధమైనవి. నాపై పోరాడేందుకు డెమొక్రాట్లు పన్నుల ద్వారా ప్రజలు చెల్లించిన 10 కోట్ల డాలర్ల సొమ్మును వృథా చేశారు. ఇంతకు ముందు అమెరికాలో ఇలాంటివి జరగలేదు'' అని ట్రూత్ సోషల్ మీడియా వేదికగా ట్రంప్ పేర్కొన్నారు.

విమానాల్లో అసభ్యంగా ప్రవర్తించే వారిని కట్టడి చేయండి

మార్గదర్శకాలు రూపొందించాలని కేంద్రానికి సుప్రీం ఆదేశం

న్యూఢిల్లీ: విమానాల్లో అసభ్యకరంగా ప్రవర్తించే ప్రయాణికుల కట్టడికి సమగ్ర మార్గదర్శకాలు రూపొందించాల్సిందిగా కేంద్ర ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది. 2022 నవంబర్‌లో ఎయిరిండియా విమానంలో తోటి ప్రయాణికుడు మద్యం మత్తులో తనపై మూత్ర విసర్జన చేయడంపై 73 ఏళ్ల బాధితురాలు వేసిన పిటిషన్‌ను మంగళవారం జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌ల ధర్మాసనం విచారించింది. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రామాణిక మార్గదర్శకాలు రూపొందించాలని కేంద్ర ప్రభుత్వం, పౌర విమానయాన డైరెక్టర్ జనరల్(డీజీసీఏ)ను ఆదేశించాలని ఆమె పిటిషన్‌లో కోరారు. విచారణ చేపట్టిన ధర్మాసనం.. అంతర్జాతీయ ప్రమాణాలను అనుసరించి తగు మార్గదర్శకాలను రూపొందించేలా సంబంధిత యంత్రాంగానికి సూచించాలని సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటిని ఆదేశించింది. ఈ సందర్భంగా జస్టిస్ విశ్వనాథన్.. జస్టిస్ సూర్యకాంత్‌తో కలిసి విమాన ప్రయాణం చేస్తున్న సమయంలో స్వయంగా ఎదుర్కొన్న అనుభవాన్ని వివరించారు. 'మేం ప్రయాణిస్తున్న విమానంలో ఇద్దరు వ్యక్తులు పూటుగా మద్యం తాగారు. వారిలో ఒకరు బాత్ రూంకు వెళ్లి, అక్కడే నిద్రపోయారు. మరో వ్యక్తి వాంతి చేసుకున్నాడు. సిబ్బంది అంతా మహిళలే కావడంతో వీరిద్దరి వ్యవహారం ఇలా అరగంటపాటు సాగింది. చివరకు మహిళా సిబ్బంది విజ్ఞప్తి మేరకు ఓ ప్రయాణికుడు వెళ్లి బాత్ రూం డోర్ తెరిచి, లోపలున్న వ్యక్తిని మోసుకొచ్చి సీట్లో కూర్చోబెట్టారు'అంటూ వివరించారు. ఇలాంటి సమయాల్లో ఏదైనా వినూత్నంగా చేయాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు.

వివాహ పన్ను రద్దు చేసిన తొలి విజయనగర రాజు?

మూడు శతాబ్దాల పాటు దక్షిణాపథ చరిత్రలో హిందూ సంస్కృతిని సముద్ధరించడంలో పేరొందిన చివరి హిందూ రాజ్యంగా విజయనగర సామ్రాజ్యం ప్రసిద్ధి చెందింది. భారతీయ సంస్కృతికి పునరుజ్జీవనం కల్పించింది. విజయనగర రాజులతో బహమనీ సుల్తాన్లు నిరంతరం యుద్ధాలు చేయడం వల్ల వారు ఉత్తర భారతదేశం వైపు దృష్టి సారించలేకపోయారు..

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
జనరల్ స్టడీస్
భారతదేశ చరిత్ర

విజయనగర సామ్రాజ్యం

సంగమ వంశానికి చెందిన హరిహర, బుక్కరాయలు క్రీ.శ. 1336లో తుంగభద్రానదీ తీరంలో మాధవ విద్యారణ్య స్వామి సహకారంతో విజయనగర సామ్రాజ్యాన్ని స్థాపించారు. సోదరులైన వీరిద్దరూ ప్రారంభంలో కాకతీయ ప్రతాపరుద్రుడి కొలువులో సేనానులుగా ఉండేవారు. క్రీ.శ. 1323లో కాకతీయ రాజ్యాన్ని మహమ్మద్ బిన్ తుగ్లక్ ఆక్రమించడంతో హరిహర, బుక్కరాయలు కర్ణాటకలో 'కంపిలి' రాజ్యానికి వలస వెళ్లారు. తర్వాత ఢిల్లీ సుల్తాన్ మహ్మద్ బిన్ తుగ్లక్ వీరిని ఇస్లాం మతంలోకి మార్చి ఆనెగొంది, కంపిలి ప్రాంతాలకు పాలకులుగా నియమించాడు. కాలక్రమంలో 1336–1340 మధ్య వీరు ఢిల్లీ సుల్తాన్‌లను ధిక్కరించి స్వతంత్రంగా విజయనగర రాజ్యాన్ని స్థాపించారు. ముస్లిం రాజులపై విజయ సూచకంగా 'విజయనగరం'గా, విద్యా విషయంలో సాధించిన అభివృద్ధి కారణంగా 'విద్యానగరం'గా ఇది చరిత్రలో పేరు పొందింది.

విజయనగర సామ్రాజ్య స్థాపన విషయంలో చరిత్రకారుల్లో భిన్నాభిప్రాయాలున్నాయి. విజయనగర రాజ్య నిర్మాత హొయసాల రాజు మూడో వీర భల్లాలుడని ఫెరిస్తా రచన ఆధారంగా రెవరెండ్ ఫాదర్ హెరాస్ పేర్కొన్నారు. ఈ రాజ్య నిర్మాత హరిహర బుక్కరాయలేనని, 'విస్మృత సామ్రాజ్యం' (ది ఫర్గాటెన్ ఎంపైర్) గ్రంథ రచయిత రాబర్ట్ సీవెల్ నిర్ధారించారు. అధికమంది చరిత్రకారులు ఈయన అభిప్రాయంతో ఏకీభవిస్తున్నారు. హరిహరుడు కన్నడవారా, తెలుగువారా అనే విషయంలోనూ వివాదం ఉంది. స్థానిక చరిత్రలు, బదౌనీ, న్యూనిజ్ రచనల ఆధారంగా హరిహరరాయలు తెలుగు వారేనని ప్రసిద్ధ చరిత్రకారుడు డాక్టర్ నేలటూరి వెంకట రమణయ్య నిర్ధారించారు. స్థానిక చరిత్రల ఆధారంగా హరిహర, బుక్కరాయలు కాకతీయ ప్రతాపరుద్రుని సేనానులని, మంగళ నిలయ వాసియైన 'సంగముని' కుమారులని చరిత్రకారులు పేర్కొన్నారు. 1336–40 మధ్య కాలంలో హరిహర, బుక్కరాయలు రాజధానిని 'ఆనగొంది' నుంచి హంపీ విజయనగరానికి మార్చారు.

ఆధారాలు

మాధవ విద్యారణ్యుని 'కాలజ్ఞానం'లో విజయనగర పాలకుల వివరాలు, విద్యారణ్యుని వృత్తాంతం, రాజ్యస్థాపన వివరాలున్నాయి. ఒకటో రాజనాథ డిండిముడు రచించిన సాళువాభ్యుదయం, రెండో రాజనాథ డిండిముడు రచించిన అచ్యుత రామాభ్యుదయం, అరుణగిరినాథ డిండిముడు రచించిన సోమవల్లీ యోగానంద ప్రహసనం, రామభద్రాంబిక రాసిన రఘునాథాభ్యుదయం, స్థానాపతి తెలుగులో రచించిన రాయవాచకం, కంపిలి రాయచరిత్ర, కృష్ణరాయవిజయం, తిరుమాలాంబిక రచించిన చారిత్రక గ్రంథాలు విజయనగర సామ్రాజ్య చరిత్రకు ప్రధాన ఆధారాలుగా ఉన్నాయి. మాధవ సాయన మంత్రి చేసిన వ్యాఖ్యానాల ద్వారా సంగమ వంశ వివరాలు తెలుస్తున్నాయి. రెండో బుక్కరాయల ఆస్థాన వైద్యుడు రాసిన 'వైద్యరాజ్యవల్లభం' లాంటి ఆయుర్వేద గ్రంథం, లక్ష్మీ నారాయణుడు రచించిన సంగీత సూర్యోదయం, కళింగ గజపతి ప్రతాపరుద్రుడి సరస్వతీ విలాసం, శ్రీకృష్ణదేవరాయలు రాసిన తెలుగులో పంచకావ్యమైన ఆముక్తమాల్యద (విష్ణుచిత్తీయం), అల్లసాని పెద్దన 'మనుచరిత్ర' లాంటి గ్రంథాలు నాటి రాజకీయ, మత, సాంఘిక పరిస్థితులను వివరిస్తున్నాయి.

విదేశీ యాత్రికుల కథనాలు:

- మొరాకో (ఆఫ్రికా) దేశస్థుడైన ఇబన్ బటూటా అనే యాత్రికుడు మొదటి హరిహరుని కాలం నాటి విజయనగర పరిస్థితులను వివరించాడు.
- వెనీస్ (ఇటలీ) యాత్రికుడైన నికోలా డీ కోంటీ మొదటి దేవరాయల రాజ్యాన్ని సందర్శించి రాజ్య విస్తరణ, నాటి సాంఘిక పరిస్థితులను వివరించాడు.
- పారశీక (పర్షియా) యాత్రికుడు అబ్దుల్ రజాక్ రెండో దేవరాయల కాలం నాటి పరిస్థితులను వర్ణించాడు.
- డొమింగో పయస్ (పోర్చుగీసు) అనే యాత్రికుడు శ్రీకృష్ణదేవరాయల వ్యక్తిత్వం, రాజ్యపాలనా స్వరూపం, నాటి సంపద, రక్తతర్పణాలు, ఆచార వ్యవహారాల గురించి వివరించాడు.
- పోర్చుగీసు యాత్రికుడైన న్యూనిజ్ కృష్ణదేవరాయలు, అచ్యుతదేవరాయల కాలం నాటి పరిస్థితులను గ్రంథస్థం చేశాడు.
- కృష్ణదేవరాయల కాలంలో వచ్చిన మరో పోర్చుగీసు యాత్రికుడు 'ఎడ్వర్డో బార్బోసా' నాటి పాలనా విధానాన్ని వర్ణించాడు.
- రష్యా వ్యాపారస్థుడు అస్తినాసియస్ నికితిన్ 1470లో దక్కన్ బహమనీ రాజ్యాన్ని సందర్శించి, నాటి న్యాయస్థానాలు, సైన్యం, ప్రజల స్థితిగతులను వివరించాడు.
- ఎడోవికో-డి-వర్తెమా (ఇటలీ దేశస్థుడు) గోవా, కాలికట్ ఓడరేవులు, విజయనగర రాజ్య పరిస్థితులను వివరించాడు.

శాసనాధారాలు:

- మొదటి హరిహరరాయలు వేయించిన 'బాగపల్లెసి' తామ్ర శాసనం ఆయన విజయాలను తెలియజేస్తోంది.
- కంపన కుమారుడు రెండో సంగముడు వేయించిన బిట్రగుంట దాన శాసనం 'అయిదుగురు సంగమ సోదరుల' వంశావళిని విశదీకరిస్తోంది.
- రెండో హరిహరరాయల చెన్నరాయ పట్టణ శాసనంలో ఒకటో బుక్కరాయలు జయించిన ప్రాంతాల గురించి వివరిస్తోంది.
- శ్రీరంగ పట్టణం తామ్ర శాసనం రెండో దేవరాయల విజయాల గురించి తెలుపుతోంది.
- ఇమ్మడి నరసింహారాయల 'దేవులపల్లి' రాగి శాసనం సాళువ రాజుల వంశావళిని విశదీకరిస్తోంది.

నాణేలు: విజయనగర రాజులు అధిక సంఖ్యలో బంగారు నాణేలు ముద్రించారు. వీటిని వరహాలు, పగోడాలు, ఫణాలని పిలిచేవారు. వీటిలో కొన్ని పూర్తి వరహాలు, అర్ధ వరహాలుగా ముద్రించారు. నాణేల వెనుకభాగంలో దేవతలు, నంది, ఏనుగు, గండభేరుండ, బాలకృష్ణ, లక్ష్మీదేవి, వేంకటేశ్వరుడి బొమ్మలు ముద్రించారు. నాణేనికి ఒకవైపు దేవనాగరి లిపి, మరోవైపు వైష్ణవ సంప్రదాయ బొమ్మలు ముద్రించారు. కొన్ని నాణేలపై కన్నడ లిపి కూడా కనిపిస్తోంది. ఈ నాణేల ద్వారా నాటి రాజకీయ చరిత్ర, మత విశ్వాసాలు, ఆర్థిక పరిస్థితులు తెలుస్తున్నాయి.

రాజవంశాలు

సంగమ వంశం: క్రీ.శ. 1336 నుంచి 1676 వరకు విజయనగర సామ్రాజ్యాన్ని సంగమ, సాళువ, తుళువ, ఆరవీటి వంశాల వారు అవిచ్ఛిన్నంగా పాలించారు. తొలి రాజవంశం సంగమ వంశ సామ్రాజ్య స్థాపకులైన హరిహర, బుక్క సోదరులు సంగముడి కుమారులు కావడంతో సంగమ వంశమని పేరొచ్చింది. ఈ వంశంలో మొదటి హరిహర రాయలు 1336 నుంచి 1356 వరకు పాలించారు. 1339 నాటికి తూర్పున బంగాళాఖాతం నుంచి పశ్చిమాన అరేబియా సముద్రం వరకు రాజ్యాన్ని విస్తరించారు. ఈయనకు 'పూర్వ, పశ్చిమ సముద్రాధిపతి' అనే బిరుదు ఉంది. దక్కన్ బహమనీ విజయనగర రాజుల మధ్య సంఘర్షణ మొదటి హరిహరుని కాలంలోనే ప్రారంభమైంది. కృష్ణా – తుంగభద్ర నదుల 'అంతర్వేది భూమి' ఈ సంఘర్షణలకు మూల కారణం. దీన్నే 'రాయచూర్ దోబ్' అంటారు. ఈయన కాలంలో మొరాకో (ఆఫ్రికా) యాత్రికుడు 'ఇబన్ బటూటా' విజయనగర సామ్రాజ్యాన్ని సందర్శించాడు.

మొదటి హరిహర రాయల మరణానంతరం ఆయన సోదరుడు మొదటి బుక్కరాయలు 1356 నుంచి 1377 వరకు పాలించాడు. ఈయన కాలంలోనే 'పెనుగొండ దుర్గం' నిర్మించారు. ఈయన కాలంలో జరిగిన మధుర (తమిళదేశం) ఆక్రమణ ముఖ్యమైంది. ఈయన కుమారుడు కుమార కంపన మధురను జయించి, విజయనగర రాజ్యంలో విలీనం చేశారు. మొదటి బుక్కరాయలు 1374లో చైనాకు రాయబారిని పంపినట్లు మింగ్ వంశ చరిత్ర ద్వారా తెలుస్తోంది. బుక్కరాయలు శైవ మతాన్ని, సంస్కృత, ఆంధ్ర భాషలను ఆదరించారు. సాయన, మాధవులు అనే కవులు ఈయన ఆస్థానంలో వేదాలకు భాష్యాలు రాశారు. నాచన సోమనాథుడు ఈయన ఆస్థానంలోని వారే. మొదటి బుక్కరాయలు, మహ్మద్‌షా మధ్య 'ముద్గల్' కోట కోసం జరిగిన యుద్ధంలో బహమనీ సుల్తాన్లు మొదటిసారిగా ఫిరంగులను వాడారు. భారతదేశంలో ఫిరంగి దళాలను ఉపయోగించిన తొలి యుద్ధం ఇదే.

మొదటి బుక్కరాయలు తర్వాత రెండో హరిహర రాయలు 1377 నుంచి 1404 వరకు పాలించారు. ఈయన కొండవీటి రెడ్లు, రేచర్ల పద్మనాయకులతో యుద్ధాలు చేశారు. పానగల్లు కోటను ఆక్రమించారు. సింహళంపై దాడిచేసిన మొదటి విజయనగర రాజు ఈయనే.

విజయనగర సామ్రాజ్యాన్ని విస్తరించడంలో ప్రధాన పాత్ర వహించిన సంగమ వంశ రాజుల్లో మొదటి దేవరాయలు ముఖ్యులు. ఈయన 1406 నుంచి 1422 వరకు పాలించారు. రెడ్డిరాజుల నుంచి ఉదయగిరి, మోటుపల్లి ప్రాంతాలను ఆక్రమించారు. మొదటి దేవరాయలు తుంగభద్రానదికి ఆనకట్ట వేయించి, 15 మైళ్ల పొడవు కొండ ప్రాంతాన్ని తొలిపించి, కాలువల ద్వారా విజయనగరానికి నీటి సౌకర్యం కల్పించారు. ఈయన కాలంలోనే ఇటలీ యాత్రికుడు నికోలా డీ కోంటీ విజయనగరాన్ని సందర్శించాడు.

సంగమ వంశ విజయనగర రాజుల్లో సుప్రసిద్ధుడు రెండో దేవరాయలు. ఈయననే ప్రౌఢ దేవరాయలుగా పిలుస్తారు. ఈయన ఏనుగుల వేటలో నేర్పరి. ఈయనకు 'గజబేంతకార' బిరుదున్నట్లు శాసనాల ద్వారా తెలుస్తోంది. రెండో దేవరాయల పాలనా కాలం 1422 – 1446.

సైన్యాన్ని పటిష్ఠం చేయడానికి అధిక సంఖ్యలో ముస్లింలను సైన్యంలో చేర్చుకున్నారు. వ్యవసాయాభివృద్ధికి హరిద్రా ఆనకట్టను బాగు చేయించారు. బహమనీలతో రెండుసార్లు యుద్ధం చేశారు. రాజ్యాన్ని ఉత్తరాన గుల్బర్గా నుంచి దక్షిణాన సింహళం వరకు, తూర్పున బెంగాల్ నుంచి పశ్చిమాన మలబార్ వరకు విస్తరించారు. ఈయన శైవ మతాభిమాని. ముస్లింలకు మత స్వేచ్ఛనిచ్చి, మసీదులు నిర్మించారు. కన్యాశుల్కాన్ని నిరుత్సాహపరిచి, కన్యాదాన సంప్రదాయాన్ని ప్రోత్సహించారు. పారశీక రాయబారి 'అబ్దుల్ రజాక్' ఈయన ఆస్థానాన్ని సందర్శించాడు.

రెండో దేవరాయలు స్వయంగా కవి, పండితుడు సంస్కృత భాషలో మహానాటక సుధానిధి, వృత్తి అనే గ్రంథాలు రచించారు. 'వృత్తి' బ్రహ్మసూత్రాలపై వ్యాఖ్యానం. ఈయన కొలువులోని సంస్కృత కవి అరుణగిరినాథ డిండిముని ఓడించి, శ్రీనాథుడు కనకాభిషేకం పొందారు. 'ప్రభులింగలీల' కన్నడ రచయిత చామరసు ఈయన ఆస్థానంలోని వారే. రెండో దేవరాయలు 'ముత్యాలశాల' పేరుతో సాహిత్య సమావేశాలను నిర్వహించేవారు.


దేవరాయల తర్వాత ఆయన కుమారుడు రెండో విజయరాయలు, ఆ తర్వాత రెండో విజయరాయల కుమారుడు మల్లికార్జునుడు 1447 వరకు పాలించారు. ఈ కాలంలో శత్రు రాజులైన బహమనీలు, ఒరిస్సా గజపతులు తిరిగి విజయనగరంపై దాడులు ప్రారంభించారు.

సాళువ వంశం (క్రీ.శ. 1486–1505): సాళువ వంశస్థులు కర్ణాటకలోని కల్యాణి ప్రాంతానికి చెందినవారు. ఈ వంశానికి చెందిన మంగరాజుకు 'సాళువ' అనే బిరుదు ఉంది. ఈయన తర్వాత గుండరాజు రాజ ప్రతినిధి అయ్యారు. గుండరాజు కుమారుడు సాళువ నరసింహరాయలు. ఈయన విరూపాక్షరాయల కాలంలో సామంతుడిగా పనిచేశారు. ఈయన 1485లో సంగమ వంశం చివరి రాజైన ప్రౌఢరాయల నుంచి విజయనగర రాజ్యాన్ని ఆక్రమించారు. కొన్నాళ్లు చంద్రగిరికి సామంతరాజుగా పనిచేశారు. ఈయన ఆస్థానంలో సాళువాభ్యుదయం రాసిన రాజనాథ డిండిముడు, తెలుగులో శృంగారశాకుంతలం, జైమినీ భారతం రాసిన పిల్లలమర్రి పినవీరభద్రుడు ప్రముఖులుగా వెలుగొందారు. సాళువ నరసింహరాయలకు 'రాయమహారసు' అనే బిరుదు ఉంది. ప్రసిద్ధ వాగ్గేయకారుడు, పదకీర్తనా సంకీర్తనాచార్యుడైన తాళ్లపాక అన్నమాచార్యుడు ఈయన సమకాలికులే. సాళువ నరసింహరాయలను విజయనగర రాజ్య దురాక్రమణదారునిగా కొందరు వర్ణించారు. ఈయన తర్వాత తిమ్మరాయడు, ఇమ్మడి నరసింహుడు పాలించారు. ఇమ్మడి నరసింహుడు రాజైనప్పటికీ, అధికారమంతా తన సైన్యాధ్యక్షుడైన తుళువ నరసనాయకుడి చేతిలో ఉండేది. 1503లో తుళువ నరసనాయకుడు మరణించిన తర్వాత 1505లో ఆయన కుమారుడు వీర నరసింహుడు ఇమ్మడి నరసింహుని వధించి, సింహాసనాన్ని అధిష్ఠించి తుళువ వంశాన్ని స్థాపించారు.

తుళువ వంశం (1505–1576): విజయనగర సామ్రాజ్యాన్ని పాలించిన మూడో రాజవంశం తుళువ వంశం. దీన్ని వీర నరసింహరాయలు 1505లో స్థాపించారు. ఈయన 1509 వరకు రాజ్యమేలారు. పాలించిన అయిదేళ్లూ యుద్ధాలతోనే సరిపోయింది. మైసూరులోని తుళువనాడు వీరి జన్మస్థలం. అందుకే తుళువ వంశమని పేరొచ్చింది. వీరనరసింహరాయలు వివాహ పన్నును రద్దు చేసిన తొలి విజయనగర రాజుగా ప్రసిద్ధి పొందారు. ఉమ్మెత్తూర్ పాలకులను అణచివేసే ప్రయత్నంలో 1509లో మరణించారు. తర్వాత ఈయన సవతి తమ్ముడు శ్రీకృష్ణదేవరాయలు మంత్రి తిమ్మరసు సహాయంతో సింహాసనం అధిష్ఠించారు. తుళువ వంశంలో ఈయన అగ్రగణ్యులు. బీజాపూర్ సుల్తాన్ ఆదిల్‌షాను వధించి, కోవిల కొండను జయించారు. బీదర్‌లో మంత్రి బరీద్‌కు బందీయైన బహమనీ సుల్తాన్ మహ్మద్‌షాను విడిపించి ఆయనకు సింహాసనం అప్పగించి 'యవన రాజ్యస్థాపనాచార్య' బిరుదు పొందారు. ఉమ్మెత్తూర్, శివసముద్రం, పెనుగొండ దుర్గాలను జయించి 'దక్షిణ సముద్రాధీశ్వర' బిరుదు పొందారు. కొండపల్లి,రాజమహేంద్రి,కళింగలను జయించారు. విశాఖ జిల్లాలోని పొట్నూర్ వద్ద రాయలు విజయస్తంభాన్ని ప్రతిష్ఠించారు.



రెండు గదుల హృదయం గల జీవి?



వివిధ జంతువుల్లో రవాణా వ్యవస్థలు

వానపాము

- వానపాము రవాణా వ్యవస్థలో హృదయాలు, రక్తనాళాలు, రక్తం ఉంటాయి. శరీరంలో 8 జతల పార్శ్వ హృదయాలుంటాయి.
- రక్తనాళాలు మూసుకొని ఉండే గొట్టాలు, ఇవి హృదయంతో కలిసి ఉంటాయి. వీటిలో పృష్ఠ రక్తనాళం, ఉదర రక్తనాళం.. ఆహార నాళానికిపైన ఒకటి, కింద ఒకటి ఉంటాయి.
- పృష్ఠ రక్తనాళం ప్రతి ఖండితంలో వివిధ అవయవాల నుంచి రక్తాన్ని సేకరిస్తుంది. అందుకే ఇది ముఖ్య సిరగా పనిచేస్తుంది.
  ఉదర రక్తనాళం ప్రతి ఖండితంలో రక్తాన్ని వివిధ అవయవాలకు సరఫరా చేస్తుంది. ఇది ముఖ్య ధమనిగా పనిచేస్తుంది.
- పృష్ఠ రక్తనాళంలో రక్తం వెనుక నుంచి ముందుకు, ఉదర నాళంలో రక్తం ముందు నుంచి వెనుకకు ప్రయాణిస్తుంది.
- రక్తంలో ఆక్సిజన్‌ను తీసుకుపోయే ప్రొటీన్ ఉంటుంది. అందుకే రక్తం ఎర్రగా ఉంటుంది. ఎర్ర రక్తకణాలు ఉండవు. తెల్లరక్తకణాలే ఉంటాయి. రక్తంలో నీరు, లవణాలు ఉంటాయి.
- శరీర కుడ్యానికి, ఆహార నాళానికి మధ్య ఉన్న శరీర కుహరద్రవం కూడా పదార్థాల రవాణాలో ప్రముఖపాత్ర వహిస్తుంది.

బొద్దింక

- బొద్దింక రవాణా వ్యవస్థలో రక్తనాళాలు ఉండవు. రక్తం శరీర కుహరంలో కోటరాల్లో ప్రవహిస్తుంది. అందుకే దీన్ని స్వేచ్ఛాయుత రక్తప్రసరణ వ్యవస్థ అంటారు.
- బొద్దింక శరీరంలో హృదయావరణ కోటరం, పర్యాంతరంగ కోటరం, ఉదర కోటరం, తలలో శిరఃకోటరం ఉంటాయి.
- బొద్దింక హృదయంలో 13 గదులుంటాయి. ఆఖరి గది మూసుకొని ఉంటుంది. మొదటి గది మహాధమని ద్వారా శిరఃకోటరంలోనికి తెరుచుకుంటుంది.
- రక్తం పక్షాకార కండరాల వల్ల చలిస్తుంది.
- బొద్దింక రక్తం తెల్లగా ఉంటుంది. ఇది ఆక్సిజన్ రవాణాలో పాత్ర వహించదు.

ఉన్నతస్థాయి జీవులు రవాణా వ్యవస్థ

- శరీర భాగాల నుంచి ఆమ్లజని రహిత రక్తం శ్వాసేంద్రియాలకు ఆమ్లజనీకరణం కోసం వెళ్తుంది.
- తక్కువస్థాయి జీవుల్లో ఇక్కడ నుంచి శరీర భాగాలకు ప్రసరణం జరుగుతుంది.
  ఉదా: చేపలు.
- ఆంఫిబియా నుంచి క్షీరదాల వరకు రక్తం శ్వాసేంద్రియాల నుంచి తిరిగి గుండెకు వస్తుంది. గుండె నుంచి శరీర భాగాలకు చేరుతుంది.

చేపలు

- చేపల్లో 2 గదుల హృదయం ఉంటుంది. ఒక కర్ణిక, ఒక జఠరిక ఉంటాయి. శరీర భాగాల నుంచి చెడు రక్తం సిరాసరణి చేరి తర్వాత కర్ణిక చేరుతుంది. అక్కడ నుంచి జఠరిక, తర్వాత మొప్పలకు వెళ్తుంది. మొప్పల్లో ఆమ్లజనీకరణం తర్వాత నేరుగా శరీర భాగాలకు మంచి రక్తం చేరుతుంది.
- చేపల్లో రక్తం గుండె ద్వారా ఒక్కసారే ప్రవహిస్తుంది. అందుకే ఈ వ్యవస్థని ఏకవలయ రక్తప్రసరణ అంటారు.
- చేప హృదయాన్ని 'జలశ్వాస హృదయం' అంటారు. (హృదయం మొప్పలకు రక్తాన్ని పంపుతుంది కాబట్టి)

ఉభయచరాలు

- కప్ప వంటి ఉభయచరాల్లో హృదయం 3 గదులు కలిగి ఉంటుంది. రెండు కర్ణికలు, ఒక జఠరిక ఉంటాయి.
- శరీరం నుంచి మూడు మహాసిరల ద్వారా చెడు రక్తం సిరాసరణి (Sinus venosus) చేరుతుంది. సిరాసరణి నుంచి కుడి కర్ణికలోనికి వెళ్తుంది.
- పుపుస సిర ద్వారా ఆమ్లజని సహిత రక్తం ఎడమ కర్ణికకు చేరుతుంది.
- కర్ణికలు రెండూ ఒకే జఠరికలోనికి తెరుచుకుంటాయి. కాబట్టి ఆమ్లజని సహిత, ఆమ్లజని రహిత రక్తాలు జఠరికలో కలిసి మిశ్రమ రక్తంగా ఏర్పడతాయి.
- మిశ్రమ రక్తం మహాధమని ద్వారా శరీర భాగాలకు సరఫరా అవుతుంది.
- ఊపిరితిత్తులకు రక్తాన్ని సరఫరా చేస్తుంది కాబట్టి ఉభయచరాల గుండెను 'పుపుస హృదయం' అంటారు.
- ఉభయచరాల నుంచి అన్ని ఉన్నతస్థాయి జీవుల్లో (సరీసృపాలు, పక్షులు, క్షీరదాలు) రక్తం రెండుసార్లు హృదయాన్ని చేరుతుంది. కాబట్టి ఈ వ్యవస్థను 'ద్వివలయ రక్తప్రసరణ వ్యవస్థ' అంటారు.

- చేపలు, ఉభయచరాలు, సరీసృపాలు, శీతల రక్త జంతువులు (Poikilothermic) రక్త ఉష్ణోగ్రత పరిసరాలను బట్టి మారుతుంది.
- పక్షులు, క్షీరదాలు, ఉష్ణ రక్త జంతువుల (Homeothermic) ఉష్ణోగ్రత పరిసరాలను బట్టి మారకుండా స్థిరంగా ఉంటుంది.

సరీసృపాలు

- వీటిలో రెండు కర్ణికలు, ఒక అసంపూర్తిగా విభజన చెందిన జఠరిక కలిగిన హృదయం ఉంటుంది.
- ద్వివలయ ప్రసరణ, పుపుస హృదయం సరీసృపాల్లో కన్పిస్తుంది.

పక్షులు, క్షీరదాలు

- పూర్తిగా నాలుగు గదుల హృదయం ఉంటుంది. రెండు కర్ణికలు, రెండు జఠరికలుంటాయి. వీటిలో సిరాసరణి ఉండదు.
- మహాసిరలు ప్రత్యక్షంగా కుడి జఠరిక లోనికి తెరుచుకుంటాయి.
- పుపుస హృదయం, ద్వివలయ ప్రసరణ కలిగి ఉంటాయి.

గతంలో అడిగిన ప్రశ్నలు

1. వివిధ శరీర భాగాల నుంచి వచ్చిన రక్తంతో ప్రారంభించి క్షీరదాల హృదయంలోని నాలుగు గదుల్లో రక్తప్రసరణ సరైన క్రమం (డీఎస్సీ-2012)
   ఎ) ఎడమ కర్ణిక బి) కుడి కర్ణిక
   సి) ఎడమ జఠరిక డి) కుడి జఠరిక
   1) సి, ఎ, డి, బి 2) ఎ, డి, బి, సి
   3) బి, ఎ, డి, సి 4) బి, డి, ఎ, సి
2. సరిగా జతపరచని వాటిని గుర్తించండి? (డీఎస్సీ-2012)
   ఎ) సాలమండర్– 2 గదుల గుండె
   బి) కప్ప– 3 గదుల గుండె
   సి) కట్లకట్ల– 3 గదుల గుండె
   డి) పావురం – అసంపూర్తిగా విభజన చెందిన 4 గదుల గుండె
   1) ఎ, డి 2) ఎ, సి
   3) బి, సి 4) బి, డి
3. హిమోగ్లోబిన్‌లో ఉండేవి? డీఎస్సీ-2006
   1) వర్ణకం, ఐరన్, పోర్ఫిరిన్
   2) హీమ్, పోర్ఫిరిన్, వర్ణకం
   3) గ్లోబిన్, ఐరన్, హీమ్
   4) గ్లోబిన్, ఐరన్, పోర్ఫిరిన్
4. రెండు గదుల హృదయం గల జీవి? (డీఎస్సీ-2004)
   1) చేప 2) కప్ప
   3) బొద్దింక 4) వానపాము
5. కప్పలో సిరాసరణి దేనిలోకి తెరుచు కుంటుంది? (డీఎస్సీ-2004)
   1) కుడి జఠరిక 2) ఎడమ జఠరిక
   3) కుడి కర్ణిక 4) ఎడమ కర్ణిక
6. కిందివాటిలో సరైంది? (డీఎస్సీ-2004)
   1) పుపుసధమని ఆమ్లజని సహిత రక్తాన్ని ఊపిరితిత్తులకు తీసుకొని పోతుంది
   2) కుడి జఠరిక ఆమ్లజని సహిత రక్తాన్ని ఊపిరితిత్తులకు పంపుతుంది
   3) ఆమ్లజని రహిత రక్తం ఎడమ కర్ణికలోకి చేరుతుంది
   4) అన్ని శరీర భాగాల నుంచి ఆమ్లజని రహిత రక్తం కుడి కర్ణికలోనికి పంపుతుంది

సమాధానాలు

1) 4; 2) 1; 3) 4; 4) 1;
5) 3; 6) 4.

మాదిరి ప్రశ్నలు

1. బొద్దింకలో రక్తాన్ని హృదయంలోనికి పంపడానికి సహాయపడేవి?
   1) వాయునాళ కండరాలు
   2) పక్షాకార కండరాలు
   3) ఉరఃకుహర కండరాలు
   4) హృదయ కండరాలు
2. కిందివాటిలో ఏ రెండు ప్రవచనాలు సరికావు
   ఎ) కప్పలో 3 గదుల గుండె ఉంటుంది
   బి) పావురంలో 2 గదుల గుండె ఉంటుంది
   సి) కుక్కలో 4 గదుల గుండె ఉంటుంది
   డి) మొసలిలో 3 గదుల గుండె ఉంటుంది
   1) ఎ, బి 2) బి, సి
   3) బి, డి 4) ఎ, సి
3. ఉభయచరాల్లో మహాసిరలు కలిసి ఏర్పాటు చేసేది?
   1) కుడి కర్ణిక 2) ఎడమ కర్ణిక
   3) జఠరిక 4) సిరాసరణి
4. స్వేచ్ఛాయుత రక్తప్రసరణ వ్యవస్థలో ఏవి ఉంటాయి?
   1) రక్తనాళాలు, రక్తం 2) మొప్పలు, రక్తం
   3) కర్ణికలు, జఠరికలు
   4) గుండె, రక్త కోటరాలు
5. మెగాస్కోలెక్స్‌లో ఉండే పార్శ్వ హృదయాల సంఖ్య?
   1) 9 జతలు 2) 8 జతలు
   3) 7 జతలు 4) 6 జతలు
6. మిశ్రమ రక్తానికి సంబంధించి సరైన ప్రవచనం ?
   1) చేప కర్ణిక, జఠరికల్లో మిశ్రమరక్తం ఉంటుంది
   2) పక్షుల సిరాసరణి ద్వారా మిశ్రమ రక్తం ప్రసారం అవుతుంది.
   3) ఉభయచరాల జఠరికలో మిశ్రమరక్తం ఏర్పడుతుంది.
   4) క్షీరదాల కర్ణికలో మిశ్రమరక్తం ఉంటుంది.
7. ద్వి ప్రసరణ రక్తప్రసరణ వ్యవస్థ కలిగిన జీవి?
   1) బొద్దింక 2) వానపాము
   3) కోతి 4) కోడి
8. వానపాములో సిరలు నిర్వహించే పనిని నిర్వర్తించే రక్తనాళం?
   1) పృష్ఠ రక్తనాళం 2) ఉదర రక్తనాళం
   3) మహాధమని 4) సిరాసరణి
9. కిందివాటిలో ఏ రెండు జతలు సరైనవి?
   ఎ) బొద్దింక - ఎరుపు రంగు రక్తం
   బి) మొసలి– 4 గదుల గుండె
   సి) సాలమండర్– సిరాసరణి
   డి) సరీసృపాలు– ఉష్ణరక్త జంతువులు
   1) ఎ, డి 2) బి, సి
   3) సి, డి 4) ఎ, బి
10. బొద్దింక రక్తప్రసరణను స్వేచ్ఛాయుత రక్తప్రసరణ వ్యవస్థగా పిలుస్తారు. ఎందుకంటే?
    1) రక్తం రక్తనాళాల్లో ప్రవహిస్తుంది
    2) ద్వి వలయ రక్తప్రసరణ జరుగుతుంది
    3) రక్తం శరీర కుహరంలో కోటరాల్లో ప్రవహిస్తుంది
    4) బొద్దింకలో గుండె భాగం ఉండదు
11. కిందివారిలో ఎవరు తెలిపిన ప్రవచనం సరికాదు?
    1) శ్రావణ్ - చేప గుండెను జలశ్వాస హృదయం అంటారు
    2) శ్రుతి - ఉభయచరాల్లో ఏక వలయ రక్తప్రసరణ ఉంటుంది
    3) శ్రేయ- పక్షులు ఉష్ణరక్త జంతువులు
    4) శ్రావ్య - వానపాములో తెల్లరక్తకణాలే ఉంటాయి
12. చేపల్లో ఏకవలయ రక్త ప్రసరణకు కారణం?
    1) 2 గదుల గుండె ఉండటం
    2) సిరాసరణి ఉండటం
    3) మొప్పల నుంచి రక్తం నేరుగా శరీర భాగాలకు వెళ్లడం
    4) చేపలు నీటిలో ఉండటం, శీతల రక్త జీవులు కావడం

సమాధానాలు

1) 2; 2) 3; 3) 4; 4) 4;
5) 2; 6) 3; 7) 3; 8) 1;
9) 2; 10) 3; 11) 2; 12) 3.

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

వందేళ్లలో ఎన్ని విషమ రోజులు ఉంటాయి?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
జనరల్ స్టడీస్
మెంటల్ ఎబిలిటీ

క్యాలెండర్

విషమ రోజులు: నెలలోని రోజులను వారాలుగా పొందుపరచగా మిగిలే రోజులను విషమ రోజులు అంటారు. అంటే ఇచ్చిన రోజులను 7తో భాగిస్తే వచ్చే శేషమే విషమ రోజులు. ఒక వారంలో విషమ రోజులు **(odd days)** 0.

రోజులు	విషమ రోజులు
28	0
29	1
30	2
31	3

ఉదా:

7)29(4
28
1

7)31(4
28
3

◆ ఈ రోజు సోమవారం అయితే 61 రోజుల తర్వాత వచ్చేవారం?
(Deputy Jailor, 2012)
ఎ) బుధవారం బి) శనివారం
సి) మంగళవారం డి) గురువారం
జవాబు: బి

సాధన: విషమ రోజులు

7)61(8
56
5

∴ సోమవారం + 5 విషమ రోజులు
= శనివారం.

నెలలు	విషమ రోజులు		
		Ju	2
		Jy	3
J	3	Au	3
F	0/1	S	2
M	3	O	3
A	2	N	2
M	3	D	3

◆ ఈ రోజు మంగళవారం. 94వ రోజు ఏ వారం?
ఎ) శుక్రవారం బి) శనివారం
సి) ఆదివారం డి) సోమవారం
జవాబు: ఎ

నెలల వారీగా విషమ రోజులు:

◆ ఆగస్టులో ఎన్ని విషమ రోజులున్నాయి?
ఎ) 1 బి) 2 సి) 3 డి) 4
జవాబు: సి

సాధన: ఆగస్టు నెలలో 31 రోజులుంటాయి.

7)31(4
28
3

= ఆగస్టులో 3 విషమ రోజులుంటాయి.

గమనిక: సాధారణ సంవత్సరం, లీపు సంవత్సరాల్లో ఒకే రోజు, ఒకే తేదీ ఉండే నెలలు

సాధారణ సంవత్సరం	లీపు సంవత్సరం
జనవరి – అక్టోబర్	జనవరి – ఏప్రిల్
ఫిబ్రవరి – నవంబర్	జనవరి – జూలై
మార్చి – నవంబర్	ఫిబ్రవరి – ఆగస్టు
ఏప్రిల్ – జూలై	మార్చి – నవంబర్
సెప్టెంబర్ – డిసెంబర్	ఏప్రిల్ – జూలై
	సెప్టెంబర్ – డిసెంబర్

ఉదాహరణ:

1. ఏదైనా ఒక సంవత్సరంలో (సాధారణ/ లీపు) ఒకే రోజుతో ప్రారంభమయ్యే రెండు నెలలేవి?
ఎ) మార్చి-నవంబర్
బి) మార్చి-జూలై సి) జూలై- ఆగస్టు
డి) పైవేవీ కావు
జవాబు: ఎ

2. సాధారణ సంవత్సరంలో ఏ నెలలు ఒకే రోజుతో ప్రారంభమవుతాయి?
ఎ) జనవరి-జూలై బి) జూన్- ఏప్రిల్
సి) ఏప్రిల్-అక్టోబర్
డి) జనవరి- అక్టోబర్
జవాబు: డి

3. 31 రోజులున్న నెలలో చివరి రోజు బుధవారమైతే ఎన్ని సోమవారాలు ఉంటాయి?
(General S.I. 2010)
ఎ) 4 బి) 3 సి) 5
డి) చెప్పలేం
జవాబు: సి

వివరణ: 31 రోజులున్న నెలలో 29, 30, 31 రోజుల్లో వచ్చే వారాలు 5 వస్తాయి. అంటే 31 రోజులున్న నెలలో 1, 2, 3 తేదీల్లో వచ్చే వారాలు 5 సార్లు వస్తాయి. కాబట్టి సోమవారం అయిదుసార్లు వస్తుంది.

సంవత్సరాలకు విషమ రోజులు

సౌర సంవత్సరం:

◆ భూమి, సూర్యుడి చుట్టూ ఒకసారి తిరిగి రావడానికి 365 రోజుల 5 గంటల 48 నిమిషాల 48 సెకన్లు పడుతుంది. 365 రోజుల కంటే ఎక్కువగా ఉన్న సుమారు 6 గంటలను ఒక రోజుగా ఉంచడం వీలు కాదు. కాబట్టి సాధారణ సంవత్సరానికి 365 రోజులుగా తీసుకున్నారు.

◆ మిగిలిన ఆరు గంటలు నాలుగేళ్లలో 24 గంటలు.. అంటే ఒక రోజు అవుతుంది. దీన్ని ఫిబ్రవరి నెలలోని చివరి రోజు (29వ తేదీ)గా పరిగణిస్తారు. దీన్ని లీపు సంవత్సరం అంటారు.



సాధారణ సంవత్సరం: ఇచ్చిన సంవత్సరం చివరి రెండు స్థానాలు అంటే ఒకట్లు, పదుల స్థానాల్లోని సంఖ్య 4తో నిశ్శేషంగా భాగించకపోతే దాన్ని సాధారణ సంవత్సరం అంటారు. సాధారణ సంవత్సరంలో 365 రోజులుంటాయి.

సాధారణ సంవత్సరాలు	సాధారణ సంవత్సరాలు కానివి
1981, 82, 83	1988, 92, 96
2001, 2002	2000, 2004

$\frac{365}{7}$ = 52 వారాలు + 1 విషమ రోజు

◆ సాధారణ సంవత్సరంలో 1 విషమ రోజు ఉంటుంది.

◆ సాధారణ సంవత్సరం ఏ రోజుతో ప్రారంభమవుతుందో.. అదే రోజుతో ముగుస్తుంది.

లీపు సంవత్సరం: ఇచ్చిన సంవత్సరంలోని చివరి రెండు స్థానాలు అంటే ఒకట్లు, పదుల స్థానాల్లోని సంఖ్యను 4 నిశ్శేషంగా భాగిస్తే అది లీపు సంవత్సరం. లీపు సంవత్సరం ప్రతి 4 ఏళ్లకు ఒకసారి వస్తుంది. లీపు సంవత్సరంలో 366 రోజులుంటాయి.

◆ లీపు సంవత్సరంలో రెండు విషమ రోజులు ఉంటాయి.

◆ లీపు సంవత్సరంలో ప్రారంభ రోజు ఏ వారం అవుతుందో డిసెంబర్ 30 కూడా అదే వారం అవుతుంది.

1. కింది వాటిలో లీపు సంవత్సరం ఏది?
ఎ) 1986 బి) 2002
సి) 2100 డి) 1992
జవాబు: డి

శతాబ్ద సంవత్సరాలు 4తో నిశ్శేషంగా భాగితమైతే అవి లీపు సంవత్సరాలు కావు. 400తో నిశ్శేషంగా భాగితమైతేనే అవి లీపు సంవత్సరాలు అవుతాయి. ప్రతి నాలుగో శతాబ్దం లీపు సంవత్సరం అవుతుంది.

లీపు సంవత్సరాలయ్యే శతాబ్దాలు:
400, 800, 1200, 1600, 2000, ...

లీపు సంవత్సరాలు కాని శతాబ్దాలు:
100, 200, 300, 500, 600 ...

2. కిందివాటిలో లీపు సంవత్సరం ఏది?
ఎ) 1100 బి) 1300
సి) 1700 డి) పైవేవీ కావు
జవాబు: డి

3. కిందివాటిలో సాధారణ సంవత్సరం ఏది?
ఎ) 1200 బి) 2400
సి) 2600 డి) పైవేవీ కావు
జవాబు: సి

4. కిందివాటిలో లీపు సంవత్సరం కానిది?
ఎ) 1744 బి) 2016
సి) 1982 డి) పైవేవీ కావు
జవాబు: సి

5. 481 రోజుల్లో ఎన్ని విషమ రోజులు ఉన్నాయి?
ఎ) 1 బి) 2 సి) 4 డి) 5
జవాబు: డి

100 సంవత్సరాలకు విషమ రోజులు

◆ వందేళ్లలో ఎన్ని విషమ రోజులు ఉంటాయి?
100 ఏళ్లలో 24 లీపు సంవత్సరాలు, 76 సాధారణ సంవత్సరాలు ఉంటాయి.
ఒక సాధారణ సంవత్సరానికి ఒక విషమ రోజు, ఒక లీపు సంవత్సరానికి రెండు విషమ రోజులు ఉంటాయి. ఆ ప్రకారం.. 100 ఏళ్లకు విషమ రోజులు
$= 76\times1 + 24\times2 = 76+48 = 124$

$\frac{124}{7} = 5$ విషమ రోజులు

సంవత్సరం	విషమ రోజులు
100	5 → 5
200	10 → 3
300	15 → 1
400	20 + 1 → 0
500	5
600	3
700	1
800	0

◆ 100 సంవత్సరాల్లో 5, 200 సంవత్సరాల్లో 3, 300 సంవత్సరాల్లో 1, ప్రతి 4వ శతాబ్దానికి 0 విషమ రోజులు ఉంటాయి.

విషమ రోజులు	వారం
1	సోమవారం
2	మంగళవారం
3	బుధవారం
4	గురువారం
5	శుక్రవారం
6	శనివారం
0	ఆదివారం

ఉదా:

1. క్రీ.శ.1వ సంవత్సరం జనవరి 1వ తేదీన ఏ వారం?
ఎ) శనివారం బి) ఆదివారం
సి) సోమవారం డి) మంగళవారం
జవాబు: సి

2. కింది వాటిలో ఏదైనా శతాబ్దం చివరి రోజు కానిది ఏది? (General S.I. 2012)
ఎ) శుక్రవారం బి) ఆదివారం
సి) మంగళవారం డి) సోమవారం
జవాబు: సి

వివరణ: శతాబ్దం చివరి నాటికి విషమ రోజులుగా మిగిలేవి 5, 3, 1, 0.
అంటే 5-శుక్రవారం, 3-బుధవారం, 1-సోమవారం, 0-ఆదివారం. వీటిలో ఏదో ఒకటి తప్పకుండా ఉంటుంది. కానీ మంగళవారం, గురువారం, శనివారాలు శతాబ్దం చివరి రోజులుగా రావు.

శతాబ్దం చివరి రోజులు		ప్రారంభ రోజులు
శుక్రవారం	→	శనివారం
బుధవారం	→	గురువారం
సోమవారం	→	మంగళవారం
ఆదివారం	→	సోమవారం

ఉదా:

1. కిందివాటిలో ఏదైనా శతాబ్ద సంవత్సరం ప్రారంభ రోజు కానిది?
ఎ) శనివారం బి) మంగళవారం
సి) బుధవారం డి) సోమవారం
జవాబు: సి

2. 247 సంవత్సరాల్లో ఎన్ని విషమ రోజులు ఉంటాయి?
ఎ) 1 బి) 3 సి) 4 డి) 5

జ. 200 రోజులకు 3 విషమ రోజులు ఉంటాయి. 47 ఏళ్లకు ఉండే విషమ రోజుల సంఖ్య తెలుసుకోవాలి.
47 ఏళ్లు = 11×4 + 3 = 44 + 3.
అంటే 47 ఏళ్లలో 11 లీపు సంవత్సరాలు, 36 సాధారణ సంవత్సరాలు ఉంటాయి.
47 ఏళ్లలో ఉండే విషమ రోజులు
= 11×2 + 36×1 = 22 + 36 = 58
58/7 = 2 విషమ రోజులు ఉంటాయి.
247 ఏళ్లకు విషమ రోజులు = 2+3 = 5
జవాబు: డి

3. 481 సంవత్సరాల్లో ఎన్ని విషమ రోజులు ఉంటాయి?
ఎ) 5 బి) 3 సి) 2 డి) 1
జవాబు: బి

4. క్రీ.శ. 100వ సంవత్సరంలో ఎన్ని విషమ రోజులు ఉన్నాయి?
ఎ) 5 బి) 4 సి) 2 డి) 1
జవాబు: డి

గతంలో అడిగిన ప్రశ్న

◆ 1977 జూలై 1వ తేదీ శుక్రవారం అయితే 1970 జూలై 1 ఏ వారం అవుతుంది?
(అసిస్టెంట్ స్టేషన్ మాస్టర్, 2013)
1) బుధవారం 2) గురువారం
3) ఆదివారం 4) మంగళవారం

వివరణ: 1970 జూలై 1 నుంచి 1977 జూలై 1 వరకు విషమ రోజులు =

సంవత్సరాలు		విషమ రోజులు
1971	→	1
1972	→	2 (లీపు సంవత్సరం)
1973	→	1
1974	→	1
1975	→	1
1976	→	2 (లీపు సంవత్సరం)
1977	→	1

మొత్తం విషమ రోజులు = 9 ~ 2
కావలసిన రోజు = శుక్రవారం-2 = బుధవారం
జవాబు: 1

Idea of group discussion is..

BANK EXAMS
GENERAL ENGLISH

Directions (Q.No. 1 - 5): Read each sentence to find out whether there is any grammatical mistake/ error in it. The error, if any, will be in one part of the sentence. Mark the number of that part with error as your answer. If there is 'No error', mark (5) as your answer.

1. Any misinterpretation of a message (1)/ leads to communication breakdown (2)/ and creates confusion (3)/ and misunderstanding. (4)/ No error (5)

2. Organizational competent (1)/ is the ability (2)/ to organize information (3)/ in a logical and structured way. (4)/ No error (5)

3. In jet propulsion engines, (1)/ gas turbines are used (2)/ only to provide the work requires (3)/ for the compressor of the engine. (4)/ No error (5)

4. When you do use (1)/ the remote control for a long time, (2)/ take out the batteries (3)/ and store them in a cool, dry place. (4)/ No error (5)

5. He has submitted (1)/ the report (2)/ before he received (3)/ the memo. (4)/ No error (5)

Directions (Q.No. 6 - 10): Which of the phrases (1), (2), (3), and (4) given below each sentence should replace the phrase underlined in the sentence to make it grammatically correct? If there is no error mark (5) No correction required as your answer.

6. Ionic compounds can be <u>separate</u> into their constituent ions with little effort.
1) sieved 2) segregated
3) filtered 4) dissociated
5) no correction required

7. Some of the more powerful microcomputers have all or most of the <u>quality</u> of earlier minicomputers.
1) resemblances
2) characteristics 3) features
4) properties
5) no correction required

8. A compound microscope is a device that is used to produce very large <u>enlarged appearance</u>.
1) ramification 2) upshot
3) magnifications 4) disclosure
5) no correction required

9. The Space Age began on October 4, 1957, when Russia <u>started</u> Sputnik 1 into orbit.
1) experimented 2) launched
3) send 4) devised
5) no correction required

10. X-rays are high energy photons, which can knock an atom <u>outside</u> of a molecule.
1) out 2) along
3) inside 4) within
5) no correction required

Directions (Q.No. 11 - 15): Rearrange the following six sentences (A), (B), (C), (D), (E) and (F) in a proper sequence to form a meaningful paragraph and then answer the questions given below.

A) Crude oil is a mixture of different compounds that boil at different temperatures.
B) The remaining and heaviest fraction is the residue, which supplies waxes, asphalts and some fuel oils.
C) The fraction obtained by boiling between about 140 degrees and 320 degrees C is termed kerosene.
D) The next fraction, normally refined into gasoline, boils between about 30 degrees and 200 degrees C.
E) The lightest fraction consists of gases that boil below atmospheric temperature.
F) The fraction boiling above about 320 degrees C is commonly refined into heating, diesel and lubricating oils.

11. What is the SECOND sentence after rearrangement?
1) A 2) B 3) C 4) D 5) E

12. What is the THIRD sentence after rearrangement?
1) A 2) B 3) D 4) F 5) E

13. What is the FIFTH sentence after rearrangement?
1) A 2) B 3) D 4) E 5) F

14. What is the FIRST sentence after rearrangement?
1) B 2) A 3) C 4) D 5) E

15. What is the LAST sentence after rearrangement?
1) A 2) B 3) C 4) D 5) F

Directions (Q. No. 16 - 25): Each question below has a blank/ two blanks, each blank indicating that something has been omitted. Choose the word/ set of words from the five options for each blank that best fits the meaning of the sentence as a whole.

16. In a huge ____ to the government and political parties in Tamil Nadu, the Supreme Court stayed the centre's ______ to holding of Jallikattu during Pongal.
1) setback, decision
2) decision, proposal
3) opposition, recession
4) retention, argument
5) format, demand

17. The _____ attempted to storm the mission building during the attack.
1) assailants 2) goon3) attacker 4) janitors
5) scrutinizers

18. I was ____ to start a production house of my own, but the project never ____ because astrologers advised me not to go ahead with production.
1) possibly, started
2) Supposed, took off
3) probably, crashed
4) thought, worked
5) naturally, rendered

19. Through telephone lines, an engineer with a personal computer can ____ data in the memory of other computers all ____ the world.
1) access, over 2) possess, across
3) acquire, along
4) pertain, among
5) grab, between

20. The warehouse supervisor can likewise use a personal computer with an _____ program to keep personal records, and those in the large computer's memory, _____.
1) record, record
2) inventory, updated
3) list, recorded
4) register, stored
5) check, retrieved

21. Aeroplanes have the ___ of being dangerous and even the hardened travelers are _____ by them.
1) probability, confused
2) remark, sick
3) reputation, intimidated
4) statement, rescued
5) possibility, sad

22. The very idea of group discussion is _____ on the concept of cooperation, where all members are _____ to work as a team.
1) revolving, accepting
2) based, expected
3) rotating, accepted
4) producing, entered
5) removed, ejected

23. Air pollution has been a major _____ not only to the quality of environment but also to the human health.
1) problem 2) concern
3) disaster 4) threat
5) coincidence

24. We could complete the assignment if it _____ not so late.
1) had 2) was
3) would 4) were
5) have

25. Having just eaten his dinner, he _____ to have even a soft drink.
1) was ready 2) wasn't
3) not supposed
4) was not ready
5) almost ready

Directions (Q.No. 26 - 30): Read the following passage carefully and answer the questions given below it. Certain words have been printed in **bold** to help you locate them while answering some of the questions.

It was through Jimmy John that I discovered that a vocabulary is an outgrowth of experience. As fast as he learned some activity, he acquired without effort the vocabulary that went with it. From the pony he learned saddle, bridle, stirrup, blacksmith and so on, although to begin with he had **hidden** from our pet in terror, with absolutely no words to describe anything about him. After a summer of sailing he unconsciously acquired nautical terms as a matter of course. But when we tried to increase his vocabulary by making him memorize words **arbitrarily**, he became confused and mixed them all up and misused them amusingly. The first time he saw a funeral procession he asked, "What's that" and someone said, "It's a hearse". Now it happened that Jimmy had not been looking at the hearse when this was said. His attention was focused on an Army officer in the procession. Sometime later he announced that there was a hearse in front of our house and when we peered out, rather **alarmed**, we saw a soldier standing there talking calmly to someone. No hearse anywhere. I than realized that you can't make a child merely memorize words; he has to live them, and therefore many experiences are vital to the growth of a child's vocabulary. Jimmy John educated me more than I ever educated him!

26. Which of the two statements is true according to the passage?
a) A child with a poor vocabulary is not very intelligent.
b) Children's vocabulary comes from experience - they have to live the words they learn.
1) only a 2) only b
3) both a & b 4) neither a nor b
5) either a or b

27. Identify the false statement:
1) Children's vocabulary comes from experience.
2) A child with poor vocabulary will not pass aptitude tests.
3) Children educate their parents more often than the other way round.
4) When we try to increase a child's vocabulary by making him memorize words, he becomes confused.
5) Vocabulary is an outgrowth of experience.

28. The antonym of **hidden** is
1) conceal 2) veil 3) secret
4) divulge 5) expect

29. The antonym of **arbitrarily** is
1) subjectively 2) personally
3) individually
4) instinctively 5) logically

30. The synonym of **alarmed** is
1) startled 2) stirrup
3) sensitized 4) scrutinized
5) overwhelmed

Directions (Q. No. 31 - 40): In the following passage there are blanks, each of which has been numbered. These numbers are printed below the passage and against each, five words/ phrases are suggested, one of which fits the blank appropriately. Find out the appropriate word/ phrase in each case and mark your answer.

Seeing is a complex act ____ (31) the optical system of the eye takes light ____ (32) from the object and forms an ____ (33) on a light sensitive layer, the retina. This ____ (34) energy ____ (35) a photochemical process is transformed into nerve energy and ____ (36) through the visual pathways to the brain. In the ____ (37) sense seeing is not complete until what is seen is interpreted ____ (38) the observer. This ____ (39) is based on past experience; hence, to a considerable ____ (40) seeing is a learned skill.

31. 1) wherein 2) where
3) where in 4) where upon
5) where on

32. 1) originate 2) emanating
3) derive 4) radiate
5) emit

33. 1) copy 2) picture
3) image 4) icon
5) figure

34. 1) beam 2) glow
3) brightness 4) light
5) darkness

35. 1) during 2) thorough
3) throw 4) trough
5) through

36. 1) passes 2) pass
3) is passing 4) passed
5) passes by

37. 1) broad 2) broadest
3) wide 4) large5) broader

38. 1) through 2) with 3) by
4) near 5) next

39. 1) construal 2) reading
3) version 4) interpretation
5) elucidation

40. 1) size 2) area
3) coverage 4) degrees
5) extent

KEY

1) 5; 2) 1; 3) 3; 4) 1; 5) 1;
6) 4; 7) 3; 8) 3; 9) 2; 10) 1;
11) 5; 12) 3; 13) 5; 14) 2; 15) 2;
16) 1; 17) 1; 18) 2; 19) 1; 20) 2;
21) 3; 22) 2; 23) 2; 24) 4; 25) 4;
26) 2; 27) 2; 28) 4; 29) 5; 30) 1;
31) 1; 32) 2; 33) 3; 34) 4; 35) 5;
36) 1; 37) 2; 38) 3; 39) 4; 40) 5.